

వాత్సల్యము

ప్రమాది — భారతి — సంపుటం-16
జ్యేష్ఠము — జూన్-1939 — సంచిక-6



౧౬ సంపుటం. ప్రమాది, జ్యేష్ఠమాసము (1939) జూన్ సంఖ్య. ౬

అ మ్మ

శ్రీ వే లూ రి శి వ రా మ శా స్త్రి

౧

సీ. ఏయమ్మపలుకుల నింపార విని వాణి వీణపై మఱి చేయి వేయఁబోదొ
ఏతల్లి సదమల హృదయంబునందుండి సుధ పాఱుఁ గృష్ణాదివిధములఁగ
ఏదేవి సేవింతు రేడుకొండలవిభుం డాంధ్రవిష్ణువు కాకుళాధినేత
ఏపురాణి యగస్తి కిల్లాలితోఁగూడ దేవత లిడని యాతిథ్య మిచ్చె

గీ. ఏమహామాత యంతంత లింతలింత
లైన ముక్కోటిప్రజ కడుపారఁ గాంచె
అదితి యెవ్వతె మైత్రికై ప్రాణ మిచ్చు
అట్టి మాయమ్మ యేడ నున్నదో నమోఽస్తు.

౨

క. ఇరువది యాఱేం డ్లకటా
జరిఁగెంగద మూఁడుకోట్ల సోదరులారా!
సరిగా వినుచున్నారా?
మరి వినుచో, అమ్మ యేది? మాకుం జెపుఁడా!

౩

ఉ. కన్న నిసుంగు లందఱకు క్షామము, మూఁగతనంబుఁ బాపఁగాఁ
గ్రన్నన నన్నపూర్ణగ సరస్వతిగా మనయమ్మ యిల్లిదే –
- తెన్నన రేపొ మాపొ చనుదెంచునటంచు గభీరముద్రతో
నిన్నటిదాఁకఁ బల్కితిరి నేఁ డెటు వోయిన దమ్మ చెప్పుఁడా?

౪

శా. ఎన్నంగాఁదగు సాతవాహనుఁడు కానీ తొల్లి, కాకున్న నున్
నిన్నన్ మొన్నను కృష్ణరాయలును గానీ, యాంధ్ర దేశంబునం
దెన్నాళ్ళని తెలుంగువారల నయారే యేలిరే? ఖడ్గ తి
క్కన్నామాత్యుని దాంధ్రదేశమె? తెలుంగా! నీకు దీర్ఘాయువా.

౫

గీ. మరులుమాతంగి ద్రొక్కించి మాయుతల్లి
గొంప కింకేరు మమ్ముఁ బట్టింపలేరు
మందుమాకులఁ బెట్టి భామందు లెవరు
విరసముగ మాడుమతు లింక విఱువలేరు.

౬

సీ. పోయిన పెదవేఁగి పున రుద్భవమునొంద దయిన యేలూర! నీవయిన లెమ్ము
విటతాటమగు కొండవీ డింక వచ్చునే అయిన గుంటూర! నీ వయిన లెమ్ము
ఐపోవు కాకుళ మ్మైపోయె నయిన విజయవాడ! యింక నీ వయిన లెమ్ము
అఱిగిన విద్యానగర మింక నరిగిన దయిన బళ్ళారి! నీ వయిన లెమ్ము

గీ. దాక్షిణాత్యులు చెన్నపత్తనముం గొనిరి
ఓఢ్రులు బరంపురంబును నొలిచికొనిరి
ముందుతల్పులు వెనుకతల్పులును బోవ
నౌర నిద్రింతురా? మీర లాంధ్రులార!

౭

శా. ఊకొట్టంగదవయ్య నీ వయిన నా కోవిశ్వకర్మ ప్రభూ!
నీకొల్మిన్ బలిమిన్ ఖనిత్ర మొకటిన్ నిర్మాణముం జేయుచున్
నా కిమ్మా! యిదె నేను వోయి కనుచున్ నాయమ్మ యాకారమున్
ప్రాకారమ్మును, *సీమపుష్కలకముల్ పాతించి నీ కిచ్చెదన్.

౮

గీ. ఎలయు కోర్కెలతూపుల నెక్కిడించి
విన్ను పగిలించు బంగారువిండ్లు పూని
రండు రం డిదె మీ రగ్నిరథము లెక్కి
అంతరాత్మలు కదలంగ నాంధ్రులార!



[* సరిహద్దులలో పాతు మేకులు.]

ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

౧

చదలువాడ యెఱ్ఱాప్రెగ్గడ భారతార ణ్యపర్వశేషమును, రామాయణమును, నృసింహపురాణమును, హరివంశమును రచియించెను. హరివంశమున నిట్లున్నది:

"శా. వాణిమ్మ్రొంక్కు ఘనుండు మల్లరథినీ
నాథుండు నిన్నాతత
శ్రీ నోడక్ సముపేతుఁ జేసి రోలమిక్
జేపట్టి మా కిచ్చుటక్
జీతో బోవ నెలర్ప రామకథ యుక్
జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం జెందితి వింకనుం దనియ నేఁ
గావ్యామృతాస్వాదనన్."

దీనిఁబట్టి రామాయణము హరివంశమునకుఁ బూర్వకృతి యనియు, నది ప్రోలయ వేమారెడ్డిగారి ప్రేరణమున చే రచితమయ్యె ననియుఁ దెలియనగును.

"వాల్మీకభవ వచోవైఖరి రామాయ
ణంబు నాంధ్రప్రబంధంబుఁ జేసె"

నని యెఱ్ఱాప్రెగ్గడ వంశము వాఁ డిటీవలి వాఁడు, చదలువాఁడ మల్లయకవి చెప్పినాఁడు. దీనిఁబట్టి యీరామాయణము సంగ్రహరూపమయినదిగాక సకల వర్ణనాపూర్ణమయిన, సంస్కృత రామాయణానుసారియయిన, ప్రశస్తప్రబంధముగాఁ దెలియనగును.

ఇట్టి యెఱ్ఱాప్రెగ్గడ రామాయణమిప్పుడు గానరాదు. లక్షణ గ్రంథములలో నెఱ్ఱాప్రెగ్గడ రామాయణ పద్యములు పెక్కు లుదాహృతము లయియున్నవి.

౨

కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహమున ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనివని యీ క్రింది పద్యముల నుదాహరించినాఁడు.

ఉ. "అంగములోడఁ గట్టు మిట
యజ్ఞవిఘాతక చోరు నెందు వో
వంగలవాఁడ వింక నిటు
నైశము తాపసవేషధారినై.

ఉ. "సంకడి యన్వరక్రియా క
సంగతమేని బలంబుకోడఁ బెక్
గ్రం దదియేల యేన తగఁ
గార్ముక హస్తుఁ డనై కనంగి మీ
ముందఱ నిల్చెదన్ గ్రకువు
ముట్టకయుండఁ బ్రచండదైత్యరా
జిం దగ దవ్వుదోల వెసఁ
జిందెదఁ జెంచెద మీకు మోదమున్.

చ. అనుటయు మంత్రిమాటకుఁ బ్రి
యంపడి యాతని నాదరించి య
మ్మనుజకులేంద్రుఁడు...

ఉ. సూర్యుని నొక్క దంచము మ
నోగతి నైరణచేసి నన్నునా
సర్వకులంబు మత్తమయా
శంబున నుంచితి రమ్మలార, మీ
కుర్వి నీ సాటి రేయబల
లొండొరు దేవతలున్ బటుక్షమా
నిర్వహణం బొనర్చుటకు
నేరరు మర్త్యులఁ జెప్పనేటికిన్.

చ. అనఘ యకంపమై విమల
 మై పరిపూర్తి నము లోఁతుఁ దియ్యముల్
ఘనతయుఁ గల్గి సజ్జనము
 నస్సదృశస్థితిఁ జాల నొప్ప నీ
జినయది యన్న దీజలము
 చేవున మంచిది...

ఉ. కోలలు నుగ్గునుగ్గయిన
 క్రూరఫణీంద్రు గరిట దరంగముల్
మాటిన భూరివారిధిక్ర
 మంబున రాహుకరాళవక్త్రము౯
జూటిన తీవ్రభానుక్రియ
 దుర్బలసైన్యశేఁ బుత్త్రిహీనత౯
గీటి పరాభవాభిగతిఁ
 గిన్పడి భూపతి నెమ్మనంబున౯.

శా. తాలుంగ్రాఁగినచేల తంపులఁ గా
 తాశంబు దాఁక౯ జనం
బాలుం బల్మరి మిన్ను దాఁకి తరఁగల్
 తోరంబులై వల్గఁగల్
పాలుం దెల్లగ నేలు లబ్బఅయు గాఁ
 బైపైన నీరెక్కఁ దై
వాల౯ శీర్వ్యలు చెన్నుమీఱె నఖిల
 ప్రాణుల్ మదింబందఁగా౯.

క. నూఱు దేఱంగుల నెఱసులు
మీఱఁగ నీవిభ్రమములు మెఱయించి మునిం
గాఱఁగఁ జేయుము మేనక
చూఱకొనదె యతని తెలివి సామ్ములు మున్న౯.

మ. చెలఁకుందోఁటలఁ జెంచి శాలిమయను
 క్షేత్రస్థలుల్ నించి యు
క్కఅశేకుంపఁగఁ బాగనాగఁతిక్రా
 కాంతారముల్ ప్రోచి యే
ర్తైఅ వంకం నుమదోత్పలాళివనవా
 టీకోటిఁ బాటించి పై
న్జైఱువుల్ వొల్చెఁ బునంబునప్రసలఁ బ్ర
 స్ఫీతాంబుపూర్ణస్థితి౯.

కూచిమంచి తిమ్మకవి గోదావరిమండలమున పిఠాపురమునకు చేరువను 'కందరాడ, చంద్రమపాలెము' అనుగ్రామముల వసించెను. ఈ గ్రంథమును క్రీ. శ. ౧౭౫౦ సంవత్సర ప్రాంతమున రచించెను. ఆతఁ డుదాహరించిన యెఱ్ఱాప్రెగ్గడ రామాయణ పద్యములు ఇతరలక్షణ గ్రంథములనుండి సేకరింపఁబడినవి కావు. ఆతఁడు స్వయము గ్రంథమును పరిశీలించి యుద్ధరించినవే. ఇన్ని పద్యముల నితరలాక్షణికు లెవరు నుదాహరింపలేదు. ఇప్పటికి ౧౫౦ ఏండ్లనాఁడు గోదావరిమండలమున కూచిమంచి తిమ్మకవి యింట ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము సురక్షితమై యుండెనని దీనివలనఁ దెలియఁగలదు.

చదలువాడ యెఱ్ఱాప్రెగ్గడ రచనముగా నీ కవిస్తుతిపద్య మొక ప్రాచీనపద్యసంకలనమునఁ గానవచ్చినది.

శా. సారోదార సమంచిత స్ఫుర దురు
 స్ఫాయ ల్లస ల్లాలిత
(స్ఫారంబుల్ ఔ?)నఁ ద్రిప్పిపెట్టుచును శ
 బ్దద్రవ్యహీనుల్ సదా
చౌర్యం జెప్పిరి మంచుఁ జెప్పికొనుటల్
 తప్పే నిరాఘాటవా
క్సారభ్యప్రతిభావిజృంభితులు మె
 చ్చర్ గాక యాదంచనుల్.

ఇది యెఱ్ఱాప్రెగ్గడ రామాయణ కృత్యవతరణికలోనిది గావలెను.

ఈ క్రిందిపద్యమును, 'ఎఱ్ఱన రామాయణము లోనిదా ?' అని యెప్పుడో నోటుబుక్కులో వ్రాసికొంటిని. ఎక్కడనుండి యుద్ధరించితినో యిప్పుడు గుర్తింపజాలను.

ఉ. చువ్వన మేను వంచి రవి
 సోఁకఁగఁ దోఁక విదల్చి పావముల్
విప్పఁగఁ బట్టి బాహువులు
 పీచి మొగంబు బిగించి కొంచె జా
జవ్వన నాఁగి నుందటికిఁ
 జాఁగి పిఱిందిఁ దూఁగి వాధిపై

జివ్వన దాఁటె వాయుజుఁడు
అక్కలతోడి సుగ్రీవమో యనక్.

కూచిమంచి తిమ్మకవిగారు మఱికొందఱు లాక్షణికులును ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనిపద్యములను తమ లక్షణగ్రంథములం దుదాహరించినారు. అట్టివి మఱికొన్ని యీ క్రిందివి:

గణపవరపు - వేంకటకవి ప్రయోగరత్నాకరము:

క. ధాత్రీ సురసేవారతి
ధైర్య ధృతి సుకీర్తిపాలబంధురమతి దు
ర్వార్తిపహరణ చణస్థితి
మిత్రానందకర విఖ్యాతి మీయం దిమధుర్.
"బాలసుధాంశునిటాలుని నవసుధా
లాపములీ వినవలె ననెను వాసు."

క. ఆదిశరథ సూనుండు ప
యోధిజలం బింకచేసి యొక్కళిసునవఁ గ్ర
వ్యాద విభుఁ దునిమి సీతను
మోదంబునఁ జేకొని కపిపుంగవులోడక్.
— ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేపరామాయణము.

గణపవరపు వేంకటకవి ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేపరామాయణము లోనివిగా నుదాహరించిన పద్యములు ప్రశస్తరచనము కలవి కావు. అతఁడు ప్రబంధరత్నాకరమున కొన్ని లక్షణములను గల్పించి వానికి లక్ష్యపద్యములను ప్రసిద్ధకవుల గ్రంథములలోనివిగాఁ గొన్నింటిఁ గల్పించి యుదాహరించినట్లున్నాఁడు. ఈతఁ డుదాహరించిన ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణపద్యములు కల్పితములైనను గావచ్చును; లేక, ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములో గ్రంథారంభభాగమగు సంక్షేపరామాయణములోని వయినను కావచ్చును. అంతేకాని ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేపరామాయణమని వేఱొక గ్రంథమును రచియించియుండఁ డనుకొందును. ఎఱ్ఱాప్రెగ్గడ తనతండ్రి సంస్కృతాంధ్రకవితావిశారదుఁడు సూర్యసుకవి యని తనగ్రంథములఁ జెప్పికొన్నాఁడు. సూర్యకవి కృతము సంస్కృతమున సంక్షేపరామాయణ మొకటి యముద్రితము కలదు. ఆ సూర్యసుకవి మన యెఱ్ఱాప్రెగ్గడ తండ్రియగునేమో! ఆ సంస్కృత సంక్షేపరామాయణమునకు ఎఱ్ఱాప్రెగ్గడరామాయణమునకు సంబంధమేమైనఁ గలదేమో — ఎఱ్ఱాప్రగ్గడ రామాయణము దొరకినప్పుడు తెలియవలెను.

3

ఇపుడు సుముద్రితమై వెలసియున్న భాస్కరరామాయణమునఁగూడ ఎఱ్ఱాప్రెగ్గడరామాయణపద్యము లనేకములు చేరియున్నట్లు తెలియవచ్చుచున్నది. పెక్కేండ్లకు పూర్వము ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున తెలుఁగు గ్రంథములకు డిస్క్రిప్టివ్ క్యాటలాగు (Descriptive Catalogue) వ్రాయునపుడు భాస్కరరామాయణమును సామాన్యదృష్టిని పరిశీలింపఁగా పాఠభేదములు, గ్రంథభేదములు చాలఁగాఁ గానవచ్చినవి. ఆ విషయ మప్పు డందు వెల్లడించితిని. ఆనందముద్రణాలయమువారి భాస్కరరామాయణముద్రణమునకొఱకు వారియొద్ద పండితులుగా నుండిన కీ. శే. తంజనగరం తేవప్పెరుమాళ్లయ్యగారు అరణ్యకాండమున రెండు భిన్నరచనము లుండుటనుగూర్చి కొంత నాతోఁ జర్చించిరి. భాస్కరరామాయణమునందలి యారణ్యకాండమున ప్రధానపాఠముగా గ్రహింపఁబడిన పద్యము లనేకములు ఏ తాళపత్రప్రతిలోను గానరాకుం

డెను. పాఠాంతరములుగా పుటలయడుగున చిన్నపైపుతో ముద్రింపఁబడిన పాఠములే తాళపత్రప్రతులలో నున్నవి. తొలుఁదొలుత భాస్కరరామాయణమును ముద్రించినవారు కరాలపాటి రంగయ్యగారో, నిశ్చింత తేనప్పెరుమాళ్లయ్యగారో యని మే మప్పుడు గుర్తించితిమి. వారే ప్రతులను చూచి అట్లు ముద్రించిరో యెఱుఁగరాదు. కరాలపాటి రంగయ్యగారు గొప్పకవి. ఆయన కొన్ని ప్రౌఢ గ్రంథములను రచించెను. ఆరణ్యకాండమున ప్రధాన పాఠముగా గ్రహించిన పద్యముల నాతఁడు రచించి చేర్చెనేమోయని కూడ మే మప్పు డనుకొంటిమి — తాళపత్రప్రతులలో నా పద్యములు కానరాలేదు గాన.

ఇటీవల భాస్కర రామాయణమును పరిశీలించుచుండఁగా వావిళ్లవారి ముద్రణమున యుద్ధకాండములోని యీ క్రింది పద్యము 'ఎఱ్ఱాప్రెగడవారి పద్యమని ప్రతీతి' అను అధోజ్ఞాపికతో కానవచ్చెను.

ఉ. 'త్రెవ్వడు గంటులం సురువు
దేఱెడు నెత్తురు రాశియున్న యే
నొవ్వియు నేనికారము మ
హోగతిఁ జెందకయున్న సాయకం
బవ్వలఁ బోకయున్న పసు
టాగ్రవిఘట్టనరావ మొప్పఁగా
నవ్వున నప్పటిల్లె నసు
రోద్వహ మూర్ధచయంబు గ్రక్కునన్
—ప, ౨౦౫౪.

అది చూచి వ్రాఁత ప్రతులను పరిశీలింతును గదా ఉదాహృతమైన యీ పద్యము ఎఱ్ఱాప్రెగడ వారిదని యుండుట మాత్రమే కాక దీని పూర్వపద్యము

ఉ. "ఉన్నది యున్నయట్ల తల
లుర్వికి డిగ్గ శిరఃప్రవాహముల్
మున్నొకసారె నిండఁ దగ
మోపినసాయక మట్లె యుండఁ జాఁ
గన్నె యిదూపు నెల్లి యని
ఖేచరకోటినుతించె నంచితో
త్పన్న దశాస్యరాఘవది
వాకరలాఘవచిత్ర సంపదల్.

అను పద్యము 'భాస్కరుని వారి' దని కూడఁగలదు. ఈ పద్యములు పెక్కుప్రతుల లోఁ గానరావు. కొన్నిప్రతులలోనే కలవు. ఇవి రాముఁడు రావణుని తలలు తెగఁగొట్టు ప్రకరణము నందలివి. యుద్ధకాండములోని యీ భాగము పెదవేదగిరి నాయనింగారి ప్రేరణమున అయ్యలార్యుఁడు పూరించినది. ఈ భాగమునకు భాస్కరరచనము నేఁడు కానరాదు. భాస్కరుఁడు కడముట్ట నారణ్యకాండము రచించినట్టు ప్రతీతియు లేదు. ఇందు భాస్కరరచనముగ పద్యముండుటను బట్టి చూడఁగా భాస్కరుఁడు యుద్ధకాండమును కడముట్ట రచించెనని యేర్పడుచున్నది. ఇవేకాక, యుద్ధకాండమున మఱికొన్ని పద్యములు కొన్నిప్రతులలో మాత్రమే యధికముగాఁ గానవచ్చుచున్నవి. దొరకిన యుద్ధకాండ ప్రతులనెల్ల పరిశీలించినమొదల నట్టివి మఱికొన్ని పద్యములు గూడ భాస్కరునివిగనో, ఎఱ్ఱాప్రెగ్గడవిగనో వేర్పడఁగల వనుకొందును. యుద్ధకాండ విషయ మిట్లుండె.

ఆరణ్యకాండమున ముద్రణములందు ప్రధాన పాఠముగ గ్రహింపఁబడిన గ్రంథ భాగములు తాళపత్రప్రతులలో సాధారణముగా దొరకుచున్నవియు, పాఠాంతరముగా నథఃకరింపఁబడినవియు నగు గ్రంథభాగ

ములకంటెఁ బ్రశస్త రచనము కలవి. ఒక వేళ నవియెల్ల ఎఱ్ఱాప్రెగ్గడ రచనమేమో యని యొకసందేహము నాకుఁ గలిగెను. ఆ గ్రంథభాగములలో వాల్మీకిరామాయణానుసారులు కానివి కొన్ని రచనములు కలవు.

ఉ. "తపనుఁడు వేఁడిఁ డొచ్చి వనఁ
దమ్ముఁడు, వృక్షముక్రిందఁ జెట్టు నాఁ
దపనుఁడు కాఁడు లేఁడు వసు
ధాధర, చంద్రుఁడుగాని, చంద్రునిన్
నృపసుత, యిటు క్లేశింగితివి
నీవు, మృగాంకము చూచి నుల్కెదే
చపలమృగాక్షి, చంద్రముఖి,
జానకి, యెక్కడ నున్నదానవే."

"శాంభవ్రేతే, నను సేవ్యతాం తరుతలం
చండాంశు రుజ్జృంభతే
చండాంశోర్నిశి కా కథా రఘుపతే,
చంద్రోఽయ ముమ్మీలతి,
వ, త్సైతద్విదితం కథన్ను భవతా
ధత్తే కురంగం యతః
క్వాసి ప్రేయసి, హా కురంగనయనే,
చంద్రాననే, జానకి."

— ప్రసన్నరాఘవము.

ఇత్యాదులు.

ఇట్టి యీ ప్రధానపాఠరచనముకూడ ప్రాచీనకవికృతమే కావలెను. కాని, యిది భాస్కరరామాయణమనుపేర లభ్యమగుచున్న గ్రంథములోనిది కాదు — భాస్కర రామాయణ తాళపత్రప్రతులలోఁ గానరాదు కాన. ఇట్టి సందేహములతో నేను చీకాకు పడుచుండఁగా డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు తమ కానెగొందిలో నొకభాస్కర రామాయణపుఁ దాళపత్రప్రతి దొరకె ననియు, అం దారణ్యకాండమున ఎఱ్ఱాప్రెగ్గడ కృతములుగా కొన్ని పద్యములు గానవచ్చె ననియు తెలిపి ఈక్రింది పద్యములను నాకుఁ జూపిరి.

ఉ. ఆనెలఁ జోడు కేలఁ దొనఁ
కై నిసుడించుటా యమ్ము వార్చి సం
ధానము సేత నింతఁ గొనఁ
దార్కొని లక్ష్యము సేయు దేయుఁడున్
గాన సజస్ర మండలిత
కార్ముక ముక్త టెంకటెఁ గంటె న
ద్దానవదీర్ఘ దేహమను
దాయ నిరంతరపాతవేగముల్.

స్రగ్ధర-కరిణీయానంబు నవ్వున్
గతి నవలతికాకార మంగంబు చంద్రున్
బురుణించున్ ముద్దుమోమం
బురుహదళములం బోలుఁ గన్నుల్ విపంచీ
స్వరసంకాశంబు పల్కుల్
జలదశ్రీనిచయ స్పర్థియై యుండు వేణీ
భర మాతన్వంగి కింద్ర
ప్రముఖ నిఖిల దిక్పాలకాళీలకౌర్యా.

చ. అళినిభవేణి చంద్రసదృ
శానన యుత్పలపత్రనేత్ర కో
మల లతికాభిరామభుజ
మంజులవృత్తలసత్కుచద్వయీ
కలిత సుమధ్య హృద్యకటి
కామ్యతరోరువు రమ్యజంఘ యు
జ్జ్వలచరణాబ్జ తద్వనిత
జానకినా విలసిల్లు రావణా.

వా గిందుకై మదరాసులోని యితర తాళపత్రప్రతుల నెల్లఁ బరిశీలించిరట! ఆ విషయము నిట్లు చీటిలో వ్రాసి పంపిరి.

"ఈపద్యాలు నేను ఆనెగొంది నుంచి తెచ్చిన ప్రతిలోనివి. అందు 'ఎఱ్ఱాప్రగ్గడ పద్యాలు' అను శీర్షికతో గూడియున్నవి. ఇదిగాక అడయారు లైబ్రరి G. No. XXXII T. 13G. 'యెఱ్ఱప్రగడవారి పద్యం'

(తాళ. ప ౯౬ పం. ౧) అనుమాటకు తరువాత పైమూడు పద్యాలు కలవు. ఇంకను మద్రాసు యూనివర్సిటీ కలెక్షన్ (ఎఱ్ఱాప్రగ్గడ పేరులేకున్నను) ౧౩౯౦ నంబరు ప్రతియందు మూడుపద్యములును గానవచ్చుచున్నవి. అట్లే ౪౩౨౬లో కూడా పద్యాలు పేరులేకుండా కాన్పించుచున్నవి. G.Or. Mss. Madras. 14-10-7 దీనిలో 'ఎఱ్ఱాప్రగడ పద్యాలు' అన్నమాటలేదు కాని ఆపద్యాలలో "కరిణీయానంబు", "అలినిభవేణి" అన్న పద్యాలు కాన్పించుచున్నవి."

ఈమూఁడు పద్యములతోపాటు తక్కిన ఆరణ్యకాండ రచనాభేదము లెల్లఁ గూడ ఎఱ్ఱాప్రెగ్గడ రచనములు కావచ్చునేమో యనికూడ నే ననుమానించుచున్నాను.

అయోధ్యాకాండమునఁగూడ రచనాభేదములు చాలఁగాఁ గలవు. అందుఁగూడఁ గొన్ని యెఱ్ఱాప్రెగ్గడ పద్యము లుండునేమో! ఇట్లు భాస్కరరామాయణగ్రంథభాగము లెన్నో చిక్కులతో నున్నవి. అవి యెల్ల జాగ్రత్తగాఁ బరిశీలించి యిదమిత్థమని నిర్ణయింపవలసి యున్నవి. భాస్కరరామాయణమున ఎఱ్ఱాప్రెగ్గడ రచనములు గొన్ని చేరి యుండుట తథ్యము.

౪

ఈ నడుమ నేను ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని యొక సంకీర్ణపద్యముల తాళపత్ర సంపుటమును పరిశీలించుచుండఁగా అందు రామాయణ యుద్ధకాండమున పద్యములు ముప్పది కానవచ్చినవి. చదువఁగా నవి ప్రసిద్ధములైన భాస్కరరామాయణాది గ్రంథములలోనివిగా తోఁచలేదు. భాస్కరరామాయణమును, భారతారణ్యపర్వాంతర్గతరామాయణమును, భాగవతాంతర్గతరామాయణమును, మొల్లరామాయణమును, రామాభ్యుదయమును, ఘనగిరి రామకవి సకలవర్ణనాపూర్ణ రామాయణమును పరిశీలించి చూచితిని. ఈ కానవచ్చిన ముప్పది పద్యములు నందెందును గానరాలేదు. ఈ పద్యములుగూడ ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనివి కావచ్చు ననుకొనుచున్నాను. అవి యీక్రింద చూపుచున్నాను:

చ. అనిలజ రావణానుజులు
హస్తములన్ గయిదండ గొంచుఁ గ్ర
క్కునఁ జనుదెంచి, భానుజుఁడు
గొల్వ సుఖంబున నున్న రామచం
ద్రునిఁ గని పాదముల్ శిరము
తో నొరయన్ బ్రణమిల్లి లేచి ని
ల్చిన యెడ నెమ్మిఁగమ్మ విశ
దిల్లి విభీషణుఁడుం బ్రియంబునన్. ౧

* * *

ఉ. తమ్ముఁడ! సేఁదు నాకుఁ బ్రమ
దంబు ఘటిల్లె దశాస్యనందనుం
డిమ్మెయిఁ గూలుటన్ మనకు
నింక జయం బగునంచు సిగ్గులోఁ
గ్రమ్మఁగ నున్న లక్ష్మణుని
గ్రక్కున నంకమునందు నుంచి వ
క్షమ్మునఁ జేర్చుచున్ శిరము
సారెకు మూర్కొనుచుం గ్రమంబునన్. ౨

* * * *

చ. కరముల నవ్విభుం డతని
గాయము లంటుచు మార్చు పుచ్చుచున్
బురఁ బురఁ బొక్కుచున్ శిరము
మూర్కొని యెంతయు నాఱడింపుచున్
దురమున లెస్సఁ గూల్చితివి
దుర్గముఁ దైవవిరోధిఁ బంక్తికం
ధరుఁడును నింకఁ గూలునని
నామది నిశ్చయబుద్ధి నొందెదన్.

* * * *

చ. *మసలక రామరావణులు
మార్కొని యుద్ధము సేయుచుండఁగా
నిశిత శరంబు లొండొకటి
చేర్పునఁ ద్రుంచుచు నుగ్రశక్తి మై
దశశిరుమస్తకప్రతతి
డాఁకినఁ జిత్రరు దుల్లు నాప్తమై
నుసిరిక ప్రూనిమీఁదఁ బడు
గూనినఁ గాయలు దుల్లునాకృతిన్. ౪

* * *

ఉ. అక్కట ధూళిఁ గ్రుంగుడయి
యంగము నెత్తుటఁ దోఁగి వేదనన్
గ్రుక్కుచు ధాత్రిపైఁ బొరలు
చున్ బడి లక్ష్మణుఁ డిట్టులుండ నా
కెక్కడియుద్ధకాంక్ష యిఁక
నెక్కడివిక్రమగౌరవక్రమం
బెక్కడిప్రాణ మెక్కడిమ
హీసుత యెక్కడిరాజ్యసంపదల్. ౫

* * *

ఉ. కందక గాజువాఱక మొ
గంబు వికాసముఁ జెందఁ జేతు లీ
యందములైనకాళ్లు నరు
ణాంబురుహంబులలీలఁ జూపఁ జె
న్నొందెడు శివహీను లిట్టు
లుండెదరు ప్రాణముతోడ నున్నవాఁ
డిందు సహోదరుండు ధర
ణీశ్వర, నీకు బ్రసాద మేటికిన్. ౬

* * *

చ. మనమున నిశ్చయించి పవ
మానతనూజుఁడు మూఁడుమూఱు లే
ఘనఁ గదలించి యంబుధర
ముంబలె నీలరుచిం జెలంగుత
ద్ద్వనగిరిశృంగమున్ బిడిచి
కైకొని పై కెగురంగవైచి యా
చి నిలువఁ బట్టుచున్ బవ సు
షేణునిఁ జేరఁగ వచ్చి యచ్చటన్. ౭

* * *

ఉ. అతనిరౌద్రరేఖ గని
యబ్ధి గలంగఁ జలించె శైల మా
త్పాతవారిదంబు లతి
దారుణరావములై జనించె ధా
త్రీతలమెల్ల బిట్టదరె
దిక్కులు ప్రీలె సమస్తభూతముల్
భీతి వహించె డెందమున
లెన్ రజనీచరలోకభర్తకున్. ౮

* * *

చ. అనయము సర్వభూతముల
యందును గోద్విజులందు శైలకా
ననగగనాఖిలాశల ఘు
నత్వము మించ సహస్రపాదశో
చనశతశీర్షమూర్తివయి
సారగతిన్ వసియించి సాద్రికా
వనియు సమస్తభూతము ల
వారి వహింతువు నీవె రాఘవా! ౯

* * *

మ. తరుణాదిత్యశిఖద్యుతిన్ మెఱసి ర
క్త శ్రీచ్ఛటాశాటికా
ధరయుం దప్తసువర్ణభూషణయు ను
ద్యన్నీలధూమాభ్రబం

---

* ఇట్టి పద్య మొకటి బాలబోధ మనులక్షణ గ్రంథమునను ఉదాహృతమయి యున్నది. అది యిది:

ఉ. దశరథరాజ సూనునకు దానవనాయకుఁ డేపుమాపినన్
విసరుహమిత్రనందనుఁడు భీతి రవంతయు లేక యుగ్రుఁడై
విస గద వ్రేసి వ్రేసినను వేగము గాలెఁ గిరీటరత్నముల్
ఉసిరిక ప్రూనిమీఁదఁ బడుగూనినఁ గాయలు దుల్ల నాకృతిన్॥ ఈ పద్య మెవ్వరిదో?

ధురధమ్మిల్లయు నా విదేహతనయన్
దొల్లొల్ల జెన్మంబులోఁ
గోరనే తెంచిన రూపుతోన జగముల్
సోద్యంబునన్ జూచినన్. ౧౦

* * *

చ. అవనిజనంబులెల్లను ద
శానమునంతిపురంబునందుఁ బె
క్కవు దివసంబులున్న జన
కాత్మజ శోధితఁజేయ కీయవా
ర్యవిహితవృత్తిఁ దెచ్చె రఘు
రాముఁడు బాలితుఁ డంచు నెంచ రా
భువనములెల్ల నమ్ముటకుఁ
బో యిటు సేసితి హవ్యవాహనా. ౧౧

* * *

చ. ప్రకటితరాత్మ తేజమున
రక్షితయా మిథిలాధిరాజక
న్యకను బయోధివేలఁబలె
వాశరుఁ డెందు నతిక్రమింపఁ డే
న్నికకును నిప్పవంటి మహ
నీయచరిత్రను గల్గ నిట్టి జా
నకిని దరంబె వానికి మ
నంబున నేనితరుఁ జాల్కొఁ జూడఁ గాన్. ౧౨

* * *

ఉ. వైరిజయంబు గాంచి బల
వంతుల మిత్రులఁ గూడి తేజమున్
సారయశంబునన్ గనిన
సాధుసమాగమునంబు నీవు సాం
పారఁగఁ జెప్పచో నతని
యానవకర్మవిలోకనేంగితా
కారవచోవిశేషముల
కైవడి నేర్పవఁ జూడు మేర్పడన్.

* * *

మ. అకులంబై వశవర్తియై రఘుకురం
గానేకపాకీర్ణమై
పితృపైతామహమైన రాజ్యము మదిన్
ఛేదింపఁగాఁ జేయు నం
తత మెవ్వానికైన రాజ్యఫల మా
త్మన్ గోరినన్ గైకొనా
సుతుఁడే యేలుమనుండుఁగాక విపుల
క్షోణీతలం బంతయున్. ౧౪.

* * *

చ. అతఁ డడరించు శస్త్రముల
యారవముల్ శరపుంఖజాతమా
రుతములు గ్రమ్మినన్ సులగి
రుల్ గదలెన్ గలఁగెన్ బయోనిధుల్
క్షితి వడఁకెన్ మనంబునఁ జ
లించిరి పన్నగలోకవాసు లు
న్నతరుచిఁ బాసి మాసె దిన
నాథుఁడు మంచటిలెన్ సమీరుఁడున్. ౧౫

* * *

చ. వడి నమరేంద్రముక్తమగు
వజ్రములీల యుగాంతకాలుకై
వడిఁ బర తెంచి రావణుని
వక్షముగాఁడి ధరిత్రిఁదూరెఁ బ
ల్వడి దశకంఠుఁ ద్రుంచి రఘు
వీరుఁడు చేఁడని వేలువార్త యే
ర్పడ ఫణిలోకవాసులల
రన్ వివరింపఁగ జేగనో యనన్. ౧౬

* * *

శా. ఆపుణ్యవ్రతఁ బట్టినప్పుడె తదీ
యంబై యనిర్వార్యమా
లోపాగ్నిన్ మసిగాక నీవునికి ర
క్షోనాథ లోకంబునన్
బాపాత్ముండనువాఁడు పాపఫలమున్
బ్రాప్తవ్యకాలంబునన్
బ్రాపించున్ నిజపాపకర్మఫల మి
ట్లంగిన్ నినుం జెందుటన్. ౧౭

* * *

చ. సవితృఁడు చంద్రుఁడున్ దిశలు
సంధ్యలు శేలుఁ బగల్లు గాలియున్
భువియును నాదిగా సకల
ముల్ గను సాక్షులు వీరలుంగ జేఁ

ప్రవిమలసద్గుణోత్తరధు
రాపరిభూషిత సైతిచేని వా
వ్యవహుఁడు వన్నె నిప్పుడు ద
యారతచిత్తతఁ బ్రోచుఁగావుతన్. ౧౮

* * *

శా. ఆకీర్తిన్ భువనత్రయిన్ గలుగువా
రత్యంతశోకార్తులై
ధీరత్వంబు పరిత్యజించి యలధా
త్రీనందనం జెందుదు
ర్వారాపన్నత రోయించుచున్ బలుకఁ ద
ద్వాక్యంబు లాలించుచున్
ధారాళాశ్రులతో మఖం జెరియఁ జిం
తన్ రాముఁ డున్నత్తతిన్. ౧౯

* * *

చ. ఖలునిఁ గబంధునిన్ నిశిత
కాండములన్ దునుమాడి వాని ప
లుకులు విని బుశ్యమూకమున
కున్ జని భానుజుఁగూడి వాలి ను
జ్జ్వలబలుఁ గూల్చి యర్కసుతు
వానరరాజ్యమునందు నుంచి య
య్యలఘుఁడు వంపె భూమితన
యన్ వెదకన్ గపివీరకోటులన్. ౨౦

* * *

చ. నిరుపమమూర్తి రామధర
ణీపతి శోభనవేళ పాడి ర
చ్చరవుఁ బోండ్లు కిన్నరులు
పాలెపుఁ బాడిరి దేవదుందుభుల్
మొరసెను ధాత్రి సస్యములు
మోహనలీల వహించె వృక్షముల్
వరసురభిప్రసూన ఫల
వర్గములన్ విలసిల్లె నెంతయున్. ౨౧

* * *

చ. అని కొనియాడుచున్ జలరు
హాక్షులు సేసలు మీఁదఁ జల్లఁగా
ననఘచరిత్ర! రామ! సుగు
ణాకర! వర్ధిలుమంచుఁ బాడ లె
ల్లను దనచుట్టుఁగొల్వఁ గన
లంకృతమైన రథంబుపై ముదం
బున భరతాగ్రజుండు రఘు
పుంగవుఁ డేగతి రైభవంబులన్. ౨౨

* * *

చ. జలనిధిగట్టి మించుకపి
సైన్యముతో వనరాశి దాఁటి దో
ర్బలమున లంకపై విడిసి
రావణముఖ్యనిశాటకోటులన్
గలఁగ జయించి భూతనయ
గ్రమ్మఱఁ గైకొని నిత్యకీర్తులన్
వెలసినవాఁడు రాముఁ డిటు
వింటిమె కంటిమె యిట్టిచిత్రముల్. ౨౩

* * *

శా. భేరీకాహళశంఖతూర్యములు గం
భీరంబులై మ్రోయఁగాఁ
దారామార్గమునందు దేవఋషిగం
ధర్వస్తుతుల్ మీఱ నీ
వారాధిం దగ వందిమాగధులు కై
వారంబు గావించుచున్
పౌరోదారవిచిత్రవైఖరుల వా
నందంబు గల్పింపఁగన్. ౨౪

* * *

ఉ. రావణుఁ గూల్చి క్రమ్మఱ న
రాసుతఁ జేకొనివచ్చుచున్న వాఁ
డావసుధాకళత్రుఁ డిద
యాప్తులతోడ మహేంద్రుతో శచీ
దేవియుఁబోలె సీత జగ
తీతలనాథునిఁ గూడి సంతత
శ్రీవిలసిల్లు నన్నయది
చేరినవాఁడు సుమిత్రపట్టియున్. ౨౫

* * *

చ. అలికుల వేణులన్ జలరు
హాక్షులఁ జంద్రనిభాస్యలన్ విని
ర్మలమణిహేమభూషణ స
మగ్రల భార్యలఁగా వరింపు గ

వ్యాల సుఖజాతికుముక్తులఁ బ
దార్థర గ్రామశతంబుఁ జూడఁ జె
న్నలరెడు లక్షగోవులఁ బ్రి
యం బెలఁగించిన నీకు నిచ్చెదన్. ౨౬

* * *

ఉ. కొంచక కోటపై నిలిచి
కొండలు భీమబలాఢ్యులైన న
క్తంచరు లుగ్రతో మరగ
దాపటుశక్తుల వానరాలి మె
ప్పించిరి వానరేంద్రులును
జేర్చి రణంబునఁ గోటపైకి లం
ఘించి నిశాటులన్ ధరణి
కిం బడనీడిచి కొంచి రద్ధరిన్. ౨౭

* * *

మ. నిను సేవించినఁ గల్గు మానవులకున్
పీటీవధూటీఘటీ
ఘనకోటీశకటీకటీతటిపటీ
గంధేభవాటీపటీ
రసటీహారిపటీ సువర్ణమకుటీ
ప్రస్ఫోటికా పేటికల్
కనదామ్నాయ మహోతురంగ శివలిం
గా నీలకంఠేశ్వరా ! ౨౮

* * *

ఈ ౨౮-వ పద్యము, నీలకంఠేశ్వర స్తుతి రూపమయినది. అది వేఱొక గ్రంథము లోనిది యయినను గావచ్చును. కాని, యీ సంకీర్ణ పద్యసంపుటమున నుదాహృత రామాయణ పద్యములతో నున్నది. కాన రామాయణములోనిది గావచ్చుననుట సంగతమగును. ఎఱ్ఱాప్రెగ్గడ నెల్లూరు మండలమందలి గుడ్లూరి నీలకంఠేశ్వరస్వామి భక్తుఁడు. ప్రోలయ వేమారెడ్డిగారి ప్రేరణమున నాతడు రామాయణము నా నీలకంఠేశ్వర స్వామి కంకితముగా రచించెనేమో ! ఈ పద్యము గుడ్లూరి నీలకంఠస్వామి స్తుతిసందర్భము లోనిదిగావచ్చును !

౫

ఈ పై పద్యములలో ఎఱ్ఱాప్రెగ్గడ రచనాగౌరవము కానవచ్చుచున్న దా యని సందేహము తోఁచును. పద్యము లన్నియు సలక్షణములై యున్నవి. గొప్ప రచనాప్రౌఢిమ కానరాకున్న దనవచ్చును కాని యెఱ్ఱాప్రెగ్గడ తొలుతటికూర్పు కాన యిందు రచనమునఁ గొంత వెన్నాటు గల దేమో !

శ్రీనాథుఁడు 'పరిఢవింతుఁ బ్రబంధ పరమేశ్వరుని లేవ సూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు'అని తన యెఱ్ఱాప్రెగ్గడ రచనానుకరణాభిమానమును వెల్లడించుకొన్నాఁడు. ఈ క్రింది పద్య ద్వయమున ఎఱ్ఱాప్రెగ్గడ సూక్తి వైచిత్రియు, శ్రీనాథుని తదనుకరణమును గాననగును.

ఉ. కందక గాజువాలిక మొ
గంబు వికాసమునొందెఁ జేరు లీ
యందములైన కొల్లు సరు
జాంబురుహంబులలీలఁ గాంతిఁ జె
న్నొందెడు జీవహీనులిటు
లుండెరు ప్రాణముతోడనున్నవాఁ
డిందు సహోదరుండు ధర
ణీశ్వర నీకు విషాద మేటికిన్.

ఉ. కందక గాజువాలిక వి
కాసము డిందక మందహాసని
ష్యందము చెక్కుటద్దముల
వాలిక నెమ్మది నిద్రవోవున
ట్లుందమునొంద ధాత్రి నిరి
యాలకుమారకు వక్త్రచంద్రుఁ డా

నందముఁబొందె నప్పు డిల
 నాఁగమనంబును భర్తధిత్తముల్:
 —శ్రీనాథుని హరవిలాసము.

ఎఱ్ఱాప్రెగడ "సూక్తివైచిత్రి" శ్రీనాథుని సమకాలపుఁ బ్రసిద్ధకవి జక్కనకూడ,

ఈత్రియుఁ నాఁ బ్రబంధపర
 మేశ్వరుఁ డై విరచించె శబ్దవై
చిత్రి సరణ్యపర్వగున శేషము......

అని ప్రశంసించెను.

సంస్కృత వాల్మీకి రామాయణమునకును ప్రాచీనాంధ్రరచనములగు రంగనాథ భాస్కర రామాయణములకును జాలభేదములుగలవు. రంగనాథ భాస్కర రామాయణములుగూడఁ గొన్ని కాండములందుఁ బోలికలు గలిగి, కొన్ని కాండములందు లేకయున్నవి. రంగనాథ రామాయణమున విశిష్టాద్వైత విషయములు గొన్ని యధికముగాఁ జేరినవి. కొన్ని కథాభేదము లున్నవి; అధికకథ లున్నవి. అందుఁ గొన్నిటికి సంస్కృతమూలము గానరాదు. దేశికథాసంప్రదాయముల ననుసరించి వానిని కవి చేర్చియుండవచ్చును. ఎఱ్ఱాప్రెగడ రామాయణాంధ్రీకరణము హరివంశాంధ్రీకరణమును బోలియుండు ననఁదగును. ఇప్పుడుపలబ్ధము లయిన పద్యములు సంస్కృతానుసారులుగా నున్నవి. ఆయాపద్యముల పట్టులను సంస్కృత వాల్మీకి రచనములతోను, తెలుఁగు రంగనాథ భాస్కరరామాయణ రచనాభాగములతోను బోల్చి చూచిన నీ యెఱ్ఱాప్రెగడ పద్యములు సరిగా సంస్కృతానుసారులుగా నుండుట వ్యక్తమగును.

రంగనాథ భాస్కర రామాయణములు ఎఱ్ఱాప్రెగడ రచనమునకంటెఁ బూర్వము వెలసిన వనఁదగినవి. ఎఱ్ఱాప్రెగడ కించుక తర్వాతికాలమువాఁ డగును భాస్కర రామాయణ యుద్ధకాండశేషమును బూర్తి చేసిన అయ్యలార్యుఁడు. ఇంచుమించుగ నాతని కాలముననే తెలుఁగున మఱొక రామాయణాంధ్రీకరణము వెలసినది.

క. రామాయణకృతికృతిపై
 తా మెఱయుచు నాంధ్రకవిపితామహుఁ డనఁగా
 భూమిం బిసభీమన యను
 నామంబున వెలసె సత్యనారన ఘనుఁడై.
 —సింహాసనద్వాత్రింశిక.

'పిన్నభీమన్న' యని 'ఆంధ్రకవిపితామహు' డని పేరఁదిన, రామాయణకృతికర్తయైన యీ సత్యనారన అనపోతకుమారసింగభూపతి (వెలుగోటి వెలమరాజు, కాలమువాఁడు. అయ్యలార్యన కించుమించుగా సమకాలమువాఁ డగును. ఈ రామాయణముగూడ నిపుడు గానరాదు. ప్రాచీనలక్షణగ్రంథకారులుగాని, యితర ప్రాచీనకవులుగాని యీ సత్యనారనను స్మరించినట్లు గానరాదు.

ఎఱ్ఱాప్రెగడ రామాయణము ఎఱ్ఱాప్రెగడ నాఁటనుండి కూచిమంచి తిమ్మకవి నాఁటిదాఁక సుప్రచారము గలదిగాఁ దెలియవచ్చుచున్నది. నూటనెనుబది యేండ్లక్రిందటిదాఁక సురక్షితమై యున్న యీ గ్రంథ మీనాఁడుగూడ నెక్కడనేని అపరిజ్ఞాతముగా నుండవచ్చును. గోదావరీమండలమున కందనాడ, చంద్రమపాలెముల (కూచిమంచి తిమ్మకవి యూళ్లు) చుట్టుపట్టులఁగాని, కృష్ణా గుంటూరు నెల్లూరు కడప కర్నూలు మండలములలోఁ గాని అది దొరకఁదగు ననుకొ

దును. నెల్లూరు కర్నూలు కడప మండలములలో ప్రాచీనగ్రంథపరిశీలన మింకను సరిగా జరుగవలసియున్నది. ఆయాచోట్ల నపరిచితముగా నున్న తాటియాకుకట్టలను పరిశీలించి యెఱ్ఱాప్రెగ్గడ రామాయణము నే పుణ్యాత్ముఁడేని యుద్ధరింపఁ గల్గునని విశ్వసించుచున్నాను. ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహపురాణము తప్పులతో నొక్కప్రతి మాత్రమే ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ గలదు. దానికిని మంచిప్రత్యంతరము కావలెను. ఆంధ్రవిశ్వవిద్యాలయాధ్యక్షులగు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమును సంపాదింప గల్గితిమేని యది మన లోకభాగ్యవిశేష మనియు, దాని నార్జింపఁగలవారి కెంతసాహాయ్యమేని చేయ నుత్సహింతు మనియు ఈనడుమ రాజమహేంద్రవరమున జరిగిన రెడ్డిసామ్రాజ్యవర్ధంత్యుత్సవమునఁ జెప్పిరి. శ్రీ రామలింగారెడ్డిగారి పవిత్రాశయము సఫలమగుట కపేక్షించుచున్నాను.

వర్షారము

'భార్గవ'

కడు తపించిన కాలిమార్గముల వెడలు
ధూసరపరాగభూరినిశ్వాససమితి
తొలగిపోవగ గ్రీష్మము, తొంగిచూచు
వలచు తొలకరి,- పృథులశోభామయమ్ము!

గ్రామముల నంటు విస్తృతప్రాంతరముల
నొలసి, పెరిగిన పచ్చికపొలము లపుడు
ఎండిన గళమ్ములను సవరించుకొనుచు
స్వాగతమ్మును పాడు వర్షార్ద్రిరమకు.

గొంతుకలు వేయి విరియించికొని వసించి,
మింటికిని మంటికిని మధ్య మెలగు వాన
కోయిల వినూత్నవత్సరోపాయనముగ
తోడితెచ్చును, తొలకరితొలిపసందు.

ఆ దినాంతవిహారప్రమోదమందు
శిశిరపవనంపుగిలిగింత చెలగుజలద
రమణుల వినీలవదనాంచలముల దోచు
సరస శృంగార మధుర హాసము లనంగ
ద్యోతలమ్ము సౌదామినీద్యుతులు విరియు!

నాడు వర్షపుజడి, బడి వీడినంత
ప్రతిదినమ్మును చేయునల్లరిని మించి
కేరలుచును, కేకరించుచు తిరిగిపోవు
బాలకుల గాంచ మిన్నుల సంబరమువాడమ.

పల్లముల జేఱు నవవర్ష వారియందు
చిన్నికరముల రచియించుకొన్నయట్టి
కాగితమ్ముల పడవలు తూగుచుండ
మరియు ముద్దుమొగమ్ముల నరయవలయు.

ప్రాణ మొసఁగఁజాలు సురభిళానిలముల, -
ఉగ్రసూర్యాతపమ్మున నుడికి వర్ష
ధారల దడిసి, - పొగయు కేదారవాటి
నెగయువలపుల, తుష్టి, సేవించిన వశి, -
అరక బరువున వంగుకంధరము లెత్తి
అతిసహిష్ణుత వెలయు నాహాలికములు.

మనుజు వానుండి నిర్గతమ్మయిన వాని
మించి, పతితపావను బ్రస్తుతించుచుండె
నేమొ, సోజ్జ్వల మ్మాదుక్కిటెద్దుల నయ
నద్వయమ్ము, దినశ్రమానంతరమున
నవి పొలమ్ములో విశ్రాంతి నందుచుండ.

జలదకన్య నదీనదముల మరుంగు,
జలముల, వినోదమునకు, పుక్కిలిని నింపి,
ఉడుకుగా నుండు పెరిగి తూపొడువ, పుడమి
కురవి, అయ్యవి, వర్షశీకరము లాయె,
మలయు తెమ్మెర తాకున చలువ నగుచు.

దివ్యకార్ముక లాంఛితాదిత్యమూర్తి
మెఱపుమెలతుక గూడి, అంబరపథాన
నెఱపువాహ్యాళి, రథచక్రనిస్వనముల
నవని ఘనమేఘగర్జనమ్మని భ్రమింప.

సప్తవర్ణమనోహరాశ్వమ్ము లపుడు
నిర్భరోత్సాహప్రకటనోన్మీలనమున
చెలఁగి మిన్నేటిజలముల చిమ్మ్మలాడ
పుడమి, వర్షావతరణమై పొలుపుగాంచె!

తనదు వాతాయనమ్మున గునుకురోగి
ఉరలు చిఱుపాటరొదల, వంకరలు తిరిగి,
పారలు సెలయేళ్ల గాంచి సమ్మోద మంది,
ప్రకృతిరూపము బింబించుపల్వలముల
నుండి పఱతెంచు శిశిరవాయువుల బీల్చి
హాయి నొక్కత్రుటి కను లరమూయు; నంత
నుపశమించిన జ్వరభార మూను నాత
డంతరంగాన వర్షమ్ము నభినుతించు.

పొలముపక్క, నేతరుమూలముననొ నిలిచి
కర్షకుడు, పచ్చగా, సుష్ఠుగా బెరింగి
వర్షపాతంపుధృతికి, యవనతములగు
తృణములను సస్యములను సంతృప్తిగనుచు
చింతనము సేయు; నెపద త్రుళ్లింతలాడ
కలుగఁబోయెడు మేలుకీడులనుగూర్చి.

ఘటికపర్యంత జీవనకాండ నిచ్చి
ప్రతిఫలిత మానవక్షణప్రభ లిమిడ్చి
వసుధ యను మేలురకపుతివాసిమీద
తొలుకుచినుకుల మొనసద్దములు లిఖించు
నింగి యొక చిత్రకారు డనంగ వచ్చు!

సేతుబంధము

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

ప్రాకృత వాఙ్మయమునందు, చాలమంది చదువునదియు, చదువఁదగినదియు సేతుబంధ కావ్యము. దీనికి "దహముహావహా" యనియు మారుపేరు. శ్రీరాములు సేతువుఁ గట్ట నుద్యమించుట మొదలుకొని, రావణునివధ పర్యంత మిందు సరసగంభీరముగ వర్ణించి నాఁడు కవి. ప్రాచీన లక్షణకారులు, సేతుబంధములోని శ్లోకముల నుదాహరించిరి. క్షేమేంద్రుఁడు సంస్కృత వాఙ్మయమునందు, మహాప్రసిద్ధుఁడు గదా! అతని లక్షణ కావ్యములయం దెన్నియో సేతుబంధములోని శ్లోకముల నుదాహరించినాఁడు. మహాకవియగు భట్టబాణుఁడు, ముక్తకంఠముతో, సేతుబంధకారునిఁ బొగడెను[1]. అంతటితోఁ దనివి దీరలేదు. తన వచన రచనమున కెన్నియో, మనోహరములగు నలంకారములు, మర్మోద్ఘాటకము లగు భావములు యెరవు తెచ్చుకొనెను. అమరుకుఁడు, భవభూతి, భారవి మొదలగు మరికొందరు, ప్రాకృత కావ్యములను, ముఖ్యముగా సేతుబంధము నాదరించిరి. ప్రాకృతములోని గభీరత భవభూతియందును, శృంగార లోలుపత యమరుకునియందును, సామాన్యత (Simplicity) భారవి[2] యందును, మనకు స్పష్టముగా, కంటఁబడును. ధ్వనికారునకుఁ ప్రాకృతముపైఁ గొంత యభిమానపువాసన యున్నట్లే యున్నది. అతఁడు గాథాసప్తశతిలోని చాల శ్లోకముల నుత్తమధ్వని కుదాహరించెను. అట్టియెడ, ప్రసిద్ధతమమగు సేతుబంధములోని దొక్క కావ్యము నైనను నుదాహరింపలే దేల? నాకుఁ దోఁచున దిది. అతఁడు ప్రధానముగ ధ్వనిని నిరూపించుటకుఁగానే గ్రంథము నారంభించెను. ముక్తక కావ్యముల (చాటువుల) యం దున్నంత ధ్వనిపుష్టి, సాధారణముగా మహాకావ్యాంతఃపాతితములగు రచనల కుండదు. ఒకవేళ నున్నను, పూర్వాపర సందర్భముల నుదాహరించుటయు, నవి సరిగా పాఠకుని కర్థము గాకుండుటయు సంభవించును. అందులకుఁగాను, బహుశః పరస్పర సంబంధము లేని ప్రత్యేక మనోహరములగు చాటువుల నుదాహరించెను. సంస్కృతమునందలి శ్లోకముల నెత్తునపుడు, మహాకావ్యాంతర్గతముల నే స్వీకరించెను. అందులకుఁ గారణము స్వతంత్రములగు చాటువులయొక్క యభావమే. అమరుకము శృంగారమాత్ర విశ్రాంతము. సూర్యశతకము మొదలగునవి భక్తియందే నిమగ్నములు. గోవర్ధనాచార్యుల సప్తశతి యర్వాచీన మని నాయనుమానము. కాఁగా, ప్రాకృతకావ్యములయందలి ముక్త

---

1. కీర్తిః ప్రవరసేనస్య ప్రయాతా కుముదోజ్జ్వలా సాగరస్య పరంపారం, కపిసేనేవ సేతునా॥—
2. చూడుఁడు: భారవి, ౮-వ సర్గ మొదలగునవి.

కముల నుద్ఘాటించుటయు, సేతుబంధమును విడుచుటయు నకారణమేగాని వేరుగాదు. మహాకవియగు కాళిదాసుని రచనలలో, ప్రాకృతవాసన సంపూర్తిగా నిండియున్నది. అతనివలె ప్రాకృతమును వ్రాసినవారు సంస్కృత వాఙ్మయమున లేరు. కాళిదాసుని ప్రాకృతమును మనము చదువుచున్నపుడు సంస్కృత నాటకమును గాక, స్వచ్ఛమగు ప్రాకృత వచనకావ్యమునే జదువుచున్నా మనిపించును. బంధచ్ఛాయగూడ ప్రాకృతమువలెనే ప్రాకృత శ్లోకములయందు నడపును. ఉదాహరణముఁ జూడుఁడు:

అహిణవ మహులోలుహవో తుమం
తహ పరిచుంబియ చూయమంజరిం,
కమలవసది మెత్తణివ్వుదో
మహుయర విహ్మరిదోసిణం కహం. [3]

ప్రాకృతమునయందు వత్తులు తక్కువ, కఠినాక్షరము లుచ్చారణమునందు మారిపోయి తేలికగా పరిణమించును. సంస్కృత కవుల కీలలితబంధ మలవాటు గాకపోవుటచే ప్రాకృతమున వ్రాసినను సంస్కృతబంధములోనికే పాకము దింపుదురు. భవభూతి మహాకవి ప్రాకృతమును జూచిన నీభేదము బాగుగా బోధపడును[4]. పైశ్లోక మట్లుగాక, చాల లలితలలితముగా నున్నదై, యచ్చముగాఁ బ్రాకృతశ్లోకమే యనిపించుచున్నది. శాకుంతలములో నతఁడు వాడిన ప్రాకృతము చాల విశుద్ధము. అనేకమందికి వరవడిగా నుండఁదగినది. అపభ్రంశభాషలయందును, నితరములగు ప్రాకృతములయందును మహాకవి యద్వితీయుఁడు. అతఁడు సేతుబంధము నవశ్యముఁ జూచియుండును. చాల సూక్ష్మముగాఁ బరిశీలించినచో, సేతుబంధకారుని రచనలలోని మేలిమి కాళిదాసుని కావ్యములలో నవశ్యము గానిపించును. కుమారసంభవములోఁ గొన్నిచోటుల స్పష్టముగనే యున్నది. కొంతమంది కాళిదాసుని కన్న సేతుబంధ మర్వాచీన మందురు. నా కీవాదముపై నమ్మకము లేదు. ఈవిధముగనే సంస్కృతవాఙ్మయమున "యశోధర చరిత్ర" కును నన్యాయము జరిగినది. అశ్వఘోషుఁడే కాళిదాసు ననుసరించె నన్నారు. ఈపంథనే యాశ్రయించి భాసుఁడు కాళిదాసుకన్న నర్వాచీనుఁ డనియు, నతఁడే కాళిదాసు ననుసరించె ననియు నొక విపరీతవాదము బయలుదేరినది[5]. ఇట్టివి కేవలము అభిమానములను బురస్కరించుకొని యావేశముతో వ్రాసిన వ్రాఁతలే. కాళిదాసు, ఒకవేళ మరియొకరి ననుసరించె నన్నంతమాత్రమున నతనికీర్తికి లోటు రాఁబోదు. వృథాభిమానముచే నసత్యము నొప్పింపఁజూచుటకంటె సత్యదృష్టితో సాహిత్యసేవ నొనరించుట మేలు. కావ్యరంగమును ఖడ్గరంగముగ మార్చుటకన్న నసహ్యము లేదుగదా! నాయభిప్రాయమునఁ గాళిదాసు సేతుబంధకారు ననుసరించినాఁడు. తక్కిన సంస్కృత

---

3. అభినవమధులోలుపస్త్వం తథా పరిచుంబ్య చూతమంజరిం,
కమలవసతిమాత్రనిర్వృతో మధుకర! విస్మృతో స్యేనాం కథం.

4. ముఖ్యముగా మాలతీమాధవములోని ప్రాకృతము చూడుఁడు.

5. The poetry of Bhasa(Poona edition)

కవులును గొంతవరకు ప్రాకృతము నను సరించి రని ముందే విన్నవించితినిగాదా! వారిలోఁ గొందరు దానికి చదివినవారు. మరి కొందరు చదివినదానిని నాజూకుగా నర్థము చేసికొనకయు, సరిగా సంస్కృతమునఁ బొందింప లేకయుఁ దికమకలాడినవారే. అది యట్లుండె.

గ్రంథ మింత ప్రసిద్ధముగదా! దీనికర్త యెవ్వ రని యాలోచించితిమా చదియును ననిర్ధారితమే. కొందరు ప్రవరసేనుఁ డన్నారు. ప్రవరసేనులు నలుగు రున్నారు. ఏ ప్రవరసేనుఁడు సేతుబంధకర్త? మరికొందరు ప్రవరసేనుఁడు భోజదేవుఁడని వాదింతురు[6]. లేదు. కాళిదాసే సేతుబంధమును వ్రాసినవాఁడు. ప్రవరసేనునిపే రూరకయుంచఁబడిన దంతే-యని యింకకొంద రందురు. రామసేతుప్రదీప మనెడు సేతుబంధకావ్య వ్యాఖ్యాన గ్రంథమందు,

"ధీరాణాం కావ్యచర్చాచతురిమ
విధయే విక్రమాదిత్యవాచా
యం చక్రే కాళిదాసః కవికుముదవిధుః
సేతునామ ప్రబంధం"

అని కలదు. ఆ గ్రంథమందే యాశ్వాసాంతమందు, "ఇయ సిరి పవరసేణ విరయిఏ కాళిదాసకయే, దహముహవహే మహాకవ్వే" యని ముగింపఁబడినది. కాని యీ వాదము కేవల మర్థములేనిది. గ్రంథకర్త పేరు తెలియని యేకావ్య మున్నను, నది యొక గొప్పకవి కంటఁగట్టుట మనవారి యాచారము. కొంతమంది స్వార్థత్యాగులు, శతవికారములగు గ్రంథములను వ్రాసి, వాటినిగూడఁ బెద్దవారి కంటఁగట్టి పుణ్యము వడయుదురు. ఇట్లే, కాళిదాసునిపేరిట ననేక మహాహీనములగు కావ్యములు ప్రచారములో నున్నవి. లంబోదరప్రహసనము, రామకృష్ణవిలోమకావ్యము మన కెదురుగాఁ గనఁబడుచు నేయున్నవి. ప్రసిద్ధిని మాత్రమే యాకాంక్షించు పరమదుర్మార్గులు సేయు కార్యము లవి. వారికి పాపశంక సున్న. సహృదయత, రసికత మందునకైన గుండెలలో నున్న, వా రట్లు చేసియుండరు. కాఁగా సేతుబంధమును కాళిదాసు వ్రాసియుండె ననుట చాల నపహాస్యకరము. సేతుబంధ రచనకును, కాళిదాసు కూర్పునకును గలయైక్యతకన్న, భిన్నత యెక్కువ. సేతుబంధకారునకు, భావనాగమ్యము లగు (Abstract ideas) భావములపై మిక్కిలి మక్కువ. కాళిదాసుని రచనయం దెచ్చటనో తప్ప నాపోకడలు గానము. మహాకవికి చిత్ర నిర్మాణముపై నున్నంతయభిమానము[7], పాఠకుని భావనకు పరిశ్రమ నొసఁగుట యందు లేదు. ఇది యాతనికావ్యముల నాస్వాదించురసికు లెల్లరు స్పష్టముగా ననుభవింతురు. ఒకవేళ, కాళిదాసే సేతుబంధమును వ్రాసియున్నచో, నతనిశృంగారలోలుపత యెచ్చటనో యొకచోటఁ బరిమళించియే యుండెడిది. సేతుబంధమునందు శృంగారమున కగ్రతాంబూలము లేదు. అట్టియెడ కాళి

6. "ప్రవరసేనో భోజదేవ" ఇతి కశ్చిత్.—(రామప్రదీపము).

7. కొన్నియుదాహరణములు : కార్శ్యసైకత (శాకుంతల), తన్వీశ్యామా (మేఘ), పదేరజాకు (కుమార సంభవము.)

దాసు, తనకళ్ళిమానతమ మగుతనమునకుఁ జోటులేని కథావస్తువును గైకొనియుండునా? ఇంకొకవిషయ మేమనఁ, గాళిదాసు వీరరసమును సరిగాఁ బోషింపలేదు. రఘువంశమునం దాతఁడు వర్ణించిన యుద్ధవర్ణనములు పూలచెండుల యాటలు. ఒక్కొకచోట, నట్టియెడఁ, బ్రయోగించిన విశేషణములు రసమునకు సహాయ మాచరింపకుండుట యేగాక, రసభంజకములుగాఁగూడఁ బరిణమించినవి. చూడుఁడు.

తతః ప్రియోపాత్తరసేఽధరోష్ఠే
నివేశ్య దధ్మౌ జలజం కుమారః.

(రఘువంశము)

ఈ శ్లోకము రఘువునకును, నింద్రునకును జరిగిన యుద్ధఘట్టములోనిది. "ప్రియోపాత్తరసే" యను విశేషణము, శంఖము నూదుటలో నేమియు నుపకారకముగాదు. పైఁగా సందర్భానుచితమగు రతిని పాఠకునిమది కెఱయించి, ప్రస్తుతము నుపసర్జనీభూతముగ కావించుచున్నది; లేక రఘుమహారాజు కేవలము చపలుఁ డనిపించు చున్నది. కాళిదాసులోని చపలతయే రఘువునకును సంక్రమించినది. శాకుంతలములోఁ గూడ నొకశ్లోక మున్నది. "ఇంద్రుఁడు పంపిన మాతలి వచ్చి, విదూషకుని పిగఁ బట్టుకొన్నాఁడు. ఆగ్రహోద్రగుఁడగు దుష్యంతుఁ డాతని, విడిపింపఁబోవుచు,

"ఏవ త్వా మభినవకంఠశోణితార్థీ
శార్దూలః పశుమివ హన్మి చేష్టమానమ్
ఆర్తానాం భయ మపనేతు మాత్తధన్వా
దుష్యంతః తవ శరణం భవ త్వి దానీమ్"

అన్నాఁడు. ఇందులో సందర్భశుద్ధి గల బంధము లేదు. వాడిన యుపమానమును వేఁడిగలది గాక, కేవలము నీరసమై యున్నది. భవభూతి వీరరసమును బరికించిన, పాఠకునకు దీనిఁ జూచిన నవ్వుదప్ప మరేమియుఁ గల్గదు. ఇతని కావ్యములయందు వీరరసమే చాల తక్కువ. ఒకటి, రెండుచోటుల వ్రాసియున్నను బాగుగా నుండదు. అట్టియెడ కేవలము వీరరసప్రధానమగు సేతుబంధమును గాళిదా సెట్లు వ్రాసియుండును? కాళిదాసు వాడిన ప్రాకృతవచనశైలికిని, సేతుబంధకారుని ధారకును హస్తిమశకాంతరము భేద మున్నది. పదముల నడపుటయందే యొక విధమగు విశిష్టత యిరువురికిని గలదు. అసలు ప్రవరసేనునకును, కాళిదాసునకును గల సంబంధ మెంతటిదో, యెట్టిదో నాకర్థ మగుటలేదు. ఇంతవరకుఁ గావించిన పరిశోధనలఁబట్టి చూచిన, వీరిరువురకును సంబంధ మున్నట్లు గానరాదు, లేదు... కాళిదాసు లెందరో మనకుఁ దెలియదు. నేటికి నలుగురు తేలినారు. వారిలో నొక్కరైన వ్రాసియుండరాదా యనమాట సర్వాబద్ధమేగాక యవిచారమూలముగూడ. స్వవచనవ్యాఘాతముగూడఁ గలుగకపోదు. శాకుంతలాదిగ్రంథములు వ్రాసిన కాళిదాసుతప్పఁ దక్కినవారు ప్రసిద్ధులు గారు. వారు వ్రాసినగ్రంథములు మనకు స్పష్టముగాఁ దెలియవు. అసలు వారుండిరో లేదో యనుమానము. ఇంత పట్టుదల దేనినిగురించి? రాజులు కవులుగా నుండఁగూడదనియా? బ్రాహ్మణులు కవులు గావచ్చునఁట. శూద్రులు కావ్యములు వ్రాయవచ్చునఁట! మరి క్షత్రియునకుమాత్ర మేమి యీయనావృష్టి? వారుమాత్రము చదువుకొనఁగూడదా? కవులు గారాదా? అది

ప్రపంచములో జరుగరానంత యసంభవమా యేమి? ఒకవేళ, రాజు సమ్మతించినను కాళిదాసు తాను గ్రంథమును వ్రాసి యాతనిపేరు పెట్టునంతటి యస్వతంత్రుఁడా? మహాలౌకికుఁడు, యుక్తచతురుఁడు, నీతి నిష్ణాతయునగు కాళిదాసు దరిద్రతకుఁగాను, గ్రంథమును బరుల కంటఁగట్టె ననుట నమ్మఁదగిన దేనా? కాళిదాసుఁడే దరిద్రుఁడైనచో, ప్రపంచమున నిఁక ధనవంతుఁ డెవ్వఁ డుండును? అతఁడే, సుఖమును, ఆత్మశాంతి ననుభవింపలే దన్నచో, భగవంతుఁడుగూడ సృష్టిలో సుఖపడలేఁడు. అయిన రామసేతుప్రదీపములోని శ్లోకమున కేమిగతి? అశ్లోకము పరంపరాగతమగు జనశ్రుతి ననుసరించి వచ్చియుండు నంతే. అశ్వాసాంతములోని గద్యమును నమ్మఁదగినది గాదు. కాఁగా ఊరక వాదోపవాదములఁ బెంచుకొనుటకంటె ప్రవరసేనకృతము సేతుబంధ మని నమ్ముట సముచితము. అందులో నే ప్రవరసేనుఁడో పరిశోధకులు పరిశ్రమించి కనుఁగొనవలసియున్నది.

ప్రాకృతకావ్యములకుఁ "బ్రసాద"గుణ మొక పెట్టనిసొమ్ము. ప్రాకృతకావ్యములలో పైకిఁ గొంత కఠినమైనది "గాడవహము" మాత్రమే. అదియును నక్కడక్కడనే ప్రాకృతవాఙ్మయమున చాలలలితమైనది యశోధరచరిత్రము. సేతుబంధము రెండవదిగా నిలువవచ్చును. సాధారణముగా దీర్ఘసమాసములే లే వనవచ్చును. ఒకచోటఁ బ్రయోగించినను మనపెద్దన్న సూరన్నలవలె పలికీ పలుకన ట్లుండునక్షరములఁ గూర్చుకొనిపోవు నేగాని శ్రీనాథునివలె ప్రయత్నోచ్చారణీయము లగువానిని వాడఁడు. చిన్నచిన్నతునుకలలోఁ గావ్యము నల్లుట ప్రవరసేనునకుఁ జాల ప్రియమగు నలవాటు. చూడుఁడు:

> దణుఇందరుహిరలగ్గే -
> జస్స ఫురంతే ణహప్పహావిచ్ఛడ్డే
> సుప్పంతీ విఅలాఆ
> గలిఅవ్వథణంసుఏ, మహాసురలచ్ఛీ. 8
>
> గమిఆ కలంబవాఆ
> దిట్ఠం మేహంధఆరిఅం గఅణఅలం
> సహిఓ గజ్జిఅసద్దో
> తహవి హుసే ణత్థి జీవిఏ అసంఘో. 9

సేతుబంధకారుఁడు చక్కని విమర్శకుఁడు. సందర్భమున్నను లేకున్నను ఔచిత్యమున్నను వలనపోయినను గ్రంథమును బెంచుకొనిపోవు చిల్లరకవి గాఁడు. వ్రాసెడు ప్రతిశ్లోకమునకును, ప్రతిపదమునకు నిగూఢమగు వ్యాఖ్యను మనసున నుంచుకొన్నట్లు గానిపించును. మహాకావ్యములకు ముఖ్యలక్షణములగు గభీరత, కథలోని విరుగడలేనితనము, ధారాశుద్ధి ప్రతియొకచోటను ప్రత్యక్షమగుచుండును. ఒళ్లుమరచు నావేశిగాఁడు. మాటిమాటికిని దడవిచూచుకొను లోభిగాఁడు. ఛందోబద్ధమగు కవిత్వమున నున్న కష్టమెంతయో, అభినవములగు భావములు, పద్య

8. దనుజేంద్రరుధిరలగ్నే, యస్య స్ఫురతి నఖప్రభావిచ్ఛర్దే
వ్యాకులా విపులాయితా, గలిత యివ స్తనాంశుకే మహాసురలక్ష్మీః.

9. గమితాః కలంబవాతాః, దృష్టం మేఘాంధకారితం గగనతలమ్.
సోఢో గర్జితశబ్దః, తథాపి ఖల్వస్యా నాస్తి జీవితే అపంగః.

ములయందు జోడించుట యెంత ప్రయత్న సాధ్యమో గమనించి, త నయనుభవము యొక్క మాహాత్మ్యముచే వాటిని సరిపెట్టు కొని నడచు మహానీయుఁడు[10]. మహా కావ్య నిర్వాహణములోని కష్టసుఖములగురించి, యితఁడు పలికినపలుకు, మహాకవుల మనస్తత్త్వమున కద్దమువంటిది. దానితో నామహా మహునకుఁ గావ్యనిర్మాణమునం దెంతటి యనుభవము గలదో, లోఁతుపాతుల నెంత వరకు గ్రహించినాఁడో మన మూహింప వచ్చును[11].

ఇతనికవిత అడ్డు, ఆజ్ఞ లేని స్వేచ్ఛా విహారిణి గాదు. మరి నియమబద్ధయగు పతి వ్రత. ఇతనిజీవితమున కొకయాదర్శ మున్నది. అది కావ్యమునందును జొరఁబడి, యాతని కవిత్వలక్షణముగ మారిపోయినది. మొదలిడిన మార్గమును నడుమ విడువక, మనసులోని యాదర్శమును — చాల లలితగంభీరముగ నిర్వహించినవాఁడు ప్రవరసేనుఁడు. ఆతనియాదర్శ మిది:

పరివడ్ఢయి విణ్ణాణం,
సంభావిజ్జయి జసో విఢప్పంతి గుణా
సువ్వయి సుఉరిసచరిఅం,
కింతం జేణ ణహరంతి కవ్వాలావా. 12

ధ్వనికారుఁడు రసచర్వణమే యనైకాంతికముగు ఫలమని వ్రాక్రుచ్చెను. భామహుఁడు, కావ్యాదర్శ, కావ్యప్రకాశకారులు మొత్తముపై సేతుబంధకారుని యాశయమునే యనుసరించిరి. కవితకు లౌకికాపేక్ష యున్నదా లేదా యనునది వేరువివాదము. దాని నిట విచారించుటకుఁ జోటును చాలదు, సందర్భమును లేదు. మొత్తముపై చాలమంది యాలంకారికులు కవితకు లౌకికఫలమును గూడ స్వీకరించి రన్నఁజాలును. ఈశ్లోకమే ప్రతాపరుద్రీయము మొదలగుగ్రంథములలో - గ్రంథకర్తపేరుతోఁగాక, ఊరక యుదాహరింపఁబడినది.

సేతుబంధకారుని యం దింకొక విచిత్ర గుణ మున్నది. ఇతనివలె వస్తువును, పాఠకునకుఁ బరిచయము గావించుకవి - నే నెఱిఁగినంతవరకు మఱియొకఁడు లేఁడు. సంస్కృత నాటకములయందు సూత్రధారుని శ్లోకము నందలి ముద్రాలంకారమువంటి యొకగుణ మిందును. అంతేకాక యట్టిశ్లోకము లచ్చ

10. ఇచ్ఛాయివ ధణరిద్ధీ, జోవ్వణలద్ధవ్వ అహిజాయాయారిసీ
దుఃఖం సంభావిజ్జయి, బంధచ్ఛాయాయ అహీణా అత్థగయీ.
[ఇచ్ఛయేవ ధనబుద్ధిః, యౌవనలబ్ధే వాభిజాత్య శ్రీః
దుఃఖం సంభావ్యతే, బంధచ్ఛాయేవాభినవార్థగతిః.]

11. అహిణవరాయారద్ధా, చుక్కక్ఖలియేసు విహడియ పరిట్ఠవియా
మేత్తివ్వ పముహరసియా, ణివ్వోఢుం హోయి దుక్కరం కవ్వకహా.
[అభినవరాజారబ్ధా, చ్యుతస్ఖలితేషు విఘటితపరిస్థాపితా
మైత్రీవ ప్రముఖరసికా, నిర్వోఢుం భవతి దుష్కరం కావ్యకథా.]

12. పరివర్ధతే విజ్ఞానం సంభావ్యతే యశః, అర్జ్యంతే గుణాః
శ్రూయతే సుపురుషచరితం, కిం తద్యేన నహరంతి కావ్యాలాపాః.

కట్టువేసిన పటములవలె మట్టసముగా సార్థకములగు విశేషణములతోఁ గూడియుండును. సంస్కృతకవులలోఁ గాళిదాసుగూడఁ గొంత వరకీయలవాటున నిపుణుఁడు. అట్టిఘట్టముల యందు సందర్భశుద్ధిగల యాశ్లోకమును జదివినవెంటనే, యదేమోగాని యొడలంత యు నొక్కసారి పులకరించును. మేఘమాత యందు మన కగుపించు విశిష్టగుణములలో నిది యొకటి యని నాయభిప్రాయము. సేతుబంధములోని వొకరెండుమాత్ర ముదాహరింతును.

> తంతియసబంధమోక్ఖం - పసుత్తిఅల్లొక్కహియ
> యసల్లుద్ధరణం
> పుణహు అణురాయఇణ్హం - సీయాఖ్దుక్ఖ
> క్ఖయం దహముహస్సవహం. 13

మరియొకచోట, శరదాగమమును వర్ణించుచు, వెలువఱచిన భావగభీరత:

> తోహరివఇజసపంథో - రాహవజీయస్స పఢమ
> హత్థాలంబో
> సయాబాహవిహోవో - దహముహవజ్ఝదివ
> హోఉవగవోశరవో. 14

సాధారణముగా సంస్కృతకవులకన్న ప్రాకృతకవులయందు ప్రత్యేకత యెక్కువగా నున్నను సేతుబంధకారునియం దాగుణము మరింత హెచ్చు. భావముల నతఁడు ప్రదర్శించునపు డేదియో యొక యపూర్వప్రపంచమునుండి కైకొనివచ్చిన ట్లుండును అప్పుడు మన మొకక్షణమునే యాశ్చర్యచకితులమై, కాలు సేతులు గదపక నిలిచిపోదుము. తరువాత తిన్నగా రసము నాస్వాదింపయత్నింతుము. అయ్యది మహాకవుల ప్రతిభలోని గొప్పతనమని నా యభిప్రాయము. సేతుబంధమును జదువునపుడు రెండుమూఁడుశ్లోకముల కొకసారి యట్టిభావములు దొరలుచునే యుండును. మొదడు నాఘూర్ణిత మొనరించు భావములయందేగాక, సామాన్యములగువాని యందును సేతుబంధకారుని భావస్వతంత్రత గొప్పది. రాముఁ డొకసారి ధనుస్సువైపు పరికించినాఁడు. కార్యధురమునందు భావనాదృష్టివలె, శరాసనకీలితమగు నా చూపు ప్రకాశించెనఁట[15]. రాముని దర్శింపవచ్చిన హనుమంతుఁడు చింతితసుఖోపనతమగు మనోరథమువలె నుండెనఁట[16]. ఇంతయేల ? భావనాస్వతంత్రత, ప్రాకృతకవులకెల్ల రకును లక్షణము. అందులోను సేతుబంధకారుఁడు మహాస్వతంత్రుఁడు. అంతటి మహాగ్రంథమును నిరాఘాటముగ నడపినను, ఒక్కముక్కయైనను, ఇతరులయెంగిలి గానము. ఎక్కడఁబట్టినను ప్రతిభావిష్కారమే, అసాధారణమగు మేధామహత్తే మెఱపుఁడీఁగెల వలె మెఱయుచున్నది.

ఔచిత్యాదిగుణములను బోషించుటతోపాటు రసపోషణమునను ప్రవరసేనుఁ డద్వితీయుఁడు. అనుక్రమమున ధారను బట్టు

---

13. తం త్రిదశబందిమోక్షం - సమస్తత్రైలోక్య హృదయశల్యోద్ధరణం,
గుణతోనురాగచిహ్నం - సీతా దుఃఖక్షయం దశముఖస్యవధమ్.
14. తతో హరిపతియశఃపథో - రాఘవ జీవస్య ప్రథమహస్తాలంబః,
సీతాబాష్పవిఘాతో - దశముఖ వధ్యదివస ఉపాగతా శరత్.
15. దృష్టిః దృష్టస్థామ్ని కార్యధురేవ నిజకే ధనుషి నిషణ్ణా.
16. ప్రేక్షతే మారుతిరనయం మనోరథమేవ చింతితసుఖోపనతం.

కొనివచ్చుటలో తిక్కన కున్నంతగొప్పతన మున్నది. పదకములవంటి విశేషణములలో మేరువంతటి భావమును జోడించుట యీతని కాకలీల. అర్ధనారీశ్వరుని వర్ణించుచు "ద్వితీయావకాశ గమనోత్సుకం వామార్ధం[17]" అన్నాఁడు. వామార్ధమునందలి పార్వతి ప్రేమ స్వభావవిముషితయై భర్తృదుం దైక్యమొందుట కాకాంక్షించుచున్నది. లజ్జచేత శరీరమును సంకుచించుకొనుటలో ప్రేమవిలీనయై యింతటియింద్రజాలమును గావించినది. ఇంకను నందులో మహత్తరమగు ధ్వనిపుష్టి యున్నది. పాఠకు లూహింతురుగాక.

పిపీలిక మొదలుకొని బ్రహ్మాండమువరకును, సకలప్రపంచము నీతని కవితాకన్యకకొక ముక్కరయైపోయినది. రాజనీతి, లోకానుభవము, సహృదయత, గభీరత అతురాతురమునను బ్రత్యక్షమగును. అంతయును నుదాహరింపవలె నన్న, గ్రంథ మంతయు మరల వ్రాయవలసివచ్చును. కాన యీయసాధ్యకార్యమునుండి యింతటితో విరమింతును. రసపిపాసువులగు పాఠకులు ప్రత్యేకముగాఁ జదువుకొని యానందింతురుగాక! సూత్రప్రాయమగు మాట యేమన, ప్రవరసేనుఁడు కవికులాలంకారుఁడు. ఆత్మశక్తిగల మహర్షి. శాంతిని స్వాయత్తీకరించుకొన్న భగవంతుఁడు. మహామహుఁడు. అతని భావనాశక్తియెదుట మనము, చీమలవలె చాల నల్పులము. భావనాశక్తిని గమనింపలేని మనయల్పజ్ఞతకు నవ్వవలయునా? యేడ్వవలెనా?

---

17. వేపతే యస్య సక్రీడం
వలితుం మహాతిపులకాంచిత స్తనకలశం,
ప్రేమస్వభావవిముషితం,
ద్వితీయావకాశగమనోత్సుకం వామార్ధం.

క్వైనైన్ చేరక్షింపబడెను

ఈస్టు ఇండీస్ నందు ఒక పర్యాయము దండయాత్రకు బయలుదేరిన ప్రొఫెసర్ రూమస్ గారి అనుచరుల కుటీరమునందు చీకటివలన గాఢాంధకారముగ నుండెను.

వారిలో పరిశోధకులగు ప్రొఫెసర్ రూమస్ దంపతులు, డాక్టర్ అయన్స్, వారి కుమారుడు జాషా గారు, కొంతమంది నేటివు పోర్టరులు గలరు. హెచ్చు జీతములకు ఆశపడి మలేరియా ప్రబలముగ నున్న ఈస్టు ఇండీస్ బురదప్రదేశములలో జరుగు దండయాత్రలో పాల్గొనుటకు నేటివు పోర్టరులు ఒప్పుకొనిరి.

వారందరు ఒక దినమంతయు ప్రయాణము చేసిరి. అనేకదినములు పర్వతప్రాంతములలోను, అటవీ ప్రదేశములలోను వారు ప్రయాణమొనర్చిరి. పగలంతయు లక్షలకొలది దోమలు వారిని బాధపెట్టుచుండెను. దండయాత్ర ముగియవచ్చెను.

డాక్టర్ అయన్స్ గారి దేహ ఆరోగ్యము కూడ బాగుగ లేకుండెను అనేకదినములు వారికి యెడతెగకుండా జ్వరము వచ్చెను వీలనగా దండయాత్ర అనుకొన్న దానికంటె ఎక్కువ కాలము పట్టెను. జ్వరమును నివారించుటకు గాను ప్రతిరోజు 6 గ్రెయినులు చొప్పున క్వైనైను యివ్వబడుచుండెను. అట్టి క్వైనైను స్టాకు కొద్దివారములక్రిందటనే పూర్తిగ ఖర్చుపడియున్నది.

క్వైనైను మాత్రమే అతనిని రక్షింపగలదు, అట్టిక్వైనైను చెంత లేకుండెను. పర్వతములకు అటు వైపున 35 మైళ్ల దూరమున నున్న వాన్ కో గ్రామమునకు క్వైనైన్ కొరకు పోవలసివచ్చెను.

జాషా గారు యెవరితోను యేమియు చెప్పకయే ఆ గ్రామమునకు పరుగెత్తుకొని పోయిరి. 10 గంటలు మాత్రమే జాషాగారు తండ్రియొద్ద లేకుండిరి. ఆ గ్రామమునుండి జాషాగారు కొంచెము క్వైనైను తెచ్చిరి. జాతిసమితి మలేరియా కమిషను వారు సిఫారసు చేసినట్లుగా జాషాగారు 5 మొదలు 7 దినములు వరకు దినమునకు 15 నుండి 20 గ్రెయినులు చొప్పున క్వైనైను నొసగి తండ్రిని రక్షించుకొనిరి.

రత్నావళి - కథాసరణి

శ్రీ నే. రామదాసు

[ఇప్పటికి పదియేండ్ల క్రిందట శ్రీహర్షరత్నావళి ఆంధ్రుల యింటర్మీడియేటు (౧౯౨౮) పరీక్షకు పాఠ్యము కాఁగా నేను శిష్యులకు పాఠము చెప్పవలసి కూర్చుకొన్న జ్ఞాపికలను ఇట్టి యాకారముగా గ్రుచ్చవలయు నని తలంచితిని కాని, అది మొదలు చిత్తమునకును హస్తమునకును ఊఁటయు తీఱికయు కుదురనందున ఆపని చేయఁజాలకయుంటిని. మరల ఇప్పుడు రెండేండ్లు వరుసగా (౧౯౩౦ - ౩౫) ఆ పరీక్షకే సంస్కృతమున అదియు, తెలుఁగున దాని యనువాదమును కీ. శే. కళాప్రపూర్ణ శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారు రచించినది, పాఠ్యములుగా నియమింపఁబడుటచే అది పలువురు పండితులచే వ్యాఖ్యాతమును, ఆంధ్రకళా పరిషన్మండలమున ఎల్లపండితులచే ప్రవచనార్థమును ఎల్ల విద్యార్థులచే పరిజ్ఞానార్థమును పలుతెఱంగుల, కాదా ఎల్లతెఱంగుల, శీలితమును అనుశీలితమును పరిశీలితమును అయ్యును అగుచును ఉన్నది. ఇంతటనైనను నా చాపలమును నే నూరించుకొనలేని మఱి యడేల యని 'కథాసరణి' అను నీ ఖండమును ఇప్పటికి ఇట్లు సంకలించినాఁడను. ఇంకను సంధుల యమరిక, పాత్రపరిశీలనము, మూలానువాదములలోని కవనంపుటందము, కథవలనం దెలియఁగల దేశకాలముల యాచార వ్యవహారముల స్థితి, రాజ్యాంగ యుద్ధాదిమర్గములు, వత్సేశుని యిల్లు తోఁట అరఁటి యిల్లు, మండపములు, చిత్రశాల, సంగీతశాల మొదలగువాని యన్యోన్య సన్నికర్ష విప్రకర్షాదితోడి సన్నివేశము-ఈ యన్నింటిం గూర్చియు కూర్చు జ్ఞాపికల గుత్తిని సమగ్రము సేయం గోరిక. కాని అందులకు కాఁగల విలంబము నోర్వఁజాలక, పాతసంవత్సరము ముగియఁబోరఁగా, ఈపాటియేని ఇట్లు ప్రకటింప సంభ్రమించినాఁడను.

రసవ్యంజకత్వమునకు గుఱిగా రత్నావళిని ధ్వనికారుఁడు ఉదాహరించినాఁడుట, అట్లే తద్వ్యాఖ్యాతలు అభినవగుప్త హేమచంద్ర విశ్వనాథాద్యాచార్య లందఱు అవిప్రతిపన్నముగా అంగీకరించినారఁట; అట్టిదానింగూర్చి నేను ఏమి చెప్పుటకును ఎంతటివాఁడను? ఆంధ్రలోకగురువు, మా గురువు, విద్వత్కవి సహృదయసార్వభౌమ కీ. శే. వేదము వేంకటరాయ శాస్త్రులవారి కీర్తి సాహిత్యలోకమున నిరంతర సాంద్ర జ్యోత్స్న కాయుచున్నది. ఈజనమునకు సాహిత్యమునం గన్ను వారు తెఱచినది; వెలుతురు వారు చూపినది; కావున ఇందు గుణాణువు లున్న, వాన అది పూజితమగును గాక.

ఇందు శ్రీహర్షమూలమును శ్రీ శాస్త్రుల యనువాదమును యథావసరముగా ఉదాహరింపఁబడినవి.

మఱియు, 'చక్రవర్తి' ప్రభృతి ఢక్కా పండితులును, 'శే' ప్రభృతి కలకత్తా పండితులును, 'కాళీ' ప్రభృతి బొంబాయి పండితులును 'రామానుజ' ప్రభృత్యాంధ్రపండితులును, శ్రీహర్షరత్నావళికి విద్యార్థుల యుపయోగమునకై బహువిషయసంపన్నముగా సమకూర్చిన యాంగ్ల పీఠికా టీకాదికముం జూచితిని. ఇంకను ఈ నానాదేశముల సంస్కృత వ్యాఖ్యలనుం బరికించితిని. ఒక్కటియు కథలో సందేహములకును విమర్శకును ఎడమిచ్చు రత్నమాలా లావాణక దాహప్రవాదాది విషయలంగూర్చి ప్రస్తావింపదు, ప్రస్తావించినను చిత్తమునకు సమాధానముం గూర్పదు. సర్వమునకును శ్రీశాస్త్రులవారి యనువాదమును ధ్వనిలోచన దశరూప హైమమాడామణి రసార్ణవాది సమాకృతమును ఉపజీవించినాఁడను. తత్తైకగవేషుఁడను 'అది కాదు, ఇది' యని చూపఁగల సహృదయుల కెల్ల కృతజ్ఞుఁడ నయ్యెదను.

— నే. రామదాసు.]

కథాసంగ్రహము

౧

కౌశాంబి రాజధానిగా వత్సదేశమును ఉదయన మహారాజు ఏలుచుండెను. ఎల్లకళలం గోవిదుఁడైన యాతఁడు గానమున, అందును వీణెపాటలలో, సాటి లేనివాఁడు. ఒకప్పుడు అడవిలో తనచే సుపకృతుఁడై తనకుం బ్రత్యక్షుఁడైన ఫణిపతిచే నాహూతుఁడై (క. స. సా. ౨. ౧.) నాగలోకమునకుం బోయి సత్కారముతో ఘోషవతిని పారితోషికముం గొని వచ్చెను (ప్రియ, ii, ౬. iv; రత్నా i, ౧౩). అట్లే మహాపరాక్రమశాలి తాను అన్వర్థనాముని ఉజ్జయిని దొరను చండమహాసేనుని (రత్నా. పుట ౫౧) చిరము సరకు గొనకుండి నిజగజగ్రహణవ్యసనమున సందుపొందిన యాతనిచే వంచితుఁడై ఖైదు గొనఁబడి, అతనిని వంచించి తన వలపువలలో తగులుకొన్న యాయన కుమారిని తన వీణాశిష్యను వాసవదత్తను తన విజయపతాకగా ఒడిచికొని, కయ్యమును వియ్యమును నెయ్యమును నెఱపెను. అంతట ఆయనకు మఱి 'విగ్రహకథ విశ్రాంత' మయ్యెను (రత్నా. i. ౯, ౧౦). వైరులు అడంగినందున, రాజ్యమును యౌగంధరాయణాది మంత్రులచేత నుంచి తాను ధీరలలితముగా ధర్మావిరుద్ధముగా భోగాలు అనుభవించుచుండెను. యౌగంధరాయణుఁడు సింహళరాజుకూఁతు రగు రత్నావళిం బెండిలి యగువాఁడు సార్వభౌముఁ డగునని సిద్ధుని యాదేశమును విని నమ్మి, ఎట్లేని వత్సేశునికి ఆమెను పెండ్లిచేయ సంకల్పించి, రహస్యముగా సింహళరాజును పలుమాఱు ప్రార్థించెను. సింహళరాజు విక్రమబాహువు వాసవదత్తకు మేనమామ. ఆయన వాసవదత్తకు సవతిగా తన కూఁతు నిచ్చి, వారి దాంపత్యరసమున చేదుం గలుపునా ? కావున ఈయఁ డాయెను. అంతట యౌగంధరాయణుఁడు లావాణకమున నిప్పులో దేవి కాలిపోయిన దని ప్రవాద పుట్టించి వత్సేశుకంచుకిని, బాభ్రవ్యుని సింహళేశుని కడకు మరల నామెకై వేఁడ బంపెను. ఆదొరయు ఆలోచించి ఉదయనునితో తమకు సంబంధలోపము లేకుండునుగాక యని అంగీకరించి, కూఁతును అనర్ఘము లగు రత్నావళియే పేరి కన్యాభూషణముగా అలంకరించి ఆ బాభ్రవ్యునితో తన ప్రధానమంత్రి వసుభూతియే తోడుగా ఓడపై తరలించెను. ఆయోడ ఎటనో ఎటులో పగిలినది. అందలి జనులు మునిఁగియు తేలియు చెల్లాచెదరైరి. రత్నావళి ఎట్లో ఒకపలకం బట్టి తేలినది. ఓడవర్తకునికి ఒక కౌశాంబిసెట్టికి సింహళమునుండి మరలుచున్నవానికి అగపడి అతనిచే కాపఁబడినది. అతఁడు రత్నమాలాచిహ్నముచే ఆపిల్లను ఆనవాలుపట్టి, కౌశాంబికిఁ గొనిపోయి, సెట్టి గావునను సాహుకారు గావునను భీతభీతముగా రహస్యరహస్యముగా, చాఁవతోనే రాజ్యసర్వవిచారణాధికారి యగు మంత్రియౌగంధరాయణునికి అప్పగించినాఁడు. మంత్రియు ఆమెను 'సగారకముగా' దేవిచేతం బెట్టినాఁడు. ఆబాభ్రవ్యుఁడును కంచుకి కంపవదంగుఁడు, అస్ఫుటదృష్టి, స్ఖలద్వాణి (రత్నా. iv. ౭౯), జరాభిభూతుఁడు, బ్రాహ్మణుఁడు; అయినను ఎట్లో మునుకను చావును తప్పించుకొని అతఁడును గట్టెక్కినాఁడు. అమాత్య వసుభూతియు. ఇరువురును గట్టెక్కి కలసికొని కోసలుని సమయింపంబోయియున్న యావయనసేనాపతి రుమణ్వంతునితో మిళితులైనారు. రత్నావళి భగ్ననౌకసముద్రములో మునుఁగక తప్పించుకొనుట, కౌశాంబి కోమటికే దొరకుట, తనచేతనే సమర్పిత యగుట — ఇదెల్ల విధ్యాభిముఖ్యవిలసితమని మంత్రి యలరును. బాభ్రవ్యుఁడుం దప్పించుకొనుట; వసుభూతియు; చీలి చెదరిపోకుండ వారిరువురుం గలసికొనుట; వారు అటు రుమణ్వంతుం గలయుట:— ఇదియు తనకు విధి యొసఁగిన చేయూఁత యని సంతోషించును.

౨

అంతలో మదనమహోత్సవము వచ్చినది. ఇది మధుమాస (= చైత్ర) పూర్ణిమ. ఇపుడు అపరాహ్ణము. రాజు వసంతోత్సవవేషము దాల్చినాఁడు. విదూషకుఁడు వసంతకుఁడు కూడనే ఉన్నాఁడు. పౌరజనప్రమోదముం గాంచ రాజు ప్రాసాదమునకు తరలినాఁడు; అంతలో ప్రాసాదము ఎక్కను ఎక్కినాఁడు. ఇవల్ల యౌగంధరాయణుఁడు, వీథిలోనుండి

కాఁబోలు, కాంచును. అటుపై తన కార్యశేషము అరయుటకై తన హవేలికిం బోవును. ఊరిలో ఎటు చూచినను ఆటలు పాటలు; వసంతపుజల్లులు బుక్కా ప్రబ్బులు. ఇట్టి యుత్సవమునసే ఆ విదిశ వారకాంత ఇరావతి ఎట్లు సారాయి త్రాగి కైపుని భ్రమనుతో అగ్నిమిత్రునితో ఉయ్యాల ఎక్కను జడలినదో అట్లే కౌశాంబి వారకామినులు — చెరువుకొన్న యశోకంపు బూలమొత్తములు శిరములను వంచుచున్నవి; పెట్టుకొన్న నగల నిగనిగలు మేనులను ముంచుచున్నవి— సారాయి త్రాగి కైపెక్కి స్వయముగా పరసులపై క్రోవులతో వసంతము చల్లుచున్నారు. అపరసులును నూటితప్ప కుంకు వారిపై చల్లుచున్నారు. ఏపు మీరిన వారి నృత్యముచే ఇండ్ల ముంగిళ్లు, వసంతములకు తడిసినవి, బురదలైనవి. ఆ వినోదములం జూచుచున్న రాజుకడకు సారాకైపుతో అనుమం బానుమసే వాసవదత్తచేటికలు ఇరువురు వచ్చి, నకుములు విఱుగునట్లు నర్తనము సేయుదురు. వారితో వసంతకుఁడును కలసి యాడును. వారు కైపులో తాము వచ్చినపని మఱతురు. ఇంతలో జ్ఞప్తి కలుగఁగా దేవిసందేశమును రాజునకు అందిచ్చి వెడలిపోవుదురు.

అంతట దానిబడి వసంతకునితో రాజు మకరందోద్యానమున మదనపూజాస్థలమునకుం బోవువాఁడై ప్రాసాదము దిగి అటు పరిక్రమించును. మకరందోద్యానమున ఎఱ్ఱనిచివుళ్లతోడి మొరపెడి తుమ్మెదలతోడి గాలికి దూరెడి కొమ్మలతోడి చెట్లయందును మధుమత్తతయే. పొగడలు సంపెంగలు అశోకములు 'యథాచారముగా' తమ దోహదములం బొంగనవే వికసించినవి. నవమాలికకు క్రొత్త దోహదక్రియ కావలసి యున్నది. ఇట్లుగాక, కాళిదాసుమాళవికతోఁటలో ఒక్కతపనీయాశోకమునకే ఆహారి దోహదప్రయోగము1. ఇంతలో వాసవదత్తయు వ్రతమునకై మడి కట్టుకొన్న పున్నెంపు సౌభాగ్యముతోడిది పరివారముతో తోఁటం జొచ్చును. పూజాస్థానముం జేరును. పరిజనములో ఒకతెగా సాగరిక పూజోపకరణములను చేతం గొనివచ్చియున్నది. రాణి సాగరికం జూచును. ఆరమణి రాజుకంటం బడునేమో అని రాణిభయము. కావున గోరవంకం జూచుకొమ్మని మిష పెట్టి దానిని పంపివేయును. సాగరిక కుమారి, ఉత్సవచపల అవలికి తొలఁగి పూజం జూచు దాఁగుసేకాని ఇంటికి పోదు. గోరవంకను తన చెలి సుసంగతకు అప్పగించి వచ్చినదఁట. తాను ఇందే కామదేవుని పూజించునఁట. పూజకోసము పువ్వులు కోసికొనుచుండును.

ఇంతలో అట మదనపూజ యయినది, రాజపూజ జరుగుచున్నది. సాగరిక పూవులు కోసికొనుచు ఆలస్యము చేసినది. ఇపుడు పూజలోని వలరాజును సేవింప నటు తిరిగినది. ఆ స్థానమున రాజు పూజం బొందుచున్నాఁడు. రాజునే వలరాజుగాఁ దలఁచి, అచూరానుండియే పూవులు చల్లి పూజించును. అంతట అందుండి వెడలిపోఁబోవును. అప్పుడే దూరాన సంధ్యాకాలనివేదకము వైతాళికగీతము వినంబడును. అందలి యర్థము - సంజప్రొద్దున ఇప్పుడు నీపాదములం గొలువఁగ ఓయుదయనా, సామంతులెల్లరు నీసభలో కూడినారు- అని. సాగరిక విని 'ఉదయనుఁడా ఈయన' అని ఆసతో రాజువంకం జూచి, ఆదర్శన మబ్బినందులకు ఆత్మను, ఊడిగముచే కృశమైనదానిసే, బహుమానించుకొనును. చక్షుఃప్రీతి కలిగినది, అభిలాష పొడమినది. చంద్రోదయమగుచున్నందున దేవి లోఁగిటికి తరలఁగా, ఆమె కంటంబడుదునన్న భయముచే దుఃఖదుఃఖముగా సాగరిక నిష్క్రమించినది. దేవితో కూడి రాజు సపరిజనముగా లోఁగిటికి పోయినాఁడు.

3

ఆరాత్రి యెట్లు గడచినదో సాగరికకు! ప్రొద్దు పొడిచి యెక్కుచున్నది. సాగరిక మరుకాఁకను కములుచున్నది. 'హృదయమా, ఎందులకు ఈ దుర్లభజన ప్రార్థనాహాళము: ఇఁక మరణము తప్ప నాకు శర

---

1. నాలిఙ్గితః కురబకస్తిలకో న దృష్టో నో తాడితశ్చ చరణైః సుదృశా మశోకః।
సిక్తో న వక్త్రమధునా బకుళశ్చ చైత్రే చిత్రం తథాపి భవతి ప్రసవావకీర్ణః।

గాను లేదు' అనునంతటి యవస్థపాలగుచున్నది. తాను చూచుకొనవలయు శారికనైనను చూచుకొనఁ జాలక సుసంగతకు అప్పగించి ఏకాంతముం గోరి అరఁటియింటికి పోయినది. సుసంగత పంజరమును మోసికొనుచు సాగరికను వెదకికొనుచుం బోయి అరఁటియింటం గాంచును. సాగరిక అనంగవినోదోపాయముగా వ్రాయుచున్న రాజుచిత్తరువుం బట్టుకొని, వృత్తము శంకించి, అపజ్ఞ సాగరికచిత్తరువును వ్రాసి, గేలి సేసి, గుట్టంతయు ఎఱుంగును. సాగరికకు సుసంగత విస్రంభస్థానము; గుట్టు దాఁచుకొనుటకు ఆర్తి తీర్చుకొనుటకు ఒక్కటే యుపాయము. అట్లే 'నేను చూస్తాను కాస్తాను' అనుచునే, ఈశారిక యొకటియున్నది, బయనోటిది, తన మాటలను నేర్చి ప్రకటించునేమో అని సందేహపడును.

సాగరికకు సంతాపము ఎక్కువయును. ఆయాకులపాటున సుసంగత శారికయెడం బరాకుపడునేమో? ఆ చెలువ క్షణములో తామరాకులు తూండ్లు తెచ్చి సాగరికకు శిశిరోపచారములు చేయును. తామరాకులతో సెజ్జ యమర్చి, అందు పరున్న సాగరికకు తూఁటికడియములు తొడిగి, తామరాకులం గప్పును. ఈ చలువసేవలు అరితిగొన్న యా చెలియకు ఊఱటం గూర్పవు. ఇంతలో తబేలాలోనున్న కోఁతి బంగారుగొలుసు త్రెంచుకొని, అంతఃపురమును, అంటలును భయముచే గందరగోళపడఁగా చొచ్చి, దాఁటి ఈ యరఁటియింటికి పరువెత్తును. వీరును సంభ్రాంతలై లేచి తొలఁగి నిలుతురు. కోఁతి చాపల్యమున పంజరము తెఱచివైచి ఎక్కడికో పోవును. శారికయు వెలువడి ఎటకో ఎగిరి పోవును. చిత్రఫలకము అక్కడనే పడియుండును. సుసంగతాసాగరికలు శారికవలని దిగులుచే దానిని పట్టుకొనుటకు అటనుండి పరిక్రమింతురు.

ఇంతలో రాజు శ్రీపర్వత శ్రీఖండదాస దోహదముచే 'క్షణములో' పూఁతపట్టి తన ముద్దు తీర్చుచున్న యకాలవికాసిని నవమాలికను చూడ వచ్చుచు, విదూషకునిం గలసికొని, దారిలో పొగడ మీఁద వ్రాలియున్న సారిక భాషితమును వినును. ఎంత విను వనఁగా, సాగరిక యుత్కంఠిత పలుకులయను వాదమును మాత్రము. రాజు విదూషకునితో అనును- 'ఇది దేనినో రమణీయమైనదానిని పలుకుచున్నది... విందుముగాక.' అని. శారికపలుకుల యభిప్రాయము, ఎవతెయో శ్లాఘ్యయౌవన కామదేవచ్ఛలముగం గ్రమ్ముఁదగిన తన ప్రియతము'ని పొందు అలవడమిచే నిరాశం జెంది అట్లట్లు పలికినది అని తేల్చి రాజు పలుకును: అట్లు కమ్మఁటికి వాఁడవు నీవు గాక మఱి యెవరున్నారు- అనుచు విదూషకుఁడు చప్పట్లు కొట్టి బిగ్గరగా నవ్వును. దాన శారిక చెదరి అందుండి ఎగిరిపోవును, అరఁటిచెట్లయింటితట్టు. అట్లేల ఎగురును అనఁగా, అందుండి గదా అది ఇటు వచ్చినది; అందే కదా దాని పంజరము ఉన్నది. వారు అనుసరింతురు. పరువెత్తురా, అరఁటియిల్లుం జేర, విదూషకుఁడు 'ప్రదోష' యొందులకు, దానిని 'వెదకు ప్రయాస'- అని అనును; అక్కడ రాతితిన్నె మీఁద విశ్రమింతాము అనియు అనును? కాదా, ఆపాగడకును అరఁటియింటికిని కడు దూరమా? అట్లు కాకున్న, తాము వెదకుచువచ్చిన శారిక దొరకకపోఁగా, తాము నవమాలికం జూడఁ బోవలసియుండఁగా, ఇట అను చేల?

కామిని వచింపఁ దాళక కంతుబారి
దేని వెయ్యాంశుసకులతో, దాని వల్లె
నుడి శుకశిశుశారికల్ వెల్లడింప
గస్యలకు నది శ్రవణసుధారసంబు

అని రాజు ఔత్సుక్యముతో మరలమరలం దలపోసికొనుచు నిట్టూర్చును. ఇది యెట్లనఁగా, ఒకానొక కన్నె రతిపతి మిడిపెట్టఁదగినంత సొబగురాలు నలరాజుకొఱకు సొమ్మసిల్లినది; నలరాజుని మిడిపెట్టి చిత్తరుఁజెలువుని గ్రమ్మినది. 'కన్య - నలరాజు'వృత్తాంతమని రాజు ఆదిలోనే కుతూహలము చెందినాఁడు; పరధ్యానము చెందినాడు. 'శ్రవణమువలననో దర్శనమువలననో' అన్నట్లు శ్రవణమువలన అభిలాష అంకురించినది. 'న జానే భోక్తారం క మిహ సముపస్థాస్యతి విధిః' 'నీ చెలువఁగని విరించి యెవనిఁ దగఁ జేయమనీఁ గూర్పఁ దెంచునో' అను పలుకునందు ప్రత్యక్షద్రష్ట దుష్యంతుని యభిలాషాంకురోద్భేదము దాఁగియున్నట్లు 'సస్యలకు' 'సుధారసంబు' అనునియెడను రాజువభిలాష

మొలక దాఁగి అనుమానాస్పద మగుచున్నది. వసంతకుఁడును 'నిన్నుఁదప్ప మఱెవ్వనిని...' అని రాజు సుభగమానితను తాఁకి మూదలించియు న్నాఁడు. కావున శ్రమ నిట్టూర్పు ఇవి ఔత్సుక్యకార్యములు. రాజునకుఁ గాఁక అంకురించినది. నవమాలికవలని పరాఁకు నిట్టూర్పు మొదలగునవి ఆకారామ్యమిటుర మీఁది గీతలు. వసంతకునికి శృంగారవాడినిదానము ఎఱుక. 'సారికావచనమున అనురాగము పొడమినది.' కావుననే, రాజు చిత్తమును రక్షించుచు, రాతియరంగుపై రవంత విక్రమింతము అని వసంతకుఁడు అనుచున్నాఁడు.

అట్లు ఉపవిష్టులై నిరూపించి అట శారికపంజరమును గాంతురు. అది మేధావినిది. రాణికి ప్రాణపదమైనదే మేధావిని, రాజునకుం గాదా? యక్షి శారికను 'కచ్చిద్భర్తుః స్మరసి రసికే త్వం హి తస్య ప్రియేతి' అని యడుగునట! మఱియు యక్షినెమలి యక్షునికి, సీత నెమలి రామునికి, ఎట్లో అట్లు గాదా వాసవదత్త మేధావిని ఉదయనునికి? పంజరముగాని పక్షిగాని ఆనవాలు పట్టఁబడదు; అదేమో! అంతట అట మఱియు క్షేమేని 'యూచూకి' దొరకునా అని అరయుదురు. చిత్రఫలకము దొరకును. దానిని జూడఁగా, ఉభయప్రార్థన చూపఁగా, రాజునకు మరులు దరులుపొరలును. రాజు చిత్తరువున సాగరికను పరభావించి చూచును. ఆసౌభాగ్యమును అనుభవించుచుండఁగా సాగరికసుసంగతలు శారికావంచితలై మరలి యాయరఁటియింటిం దరియుదురు. లోపలి మాటలు విని, దాఁగి వృత్తమం గందురు. రాజు కన్నెమొగమును ధాత్రీతాపనపంకజమును మొగిడించిన చందురుఁడని మెచ్చుకొనును. కోరిక 'యడమ్మడి' యన్న యూఅటతోఁ సాగరికకు అకోరిక కొనలిడును. చిత్తరువున సాగరిక ఏమో మొగము వంచుకొనియున్నదట. 'ఎందులకు?' అనును వసంతకుఁడు. చెలువుని చెంగటనని, లజ్జావనతముఖినిగా సుసంగత వ్రాసినది కాఁబోలు. 'దానికొల్ల శారిక యొఱింగించినదిగదా' అని రాజనును. 'ఓహో, శారిక నట్టు ప్రకటించినట్లున్నదే' అని చెలులు శంకింతురు. అవనమనమున్న రాజు మొగమునే వర్ణించుట! వంపు రసంతయే యయి సౌభాగ్యమునే పెంచుటచేత. రాజు అట చెదరిపడియున్న తామరాకులపడుక తూఁటియాభరణాల తునుకలు చూచి, వాఁచి, ఆ చెలువకాఁక నంతయు తానే ఎక్కించుకొని వేదురుగొనును. సుసంగత దౌత్యమువూని లోపలికి రాజు కడకు వచ్చి, ఆరహస్యమున తాను అభ్యంతర యని తెలుపుకొని, సాగరికకు 'నీవు నన్నేల వ్రాసితివి' యను తనమీఁదియలుక తీర్చి యనుగ్రహింపుమని ఁతిమాలుకొని, ఆసాసతో అనుసరించు నా దొరను సాగరిక చెంతకు పిలుచుకొని వచ్చును. వసంతకుఁడును అచిత్రఫలకమును పదిలము చేయును. ఇరువురును సాగరికను సాక్షాత్తుగా చూచి ఆశ్చర్యాధీను లగుదురు. సాగరికయు ప్రియంవదపై శకుంతల తన్ను దుష్యంతునియెదుట అఁపి ఆయునతో తన పెండ్లి ప్రస్తావము చేసినందులకు ఎట్టి యసూయాకోపములు చెందునో అట్టివే ఇపుడు సుసంగతపై వహించును. 'కుమారీభావసదృశమగు కృతకకోపము!' రాజు లలితలలితముగా సాగరిక చేయిపట్టుకొని ఉపచారము కోపవినోదనము పలుకును. సరససంవిధానము! విదూషకుఁడు 'ఓహో, నిశ్చయముగా ఈమె మఱియొకతె, కోపగత్తె వాసవదత్త' అని సాగరికకోపముం గూర్చియే ఎగతాళి సేయును. అట్లు వాసవదత్త పేరు ఎత్తినమాత్రకే భయపడి రాజు తటాలున సాగరిక చేతిని వదలును. సాగరిక సుసంగతలు అపసరిల్లి, అటం దాఁగి వీక్షింతురు. అంత భయము! దీనిచే "చక్రవాకవధూటీ, రాత్రి వచ్చుచున్నది" మొదలగు శాకుంతలము స్మృతమగును. ఇట్టి మదవచార్యవిలసితమున ఇట్లు తటాలున భయము గొనుటయు చీలుటయు దాఁగుటయు వీఁగుటయు ఎంతయు కామిస్వభావానుగుణము. 'హితరోధ' లక్షణము 'నిరోధ' మనుపేరిది ఈ విఘటనము, సహృదయులకు మన్నెండిక! అట్లు చీలిపోవుటం జూచుచు, విదూషకుఁడు గదా, సంఘటనచతురుఁడు, "లేదు, లేదు, నిలుఁడు నిలుఁడు" అని తెలియఁజెప్ప వలసినవాఁడు మఱి యేల యూరకుండును? తాను అనుకొనకున్నను అటం జరిగినది తమాషాగా నున్నదని చూచుచున్నాఁడా?

అట వాసవదత్త నిపుణికవలన ఎఱింగినది, నవమాలికవికాసముం గూర్చి. దానిం గాంచఁగోరి ఆ

సమయమునకు అక్కడికి వచ్చినది. రాజ కేమని నిపుణికచే 'రమ్మ'ని మాట పంపెనా దేవికి? అటువలెనే యున్నది. 'భట్టినిసే ఎదురుచూచుచున్నారు ఏలినవారు' అని కాంచనమాల యనుకొనును. రాజును 'నీవు విలంబించుచున్నందున మేము ఇంకను నవమాలికను చూడలే'దని మిష పెట్టును. వాసవదత్తయో, అటనుండి రాజుతో కలసి దానిని చూచుటకోవ నుత్సహింపక వెనుమరల సమకట్టినది. పిలన మాధవినవమాలికల పూఁతపోటి యూసుచే, రాజు జయమును తన యపజయమును భావించి. అభంగపాటునను భావమును 'అదిగో పెద్ద మొగము పెట్టుచున్నది' అని రాజు వ్రేలితో చూపనుంజాపును. మఱి రాకయే యుండరాదా యనిన, అది కరమునౌదార్య మగును. అంతట పూఁతపోటిలో తన పక్షమునకు గెలుపు సేకుఱనదని వసంతకుఁడు వెత్తిపాట యాడును.

అప్పుడే మరలంగూడ రాజు హెచ్చరిక పొంది వసంతకుఁడు చంకలో దాఁచుకొన్న చిత్తరుపటమును ఆ దోహద జమోవాచ్యదనృత్యమున జాఱవిడుచును; విడిచియు మరలఁ గప్పం దివురఁడు. కామతంత్రమున నిపుణుఁడు, లోలుత తాసై దానిని పదిలపఱచినవాఁడు, ఇపుడు రాజు హెచ్చరికచే చంకలో గ్రుచ్చుకొన్నవాఁడు, ఇంతలో ఎంతటి వెఱ్ఱినృత్యమునను ఇట్లు ప్రమాదపడునా? ఒకవేళ అట్లు సాగరికా రాజులకు ఆలింగనభంగము కావింపకయే కావించి వినోదము గాంచినవాఁడు, 'పెనుగాలి', 'అరణ్య రుదితము' అని దేవీరాజులం దాఁకు నదినయశాలియు, చనువరియు, ఇతఁడు కావలయు ననియే ఇపుడు దానిని జాఱవిడిచియుండునా, రవంత తమాషా చూచుటకు; ముద్రలో సిద్ధార్థకుఁడు తాఁత్యయానుఁడై నటులమాటంబోలె? ఫలకమున సాగరిక వ్రాసిన రాజుచిత్తరువును, సుసంగత వ్రాసిన సాగరికచిత్తరువును గుఱించి రాజు తాను తన్నె వ్రాసికొనుచేర్పను స్వబుద్ధికల్పనచేర్పను తారుకాణ చూచుకొంటిని అని యనును. అట్లు రాజు క్రమ్మఱ దలగా పలుకుట దేవికి వారిపై శంక వారించి కాపాడుట, అదే 'స్వపరాభ్యుపపత్తిలక్షణము' ఔదార్యము అనును; అట్లే పునఃసమాగమాజికి ప్రతికూలమును వారించుట యను బుద్ధివిభవము, అదే తెలివియు అగును. (gallantry, chivalry, prudence మొదలైనవి.) మఱి ఎంత ప్రాగల్భ్యముచేతను రాజు దేవి ప్రశ్నయమున 'మధురము'గా దాఁచిన కోపమును తీర్పఁజాలఁడాయెను. అటనుండి కోపముతోడనే వెడలిపోయినది దేవి. ఆమెం దేర్చుటకు రాజు లోఁగిటికిం బోవును.

౪

ఆ సారిక ఏమయినదో! పంజరమును పరిజనము చేతిలో మోయించుచునే యుండు దొరసానికి, తాను మద్దుతీర్పవలయు దేవికి చెప్పనుగదా చిత్రఫలకమునట్లు! చెప్పియున్న కథ ఏవంకర తిరిగియుండునో! చిత్రఫలకము రవంత సందేహము కలిగింపఁగా, దేవికి సాగరికయెడ నీర్ష్య దళముకొనును; కాని, అపరాధశంక లేదు. సుసంగతియెడ లేనేలేదు. సాగరికను సుసంగత చేతికే అప్పగించి, మేలఁకువతో కాచుటకై నేపథ్యము పసదనము కూడ నిచ్చును. చిత్రఫలకమునకై రాజునెడను వసంతకునెడను మాత్రమే శంక కలిగినది. అయినను రాజు వెంటనంటి బతిమాలఁగా, ఋజుమతి దేవి కాంచనమాల చెప్పిన యాఘుణాక్షరసంవాదమునో, రాజు చెప్పిన యాశిల్పనైపుణి సమాధానమునో నమ్మినదేమో, అత్తూరికి అలుకతీఱినది. అటు సాగరికకై భద్రమగు నేర్పాటు సేయఁగలిగినందునను ఇటు రాజునెడ ఇఁక నెందుకు కోపానుబంధము అని తలంపఁగలిగినందునను ఆ మేరలేనియనురాగముగలది ప్రకృతిం బొందినది.

'అట్లు చేతికి దొరకియు అనుభవమునకు రాకపోయెనే, అరఁటియింటికడ సాగరిక!'—అని క్షణము యుగముగా సాఁగి పరువుచున్నది రాజునకు కాలము. స్మరశిఖిలో చిత్తము కుములుచున్నది. అరఁటియింటి చెంత అట్లు చెదరి చీలిపోయినది సాగరిక; దేవి చిత్రఫలకముం గని కొనిపోయినది. సాగరికను ఏమి చేసినదో, సాగరిక ఏమయినదో అని రాజునకు సాగరికదే చింత. కనుఁగొమ్మని వసంతకుం బంపినాఁడు. తనకు అస్వాస్థ్యమని మిష పెట్టినాఁడు. అదే నిజమనుకొని, ప్రకృతిం బొందినది కావున దేవి తన పరిజనమును పంపి రాజుదేహస్థితిని విచారించుచున్నది. వసంతకుఁడు మరుగుట్టు

ఎతింగినవాఁడు సాగరికమాట నెఱుంగుటెట్లు, సాగరికను రాజుతో కలుపుటెట్లు అని మిక్కిలి పనివడుచున్నాఁడు. చిత్రశాలవాకిట సుసంగతం గలసికొన్నాఁడు. సుసంగత ప్రతీకారోపాయమును గా చెప్పుచున్నది. సాగరికకు వాసవదత్తవేషము వేసి, తాను కాంచనమాల వేషము వేసికొని, రహస్యమునకు అదే కమ్మదల కాఁగా తాము రాజును అభిసరింతురఁట. వసంతకుఁడు రాజునకుం దెలిపి, ఆయనను బందిసురి వెందమంటపమునకు చేర్పవలసినది. చేర్చి, తమకోసము ఆ చిత్రశాలవాకిటనే కనుపెట్టుకొని యుండవలసినది— అని. రాజకుశల మెఱుంగుటకు వచ్చి మరలుచున్న కాంచనమాల దారిలో నీరిం గాంచి దాఁగి ఆమాటలను అన్నియు విన్నది. దేవికిం జెప్పినది. 'అటులనా! కానీ చూతము ' అని దేవి పరీక్షింపఁ బూనుకొనినది. అట వసంతకుఁడును దంకతోరణవలభిలో కూర్చున్న రాజును చేరఁబోయి ఈ కూత్వాస రహస్యమును చెప్పినాఁడు. అంతట రాజు ఆత్రముతో ప్రొద్దువోదనే కన్నుపెట్టినాఁడు. సూర్యుఁడును సంధ్యావధువును అస్తగిరివనసంకేతమున అభిసరించుచున్నాఁడు. ప్రొద్దు క్రుంకినది. సంకేతకాలము సమీపించుచున్నది. ఇరులు మోహరించుచున్నది. చెట్ల తీబుచేతోఁటలో మఱియు అంధకారము. పూవులవాసనచే ఆయా చెట్ల నిశ్చేశను నకు సుర్తుగా రాజు దారి తెలుపుకొనుచు వసంతకునితో బందిసురి వెందమంటపము చేరినాఁడు. ఎంత చీఁకటిలోను కామికి 'తెర - మహల్ 'వేసి పందులు గొందులు త్రిప్పునుగదా మహాల్పి కాముఁడు! అతని వందుం గూర్చుండు మన్నాఁడు వసంతకుఁడు, తాను తనకు తెలుతయిన చిత్రశాలవాకిటకడకు వచ్చి అటం గూర్చున్నాఁడు.

సుసంగతాసాగరికలు వేషములు వేసికొని తయారగుచున్నారో, అయినారో. అంత చిమ్మచీఁకటిలో ఆ చేలలు తెలువచ్చునా? వేషములు మార్చుకొన్నను, దేవియైనను కాంచనమాలతో ఈ చీఁకటిలో ఎక్కడికి బయలుదేరిన దని యనుకొందురు అని, అదియు సంశయము కలిగించు నని వారికిం దోఁచును. కొంచెము వెన్నెల వచ్చిన తరువాత వెడలుదురు కాఁబోలు. అట్లు వెడలినపుడు సందేహములు ఎవరికిం గలుగకుండుటకే ఆవేషములు సంకల్పించుట.

ఇంతలో కాంచనమాలానుగతయై దేవి, తాన దేవి గాన్పన భయము లేక, చీఁకటియే అవభిజ్ఞానసహాయముగా, సంకేతస్థలమున విమానకుం దరిసినది. చెవికి స్పష్టముగ చప్పుడున్నతే కాని, కంటికి స్పష్టముగ చూపుడు సన్నలకు ఎనము లేదు. ఒండొరులకు అనతిస్పష్ట దర్శనము, అపర్శనమును. కాంచనమాల చిటికవేయును; వ్రేలితో చూపుచు 'ఇమగో' అని మూఁడక్షరాలే పలుకును; వాసవదత్త, గొంతున ఆనవాలు దొరకు నని, 'శిరఃస్నా' నోసంగును. వసంతకుఁడు సాగరికయే యని తలంచి వాసవను రాజుతో కలుపును. 'నన్ను చల్లఁగా కౌఁగిలింపవే, సాగరికా' అనును రాజు. 'నీవు తియ్యగా మాటలాడవమ్మా, సాగరికమ్మా- చెవులకు ఆ వాసవదత్త కొల్పిన చేఁదు తీరునట్లుగా' అనును వసంతకుఁడు. 'నీ ముఖచంద్రునియందు ఇది నీ వాతెఱ సుధాపూర్ణము'—అనును రాజు. సాగరికా యనుచు అట్లు కౌఁగిలికి ఇట్లు అధరపానమునకు ఉవ్విళులూరుచున్నాఁడు రాజు. వాసవకు రోషము ఇముడక వచ్చినది. 'సాగరికను కాను, నేను వాసవదత్తా' నని 'ముఖోద్ఘాటనము' చేసి బయటపడినది. వెన్నెల వెలుతురును వచ్చినది. రాజు ఏమి సేయును? వసంతకుఁడు ఏమి చెప్పును?

ఇఁక నొక్కటే ఉపాయము. రాజు దేవిపాదముల వ్రాలి కనికరింపుమని బతిమాలుకొనును. ప్రేమస్థలనము ఇట్లు ప్రత్యక్షప్రకటమైనదే, ఓర్చునా వాసవదత్త! ఆమె అట నిలువక వెడలిపోయినది. ఇఁక తనువు దొరంగకుండునా ఆమె అని రాజభయము. ఇక సాగరిక ప్రాణాలు ధరింపదయ్యొ అని వసంతకుని హెచ్చరిక. అంతలో రాజును హా! ప్రేయసీ, సాగరికా అని వాపోవును, దక్షిణుఁడో శఠుఁడో! దేనికిని దేవీప్రసాదనమే ఏకోపాయమని రాజు తలంచును. దేవికోసమే అట నుండి వెడలును.

అట్లు సంకేతవృత్తాంతమును ప్రత్యక్షముగా రుజువుచేసికొన్నది దేవి, ఇఁక సుసంగతాసాగరికలను ఏమి సేయునో! సాగరికకు దేవివేషము వేసి సంగీతశాల

లో నుంచినది సుసంగత. తా నింకను కాంచనమాల వేషము వేసికొనలేదు. చుట్టురా సందర్భములం బరికించుచు అటు వచ్చుచుం బోవుచు నున్నది. అంతలో దేవికి, సాగరిక చూచుచుండఁగానో వినుచుండఁగానో, పట్టువడినది; అవమానింపఁబడినది. ఎట్లో, తెలియదు. తిట్టినదేమో. కసరినదేమో. మఱి సాగరికనో? సాగరికను అప్పుడే ఏమియు చేయలేదు. సుసంగతను మందలించి అట్లు చీఁదీసినతర్వాత ఇంక సాగరిక ఏమిసేయఁగలదు లే. అదియునుంగాక, ఇప్పుడే తనయొక్క 'గోత్రస్ఖలనమున' రాజు సాగరికనామగ్రహణమే చేసినందున దేవికి తిన్నగా సాగరికనే ఏమేని యనుటకును చేయుటకును వైలక్ష్యమును కొఱవడిటవును అగును. సాగరిక వేషధారణమయి సంగీతశాలయందు దాఁగియుండెను గదా. ఆ విక్రమబాహుని కూఁతురు, సంకేతము తెలిసిపోయినదే, ఆ యవమానము ఓర్చునా? ఆ మనసిజరుజకు ఇఁక వేఱుచికిత్సయు కలదా? ప్రాణమునకు తెగించి, అటనుండి వెలఁవడి తోఁటలోనికి వచ్చినది. ఆపదశబ్దమునే విని రాజవసంతకులు, దేవీప్రసాదనమునకై ఆమెకడకు తరలినవారు వాసవదత్తయే పశ్చాత్తప్తయై మరలుచున్నదా అని శంకింతురు. సాగరిక తీఁగత్రాటితో తన్ను చెట్టున ఉరిదీసికొని ప్రాణములు వదలునఁట. తీఁగలను చేనుకొని ఆకన్య, అట్లు తల్లిదండ్రులకు దూరమై దిక్కుమాలి ఆ యవస్థలో నున్నట్టిది, అది కడస్మరణగా, వారినే వాపోవుచు ఉరిం దగిలించుకొనను. దేవికడకు అని వచ్చుచున్న ఆ రాజవసంతకులకు అట్లు అగపడును. వెన్నెల! 'వాసవదత్తాదేవియే' అని వేషమునుబట్టి వసంతకుఁడు వేసిన కూఁతచే భ్రమసి, అట్టి ప్రేమలో ఆ స్ఖలితమును సొంతముగా చూచినది వాసవదత్త, అట్టి బలిమిచావునకు ఉంకించునెపో యని మున్నె తలంచిన వాఁడు రాజు ఆరమణిం బరిసి ఉద్బంధనమును మాన్పును. 'నన్ను వదలు ప్రభూ' అను వారణోక్తితోడి గొంతును, 'ప్రభూ' అన్న సంబోధనతోడ విని, వాసవదత్త కాదు, సాగరిక యని యెఱింగి, అదే సందు అని నిర్ణయముగా ఆ చెలువబాహువును తనకంఠమున నుంచుకొని స్పర్శసుఖము అనుభవించును.

ఇప్పుడే వాసవదత్తను సాగరిక యని పైకొన్నాఁడు. ఇప్పుడే సాగరికను వాసవదత్త యని పైకొనుచున్నాఁడు. పొరపాటుల ప్రహసన మగునా, శృంగారరసమున ఇది? సామాజికుల యనుభవమెటువలె? ఇందు సహృదయునికి హాస్యము పుట్టదు కాఁబోలు. వివిధముగానైనను ఇది సాగరికా వాసవదత్తా రాజుల రతివిలాసమే, నానావిభావాది విభావితము! అహో! సుశ్లిష్టసందర్భము! మూఁడు జంటలను - దేవీకాంచనమాలా, రాజవిదూషక, సాగరికాసుసంగతలను - మూఁడు తెఱంగులుగా సంకేతసంభోగవిప్రలంభ సంభ్రమములం ద్రిప్పి ఏకశృంగారరసప్రవాహమున సుడిబాఱగయలల వివర్తములం గొల్పి సహృదయులకు కుతుకబంటి తరఙ్గక్రీడ! ఇంతలో వాసవదత్తయు అలాగు సుసంగతను మందలించి దాన నసహాయయు పరాధీనయునగు సాగరికపాటిని దాఁటితి ననుమతితోడి ఈర్ష్యను మ్రింగి ప్రకృతిం బొందుచు ప్రియప్రణిపాతలంఘనమునకు పశ్చాత్తాపము నొంది అనునయింతుంగాక యని నిజముగానే రాజుకడకు వచ్చుచుండి, అంతలో రాజునొంటు విని దాఁగి పరికించును. ఏమి యగపడును! రాజు సాగరికను లోఁబఱుచుకొనుచుండును. సాగరిక నాఁటి యుదయము అరఁటియింటికడ రాజు దేవిభయమునకై తటాలున తనచేతిని వదలి పడినపాటుం జూచియున్నట్టిది ఇప్పుడు 'మళ్లీ యెందుకు దేవికి అపరాధి వవుతావు' అనును. రాజు తాను రవంతయుం దు సంకేతమున దేవికి పట్టువడి సిగ్గువడి వడఁకి పాదముల వ్రాలి బతిమాలుకొనుటను సాగరిక చూడనిదానివలె ఇంతట నంతటనుండి చూచినదేమో, ఇట్లు పలుకుచున్నది అని సందేహించి, దానికి సమాధానముగా 'అదంతయు ఆభిజాత్యమునకుం దగినది దేవికి నేనామాత్రము; అధికరసముపహారిణి నాకు నీవుండే' అని నమ్మఁబలుకుచుండును. ఏప్రణిపాతమును తాను లంఘించినదో, దేవికై సుండించుటకు తానె ఇట్లు రాజుకడకు వచ్చుచున్నదో, అది కైతవమని అట్లు రాజునోటనే వినునా, దేవి. 'కర్ణగృహీత కుంభిలకుఁడు' రాజు ఇఁక నేమి సేయఁగలఁడు? రాజు మరల దేవిపాదములలో వ్రాలును. వసంతకుఁడును అనును - ఆవేషముచేత సాగరికను ఉరిఁబోవి

కొనుచున్న దానిని దేవిగా భ్రమించితిని అని. కోపముతో దేవి వసంతకుని ఆయురిత్రాటితోనే కట్టించి, సాగరికను పట్టించి, ఇరువురిం గొని అటనుండి పోవును. రాజు ప్రతిపత్తిశూన్యముగా క్షణ ముండి, ఎట్లులేని దేవినే ప్రసన్నను చేయవలసినదని అనుకొని లోనికేగి పోవును.

౫

తాను పట్టువడి వచ్చిన రవంతసేపటికే సాగరిక తనకు కలిగినట్టియు, ఇంకను కలుగనున్నట్టియు నవస్థం దలంచుకొని, దానినెల్ల అట్లు సమకూర్చుచున్న దుర్దైవమునకు శాంతిం గోరి కాఁబోలు, రత్నమాలను బ్రాహ్మణునికి దాన మిమ్మని,- ఎట్లు తారసిల్లినదో చెంతను సుసంగత- ఆసుసంగతచేత ఇచ్చివైచినది. తరువాత రాణిరహస్యాజ్ఞచే నిశీథమున నగరున ఎవ్వరికిం దెలియనీక మఱియు అంతరపనీతయై సంకెలంబడినది. తెల్లవాఱఁగా ప్రవాద 'ఉజ్జయినికిం బంపివేయఁ బడినది సాగరిక' అని పుట్టి పర్వుచున్నది. దేవిమాటచే విదూషకునికిని రాత్రియెల్ల ఖైదే.

ఎవతె రాజానురాగమునకు తనకు సవతికాఁజూచెనో ఆ చెలువ సాగరిక నిర్బంధితయు తనకే కారాపరాధీనయు అయినది. ఇఁకను ఈర్ష్య తనంతట అడఁగును; కోపము తనంతటనే తెరలును. రాజును చెంతఁ జేరి ఏమేమో చెప్పినాఁడు, ఊఱడించుటకు ఎంతెంతో చేసినాఁడు. కాంచనమాలయు బతిమాలినది. దేవియు చాలసేపు కంట నీరు గార్చినది. అంతట ప్రకృతిం బొందినది. అదే ప్రసన్నయైనది.

ఇఁకను ఆక్షణము మొదలు మరల రాజునకు సాగరికచింతయే. వసంతకుఁడును చెఱంబడినాఁడు, చెంత లేఁడు గదా. ఆరాత్రిశేషమును ఎట్లో అటనే పుచ్చినాఁడు, రాజు. మఱునాఁటి యుదయమున అక్కడినుండి (పూర్వాహ్ణమునం గాఁబోలు) వెడలి, పటికరాతి తిన్నెమండపమునకు పోయి, అటం గూర్చున్నాఁడు.

దేవియు ఆ యుదయము వసంతకుని చెఱవిడిపించి, అనునయించి, ఔదార్యము మీఱ, తన చేతితో కడుపునిండ అప్పచ్చులు పెట్టి తినిపించి పంపినది. అతఁడు వయస్యుని రాజునుం గలసికొనంబోవుచున్నాఁడు.

సుసంగత సాగరికతోడి వియోగమునకును సాగరికయవస్థకును బాష్పములు ఆఁపుకొనలేక కురియుచు, ఆరత్నమాలను ఎవనికేని బ్రాహ్మణునికి దానమియ్యఁగోరి వెడలినది. వసంతకుని కిమ్మని సాగరిక చెప్పియుండదు; ఏలన అతఁడును తనవలెనే చెఱంబడుచున్నాఁడు, గ్రహింపఁజాలఁడు. సుసంగతయు అతనిం బ్రతీక్షింపదు. గుఱి యిపుడు బంధముక్తుఁడు పోదక హృష్టుఁడు అతఁడు కాకతాళీయముగా అగపడినాఁడు. అతనితో సుసంగత సాగరికను ఉజ్జయినికో ఎక్కడికో పంపివేసినది దేవి అనును. ఇరువురుం గలసి సాగరికకోసము ఉమ్మడిగా ఏడ్తురు. కరుణాత్మకసంవిధానము! అంతట సాగరిక ఇమ్మన్న దనుచు ఆరత్నమాలను అతనికి ఇచ్చును. అతఁడుం బుచ్చుకొనలేక పుచ్చుకొనును. రూపమేధావినయశీలాదికముచే మాళవికను గొప్పయింటిపుట్టువని గణదాసుఁడు శంకించునుగదా; సాగరికను కులీన యని వసంతకుఁడు ఈ హారముచే శంకించును! దానిని రాజునకే వినోదోపకరణముగా గొనిపోయి మండపమున పటికరాతి తిన్నెమీఁదనున్న యాతనిం గలసికొనును.

క్షణము చెఱవిడుపు దేవీప్రసాదములం దలపోసికొందురు. తరువాత వసంతకుఁడు సాగరిక యుపనయనముంగూర్చి రాజునకుం జెప్పును. దానం దుఃఖితునికి వినోదంకరణముగా రత్నమాలను ఇచ్చును. అతఁడు దానిని ఎదయందుంచుకొని ఊరటం దెచ్చుకొని, దాని దర్శనము తనకు నిరంతరాప్యాయనగా నుండుటకు విదూషకుని కంఠమున ధరింపు మనును.

అంతలో కోసలయుద్ధవిజయముం జెప్పుటకు అటనుండి మున్నాడివచ్చిన రుమణ్వద్భాగినేయుఁడు విజయవర్మ రాజదర్శనమునకు వచ్చును. సాగరికచింతలో నున్న రాజు విజయవర్మకు దర్శన మిచ్చుటయ కాక ఆ యుద్ధముంగూర్చి వివిదిగా వినంగోరును. విజయవర్మయు కోసలయుద్ధవిజయము సవిస్తరముగా చెప్పి రాజామన్ననం గొని వీడుకోలువడయును.

అప్పుడే కాంచనమాల శంబరసిద్ధియను నైంద్రజాలికుని ప్రభుదర్శనమునకుం గొనివచ్చును. అతఁడు ఉజ్జయినివాఁడు. కావున మొదట దేవిదర్శనము చేసి, ఇపుడు ఆమె యొసఁగిన సిఫారసుతో రాజుకడకు వచ్చినాఁడు. సాగరికను దేవి మాయము చేసెనే, ఈ యైంద్రజాలికుం డేమైనను రాజును సాయము చేయఁగలఁడా, తనవిద్యచే సాగరిక పోఁబడి యుండుటకుఁగాని ఆచెలువనే రాజుం జేర వాఞ్ఛించుటకుఁగాని? మణిమంత్రౌషధుల ప్రభావము అచింత్యమని మునుపే తలపోసికొన్నాఁడు రాజు. మంత్రౌషధుల మహిమను నవమాలికపూఁతలో ప్రత్యక్షీకరించుకొన్నాఁడు, నిన్ననే. కావున ఇపుడు అతనికి తత్క్షణమే దర్శనమిచ్చును. అతఁడు మహోద్యుతముల నెల్ల మాపుదు నని 'గర్జిల్లును'.

'హెచ్చుపలుకు లేల? హెచ్చరింతువరేని,
మాపు దేనిఁ జాడ నిచ్చుకొనుదొ,
దానిఁ దెచ్చి నీకు దరిసింతు దేవరా,
గురునిమంత్రమహిమ గుణికి రాఁగ'

అని. దేవితో కలసియే చూతమని రాజు కాంచనమాలనే పంపి దేవిని పిలిపించును. అందఱును కలసి కూర్చుండి తమాషా చూతురు. ఎక్కడెక్కడివారినో, దేవతలను సైతము, ప్రత్యక్షముగా ఆకసమున చూపించినాఁడు, శంబరసిద్ధి - తామరపై బ్రహ్మను, అంబతోఁ గూడ సిగజాబిల్లితో శివుని, లక్ష్మితోఁ గూడ చతుర్భుజములతోఁ గూడ నారాయణుని, తెల్లయేనుఁగుమీఁద నింద్రుని, పాటలో రంభను, ఆటలో ఉర్వశిని- ఇంకను ఎందఱినో! వసంతకుఁడు రహస్యముగా అతనితో చెప్పును- 'సాగరికను చూపఁగలవా? చూపఁగలచేని నీకు గొప్ప బహుమానము దొరకును' అని. అట్లు యీ గారడి వత్సరాజహృదయస్థ సాగరికా దర్శనానుకూల స్వశక్తిని ఆవిష్కరించినాఁడు.

ఆదేసమయమున బాభ్రవ్యునితోఁ గూడ వసుభూతి రాజును దర్శింప వచ్చినాఁడు. అట్లని ప్రతీహారి వసుంధర నివేదించినది. ఆయనకు దర్శనమీయ నదే శోభనముహూర్తమని చెప్పుచున్నాఁడు మంత్రి. ఆమాట తెలియఁగానే, వసుభూతి తన మేనమామ మంత్రియని సింహళమునుండి వచ్చినవాఁడని దేవియు, ఇంద్రజాలము అంతట మాన్పించి ముందుగా ఆయనకు దర్శనమిమ్మనును. శంబరసిద్ధియు అట్టివిద్దెలవారు సెలవు పుచ్చుకొను తెఱంగునకు సదృశముగా స్వభావోక్తితోఁ దనవిద్య యింకొకటి ఏలినవారు చూడవలయునను అప్పటికి సెలవుగొనును.

వసంతకుఁడు, రాజునాజ్ఞచే, ఎదురుపోయి వసుభూతిం దోడ్కొని వచ్చును. బాభ్రవ్యుఁడును వెంట నడుచును. వారిరువురును వసంతకుని మెడలోని హారముం జూచి రవంత సందేహపడుదురు; కాని నగల పోలిక లుండవా అని సమాధానపడుదురు. అంత దేవి రాజులం దరిసి ఒండొరుల మర్యాదలు ఆచారములు జరిగినంతట యథావిధిగా కూర్చుండురు. విక్రమబాహునికి కుశలమా అని రాజడుగును. వసుభూతి అటు మిన్ను చూచి ఇటు మన్ను చూచి వెంగము క్రేలజేసి దేవికి దిగులుగొల్పి, రాజు చెప్పుమని యనుబంధింపఁగా ఎట్టకేలకు తొడంగి సాగరికవృత్తాంతమును సముద్రమున యానభంగమై మునుంగుటవఱకుం జెప్పును. ఆబాభ్రవ్యుని యీ పెండ్లిదౌత్యము ఇంచుకయు రా జెఱింగినది గాదు; అంతయు నది రాజు పేర స్వచ్ఛందచారి అమంత్రి పన్నాగించినది. కావున వారి మాటలు ఆయనకు బోధపడవు. భగినికవిపత్తికై వాసవదత్త మిక్కిలి దుఃఖపడును. వివరములను రాజు బాభ్రవ్యుం జెప్పుమనును.

ఆ సాదన అంతఃపురములో గొప్ప నిప్పు పెనుమంటలు మండుచు వ్యాపించుచున్నదని మహాకోలాహలము వినంబడును. అక్కడ ఎక్కడనో మూలలో నుంచియున్నది సంకెల వేసి సాగరికను దేవి. ఆ పిల్లను కాలిపోకుండ కావుమని దేవి కుయిపెట్టును. రాజు సాహసమునక అనిప్పులో చొచ్చి, సాగరికను వియోగావమాన దుఃఖశాంతికై దాహమరణమునుం గోరి జ్వాలల నెదుర్కొనుచున్న దానిని గాంచి, సంకెలచే లొట్రిలుటం బరికించి, మొదం జేర్చి యెత్తుకొని వచ్చి ఇవలికి చేర్చును. అంతలో నిప్పు మాయమగును. దేవికిని ఎవరికిని సెగ సుఱుతేని సోఁకలేదు. ఆశ్చర్యముతో అందఱును ఒక వేళ అది యైంద్రజాలికప్రయోగమగునా అని శంకింతురు.

అట్లు ఎకుటికిం గొనిరాఁబడిన సాగరికం బరఖాయించి చూచి, ఆ రత్నమాలను స్మరించి,— స్మరింప నేల, మరల వసంతకుని మెడలోఁ గాంచి — వసుభూతి ఆ చెలువ రత్నావళి యని యానవాలుపట్టి దుఃఖభరమున నేలం గూలును సాగరికయు (—రత్నావళి) వసుభూతిం గాంచి తల్లి దండ్రులం దలంచుకొని, అట్లు వచ్చి అట్లు చచ్చి అట్లు లేచి ఇట్లు చొచ్చి ఇట్లు నొచ్చి ఇట్టులైతినే అని దుఃఖము పొంది మూర్ఛఁగా మూర్ఛిత యగును. అమ్మాయీ అని వసుభూతియు, భగినికా అని రాణియుం దేర్పఁగా లేచును.

అంతలో అచ్చటికి యౌగంధరాయణుఁడు వచ్చును రాజుతో చెప్పకున్నను, తదభ్యుదయమే కోరి, తాను గావించిన సింహళధూత్యంపు వివరముం జెప్పి, క్షమ వేఁడి, అట్లు సముద్రమునుండి తనచేతికి చిక్కిన యాపిల్లను, అంతఃపురమున నుంచినట్లైన రాజు కంటంబడునని యెంచి దేవిచేతం బెట్టితి ననెను. అంతట మహానుభావురాలు దేవి సంతోషించి భగినికను రత్నావళిని తనతోడవుతే తొడిగి, పెండ్లిసింగారము చేసి, దేవీపదానుగ్రహసంపన్నముగా తనకు సపత్నిగా రాజునకు సమర్పించెను. దేవియే అనుగ్రహించిన దని రాజు ఆదరముతో గ్రహించెను.

రోహిణికి

"భరణి - కృత్తిక"

రోహిణీ! మోహినీ! నేటి కీ హృదంబు
జాతదళములు విడి మధుసౌరభములఁ
గురిసె నీయుషఃకాలాన నరుణవీథి:
రమ్ము హృదయాన నటియింపఁ దుమ్మెదవయి.

ఈకుటీరాన పాదమ్ము లీవు మోప
నణువణువు పవిత్రీభూతమగును చెలియ!
బ్రదుకు బ్రదుకెల్ల పాటగా పాడుకొందు
నీ చరణసన్నిధిని నిల్చి నేడు నేను.

సాంధ్యతరుణిపై యల్లనఁ జల్లిపొమ్ము
రాగకాశ్మీర మీమనోరాజ్యమందు!
హృదయమే పిండి పిండి నీ కీ దినమ్ము
రక్తనై వేద్య మిడుదు హారతులొసంగి

నీవు శ్రావణలక్ష్మి వీ నీసఖుండు
నీలమేఘుఁడై గొనిపోవు నేఁడు నిన్ను
తరళతారావిహారపథమ్ములందు
ప్రణయరసభారవివశత వ్రాలి వ్రాలి.


"నన్ను చూడుము!"

అంకితము :
నా ప్రేమబావ సోమశేఖరశర్మకు
గాఢాలింగనంతో.

ద్వేషము

రచయిత :
శ్రీ అడవి బాపిరాజు

(ఈ కథ, ఈ కథలోని పాత్రలూ కేవలం కల్పితాలు.)

౧

ఆవేశంతో ఆచిత్రము లిఖిస్తున్నాడు. రంగులు కలపడంలో, కుంచెలు రంగుల్లో ముంచడంలో, కుంచెలతో చిత్రలేఖనం కాగితంమీద చిత్రించడంలో అతి వేగము.

ఆచిత్రం పేరు 'రోడ్డురోలరు' అట. రంగులు 'అంబరు, సియన్నా, పెయనీస్ గ్రే, నీలిమందు, క్రిమ్సన్ లేకు' కలిపిన తమస్సును కలిగినవి.

రేఖలు అసాధువులు, కర్కశాలు. రూపాలు వికృతాలు, భయంకరాలు.

హెచ్చుతగ్గులుగా ఉన్న రోడ్డు-ఆరోడ్డును సమం చేయడానికి భారతీయ నర, నారీమణుల రాళ్లు, — శిశువులూ, వృద్ధులూ, వికృతాంగులూ — ఆ రాళ్లమీద నుంచి రోడ్డురోలరు నెమ్మదిగా, నిదానంగా, అత్యధికమైన బరువుగా నడుస్తున్నది. ఆరోలరుబండి పొగలువిడుస్తూ విపరీతమైన చప్పుడు చేస్తూ వెడుతూఉన్నట్లున్నది.

ఆ రోలరుబండి నడిపేవాడు నల్లటి ఎత్తుటోపీ బ్రిటిషురాజ్య తంత్రజ్ఞుడు. రోడ్డుకు ఈ వలావల ఉన్న భారతీయులను ఆంగ్లయుద్ధభటులు, ఆంగ్ల వర్తకులు, ఆంగ్లమిషనరీలు కత్తులతో రోడ్డుమీద పడేటట్లు నెట్టుతున్నారు. బండి వెనుకభాగం రక్తమయం.........

ఆ యువకుడు ఆ చిత్రంపూర్తిచేసి తన పేరు దానిమీద, లిఖించుకొని వెనక్కు వెళ్లి చిత్రాన్ని చూచి కళ్లు సన్నగిల్ల, బొమలు ముడివడ, పళ్లు పటపటకొరుక్కున్నాడు.

విశ్వేశ్వరరావు ఆవేశహృదయుడు. చిన్నతనాన్నుంచీ దేశభక్తి విశేషం.

గాంధీమహాత్ముడు ౧౯౧౯లో అహింసా మహాయజ్ఞం భారతమాతదాస్యశృంఖలవిమోచనార్థం ప్రారంభించిన రోజుల్లో విశ్వేశ్వరుడు పదేళ్ల బాలుడు. అప్పటికే అతనికి తాను ఆంధ్రుణ్ణనీ, బానిస అయిన భారతీయుణ్ణనీ గాఢభావాలు అతని మూర్తి మూర్తంతా వ్యాపించిపోయినవి.

అతని హృదయం ఆంగ్లజాతిద్వేషంతో నిండిపోయింది. అతనికి ద్వేషం మోముమీద మచ్చలా ఉన్నది. చిన్నబిడ్డతనం వచ్చినప్పుడు కాల్చగా వచ్చిన మచ్చలా ఉన్నది.

ఎక్కడ చూచినా ప్రత్యక్షమయ్యే దారిద్ర్యం, అనాగరకతా, అనారోగ్యపు పరిసరాలు తెల్లవాడు తెచ్చిపెట్టిన మహాభిక్ష అని అతని నిశ్చితాభిప్రాయం.

కర్కశహృదయంతో, స్వలాభాపేక్షతో ఈ ఇంగ్లీషు బందిపోటు భారతజాతీయత, ఐశ్వర్యము, నాగరికతా తరలించుకుపోయినట్లు అతని చిన్నహృదయానికి గోచరించింది.

పాఠశాలలు విడిచి బయటకు రావలసిందని మహాత్ముకీ ఆదేశం ఇవ్వగానే బడికి వెళ్లనని పట్టుపట్టి రాజకీయసభలకు పోవడం, స్వచ్ఛందభటులతో తిరగడం ప్రారంభించాడు.

గాంధీగారి బోధనలు అతని చిన్న హృదయానికి అర్థంకాలేదు. ఇంగ్లీషువాళ్లను దేశంలోంచి వెళ్లగొట్టడానికి వేసినఎత్తు అనిమాత్రం అతడు భావించుకొన్నాడు.

౧౯౨౨ నుంచి మళ్లీ చదవడం ప్రారంభించాడు. ౧౯౩౦కి బియ్యే పూర్తిచేశాడు.

మళ్లీ శ్రీమహాత్ముడు ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించగానే కదనరంగంలోకి దూకాడు. రెండేళ్లు జైలు. గాంధీ ఇర్విను ఒడంబడిక వెనక వదిలారు.

కాని అతని జీవితము జైలులో పిశాచరూపం వహించింది. జైలులో అతడు తిన్న దెబ్బలు వాతలు కట్టినవి.

విశ్వేశ్వరరావు క్రోధం మిన్ను ముట్టింది. తిన్నగా ఉత్తరహిందూస్థానం చేరుకుని లక్నోలో ఒక వర్తకపు దొరమీద ఆకలితో మాడుతూఉన్న తోడేలులా విరుచుకపడ్డాడు.

చేతిలో ఉన్న కత్తియొక్క వేగం ఇంకా ఎడమ వైపుకు మళ్లింది కాని, ఆ ఆంగ్లేయుని హృదయం చిమ్మట గొట్టం ఆయిపోయిఉండేది. విశ్వేశ్వరరావుకు ఇరవై ఏళ్లు ద్వీపాంతర వాసము వరమీయబడింది.

౨

అండమాను ద్వీపాలు చూశాడు. అనేక ఇతర జైళ్లు చూశాడు.

గాంధీమహాత్ముడు సత్యాగ్రహం విరమించమని ఆదేశం ఇచ్చి, క్రొత్తచట్టం క్రింద కాంగ్రెసువారిని శాసన సభలకు వెళ్లవలయునని కోరిన వెనక, అనేక రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పాటయిన వెనక రాజకీయబంధీలు అందరూ బోనుల్లోంచి ఎండిపోయిన శవంగుల్లా వచ్చారు.

అందరూ సత్యమూ, అహింసలయందు తమకు నిశ్చలమైన నమ్మకం కుదిరిందని శపథంచేసే బయటకు వచ్చారు కాని కొందరికిమాత్రం వాళ్లహృదయాలల్లో ద్వేషం దాగేఉన్నది. కొందరు దాచుకొన్నారు. ఆదాచుకొన్న వాళ్లలో విశ్వేశ్వరరావు ఒకడు.

అనేక ఖైదులు చూశాడు. అనేక రకాల కూడులు కుడిచాడు. కొరడా దెబ్బలు తిన్నాడు. అడ్డ బేడీల్లో, నిలువు బేడీల్లో, గోడకుర్చీల్లో చీకటి కొట్లల్లో పిశాచరూపం దాల్చాడు. పై పెదవి పైకి పోగా క్రిందిపెదవి క్రిందికి పోగా, ముక్కుపుటాలు విస్ఫారితంకాగా, కళ్లుకాయలుకానిపోగా, "ఖాఁ-ఖాఁ" అని బుసలుకొట్టాడు. ఉపవాసవ్రతాలు చేశాడు. బలవంతంగా ద్రవాహారము ఇచ్చారు. కొన ఊపిరితో బయటపడుతూ ఉండే వాడు.

అతని హృదయంలోని దవానలం గాంధీమహాత్ముని చల్లని మాటలతో చల్లారలేదు; ఇంటివద్దిర తన వాళ్ల ప్రేమచూపుల్లో మాయమైపోలేదు

రైల్లో బిచ్చగాళ్లు, ఋణవిమోచన చట్టం, గాలివాన, పొలాలవరదలు, ఎగిరిపోయిన ఇళ్లు, చచ్చిపోయిన జంతువులు, అన్నీ తెల్లనిపాని భావులే.

ఈ తెల్లని పాము భరతదేశం అంతా నిండింది. దానికి లక్షలు లక్షలు నాల్కలు. ఆ నాల్కలు చిన్నపిల్లాళ్లని రుచికి నాకుతున్నవి. కూలీలపై ఆడుతున్నవి. చదువుకొని ఉద్యోగంలేని యౌవనవయస్కులను పీల్చి పాలిపోచేస్తున్నవి.

అతని ఆస్తి పెద్దది కాకపోయినా ఆకారం పెద్దది. అందంలేని జీవితమైనా మూర్తిమాత్రము ఆర్య జాతిరేఖలు పుణికి పుచ్చుకొన్న సౌష్టవం కలిగిన సౌందర్యము. కళ్లల్లో జాలిమిలేదు. హింసితకాంతులు కృత్తికానక్షత్రయుక్తసూర్యుని కిరణాలతీక్ష్ణతతో కనురెప్పలమీద తాండవిస్తుంటవి.

జైలులో వున్నన్నాళ్లూ చదువుమాత్రం చక్కగ నేర్చుకున్నాడు. ఫ్రెంచి, జర్మని, ఇంగ్లీషు భాషలూ, ఉరుదూ అరవం భాషలూ మంచినీళ్ల ప్రాయం చేసికొన్నాడు. అనర్గళధారతో మాట్లాడుతాడు, వ్రాస్తాడు.

ఖైదునుంచి రాగానే చక్కనిపిల్ల నొకదాన్ని కట్టబెడితే చెదిరిపోయిన మనసు కుదుటపడుతుందని మంచి సమ్మంధాలు రెండు మూడు తీసుకవస్తే విశ్వేశ్వరరావు — ఇష్ ఇష్ — అన్నాడు.

3

అతని జన్మమంతా నిండిపోయిన కోపానికి విరుగుడు కన్పడటం లేదు. ఏం చెయ్యాలో అతనికి తోచటంలేదు. తనలాటివారిని పదిమందిని కలేసి ఒక పార్టీ చేదా మనుకున్నాడు. నడపబడేవారూ లేరూ —

నడిపే మొనగాడూ లేడు. పదిమందిలోనూ తన కున్న భావాలు గట్టిగా మాట్లాడటానికి వీలులేదు. తెల్లవాళ్ల శానిసత్య ప్రచారానికి గాంధి మహాత్ముడు ప్రధానవ్యాసంవంటివా డనుకొన్నాడు.

ఇలాంటి యినుమునిప్పుల విశ్వేశ్వరరావుకి ఒక్కటే నీరసగుణం వుంది. శిల్పమన్నా, చిత్రలేఖన మన్నా, సంగీతమన్నా గబగబవెళ్లే అడుగు ఖంగున ఆగిపోతుంది. క్రిందికి తిరిగివున్న పెదవుల రేఖలు ఒకొక్కప్పు డొకవైపునా, ఒక్కొక్కప్పుడు రెండు వైపులా ప్రసరించి, అతని మొహాన్ని వెన్నెల చేస్తవి. వేసంకాలపు మధ్యాహ్నంనాటి అతని జీవితం మాఘ పూర్ణిమనాటి నిశిరాత్రి ఔతుంది.

ఎల్లోరాలూ, అజంతాలూ చూస్తూ, ఆంగ్లేయు లని ద్వేషించవలసిన కాలమంతా కళలలో మునిగి వృథాపుచ్చటం తప్పని వాదించుకుంటాడుగాని కళల మస్య ప్రతిహింసాత్మకమైన కలలు బాగా కనవచ్చని సమాధానం చెప్పుకుంటూ దక్షిణాదినివున్న సర్వా గోపురాలూ, శిలలూ, శిల్పాలూ, విగ్రహాలూ వితానాలూ, చెక్కడాలూ చిత్రలేఖనాలూ దర్శనం చేస్తూ గడుపుతున్నాడు జీవితం విశ్వేశ్వరరావు.

౪

బొంబాయి పట్టణంలో అలెగ్జాండ్రా రేవులో 'పి. అండ్. ఓ' కంపెనీవారి క్లియోపాత్రా అనే పెద్దఓడ వొడ్డుకు వచ్చి చేరింది. మెట్లు దింపినారు. ఓడలోనుంచి క్రిందకి మెట్టుమొదట దిగినవారు పది మంది ఆంగ్లస్త్రీలు.

హిందూదేశ విచిత్రకళాసౌభాగ్యాన్ని దర్శించి చూరగొనిపోదామని జట్టుగ వారందరూ ఈ శీత కాలంలో బొంబాయిపట్టణంలో అడుగుపెట్టారు. అందరూ వున్నతకుటుంబాలకు చెందినవారే! చదువు కున్నవాళ్లు! డబ్బుగలవాళ్లు! ఇరవై ఏండ్లదగ్గరనుంచీ ముప్ఫై ఏండ్లవరకూ వున్న విలాసవతులు వాళ్లు. పెండ్లిండ్లు చేసికోవడం స్వాతంత్ర్యానికి భంగకరమని పూర్ణంగ నమ్మిన పూవుబోడులు.

ఈ జట్టుకు నాయకురాలు 'మార్గరెట్టు సల్లివాన్'; ముప్ఫైయేండ్లపడుచు. ప్రపంచంలోకల్లా అందమైన దేశం హిందూదేశమని ఆమె నమ్మకం. హిమాలయ పర్వతం, 'షాలీమార్' తోటలు, 'తాజ్ మహల్', 'అజంతా', వీని యన్నింటికీ తలమాణిక్యం గాంధీ మహాత్ముడు. ఇవి చాలవా ప్రపంచానికి ఒక దేశాన్ని నాయకమణిగ చేయటానికని ఆమె వాదన.

బొంబాయినుంచి తిన్నగ శివగ్రామానికి వెళ్లి వారు గాంధీగారి ఆశ్రమానికి చేరుకున్నారు. పదిహేనురోజులా ఆశ్రమంలో, ఆశ్రమవాసు లందరితోపాటు ప్రార్థన సమయానికి ప్రార్థనలకు వెళ్లుతూ అప్పుడప్పుడు గాంధీ మహాత్మునితో సత్యాగ్రహం, ప్రేమ, సంతాననిరోధం, యూదులు, ప్రపంచయుద్ధం, భారతజాతీయత, భగవ ద్గీత మొదలైన విషయాలనుగురించి ఆ అవతారపురు షుని అభిప్రాయాలు చూరగొంటూ కాలం గడిపారు. వృత్తి ఆధారవిద్యనుగురించి తెలుసుకొన్నారు.

మగన్వాడి, నల్వాడి, విద్యామందిరం మొదలైన ప్రదేశాల తీర్థయాత్రలు సాగించి ఆ తెల్లస్త్రీలు గాంధీ మహాత్ముని మహత్తత్వాన్ని అర్థంచేసుకొనేందుకు ప్రయత్నంచేశారు. అక్కడున్న ఆ పదిహేనురోజులూ ఆశ్రమవాసులూ, ఇతర గాంధీశిష్యులూ వాళ్లకు చూపించినగౌరవం, మర్యాద వాళ్ల హృదయాలను ద్రవింప జేశాయి.

డెబ్బయ్యేళ్లుదాటిన ఆ ముసలివాడు, బోసినవ్వులతో చిన్నబిడ్డలా ఉన్నవాడు, దివ్యమయిన కళకాంతులతో అవతారపురుషునిలా తేజరిల్లేవాడు, జ్ఞానపూర్ణమయి, స్పష్టమయి, ప్రేమసుధారసాలు నిండినవాక్కులు కలిగినవాడు మోహనదాసు వాళ్లకళ్లకు అపరయేసు దేవుడులా కనబడ్డాడు.

వాళ్లజట్టులో ఇరవై యొక్క యేళ్లు నిండిన మేరీ టెంపిల్ అని ఓఅమ్మాయి ఉంది. ఆ అమ్మాయి బంగారు అందంపిల్ల; బంగారుజుట్టు, విశాలమైన నీలికళ్లు. పరువం పండించుకొన్న స్నిగ్ధమయిన ఉత్తమజాతిదంతంలా ఉన్నవొళ్లు. ఆమె అందాలలో హిమవాలుకలు కరిగిపోతూఉండేవి. ఆమె పెదవుల్లో కాశ్మీరకుసుమ

వర్ణం చీరలు సాకేది. సన్నని పొడుగాటి ముక్కు, కోలమోము, గులాబీరేకల చెవులు, ఎప్పుడూ నవ్వుతూ జీవితరహస్యసౌందర్యం ప్రతిఫలించే ఫాలము ఆమెకు దివ్యసౌందర్యం నివేదన లిచ్చినవి.

మేరీకన్య ఎదుటివాడు మాటాడుతూ ఉండ గానే అతని భావం గ్రహించేది. తనకు ఏవిషయమ యినా నచ్చితే మళ్లీ దానినిగురించి తర్జనభర్జన చేసుకు నేది కాదు. ఏ కార్యమయినా తన ఆలోచనాపథంలో మెరుపులా ప్రత్యక్షమయితే ఆకార్యం నిర్వహించు కొన్నదాకా నిద్రపోయేది కాదు. అఖిల ప్రపంచశాంతి సంఘాధ్యక్షురాలయిన మార్గరెట్ హల్లివాక్ శిష్యురాలు. మార్గరెట్ హల్లివాక్‌కు గాంధీమహాత్ముడు దేవు డాయెను. అందువల్ల గాంధీమహాత్మునికి చెందిన జాతిలో ఉన్న మనుష్యులంతా భగవంతుని పక్కనున్న దేవతల వంటివాళ్లనే ఆమె ఉద్దేశం. బొంబాయిలో దిగినప్పుడు, రైళ్లల్లో ప్రయాణాలు చేస్తున్నప్పుడు, హోటళ్లలో భోజనాలు చేస్తున్నప్పుడు కొందరు మనుష్యులు తమ్ము మోసంచేస్తున్నారని ఆమెకు తెలిసినప్పటికీ తన సిద్ధాంతానికి ఏదో కొంచెం వ్యతిరేకం సంభవించిందనే భావమే కాని భారతీయులయెడ ఆమెకున్న ప్రసన్నతా భావానికి ఈ మాత్రమైనా జంకు కలుగ లేదు.

భరతదేశపు ఆకాశంలోని నీలిమ 'లెపిస్ లజూలీ' శిలకన్న ఎక్కువ కాంతిమంత మయినదట. భరత దేశంలోని నదీనదాల నీరు గ్రీకుదేవతల 'ఆంబ్రోసియా' (అమృతము)ట. భరతదేశంలోని పువ్వులయొక్క వాసన స్వర్గధామంలోకూడా దర్శన మవుతుందో లేదో అని ఆమె కనుమానం. రెండుచేతులూ జోడించి ఆమె జోహారులివ్వడం నేర్చుకొంది. 'సుజలాం సుఫలాం మలయజశీతలాం' అని పాడుతూ పులకరించక పోయేది.

జీనట్టి మేళ్గానాల్డుగొంతుకను వన్నెలు దిద్దే గొంతుకతో 'వైష్ణవజనతో' అని పాడుకొంటూ కళ్లు అరమూతలు చేసుకొని, వణికిపొయ్యేది. ఆంగ్లస్త్రీ లందరు మీరాబెన్నులయితేనే కాని ఇంగ్లండుకు మోక్షం లేదని ఆమె నిశ్చితాభిప్రాయము.

౫

ఉదయ సంధ్యానృత్య పరవశుడయిన నటేశ్వ రుని పదకింకిణీరవాలు రామప్ప చెరువు చిరుకెరటా లలో లీనమై పోయినవి. ఛాయాసోధం బోగైన్ విల్లా పూలయొక్క కుంకుమవర్ణం, తెరలుకట్టి ప్రత్యూష మంగళ గీతికారవాలను చేపట్టి గాంధర్వ మొనరిస్తు న్నది. ఉదయకాదంబినీమూర్తియొక్క అవ్యక్త రూపాలనుంచి ఉదయనృత్యాలోకనాభిలాషు లయిన దివ్యులు అనిమిషులై పొంచిచూస్తున్నారు. అంగ హార వివిధ కరణోపేతమైన అభినయ లాస్యయుక్తలై అప్సరసలు పరమనటునకు హంగుచేస్తున్నారు. రామప్ప దేవాలయంలో ప్రత్యక్ష మవుతున్న ఈ దివ్య లీలవంతా దర్శించడానికి గాఢాభిలాషలై మార్గ రెట్ హల్లివాక్ జట్టువారు ఆ తెల్లవారకట్లకే ఆ దేవాల యానికి వేంచేశారు.

కారులు దిగడంతోనే అందరికన్న ముందుగా పరు గెత్తుకు వెళ్లాలని అయిదంగల్లో వంతెన దాటింది, సింహద్వారం దాటింది, మండపం చేరుకొంది మేరీ టెంపిల్. ఆ మండపరమ్ముందర శిల్పవైభవం చాటే స్తంభాలు! ఆ స్తంభాలకు శిఖర స్వరూపాలుగా నాట్యం చేసే నల్లరాతి శిల్పకన్యలు! —ఆ శిల్పసుంద రుల నాట్యభంగిమ రేఖావిలాసాలను చూసి నిస్తబ్ధురా లై పోయింది మేరీ. ఆ శిల్పబాల లందరలో ఒక మనోహరాంగి తన అందంతో మేరీసంకెను చిదిమి వేసింది. తదేక దీక్షతో అలాగే చూస్తూ ఆమె నిలబడి వుంది.

తన వెనకాల ఏదో చప్పుడయినట్లు కాంచి, చటుక్కున వెనక్కు తిరిగింది మేరీ. విశాల క్రొక్కు చూపులతో రెప్ప వాల్చకుండా తనకేసి చూస్తున్న ఒక యువకుడు బిర్రబిగిసి నిల్చిఉన్నాడు.

"అప్రకృతిలాగ ఇక్కడ దాపురించావేమిటి?"

తెల్లబోయి మేరీ టెంపిల్ మాటాడలేక పోయింది.

"దేశమంతా పిచ్చిచేస్తూ ఎక్కడో మూల దా క్కొనిఉన్న ఈ కాస్త కళనూకూడా నమిలివేయ డానికి వచ్చిన తెల్ల రాక్షసిలా గున్నావే నీవు?"

మేరీ భయంచేత కుంచుకుపోయింది. అందమైన ఆమె పెదవులు అప్రయత్నంగా విడివడి పోయాయి.

"నీ దేశం పోయి మమ్మల్ని అపహాస్యం చేయడానికి మేమోపిశాచంలాగ ఇక్కడికెందుకు వచ్చావు?"

బిర్రబిగుసుకుపోయి మేరీ రాయిపడి శిలావిగ్రహంలా అయిపోయింది.

ఇంతట్లో తక్కిన జట్టువాళ్లంతా అక్కడికి వచ్చారు. వాళ్లందర్నీ చూస్తూ అసహ్యంచేత కనుబొమలు ముడుచుకుపోగా, పైపెదవి పైకి తిరిగిపోగా, ఆ యువకుడు విసవిస నడిచి చక్కాపోయాడు.

మార్గరెట్ పల్లివాక్ మేరీని దూసి, ఆ అబ్బాయి ఏమిటి నీతో ఇంగ్లీషుతో మాటాడుతున్నాడని ప్రశ్న వేసింది.

ఎక్కడో నీలాకాశంలోనుంచి ఊడిపడిన పిడుగుదెబ్బ తిన్నదానిలా చైతన్యం తప్పిఉన్న మేరీ మార్గరెట్ మాటలను వినిపించుకోలేదు.

"మేరీప్రియా! ఏమిటే అలా చూస్తున్నావు— పామును చూసి భయపడ్డ పాశ్చాత్యునిలా?"

"తళుక్కుమని దయ్యంలా మాయమైన ఆ కుర్రాడేమయినా అన్నాడా నిన్ను? వాడిమాటలు మాకు కొంచెం కోపంగానే వినిపించాయి" అని మేరీని వీపు తట్టుతూ మళ్లీ పలకరించింది మార్గరెట్.

మూలమూలలకు చెదిరిపోయిన ధైర్యశక్తిని నెమ్మదిగా చేరదీసికొని, గుండెల్లో పదిలపర్చుకొని మేరీ వెలవెలపోయే చిరునవ్వు నవ్వింది.

"ఆఁ! ఆఁ! ఏమిటీ అన్నావు మార్జీ! అబ్బే, ఏమీ లేదు. ఆకుర్రాడు ఏమన్నాడో నాకూ వినపడలేదు. ఈ ఉదయపు చీకటిగట్లలో ఎవరూ లేరుకదా అని నేను వస్తే ఆ అబ్బాయి కనపడ్డంచేత భయపడ్డాను. అంతే."

ఇంతట్లో హెలెన్ అనే అమ్మాయి "ఏమి అందగా ఉందే ఈగుడి! ఏమి అందంగా చెక్కాడు నందుల్ని. ప్రతి స్తంభంపైనా తనకున్న కళంతా ధారపోసి నాట్యంచేసే ఈ స్త్రీవిగ్రహాలను చెక్కినవాడు ఎంతటి మహాశిల్పికదా!" అని అన్నది.

నుపి— "రాతిలో చెక్కాడా, రాతిని కరిగించి పోత పోశాడా?"

నెల్లీ— "ఇవి రాతిబొమ్మలు కావర్రా;— శాస్త్రజ్ఞానం అంతా కనబరచి ఇనుము కరిగించి తయారుచేసిన బొమ్మలు గాని!"

మేరీ— "ఆ దేహరేఖలు, ఆ శరీర సౌష్ఠవం, ఆ విచిత్ర భంగిమ, ఆరాతితనంలోని నలుపును మరపింపజేస్తున్నవికదా? రక్తం పోటెత్తుకువస్తూ, స్నిగ్ధమై, సిక్తమయిన ఆమె శరీరమే కనబడుతోంది. ఈవేళ్లతో ఆమెను అంటుకొంటే ఆమె ఎంత మార్దవంగా ఉంటుందో!"

మేరీ అప్పుడు వెనక్కి తిరిగి చూసింది. విశ్వేశ్వరరావు దూరంగా ప్రాకారపుగోడదగ్గర నిలబడి వాళ్ల సంభాషణ వింటూ తెల్లవాళ్ల మీద ద్వేషం ఒకనిమేషమాత్రం మరచిపోయి, భారతీయకళను నిర్మలహృదయంతో అభివందిస్తున్న వాళ్ల మాటలలోని పూజ్యభావానికి సంభ్రమించిపోయాడు. మేరీవంక తదేకదీక్షతో చూస్తున్నాడు. అప్పుడాతని మోములో ఆశ్చర్యానందవర్ణాలుతప్ప ద్వేషపు వర్ణం ఏమీ గోచరించడంలేదు. ఒకచిరునవ్వు ఒకచిన్న మేఘంలోని చిరుమెరుపులా తళతళలాడుతున్నది. ఆసమయంలో అతన్ని మేరీ చూసింది.

పెద్దపులో, తాచుపామో, పిశాచమో అని అనుకొని భయపడ్డ ఆబాలికకూడా అతనికి తెలియకుండానే అతన్ని ఆవరించిన ఆనందజ్యోత్స్నను చూచి ఆశ్చర్యహృదయురాలైనది. ఆక్షణంలో ఉన్నత రూపుడై, గంభీరరేఖాసమంచితుడైన అతనిరూపం అతన్ని ఆమెకు దివ్యుణ్నిగా కనబర్చింది. సుమనస్కురాలైన ఆ పాశ్చాత్యబాలకు విశ్వేశ్వరుని హృదయం ప్రస్ఫుటంగా ద్యోతకమయింది, ఆమె కప్పుడు గుడిలేదు. హిందూదేశం లేదు. ఇంగ్లండు లేదు. కాలపథాలలో ఒకరొకడ మధురిమలు అవహించిన యువతి ఆమె, దూరదూరాన ఆమహో నిజానస్థలంలో దివ్యుడయిన పురుషమూర్తి అతను.

ఆమెబుద్ధినుంచి జాతి తెరలు పటపటమని క్రిందకు జారి కూలి పడిపోయినవి.

౬

ఇంతకుముందే ఎంత కర్కశంగా తిట్టినాడు? ఎవ రితను. ఎందు కితనికి ఇంతకోపం? ఈదేశంలోని యువకులంతా తెల్ల వాళ్లనిచూస్తే, బ్రిటిషువారిని తలుచు కుంటే ఇంత విషపూరితమైన ద్వేషంతో చూస్తూ ఉంటారా? యూదులంటే హిట్లరుకోపంవంటిదా వీరి ద్వేషం?

ఆతనిది ఎంతచక్కని విగ్రహం! మేరీ హృదయ క్షేత్రానికి ఇంగ్లండులోని తనయువకస్నేహితు లందరూ జ్ఞాపకం వచ్చారు. మనకువల్లే వాళ్లూ ఆంగ్లశాక్సనుజాతికి చెందినవాళ్లు. జాతులన్నింటిలోకి ఆంగ్ల శాక్సను, జర్మనీ, నార్డు జాతులు ఉత్తమమైనవి. వాళ్లవాళ్లు దేవతలవాళ్లు. స్వచ్ఛమై, నిర్మలమై, సాయంకాల కుంకుమవర్ణాలు ప్రసరించిన ధవళహిమంలా ఉన్న దేహాలు దేవతలవికాక మరెవరివి?

సుగుణాలలో ఆంగ్లశాక్సనుజాతి ఉన్నతపథా లల్లో లేదా? ఆజాతివారు అబద్ధాలాడరు, అన్యాయాలు చేయరు. వారి గంభీరత, రాజనీతి, వీరత్వము, సర్వకళల యందూ ఆరితేరినతనము, సర్వదేశాలను అరికట్టి నిల బెట్టిన రాజనీతి.

భారతీయులలో ఉన్న అద్భుతత్వము ఏమిటి?...

అనేకయుగాలనుంచీ విచిత్రమైన గ్రంథాలు ఉద్భవింప జేశారు...వేదాంత విచారము, కవిత్వము... కాని వీరికవిత్వం షేక్స్పియరు కవిత్వంతోటి తుల తూగగలదా?......... విచిత్రాతి విచిత్రమైన శిల్పం ఉంది. ఆలయనిర్మాణం ఉన్నది. ఈ మాత్రమూ లేక పోతే హిందూదేశంయొక్క గొప్ప ఏమిటి?......

పైగా గ్రీకుశిల్పంతో, రోమకచిత్రలేఖనంతో డోరిక్కు, కొరిన్తియను, రోమక, గాథిక్కు నిర్మాణా లతో ఈయాలయాలు తులతూగగలవా?.........

పైగా వీళ్లు రంగులవాళ్లు. లాటిను జాతులైతే నేమి, స్లావికుజాతులైతేనేమి, యూదుజాతులవాళ్లయితే నేమి? మాఘియార్లయితే నేమిటి? రంగువాళ్లకన్న ఎక్కువకాదూ?......

రంగులవాళ్లు నీగ్రోలకన్న కొంచెం నయం...

“మేరీ! నీ ఆలోచనలకు ఒకపెన్నీ ఇస్తాను. ఏమిటే ఒకటే ఆలోచన? నీ నీలం కళ్లలో కొన్ని వందల ఆలోచనలు సుళ్లు తిరిగిపోయినవి. నువ్వు తేరిపార చూస్తూన్న ఆ కుఱ్ఱవాడు అప్పుడే వేరోచోటకు వెళ్లాడు” అని మార్గరెట్టు మేరీభుజంమీద చేయి వేసింది. మేరీ మొదటిమాటకే ఉలిక్కిపడింది. మార్గ రెట్టు మాటలు విన్నకొద్దీ ఆమెచెంపలలోకి అరుణ వర్ణాలు పోటెత్తుకు వచ్చినవి. ఆమె కళ్లలో సిగ్గులు అలమినవి.

మేరీ— “మార్జీ! నేను ఓ ప్రశ్న అడుగుతాను. నీ హృదయపూర్వకమయిన జవాబు ఇవ్వాలి.

మార్గరెట్టు — “ఓసీ పిచ్చిపిల్లా! నే నెప్పుడయి నా నా అభిప్రాయాలను దాచుకున్నట్టు నీ వెరుగు దువా?”

మేరీ— నీ బంధుత్వానికే నీ వంటే అందరూ భయపడుతారు. హైందవజాతికన్న ఆంగ్ల జాతి ఉత్తమమయినదా కాదా?”

మార్గ— “ఇదా నీ ప్రశ్న! ఇన్నేళ్లు నా సావాసం చేసి ఇప్పుడు ఆప్రశ్న అడుగుతున్నావు! వారెవా!—ఏవిధంగా గొప్ప దంటావు? సామ్రాజ్యం స్థాపించటంలోనా, అన్యాయాలు చెయ్యటంలోనా?”

మేరీ— “ఒక జాతికీ ఇంకొకజాతికీ అనేక విషయాలలో భేదా లుంటా యంటావా లేదా? ఆ భేదాలలో ఒకజాతి ఎక్కువా ఒకజాతి తక్కువా అవుతుందా లేదా?”

మార్గరెట్టు— “జాతికీ జాతికీ భేదా లుండవచ్చు. ఆ భేదాలలో హెచ్చులూ తగ్గులూ ఉండవచ్చు. అంతమాత్రంచేత ఒక జాతి గొప్పది, ఒకజాతి హీనమయి నది, ఒకజాతి ఎక్కువది, ఒకజాతి తక్కువది అనేది మాత్రం నేను ఈషణ్మాత్రమూ నమ్మను. అలా నమ్మే వాళ్లను చూస్తే నాకు సంపూర్ణమయిన విచారం అని మాత్రం చెప్పగలను.

వారంతా అక్కడినుంచి కదలి, పాడుపడిపోయిన ఆ రంగమంటపంలోకి వెళ్లారు. అక్కడ ఒక స్తంభంలో చెక్కిన దివ్య నటరాజమూర్తివిగ్రహాన్ని ఎదురుగుండా కూర్చుని ఆ బొమ్మయొక్క ప్రతిరూపాన్ని చిన్న చిత్రలేఖన పుస్తకంలో వ్రాసుకొంటూ ఆ యువకుడు వాళ్లకు మళ్లీ ప్రత్యక్షమయాడు. ఆ విగ్రహంయొక్క అద్భుత సౌందర్యానికి, ఆకుర్రవాని దీక్షకు ఏదో పరమప్రీతి వాళ్లకు గోచరించింది. ఆదృశ్యంలో ఉండే విచిత్రత, భావం ఎవరు తమకు చెప్పగలరు?

ఒక్క అయిదునిముషములు వాళ్లు నిశ్శబ్దంగా ఈ దృశ్యం చూస్తూ నిలబడ్డారు. పదిమందీ పదిస్థలాలకు, అప్పుడే కాలిజోళ్లు టక్కు టక్కున చప్పుడుచేసుకొంటూ, వివిధవిగ్రహాలు, ద్వారబంధము, వితానశిల్పము, నందిని, ఏనుగులను తిలకిస్తూ చెదరిపోయినారు.

అతి సన్నని గొంతుకలతో శిల్పాన్నిగురించి వ్యాఖ్యానాలు సాగించడం మొదలుపెట్టారు. మువ్వన విశ్వేశ్వరరావు లేచాడు. అతనికళ్లు విస్ఫులింగాలు రాలుస్తున్నవి.

"హిందువుల పవిత్రమైన దేవాలయాలన్నా కూడా మీకు ఈ మాత్రం గౌరవం లేదే? నంగనాచిల్లా కాలిజోళ్లు తొడుక్కొని అసభ్యపుటిశబ్దాలు మారుమోగిస్తూ, ఈ దేవాలయం అపవిత్రం చేశారే. ఈపవిత్ర శిలానృత్యమూర్తిసన్నిధానాన్ని శిల్పసత్యానికై అన్వేషిస్తున్న ఓమనుష్యునిపట్లయినా మీకు ఇంత దయన్నా లేదే. మీ ఆ యొత్తుమడమలకింద ఎంతకాలం మా భారతీయహృదయాలు చిమ్మటగొట్టాలలా రక్తాలు చిమ్ముతూ ఉండగా నలిపి నలిపి తొక్కగలరు?"

—అని నుప్పిడి చూపిస్తూ "మీ ఆఖరుదినాలు వచ్చాయి. ఏపూంకీవాదాలవాళ్లయినా ఇంగ్లీషువాళ్లకు మెలిమెలుగుల్లు, హిట్లరు, ముస్సోలినీ — వాళ్ల కడుపులు చల్లగా! ఆంగ్ల జాతి ఈశతాబ్దాలపాపపుమంటల్లో పడి భగ్నమయి పోయే — — —"

మార్గరెట్టు — చిరునవ్వుతో— "ఏమయ్యా! క్షమించు. ఇది పాడుదేవాలయంకదా అని జోళ్లు తొడుక్కు వచ్చాం. పాడుదేవాలయం అయితేమాత్రం ఇది పవిత్రమయిన శిల్పదేవాలయం. జోళ్లు విడిచి రావలసిందే. ఈశిల్పానికి మేము కొత్తవాళ్లము అవడంచేత అర్థం చేసుకోవడానికని మాట్లాడుకున్నాము. మనస్ఫూర్తిగా మా అందరి తరఫున మిమ్మల్ని క్షమాపణ వేడుతున్నాను. మీబొమ్మ అయినదాకా, పైనే తిరిగి వస్తాము. ఈపట్టు లోపలికి వచ్చేటప్పుడు జోళ్లు తీసేవస్తాము" అని చిరునవ్వు నవ్వుతూ తన జట్టు యావన్మందితోనూ రండని సైగచేసి వాళ్లతో పైకి పోయింది.

ఖస్ బుస్సని బుసలు కొట్టుతూ మాట్లాడిన విశ్వేశ్వరరావు విభ్రాంతిపొంది, తనది జయమో అపజయమో నిర్ణయించుకోలేకపోయాడు. అందాలు పుణికి పుచ్చుకొన్న ఆ శ్వేతబాలిక చిరునవ్వు నవ్వుతూ తనవైపున వారచూపులు ప్రసరింపజేసి వెళ్లిపోయింది.

"ఎంత అందంగా ఉన్నది? శ్వేతజాతుల్లో అందమయిన వాళ్లుంటారా? దేహసౌష్టవంలో భారతనారీమణులు ప్రపంచంలోని తక్కిన స్త్రీలకన్న అందమయినవాళ్లు కారా? ఒకవేళ, బాహ్యసౌందర్యంలో కొందరు పాశ్చాత్యజాతుల స్త్రీలు హైందవనారీమణులతో సమానమైనా హెచ్చయినా అంతస్సౌందర్యంలో వాళ్లు ఎట్లా పోలగలరు? కాని ఈ అమ్మాయి ఏదో శిల్పసౌందర్యాలను సేకరించుకొన్నది."

అయినా వీళ్లసంగతి? విశ్వేశ్వరరావు గబగబ రెండంగల్లో వేరే పక్కన వున్న దేవాలయంలోని శిల్పం చూస్తూఉన్న ఆయువతీమండలి దగ్గరకు పోయి వాళ్లకు జోహారించి,

"నన్ను మీరంతా క్షమించాలి. ఈశిల్పాన్ని గురించి నేనంతా మీకు చెప్పడానికి మీరు అనుజ్ఞ యిస్తే మీరు నన్ను క్షమించినట్లు ఎంచుకొంటాను" అని పలికినాడు.

మార్గరెట్టు నవ్వుతూ "అలాగే రండి, కొంచెం చెప్పండి. మాకృతజ్ఞత అందుకోండి" అన్నది.

ప్రతిశిల్పం దగ్గరికీ వాళ్లను తీసుకువెళ్లి దానిని గూర్చి విశ్వేశ్వరరావు చక్కనిభాషలో గంభీరమయిన భావంతో విపులంగా చెప్పాడు. కొద్దివాక్యాలలో భారతీయ శిల్పలక్షణాలనుగురించి వాళ్లకు బోధప

చాడు. భారతీయశిల్పానికీ పాశ్చాత్యశిల్పానికీ ఉండే భేదాలు అనర్గళంగా ఉపన్యసించాడు.

"ఇక్కడినుంచి మీరు ఎక్కడికి వెడతారు" అని ప్రశ్నించాడు అతడు.

మేరీ— "అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటాలు మాత్రమే చూశాము. వార్ధా వెళ్లి గాంధీమహాత్ముని ఆశ్రమంలో పదిహేనురోజు లున్నాము. అక్కడి నుంచి తిన్నగా అనుమకొండ, ఒరంగల్లు చూసి ఇక్కడికి వచ్చాము. హిందూదేశము యావత్తూ చూడాలని సంకల్పం ఉంది."

విశ్వే— "అట్లయితే ఇక్కడినుండి అమరావతి, నాగార్జునికొండ చూసుకొని అక్కడనుంచి హంపి, బిజాపూరు, బాదామి, హర్పనహళ్లి యాత్రలు సేవించుకొని, పెనుగొండ, తాడిపత్రి, లేపాక్షి వెళ్లి మైసూరికి వెళ్లండి. మైసూరులో హళేబీడు, బేలూరు, శ్రవణ బెళగొళా యాత్రలు సేవించిన వెనుక అరవదేశం, మలయాళదేశయాత్రలు సేవించవచ్చు. నేనున్నూ లేపాక్షి వరకు మీతో వస్తాను — మీకు నారావడం ఆక్షేపణ లేకపోతే."

౭

వాళ్లతో మైసూరుదాకా యాత్రలు సాగించాడు విశ్వేశ్వరరావు. ఎక్కడో అణగిఉన్న అతనిలోని మర్యాదంతా ఉబికివచ్చింది. మార్గరెట్టుకూ విశ్వేశ్వరరావుకూ అహింస, జాతిభేదాలు, కళలు, సాహిత్యమూ మొదలయిన విషయాల్ని గురించి వాదాలు జరుగుతూ ఉండేవి. విశ్వేశ్వరరావు కోపం విపరీతరూపం తాల్చేది. అతడు మేరీ అందం చూచి భరించలేకపోయేవాడు.

అతనిలోని క్రూరత్వము లోలోన గాలివాన రేగింది. మింగబోయే కప్పను పాము వెంబడించినట్లు వాళ్లతోకూడా అతడు ప్రయాణాలు తీర్చినాడు.

వాదనలోని కరకుతనమూ విజ్ఞానమూ అతనిలో వెలుగు, నీడలు అయ్యాయి.

ప్రతివాదవిషయంలోనూ అతనిక్రోధం ఉడుకెత్తుతుని, ఉబుకెత్తుకుని పరవళ్లుతొక్కుతూ ప్రవహించింది. అది 'గైయుసరు'లా చిమ్మిచిమ్మి ఎగిరేటట. ఆకసం అంటేటట్లు గబుక్కున వస్తూ ఉండేది.

అతనికున్న అపారజ్ఞానం ఆ పాశ్చాత్యస్త్రీలను ఆశ్చర్యంలో ముంచింది. అతని ద్వేషానికి వాళ్లలో కొందరు ఒణికిపోయారు. ప్రతిభారతీయ యువకుడు ఇల్లాగే ఆంగ్లేయులను ద్వేషిస్తున్నాడా?

నెల్లీ మార్గరెట్టుతో అనేకసార్లు "ఎందుకు ఈ రాక్షసుణ్ణి కూడా తిప్పుకోవడం" అని కోపంతో వాదించింది. మేరీతప్ప తక్కినవాళ్లు ఆమెవాదాన్ని బలపరచారు కాని మార్గరెట్టు చిరునవ్వు నవ్వుతూ,

"నా ప్రియబాలికల్లారా! నాకు పాలంపేటపల్లో ఒకదీక్ష అంతరాత్మలోంచి ఉద్భవించింది. రెండురాత్రిళ్లు ప్రార్థనతో ఆభావాన్ని సత్యబద్ధమైందా, కాదా అని భగవంతుని ప్రశ్నించుకున్నాను. ఈ విషయం యావత్తు గాంధీమహాత్మునకు వ్రాసుకున్నాను. ఆయన జవాబు-న న్నాశీర్వదిస్తూ- రానిచ్చింది. ఈ బాలకుడు మనల్ని చంపుతాడా? చంపనీ. ఈలాంటివాళ్ల ద్వేషానికి మనం ఆహుతి అవడం ఎంత విచిత్రమైన, పవిత్రమైన దానము. ప్రేమతో బలిదానం - ఈ ఉద్యమాన్ని అరికట్టదా?"

అని. ఆరక్తమైన చూపులతో దివ్యహాస నృత్యాలైన పెదవులతో పలికింది.

వెంటనే మేరీ ఆమెను గాఢంగా కౌగిలించుకుంది.

"ప్రియా! నాకున్న అనుమానాలు పటాపంచలు చేశావు. ఈరాత్రి ఒకరహస్యం నీతో చెప్పి నా హృదయతాపం ఉపశమనం చేసుకుంటాను" అని అన్నది.

తక్కినవాళ్లంతా "ఏమిటి మేరీ! గాంధిగారు రహస్యాలు ఉండకూడ దన్నారుకాదా?" అని ఒత్తిడి చేశారు.

చిరునవ్వు నవ్వుతూ మేరీ "తొందరపడకూడదు. స్పష్టత పొందని ఆలోచనను అప్పుడే వ్యక్తంచేయలేను. అది సరిగాదూ? మార్గీ!" అని మార్గరెట్టు వైపు చూసింది నవ్వుతూ.

"అలాగే మేరీ."

అందరూ నవ్వుతూ బేలూరు ప్రయాణం అయ్యారు.

విశ్వేశ్వరరావు వాళ్లదగ్గర శెలవు తీసుకుని గబుక్కున మదరాసు తిరిగి వచ్చాడు.

౫

దారిపొడుగునా మేరీకన్యమూర్తి అతని ఎదట మేఘశకలంలా గోచరిస్తున్నది. పువ్వుని కమ్మిన నల్లని తుమ్మెదలా అతనిద్వేషం అతనిహృదయము చుట్టూ జుమ్మని తిరగడం ప్రారంభించింది. అతని హృదయపుష్పమధ్యాన అల్లరిచేయకుండా కేసెలు తాగుతూ, దాగుకుంటూ ఏదో ఒకభావం, ఏదో ఒక కోర్కె, ఏదో ఒక అనుభూతి...

మేరీమాటలు, మేరీపాటలు, మేరీనడక, మేరీ వాదన, మేరీ శిల్పహృదయం...... ఆమె భారతీయ శిల్పదేవాలయంయొక్క ప్రథమప్రాంగణంలోకి ప్రవేశించింది.......

"ఎందుకు ఈ దేవాలయానికే ఆమె రావాలి? ఆమె ఆ హీన పాశ్చాత్యశిల్ప శిథిలత్వంలోనే పొర్లాడనీ. ఎవ రామె భారతీయ మహాశిల్పసత్యాన్ని గోచరింపచేసుకోనే అధికారం సంపాదించడానికి......

"పోనీ ఈ నీచస్త్రీలను తనదేశం వదలి. వాళ్లతో పాటు తన దేశసౌభాగ్యం తనకే ఉండనీ. దేశంలోని సువర్ణరాసులు, దేశంయొక్క మహాసౌభాగ్యమైన అభిమానమూ, మానమూ, స్వేచ్ఛా తస్కరించుకు పోయింది పోక, ఈ కజిన్నులు, ఈ హానల్సులు, ఈ క్రామరెస్టులూ, ఈ కూర్డ్రీలు, ఈ గిల్లులు, ఈ మేరీలు మాశిల్పం కూడా తస్కరించుకుపోవాలి......"

అతని కళ్లు విషవాయువులు వీచే నాళికములయ్యాయి. అతని పెదవులు పళ్లల్లో ఎలకబోనులా బిగుసుకుపోయాయి... ...

ముష్టి ఘట్టి అతడు బల్లను గట్టిగా గుద్దినాడు...

వాళ్లతో ఉన్నప్పుడు తన కంత పిరికితనమెందుకో? వాళ్లను బాధపెట్టలేకపోయినాడు. వాళ్లకు అంత సేవచేయడమేమిటి తాను! వాళ్ల సేవకుడిలా టికెట్లు కొన్నాడు, బళ్లు మాట్లాడాడు. కూడా వెళ్లి ప్రతి శిల్పంయొక్క అర్థమూ, అందమూ, ఆనందమూ వర్ణించి చెప్పాడే! ఎంత చచ్చుహృదయం అయిపోయింది?

మేరీకన్య తన్ను మంత్రంవేసినట్లు తిప్పిందే? తియ్యటి గొంతుకతో కబుర్లు చెబుతోంటే ఏదో మమతతో, కాంక్షతో, గాఢ సంతోషంతో విన్నాడు కబుర్లు....

ఇప్పటికీ ఆరోజున జరిగిన ఒకవిషయం ఒళ్లు జలజల మనిపిస్తుందే. ఆరోజున తాను లేపాక్షి చిత్రలేఖనం శిల్పం అతిమాధుర్యంగా వర్ణిస్తూ, వాళ్లందరికీ హృదయాలు ఉప్పొంగచేసినమాట నిజం. ఆరాత్రి వెన్నెట్లో లేపాక్షి బసవయ్యను తిలకిస్తూంటే తనకళ్లు చెమరించిన మాటా నిజం. ఆ ఉన్నత, ఉత్తమశిల్పంపక్క తాను ఒక చిన్న శిల్పంలా అయిపోయిన మాటా నిజం. కాని... తనవెనకనే... వచ్చి... ఆ మేరీకన్య... తన రెండు బుజాలమీదా చేతులు వేసి... "వెన్నెట్లో శివునిలా నిలబడ్డావు పార్వతీకోసమా విశ్వేశ్వర్?" అని ప్రశ్న వేస్తూ, వాలిపున... ఆమెహృదయం తాళగతులు లయింపగా అని... ఒకనిముషం... ఒకేనిముషం... పక్కకు వచ్చి నిలుచున్నది... ...తనకు గలిగిన పులకరాలు— ఒళ్లు వేడి, హృదయంలో మత్తు... ఏమో... ఏమో... అతి అతిభావాలు! వీళ్లు సైరను (తియ్యనిపాలతో మోహం పెట్టి తమమంత్రంలో వశచేసికొని రక్తం పీల్చే గ్రీకు ఢాకినీ) వనితలా?...

ఆ మేరీ?... ఏమి ఆమెఅందం... ఎందుకు వాళ్లని తిట్టుకోడం... "ఓయి పెట్టిమృగపు విశ్వేశ్వరరావూ! నువ్వు వట్టి వాజమ్మవు... నీఅగ్ని చల్లారింది, నీ హృదయం చచ్చింది. నీ అభిమానం అధోగతి పాలయింది. నీదేశభక్తి కుళ్లిపోయింది. లే... ఏడు. నెత్తి నోరూ బాదుకొని, గాజులు తొడిగించుకొని, వంట చెయ్యి, జజ్జమ్మా, చచ్చుమ్మా!"

౬

"మేరీ! ఆచిన్నఫొటో బాగా తీశావే. ఏమిటే అతిగా పరికిస్తున్నావు, ఆవిశ్వేశ్వరరావు బొమ్మను?" అని నెల్లీ మేరీని పలకరించింది.

వాళ్లంతా మధుర దేవాలయం చూస్తున్నారు. తిరుమల నాయకుని మహాభవనం చూశారు, మంటపం చూశారు. తెప్పాకులం చూశారు. 'మేల'గోపురాలు పరిశీలించారు.

మీనాక్షి సుడిరెదుట ఉండే లోనిమండపం లోని విగ్రహాలని సందర్శిస్తున్నారు. తిరిగి తిరిగి నృత్యమూర్తి అయిన శారదాదేవివిగ్రహంకడకు వచ్చారు. ఆ విగ్రహంయొక్క చిత్రం ఓటీ-విశ్వేశ్వరరావు-చక్కని రేఖాచిత్రం తన స్కెచ్చిపుస్తకంలో వ్రాసుకొని ఉన్నాడు. ఆ రేఖాచిత్రం చాలా అందంగా చిత్రించినాడు. "ఆచిత్రం, అందుకో పాటు ఆతనూ ఈవిగ్రహం చూస్తే జ్ఞాపకంవస్తే ఆతనికి తెలియకుండా నేను తీసిన ఆతని ఛాయారూపం చూస్తున్నాను కెల్లీ!" అన్నది మేరీ.

కెల్లీ పకపక నవ్వింది.

"ఓసి నంగనాచీ! నాదగ్గర దాపరికం వద్దు. థియాసఫిస్టులలా భారతీయులంటే ప్రేమించడం నేర్చుకున్నావేమిటి?" అన్నది.

"నీమాటలు విపరీతంగా ఉన్నాయి కెల్లీ!"

"నిన్ను నేను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. ఒకటిలే, నువ్వు ఇదివరకే ఎందరి యువకులతోనో-జాగ్రత్తగామాత్రం - సరదాగా గడిపావు. ఒక ల్లిద్దర్ని ప్రేమించా ననుకున్నావు. అల్లాగేనా ఈ విశ్వేశ్వరరావు అంటే పిచ్చి?"

"కెల్లీ! నీకు ఈ జన్మలో వేళాకోళంగుణం పోయేది ఎప్పుడే?"

తిరిగి వాళ్లంతా రహదారిబంగాళాకు చేరుకున్నారు.

కెల్లీ మళ్లా మేరీని ఒంటరిగా కలుసుకొని "మేరీ! నువ్వు మార్జితో ఆనాడు ఏమి మాట్లాడింది నాకు తెలియచేయకపోయినా నేను ఊహించుకోలేక పోలేదు. మార్జీ జాతికీ జాతికీ ఎంత భేదా లేదని వాదించినా, ఒకపక్షంలోంచి ఆవాదన ఒప్పుకున్నా స్త్రీ పురుషసంబంధం విషయంలో నువ్వు కోటి వాదనలు తీసికొనిరా నన్నుమాత్రం మీరు ఒప్పించలేరు" అని తీవ్రముగా వాదించింది.

"ఇప్పుడు నీ కలహం అవసరమే వచ్చింది కెల్లీ! నువ్వు కాదూ కూడదు వాదిస్తాను అంటావా? అయితే నీవాదనే నీకు అప్పజెప్పుతాను. సాధారణ హీనవిషయాలలో జాతిభేదాలకు నాకు అభ్యంతరం లేదుగాని, ఉత్తమమైన కళలవిషయంలో, స్త్రీ పురుషసంబంధం విషయంలో, భగవంతుని విషయంలో జాతిమత భేదాలు ఎంతమాత్రమూ ఉండకూడదని నాఘట్టివాదన. అంతే అంటుంది మార్జీ. అది కాకుండా నేను ఒకరహస్యం మార్జీతో మాట్లాడాను అన్నావు. అది ఏమిటో విను. విశ్వేశ్వరరావు పట్టిగా దేశభక్తి అని అనుకొని అతి ద్వేషహృదయం కలవాడై ఉన్నాడు. మహాత్ముని ఆదేశ ప్రకారం అయినవపుడికి మనం అహింసామహావ్రతదీక్ష ఇవ్వాలి అని నేను మార్జీతో చెప్పితే, ఆమె ఎంతో సంతోషంతో 'షెహబాస్' అన్నది. అది ఆనాటిసంగతి —నీకు తృప్తి అయిందా?"

"ఏమి చేశారు మీరు? అతడు మరికాస్త ద్వేషంతో మండిపోయాడు. మీరు వాడిదాకిని వాణ్ణి పోనీక గాంధీ అంతవాడు చేయలేని పిచ్చిపిచ్చి పనులు చేయబోయి సీకలమీదకు తెచ్చుకుంటారు."

౧౦

మధురనుంచి యాత్రలు సాగించుకుంటూ వారు చెన్నపట్టణం చేరుకున్నారు. అక్కడ మైలాపూరు కపాలేశ్వరాలయాన్ని చూచారు. ఆ దేవాలయంలో విశ్వేశ్వరరావు పిల్లకు ఎదురొళ్లు ఇచ్చాడు. కెల్లీ మేరీని చూచి పరిహాసంగా చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు విశ్వేశ్వరరావు చూచాడు. దాని భావమూ గ్రహించాడు. మనస్సులో ఉగ్రుడై పోయాడు.

విశ్వేశ్వరరావును చూడగానే మేరీకుండె కొట్టుకుంది. మార్గరెట్టు ఆనందంతో విశ్వేశ్వరరావును బహూకరించి తనతో రమ్మని ఆహ్వానించింది.

ఆసక్తి చూస్తున్నంతసేపూ విశ్వేశ్వరరావుకూ మార్గరెట్టుకూ భారతీయజీవితాన్నిగురించి వాదోపవాదాలు పెరిగాయి.

భారతీయులు అఖండప్రయత్నంచేసి శుద్ధజీవితం అలవాటు చేసుకోకపోతే ఈఉత్కృష్టజాతి అంతా నశించిపోతుంది అని మార్గరెట్టు.

ఈ హీనస్థితికి కారణం ఆంగ్లేయులే అనిన్నీ, దేశాన్ని చీల్చి పిప్పిచేస్తే ఈలాంటి జీవితం తమకు తప్పిందనీ ఆతని వాదన.

అక్కణ్ణుంచి అందరూ కలిసి 'కానమెరా' హోటలుకు వెళ్లారు. అందరూ తమ తమ గదులకు దుస్తులు మార్చుకునేందుకు పోయారు. హోటలుహాలులో మార్గరెట్టూ విశ్వేశ్వరరావూ వాదించుకుంటూ కూచున్నారు.

"మీరు హిందూదేశశ్రేయస్సే నిజంగా కోరేవారయితే, అందుకనే లండనులో భారతీయ సంపూర్ణ స్వరాజ్యసమితి ప్రారంభించి పనిచేస్తున్నవారయితే మీవాళ్లంతా సంపూర్ణస్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లేందుకు ఎందుకు ప్రయత్నించేయరు?"

"ఏమండీ! అందరూ ఒకే ఉద్దేశం కలవాళ్లవుతారా? మా దేశమొత్తంమీద ఏవేయిమందో ఈ క్షణమే భరతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనేవాళ్లు ఉన్నారు. పదివేలమంది ఏకొద్ది సంవత్సరాలల్లోనో ఇవ్వవచ్చుననేవాళ్లు ఉన్నారు. అసలు ఎప్పటికీ ఇవ్వరాదు అనేవాళ్లు కోట్లు."

"అందుకనే దెబ్బకు దేవేంద్రలోకం అన్నట్లు భరతదేశపు ముష్టియొక్క బరువూ, బలమూ చూపిస్తేనే మీవాళ్లు లొంగుతారని మానమ్మకం."

"అలాటివాళ్లు ఏలక్షో రెండులక్షలో గా ఉండేది?"

"తక్కినవాళ్లంతా భరతదేశం బ్రతికి ఉన్నన్నాళ్లూ ఆంగ్లేయపాదధూళి శిరస్సున ధరించే బ్రతుకే నమ్మేవాళ్లనా మీఉద్దేశం?"

"అది కాదయ్యా, అహింసామార్గంవల్ల సంపూర్ణ స్వరాజ్యం స్థాపించాలి అని నమ్మేవాళ్లు."

"అయితే ఏది వారిపనులు, వారి ఫలసిద్ధి?"

"నమ్మకానికీ, నమ్మకానికి తగినట్లు జీవితాన్ని అనుసరించేటట్లు చేయగలశక్తి ఉండడానికీ ఎంతో దూరం ఉంది. ఆదూరం క్షణక్షణమూ మహాత్ముని నాయకత్వంక్రింద తగ్గించుకుంటున్నారు భారతీయ ప్రజాలోకము."

"ఓహోహో. ఇది మాకు ఒక ఆంగ్లస్త్రీ బోధించడం!"

"హేళన ఎందుకు వీరపురుషుడుగారూ? నాజీవిత సర్వస్వముతో నమ్మినవిషయం అది. అది నాబోధ కాదు. మహాత్ముణ్ణి నేను అర్థంచేసుకున్న రీతి అది.

ఆమె మాటలలోని నిర్మలత్వమూ, ఆమెకళ్లల్లోని నిశ్చలత్వమూ, ఆమె దరహాసంలోని కరుణత్వమూ ఆతనికి సిగ్గు పుట్టించాయి.

"క్షమించండి మార్గరెట్టుగారూ! నాలోని ఆవేశంచేత అన్నమాటలు. మీ నిష్కల్మషహృదయము నాకు సంపూర్ణంగా ద్యోతకము అయ్యింది. అహింసవల్ల లోకంలో శాంతి అవతరిస్తుందని అనుకోడం శుద్ధవెఱ్ఱి అని నా నమ్మకం. అహింసాతత్త్వార్థమూ, దాని తర్కమూ జ్ఞానమూ నా కేమాత్రమూ హృదయానికి తట్టలేదు. ద్వంద్వాతీతుడైన భగవంతునికి ద్వంద్వాలు రెండూ సమంకదా! అల్లాంటప్పుడు భగవంతుడు అహింసాస్వరూపుడు అని వాదించడం ఏమిటి? అహింసే మోక్షార్థకం ఏమిటి?"

"అది కాదయ్యా, భగవంతుడు ద్వంద్వాతీతుడనేది శ్రీ మహాత్మజీకూడా చెప్పేది. స్థితప్రజ్ఞుడైనవాడూ భగవంతునిలో లీనమైనవాడూ వాడు సిద్ధుడు. సాధకుడు ప్రపంచంలో ఉన్నాడు. ప్రపంచంలో ఉన్నవాళ్లకు ఆ ద్వంద్వాలలో ఒకటి మంచిది ఒకటి చెడుగు. వెలుగు మంచిది, చీకటి బాధ. ఆ వెలుగుయొక్క తత్త్వం ప్రేమ విశ్వేశ్వరరావుగారూ..."

"ఈ సిద్ధాంతాలన్నీ విన్నాను, నాకు నవ్వు వస్తాయి. అందులో మా వేదాంతాలలో పుట్టి పెరగని మీరు ఎల్లా తెలుసుకోగలరు?"

"ఇదివరదాకా పంటకు వేనిభూములు ఎరువు వేసి దున్నితే ఏలాంటి పంట వేసినా అద్భుతంగా పండవటయ్యా?"

అక్కణ్ణుంచి విశ్వేశ్వరరావు విడిదికి చక్కాపోయాడు.

౧౧

వాళ్లతో ఆంధ్రదేశం అంతా తిరిగి, తనతోబాటు కూడా వాళ్లను తీసుకుని వెళ్లినాడు విశ్వేశ్వరుడు.

క్షేమము అనుకుంటూనే అతడు వాళ్లకు చూపించిన గౌరవమూ, వాళ్ల కిచ్చిన ఆతిథ్యమూ వర్ణనాతీతమైనాయి. విశ్వేశ్వరరావుతల్లితో వాళ్లు ఎంతో ప్రేమతో వ్యవహరించారు. విశ్వేశ్వరరావుతల్లి వాళ్లను హృదయాని కద్దుకుంది.

ఆమె సత్సంగములో చేరడంవల్ల తన పూర్వాచారపరాయణత్వాన్ని దయాల్ బాగు పవిత్రధామములలో శ్రీ ప్రేమునకు సమర్పించిన మనిషి. సర్వదా భజనా, ధ్యానములలో భగవంతుని అర్చించే భక్తురాలు.

ఆమెకు ఈ ఆంగ్లస్త్రీలు తన ఇంటికి రావడం పరమసంతోషమైంది. ఆమెను ఆ ఆంగ్లవనితాసమూహము హృదయపూర ప్రేమించింది.

మేరీ టెంపిల్ ఆమెతో విశ్వేశ్వరరావును దగ్గర ఉంచుకుని అతను భాషాంతరీకరణం చేస్తూండగా విశ్వేశ్వరుని బాల్యచరిత్ర అంతా అడిగి తెలుసుకుంది. విశ్వేశ్వరుని కైశోరకష్టాలు, అతని సహజప్రేమహృదయమూ, అతడు ఎల్లప్పుడూ ఏదో రూపంగా హీనజనులకు చేసే సేవా ఇంకా ఇంకా ఎన్నో తెలుసుకుంది. తాను భారతీయజీవనంలోని అత్యుత్కృష్టాలను దర్శించిన చిత్రాలు ఆమెకు చూపించింది. విశ్వేశ్వరరావుకు తెలియకుండా అతని చిన్నవాటి ఫోటోలు రెండు ఆమె వద్దకి తీసుకుని దాచుకుంది. అతని ప్రతిరూపాలు అతని వివిధభంగిమలతో, అతని వివిధదశలలో చిత్రించుకున్నది. ఆబొమ్మలు ఆమె ఎవరికీ చూపించలేదు.

* * * *

ఆంధ్రదేశమంతా తిరిగి వాళ్లు భువనేశ్వరము చేరుకున్నారు. భువనేశ్వరములో విశ్వేశ్వరుడు తాను చిత్రించిన "జగన్నాథరథము" అనుచిత్రమును ఆంగ్లస్త్రీ మండలానికి చూపించాడు.

వాళ్లు ఆ బొమ్మను చూచి భయపడిపోయారు. వాళ్లు అతనిహృదయంలో ఎంత క్షేమము, ఎంత క్రోధము, ఎంత హింస కూడుకట్టుకొని చేరుకుపోయిందో చూసి గజగజలాడారు. మేరీ టెంపిల్ కళ్లవెంట బొట బొట పడపోయి ముక్కలు రాలినవి. ఆమె అన్నది—

"మనుష్యుల్నింత ద్వేషిస్తున్నావా విశ్వేశ్వర్!" అని.......

ఆ ముక్కలకు విశ్వేశ్వరుడు ఎంతో సిగ్గుపడిపోయాడు. ఆ సిగ్గుతో దహించుకుపోయాడు. కుంగిపోయాడు. ఆమె కంటపడుల వోయి ఆ బిందువులు అమృతబిందువులై అతని హృదయాన్ని దహించివేసినవి. అమృతమే కాలకూటమైనది. వాళ్ల ఎదుట నిట్టనిలువున కుంగిపోయిన దేహంతో కాళరాత్రులు కమ్మిన కళ్లతో భయంకరరూపి వణుకుంటూ విశ్వేశ్వరుడు దహించుకుపోయాడు......

ఎవ్వరూ మాట్లాడలేదు. గబగబ మేరీ గదిలోనికి పారిపోయింది. చురచుర విశ్వేశ్వరరావును అతికోపంతో చూసి కెర్లీ ఆ బాలిక జవకాశే వెళ్లబోతే మార్గరెట్టు ఆమెను కనుసన్నతో ఆపుచేసింది.

చేతులు కట్టుకొని చూస్తూ విశ్వేశ్వరుడు తన బసకు వెళ్లిపోయాడు.......

అతనిలో గాలి దుమారాలు రేగాయి. ఆ దుమారాలను అణిచివేస్తూ ఆమె కంటి బిందువులు గాలివాన అయ్యింది...

ఆ సాయంత్రందాకా విశ్వేశ్వరుడు తిండి తిన కుండా తన బసలోనే పండుకొని ఉన్నాడు.

అతనిచుట్టూ చీకట్లు అలముకొన్నాయి. అతనిలో చీకట్లు గడ్డకట్టుకుపోయినవి. అతని రక్తప్రవాహము పూర్తిగా ఆగిపోయినట్లయింది.

....

ఆ సాయంకాలపు సూర్యఛాయలో మెల్లగా అడుగులువేస్తూ ఒంటరిగా విశ్వేశ్వరరావు తలవాల్చుకొని పరశురామేశ్వరదేవాలయానికి పోయి వెలుపలవున్న శిలాపాటి(శివరూపం) గా కనబడ్డాడు. ఆ శిలని చూస్తూ చూచీ చూడని చూపులతో చలించకుండా ఉన్నాడు.

....

ఇంతలో చీకటి ఎక్కువౌతూ ఉన్న ఆకసంలో ఆతని బుజంమీద ఒక చల్లనిహస్తం.

ఆచేయి ఒకపావురము ఒకబురుజుమీద వాలినట్లు వాలింది.

ఆతని ఒళ్లు మరుపులలో తూలింది.

ఆతడు జలదరించిపోయాడు.

ఆతని హృదయం కరడుతనంలోంచి కరిగి పోయింది.

ఆతడు నెమ్మదిగా వెనక్కు తిరిగాడు.

ఆతనివెనక మెరిసిపోయే నక్షత్రాలాంటి కళ్లతో తన్ను కలలచూపులచూస్తూ మేరీ టెంపిల్ నుంచునిఉంది.

ఆమె చెయ్యి ఇంకా ఆతని బుజంమీద ఉంది.

....

ఏదో మత్తు విడినవానిలా చటుక్కున విశ్వేశ్వరుడు ఆమెవైపుకు మరలి ఆమె రెండు చేతులూ తన చేతులతో అదిమి పట్టుకొని

"మేరీ! మేరీ! నువ్వు నా జీవితంలోకి ఎందుకు ప్రత్యక్షమయ్యావు. నా ప్రేమ విశ్వాలను పొర్లి విశ్వాతీతమైన శూన్యాలు ఆక్రమిస్తోంది.............నన్ను నువ్వు ప్రేమించగలవా ?"

అని ఆమె ఎదుట తలవంచినాడు అతడు.

ఆమె కరిగిపోయింది.

"ఎందుకు ప్రేమించలేను ?"

"నిజంగా ! నిజంగా !"

ఆమెను అతివేగంతో తనకౌగిలిలోకి లాక్కున్నాడు............

ఆమె ఆతనికౌగిలింతలో వివశఅయిపోయినది.

ఆమె ఆతని మోమును అగాధ ప్రేమతో చూచినది.

అతడామె పెదవులను దివ్యమైన, నిర్మలమైన, దీర్ఘమైన ముద్దుకొన్నాడు......

ఆమె కనకాంబరకాంతిరూపమైన, గంధరాజపుష్పపరిమళాత్మకమైన, వేదనాతీతమైన, మహాపవిత్రమైన ముద్దు నాతనికి వరమిచ్చినది...

"ఆ నృత్యమూర్తి కడ క్రోధమూర్తివైన నిన్ను చూసినప్పుడే నా మనస్సు, నా ప్రాణము నీకు అంజలి ఘటించాయి, భారతీయుడా!"

"ఇది నిజమా మేరీ బాలికా! నా దివ్యరాజ్ఞీ. ఆంగ్లేయయువతి ఈదీనుణ్ని ప్రేమించడం అసంభవం కాదూ! నేను ఇది మహాస్వప్నం అనుకుంటున్నాను."

"నారాజా! నాప్రాచ్యపతీ! నీహేళన నిన్నింక వదలలేదూ?"

"హేళనకాదు మేరీప్రియతమా! హేళనా! ఈ పరపురామేశ్వరుణ్ణి, ఈ ప్రథమరాత్రికుణాన్ని, ఈ భూమిగడ్డను అడుగు...అడుగూ!"

....

ఆ రాత్రి బంగాళాలో మార్గరెట్టు వరండాలో పడకకుర్చీమీద కూర్చుని ఔరంగజేబు జీవితచరిత్ర చదువుకుంటున్నప్పుడు మేరీ నడుముచుట్టూ విశ్వేశ్వరుడు చేతిని చుట్టినీ, విశ్వేశ్వరునిభుజంమీద మేరీ తల వాల్చినీ మార్గరెట్టుఎదుటకు వచ్చి ఆమె పాదాలకడ ఆ ప్రేమికులు మోకరిల్లారు.

మార్గరెట్టు చటుక్కున మంచోని దివ్యానందము మోమున నృత్యంచేస్తుండ, కళ్లు పవిత్రకాంతులు ప్రసరిస్తూఉండగా "నాహృదయం కోర్కె ఈడేరింది నా బిడ్డలారా!" అంటూ వాళ్లిద్దరి తలమీదా రెండుచేతులూ వేసింది..................................

౧౨

ఈవార్త విని నెల్లీ భూమిమీద ఘట్ఘట్టని చప్పడవుతూవుండగా, కోళ్లపాదాలతో గబగబ ధడధడ భూమిమీద బాదింది.

"నేను ఒప్పుకోను. ఈ వ్యవహారాన్ని పళ్లతో, గోళ్లతో పీకి చీల్చి చెండాడుతాను. ఈ సంయోగం కానివ్వను. మేరీగార్డియను కుత్తరం వ్రాస్తాను. కోర్టుల్లో దెబ్బలాడుతాను. ఆంగ్లప్రభుత్వానికి విజ్ఞప్తిపెట్టి అడ్డగిస్తాను. సిగ్గు! సిగ్గు!"

అని అల్లరిచేసింది. ఘొల్లున ఏడ్చింది, పక్కమీదపడి దొర్లింది.

మార్గరెట్టు ఆమెను చూచి, ఆమెపక్కనే మంచంమీద కూచుని, ఆమెను తనకౌగిలిలోకి తీసుకొని గట్టిగా హృదయాని కదుముకొని, ప్రేమార్ద్రకంఠంతో "నెల్లీ! నీకు హిస్టీరియా వస్తోంది. ఇంత నీవు అల్లరి చేయడానికి బదులు ఆనందంతో ఉప్పొంగి పోవలసింది —ఇటువంటి సంవిధానం సంభవించినందుకు. వందల కొద్ది సంవత్సరాలు భారతజాతీయులను, ఐశ్వర్యాన్ని పీల్చిపిప్పిచేసిన మనం ఇలాంటి నివేదనలలోకాని నిష్కల్మష చరిత్రలను కానేము" అని అన్నది.

నెల్లీ క్రోధంతో లేచి నుంచుని "నీ వెర్రి మొర్రిమాటలు నిక చాలించు. నీ శుద్ధ తెలివితక్కువతనంచేత ఈలాంటి దుష్టసందర్భం దాపురించింది. నీవు బట్టిమెదడులేని మూర్ఖురాలవు. ఈ మేరీ అనాయకురాలు, బడాయికోరున్నూ. సర్వప్రపంచానికి నాయకమైన ఆంగ్లజాతికి తీరనికళంకము అవమానము తెచ్చిపెడుతున్నారు. — మేరీ! నీ అందమైన, సౌష్టవపూర్ణమయిన, దివ్యమయిన నీదేహాన్ని, నీ గౌరవాన్ని వాసనవేసే కుళ్లులో కూరుతావా? గాఢమైన పశుత్వం ఉంటేమా నీలో ఎక్కడో, నీలాంటి పశువులయిన మనజాతికి చెందిన అమెరికాస్త్రీలు కొందరు నల్లటి నీగ్రోవైధవలకు సమస్తార్పణలూ చేస్తారు...

అని ఆడుపెద్దపులిలా గాండ్రించిపోయినది.

ఆ మర్నాడు ఆజట్టును వదలిపెట్టి నెల్లి తనసామానుతో బొంబాయి చేరినది. ఆ వెనకనే బయలుదేరు స్టీమరుమీద ఇంగ్లండు వెళ్లిపోయినది............

తక్కినవాళ్లంతా మేరీని కౌగలించుకొని "నీవు ఆదర్శసమంచితమైన బాలికవు తల్లీ! భగవంతుడు నీ ఈనూతన తపస్సును సర్వసుఖప్రదంగా ఆశీర్వదించును గాక" అని ఆమె మూర్ధము మూర్కొన్నారు.

....

౧౩

"మార్జీ!, ఇంగ్లీషుభార్యతో కాపరంచేయడానికి తగిన ధనం లేదు. సంపాదించేమార్గాలూ లేవు."

"ఓయి వెఱ్ఱివాడా! మేము భారతీయస్త్రీలమవుతున్నాము. నీలో అయిక్యమయిపోయే మేరీ ఎంత అందంచేస్తుందో చూస్తూఉండు. ఆమెకు సాలుకు మూడువేలపౌనులు రాబడివచ్చే ఆస్తి ఉంది. అది ఆమె స్వంతం. తక్కిన ఆస్తి తనకు అక్కరలేదంటుందట."

"నేను సాలుకు వేయిరూపాయలుమాత్రమే తెచ్చుకోగలను. ఆమె సాలుకు నలభై వేలరూపాయలు తెస్తే ఏలాగు? దరిద్రునకు వివాహం ధర్మమా మార్జీ!"

"ఓయివెఱ్ఱివాడా! ప్రేమ ప్రధానం. ధనం కాదు. నువ్వు అహింసావ్రతాచరణం చేయడమే పదివేలు. ఇన్ని శతాబ్దాలనుంచి దోచుకొన్న ధనం మేము మీకు ఎన్నిరకాలుగా తిరిగి ఇవ్వాలో!"

విశ్వేశ్వరుని ప్రేమ మహాకావ్యమై లోకమోహనమైంది.

ఆంగ్లయువతులు, ఆంగ్లయువకులకడనుండి ప్రేమను ఈఅద్భుతస్వరూపంతో చూరగొని ఉండరు.

ఆమెను ఒకరోజున పద్మాలు చెక్కిన పీఠంమీద అధివసింపజేసి, పదివేలపూవులతో పూజించినాడు విశ్వేశ్వరుడు.

కళలు పుణికి పుచ్చుకున్నచీరలు, ఖరీదు కలవి కొనివచ్చి, ఆమెను ధరింప జేసి ఆమెకడ మోకరిల్లాడు.

అతని కళ్లలోనిపూజ ఉదయసూర్యునివర్ణాలులా, పూర్ణిమాజ్యోత్స్నలులా అలిమివేసినది.

"నీసౌష్టవమూర్తిత్వానికి కాదు, నీస్నిగ్ధబాలికాత్వానికి కాదు, నీహిమాచ్ఛశరీరకాంతికి కాదు, నీఆంగ్లశాక్షనుజాతిత్వానికి కాదు, నీదివ్యసౌందర్యానికి కాదు మేరీ! నిన్ను పూజించేది, నువ్వు నా దేవివి! నా మోక్షానివి, నా నిత్యవు.

నిన్ను ముద్దు పెట్టుకుని నీకు మలినము ఇస్తానేమో నన్నభయం...

నువ్వు కలగా మాయం కావుకదా ?

నువ్వు సూర్యునికుమారితవు కాదుకదా ?

ఇన్నాళ్లు ఈ ద్వేషం నా హృదయంలో ఉన్నందుకు ఫలితానివా, నన్ను ద్వేషరహితుణ్ని చేయడానికి వెంచేసిన దివ్యసాన్నిధ్యానివా ?

అతడు పట్టుశాలీ పాంసూరుఢోవతి ధరించి, పాంసూరులాల్చీ ధరించి ఆమెకడకు వచ్చినప్పుడెల్లా ఆమె చిన్నపరుసతో ఆతన్ని వచ్చి కంఠము బిగియార గా బాహులతలు చుట్టివేసేది.

ఆతని విశాలఫాలంలో వేగుచుక్కలు పనసలు పాడుతున్నవని ఆమె అనుకునేది.

అతనికళ్లలో పరమ క్రమణకుడైనను బుద్ధభగవానుని శాంతకాంతులు పుంజీభూతాలయి దర్శనమిస్తున్నవని ఆమె ఒణికిపొయ్యేది.

అతని మూర్తిలో గ్రీకుదేవుడు అపోలో ప్రతిఫలించలేడు. సర్వసౌందర్యస్వరూపాలు ప్రోగుచేసికొన్న భారతీయదివ్యమూర్తి ప్రత్యక్షమయ్యేవాడు ....

"మహాభరతదేశానికి నేను నూతనయాత్రికురాలిని విశ్వా! నా చేయిపట్టుకుని ఈ దివ్యతోర్యత్నలో నడిపించుకొనిపో" అని ఆమె అన్నది.

....

వా రిద్దరూ ఒంటిగా ఉన్నంతసేపూ ఆమె అతని ఒళ్లో ఉండవలసినదే! వారి హృదయాలు రెండూ లయలు శ్రుతులు కావలసినదే.

౧౪

మేరీ తక్కినవారితో ఇంగ్లండు వెళ్లి తనవ్యాపారాలన్నీ సర్దుకుని తిరిగివచ్చేటట్లూ, అంతవరకూ విశ్వేశ్వరుడు శివగ్రామఆశ్రమంలో ఉండేటట్లూ ఏర్పాటుచేసికొన్నారు.

మేరీ మార్గరేట్టు మొదలయినవాళ్లతో బొంబాయి వెళ్లిపోయినది.

ఒంటిగా ప్రాణ మేలోకానికో పోయినవానిలా ఉస్సురంటూ ఆశ్రమంలో ఉన్నాడు విశ్వేశ్వరుడు.

అతివేగంతో, అతిసున్నితంగా యిరువది నాలుగురకాల దారం వడకడం నేర్పుకో ప్రారంభించాడు.

అతిబాధతో ఇంకో చిత్రం ప్రారంభించాడు అతడు. ఉజ్జ్వలరూపరమై, జగత్కల్యాణమూర్తియైన శాంతిదేవియొక్క చిత్రము. సర్వకష్టాతీతరైన, సర్వ ద్వేషాతీతరైన పరమప్రేమమూర్తి ద్వేషపూర్ణమైన ఈ ప్రపంచంలో ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క దివ్యవిధానాన్ని అహింసాస్వరూపముగ నిర్ణయించుకుంటూ ప్రేమాపరావతారుడైన గాంధీ అహింసామార్గమును ఆశ్వేషిస్తున్నాడు.

ఆ మహాభావాన్ని సర్వవిధాలా ఉద్దీపింపచేయడం తనబోటివారి ముఖ్యధర్మము.

ఆ చిత్రం విచిత్రవేగంతో విజృంభింపసాగింది. నీలాలు, వంగపండుచాయలు, పాటలవర్ణాలు-

అయిదవరోజున సాయంత్రం ఒంటిగా ఆశ్రమానికి అనతిదూరంలో ఉన్న ఎత్తుప్రదేశంమీద కూర్చుని విశ్వేశ్వరుడు మేరీదివ్యమూర్తిని ఊహించుకుంటూ పులకితదేహుడౌతూ, ఈ రెండు నెలలూ ఎట్లా భరించడమా అని ఆలోచించుకుంటూ, పరవశమైన స్వప్నాలు కంటూ కూచునిఉన్నాడు.

దశమినాటి చంద్రు డప్పుడే నీలాకాశంలో పైనసే ఉన్నాడు. చంద్రకాంతులూ, సంధ్యాకాంతులూ నిశ్శ్యమందుతూ ఉన్నవి.

చటుక్కన చంద్రకిరణాలలాంటి రెండుచేతులు అతని మెడను చుట్టుకొన్నవి.

అతడు గుండె కొట్టుకుంటూ వెనక్కు తిరిగాడు.

"మేరీ! మేరీ! కలా?" అంటూ వెనక్కు తిరిగాడు.

"కలకాదు, నేను నిజాన్ని ప్రియా! నిన్ను వదలి ఇంగ్లండు వెళ్లలేకపోయాను. రెండునెల లయినవెనక మార్జి నావ్యాపారాలన్నీ సర్ది మన...మన...వివాహానికి వస్తుందట..."

"ఓ మేరీ! ఇంత ప్రేమకు నే నెట్లా తగుదును దేవీ!"

వెన్నెలవెలుగు దీప్తి తాల్చినది.

ఆశ్రమంలో ప్రార్థనకు అందరూ చేరినారు.

....

కల్యాణకింకిణి: ఒకసమీక్ష

శ్రీ పి. గణపతిశాస్త్రి

శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావుగారి "కల్యాణకింకిణి" మనం చూసేసరికి ఏదో వింతపుస్తకంలా కనబడుతుంది. ముందుగా ప్రాచ్యశైలిలో ఉన్న ఇద్దరు సుందరీమణుల త్రివర్ణనాట్యచిత్రమూ, చక్కని తేటతేనె రంగులో మెరుస్తోన్న ముఖపత్రమూ, ముత్యాలకోవలా ఉన్న చక్కని ముద్రణమూ మన్ని ఆకర్షిస్తాయి. అనుక్రమణిక, శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారి ప్రవేశిక చూసేసరికి, అది 'నవ్యకవిత్వం' అని పిలవబడే నేటికాలపు కవితోద్యమంలో చేరినదనీ, కవి సుహృన్మణియైన పూజ్యశ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారికి "పరిణయోపహారం"గా అంకితమిచ్చినదనీ తెలుస్తుంది. ఎంత విభిన్నాభిప్రాయం కలవారైనా సహృదయులు పరిశీలించదగినవి కొన్ని విషయాలు ఉన్నాయని మనం పుస్తకం పూర్తిఅయ్యేసరికి అనుకుంటాము.

'కల్యాణకింకిణి' లో శ్రీ, స్వర్ణకింకిణి, మోహితవని అనే మూడువిభాగాల్లోనూ "శ్రీ" అనే ఖండకావ్యం మనం ముఖ్యంగా పరిశీలించదగ్గది. ఇది వెర్స్ లైబర్ (Verse Laibre) అనబడే పాశ్చాత్యవృత్తఫణితిని వ్రాయబడినది. ఇది ప్రత్యేకంగా ఏవృత్తంగాని గేయంగాని కాక, అనేకవృత్తాల కలయిక అని చెప్పవచ్చును. ఈ వృత్తం ఒకప్పుడు ఏవో విచిత్రమైన సంస్కృతవృత్తాల్లా కనబడుతుంది. కాని స్థిరమైన ఏవరసని కాని అనుసరించి పఠించడానికి అర్హమై ఉండదు. అల్లాగని కేవలం వచనంలా ఉండక ఈవృత్తం నాగసర్పంలా ఒకప్పుడు బుసకొడుతూ, ఒకప్పుడు ఒయ్యారంగా మందగమనంతో నడుస్తూ, ఒకప్పుడు ఆగిపోతూన్నట్టుండి మళ్లీ మెరుపులా పరుగెడుతూ ఉంటుంది. ఛందోగమనం భావతరంగాల గమనాన్ని అనుసరించి చిత్రంగా మారుతూ ఉంటుంది. ఈఖండ కావ్యంలో ఒకభాగం:

> కోమలాంగి నీ
> దివ్యాకారం, నామీదుండ అద్దంలో
> ఈ కల్యాణముహూర్త మా నిశీథంలో
> ఆకు ల్దాడిగిన పూలమొక్కలా
> నిల్చావో కన్యా!
>
> ఈ లోకకఠోరయాత్రలో, హాలో,
> డోలాందోళిత భీతభావనాజాలం
> జాలై, హాసై, ఓమహాప్రవాహమై,
> నాజాగ్రదవస్థనెల్ల ముంచెత్తి,
> నాజ్ఞాన ప్రవృత్తులెల్ల కుంచించి,
> నాజీవాన్ని ప్రసుప్తం చేసిన చీకట్లో
> ఓ జవ్వనీ!
>
> పూజాపుష్పాంజలితో వరిశావో
> తేజస్స్వరూపిణీ రాణీ
> తారాజ్వలితలలితకాంతిమయీ!
> కాంతిమయీ!

మొత్తంమీద స్వతంత్ర వృత్తానికి (Verse Laibre) విశ్వేశ్వరరావుగారి ఖండ

కావ్యం ఒకచక్కని ఒరవడి. దీనితో ఆంధ్రవాఙ్మయంలో కవిత ఒకకొత్తమార్గం తొక్కినదనవచ్చును.

తరువాతి విభాగం "స్వర్ణకింకిణి" అనేకఖండకావ్యాల సంపుటి. ఈఖండకావ్యాలలో ప్రేమ, ప్రకృతి ముఖ్యమైన వర్ణ్యవిషయాలు. సూక్ష్మంగా పరిశీలించినట్టయితే, ఈఖండకావ్యాలలో కవి పూర్వకృతియైన "మధుకీల"లోకంటె, శైలిలో పరిణతీ భావగాంభీర్యమూ విస్పష్టంగా కనబడతాయి. ముఖ్యంగా ప్రేమకవితలో ఈపరిణామం గమనించదగినది. కొంచెం వ్యక్తిపరంగా కనబడే "మధుకీల"లోని ప్రేమకవితకంటె కల్యాణకింకిణిలోని కవిత ఎక్కువగా ఆదర్శపరంగా ఉంటుంది. 'మధుకీల' లో ప్రకృతిని వర్ణించే పూర్ణిమ, వార్ధి, మొదలైన ఖండకృతులున్నవి. కాని 'మధుకీల'లోని ప్రకృతికవితలో, ప్రకృతిఅంతా కవిహృదయభావాలతో అనురంజితమై — వికృతరూపం కాకపోయినా — ఒకవిశిష్టరూపం ధరించిఉంటుంది; అంటే — కవిలో ఉండే నైరాశ్యమూ, నిర్వేదమూ మొదలైనభావాలే ప్రకృతిలో ప్రతిబింబించి ప్రకృతిస్వరూపాన్ని మరుగుపరిచినట్లు కనబడతాయి. మధుకీలలో ప్రకృతిచాలావరకు విషయిపరము (Subjective). కల్యాణకింకిణిలో ప్రకృతిలో సహజసౌందర్యం ఎక్కువగా కనబడుతుంది. అది చాలావరకు విషయపరం(Objective) గా ఉంటుంది. 'సంధ్య'అనే ప్రకృతికావ్యంలో ఒక భాగం:

కిలకిల కిలకల కూజిత
నవోదయవిహంగమా!
కలకలకల చలితవర్ణ
దివ్యాంబర పతంగమా.
నిలిచితి వీ సాంధ్యవేళ
నిర్మల మామక జీవన
పరిసరముల విస్తృతములు
పత్నోజ్జ్వల దీప్త లహరుల!

ఈవిభాగంలోనే'నవవర్ష'కూడా ప్రకృతివర్ణనపరమైన లలితకృతి. కల్యాణకింకిణిలో ప్రకృతికవిత ఎక్కువగా విషయపరమే కాకుండా శైలీసౌందర్యాన్నికూడా సమకూర్చుకొన్నది.

ఇక మిగిలిన విభాగం 'మోహితవని'. ఇది ఒక యాత్రిపద్యాల ఖండకావ్యం- కవికీ మరి ఒక వ్యక్తికీ జరిగిన సంభాషణాత్మకమైనది. దీనిలో ఒక కవి తన ప్రేమవిషాదమునూ, 'మోహితవని'లోని అనుభవములనూ మరి ఒకవ్యక్తికి నివేదిస్తాడు. కథాభాగము శూన్యప్రాయమై, కేవలభావనాత్మకమూ, వర్ణనాత్మకమూ అయిన ఈకావ్యం విశ్వేశ్వరరావుగారి కవితకు ప్రారంభస్థితిలోనిది. ఎందుచేతనో 'మధుకీల'కంటెకూడా కొంతవరకు ప్రథమకృతి అయినా కల్యాణకింకిణిలో అంతిమభాగానికి చేరింది. ఈ కావ్యంలో వృత్తాల్లోనూ, జాతుల్లోనూ లలిత లలితమైన పదవిన్యాసం కనబడుతుంది. కాని'అస్పష్టత'అనేది ఈకావ్యంలో అంతటా కనబడుతుంది. ఎవరైనా కవి ప్రథమకృతి చూచినవారు అతని భవిష్యత్తులో ఎంతకళాస్నత్యం ఉండేదీ సామాన్యంగా ఊహించవచ్చును. ఆవిధంగా ఆలోచించినప్పుడు విశ్వేశ్వరరావుగారి ప్రథమకృతి ఐన 'మోహితవని' లో కవిభావనాబలమూ,శయ్యాలాలిత్యమూ స్పష్టంగా కనబడతాయి.

మొత్తంమీద కళ్యాణకింకిణి విశ్వేశ్వరరావుగారికి నేటి నవ్యాంధ్రవాఙ్మయంలో

ఒక విశిష్టస్థానాన్ని స్థిరపరిచిందని చెప్ప వచ్చును. ఇంతేకాక ఇంకా ఈ కవికవితలో కల్యాణకింకిణికంటె శతౌన్నత్యం రాగలదని ఊహించడానికి అవకాశముండింది. అయితే విశ్వేశ్వరరావుగారు ఎంతవరకు మన ఉన్న ఆశయాన్ని సఫలం చేస్తారో కొంతకాలం నిరీక్షించవలసి ఉంది. *

ఫిడేలు నాయుడుగారి వ్రేళ్లు

శ్రీ శ్రీరంగం నారాయణబాబు

[శ్రీ ద్వారం వేంకటస్వామినాయుడుగారికి మధ్య మైసూరు సంస్థానమునుండి ఆహ్వానము వచ్చినది. శ్రీనాయుడుగారు మైసూరుదర్బారులో వారి గానాన్ని వినిపించారు. మహారాజావారు తమ ఆనందాన్ని వెలిబుచ్చుతు అర్థ వేయిన్నూటపదార్లు, జోడుశాలువలు యిచ్చారు. ఈనాటి ఆంధ్రులలో, మైసూరు దర్బారులో యింత అధికసన్మానము పొందిన ఆంధ్రులు వీరొక్కరె అని చెప్పవచ్చును.

మైసూరునుంచి వచ్చాక శ్రీనాయుడుగారి శిష్యకోటి, వారి ఆనందమును వెలిబుచ్చేందుకు విందుచేశారు. ఆనాడు రచించిన దీ గీతం. దీనికి స్వరం వీణాకోవిదుడు జనార్దనాచార్యులువారు రచించారు. దీనిని శ్రీనాయుడు గారి కొమార్లు, బాబురావు, చిన్న ఫిడేలుమీద వాయించారు. కిన్నెరగాత్రంతో చొప్పల్లి భాగవతార్ పాడినారు.]

నాయుడుగారు!
మీ వ్రేళ్లు
ఘనరాగ పంచకం!

మీ శరీర
మాకాశం!
మీ హస్తం

హరివిల్లు!
చిత్రచిత్ర వర్ణాలు
శ్రీవారి వ్రేళ్లు!

---

* కల్యాణకింకిణి ప్రాప్తిస్థానం : నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

సృష్టి
శ్రుతిమయం
సగుణం నాదం
నిర్గుణబ్రహ్మ
నిశ్శబ్దపు
నీలినీలి
యంచులనె
ప్రయోగించును
మీ వ్రేళ్లు!

ఉక్కుతీగ [1]
నొక్కువ
తారలనె
దాటించి
ధ్రువనక్షత్రానికి
చలనం కలిగించి
పల్లెటూరి
శోభతోడ
పలుకరించు
సూర్యచంద్ర
లోకాలె
సూచించు
బ్రహ్మహృదయమె

వెన్నెలబయలు ఋటు
కనిపిస్తుంది.

పంచమమె, పడితే [2]
గాయత్రి
ప్రత్యక్షం!
ఉపనైనవేళ
చెవిలో
బ్రాహ్మణు డేదో
ఊదినట్లు!

ఆనందానికి
పరమావధి
మందరమె [3]
అందుకుంటె
సంధ్యకు పూర్వం
దినసంధిలోన
తెల్లని వెలుగేదో తోచి
గళమై పాడును!
పిష్కాట్ [4]
వాయిస్తారు
బొందెకు
ఆత్మకు

ద్వంద్వయుద్ధమె
పెడతారు
మానవత్వపు కుట్లు
చిటపట తెగిపోవగ!

మీ చేతిని
జంత్రం గాదది
ఏదో మహామంత్రం!
మీ వ్రేళ్లు
బీజాక్షరాలు!
కమాన? కాదు!
నరుని రథం
భారతయుద్ధం
శ్రీకృష్ణుని
చేతిని
కొరడా!

మీ వ్రేళ్లు
పలికే వేళల
విశ్వరూపమె
వినిపిస్తుంది!
కనిపిస్తుంది!

---

౧. ఉక్కుతీగ ఫిడేలుమీద ఉండే మొదటితీగ; దీన్ని హెచ్చు పంచమ మంటారు.

౨. పంచమముతీగ ఫిడేలుమీద మూడవతీగ.

౩. మందరము నాలుగవతీగ.

౪. 'పిష్కాట్' (Pizzicat) అంటే కమాను వదలి ఒకచేతితో తీగను మీటుతు రెండవచేతితో స్వర స్థానములను నొక్కుట.

గౌరన కాలము

శ్రీ వేంపటి శ్రీనివాసమూర్తి

హరిశ్చంద్రోపాఖ్యానము నాంధ్రమున ప్రత్యేకకావ్యముగ రచించినవారిలో మొదటివాడు గౌరనమంత్రి. సాధారణముగ కవి తన కావ్యములందుగాని, తాను రచించిన శాసనములందుగాని కాలమును పేర్కొనిన యెడల దానినిబట్టిగాని, తన కావ్యము నే రాజుకైన నంకితమొనర్చిన నారాజుకాలమును బట్టిగాని కవికాలమును నిర్ణయింపవచ్చును. కాని, గౌరన నిజకావ్యమును భగవదర్పితము గావించుటచేతను, తన కావ్యములలో నెక్కడను కాలము వ్రాయనందునను నీయాధారములు రెండును శూన్యములైనవి.

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమును మొదట ముద్రింపించిన బ్రౌనుదొరగారితడు ౧౬౦౦ ప్రాంతములం దుండెడివారని యభిప్రాయపడిరి. తంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారు గౌరన రామరాజభూషణునితో సమకాలమున, ననగా పదునారవశతాబ్దమధ్యమున నుండవచ్చునని యభిప్రాయపడినారు. ఆంధ్రమున పుస్తకజాలమంతయు నచ్చుపడని కాలమున నిర్ణయించిన దగుటచే బ్రౌనుదొరగారి యభిప్రాయమును, కేవల మూహామాత్రాధారముచేత సుమారుగా ౧౬౩౦ ప్రాంతమున నుండవచ్చు నని యనుకొన్న తేవప్పెరుమాళ్ళయ్యగారి నిర్ణయమును[1] సరి గానేరవు.

గౌరన తనకులక్రమమును కావ్యాది నిట్లు వ్రాసినాడు:

"..........మత్కులక్రమ మెట్టి దనిన
సింగనమాత్యశిఖామణికి
మంగళమూర్తికి మంత్రియై జగతి
బాగడొందు పెద్దన పోతరాజునకు
దగిన తమ్ముడు యశోధను డెల్లమంత్రి
చెట్టపట్టంగ నోచిన భాగ్యవతికి
(కనిన) పోచాంబకు గారాబుసుతుడ"
(౩౮-౪౦)

దీనివలన నితని తండ్రి ఎల్లమంత్రి యనియు, నితని తల్లి పోచాంబ యనియు దెలియుచున్నది. కాని గ్రంథాంతమున తండ్రిపేరు 'అయ్యలమంత్రి' యని యున్నది.

'మతిమంతు డయ్యలమంత్రిపుంగవుని
సుతుడు గౌరనమంత్రి సుకవిశేఖరుడు'
(౨ భా. ౩౦౧౫,౧౬)

1. "కూర్మపురాణమును రచించిన రాజలింగకవి 'రంగనాథుని, రామలింగకవిని, నూరపరాజును, గౌరనాహ్వయుని' అని చెప్పియున్నాడు గాన యతడు రామకృష్ణునికి దరువాతను, కూర్మపురాణమునంది యప్పకవి పద్యము నొకదానిని ఉదాహరించి యుండుటచేత నప్పకవికి బూర్వమునను, అనగా ౧౬౩౦-వ సంవత్సరప్రాంతమున నున్నవా డగుచున్నాడు. ఆకవి గౌరనను పేర్కొనియుండుటచే గౌరన యతనికి బూర్వుడుగా నుండవలె ననియు తేర్పడుచున్నది; అనగా గౌరన పదునారవ శతాబ్దము నడుమ నుండ వచ్చునని తోచుచున్నది" - తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారు— (హరిశ్చంద్ర, పీఠిక.)

కందుకూరి వీరేశలింగము పంతులు గారు రెండు నామములు నొక్కనివే యని రి; 'అయ్యలమంత్రి' యనునది 'ఎల్లమంత్రి' యొక్క రూపాంతరము తప్ప వేరే మియు కా దనిరి. గౌరన రచించిన లక్షణ దీపికయను సంస్కృతగ్రంథము గద్యలో—

'ఇతి కవిమత వితరణపారిజాత పోతనామాత్య సహజాత చాతుర్య గుణాభిరామ శ్రీ మదయ్యల మంత్రి శేఖర గర్భరత్నాకర శ్రీ గౌర నార్య విరచితాయాం లక్షణదీపికాయాం...,

'అయ్యలమంత్రి' యని స్పష్టముగా నుండుటచేత నీపేరే నిశ్చయింపవచ్చును. ఈ అయ్యలమంత్రి సింగనమాధవ క్షితి పాలునకు మంత్రి యైన పోతరాజునకు దమ్ముడు. 'మంత్రియై జగతి బాగడొందు' అని వర్తమానక్రియ నుపయోగించుటచే పోతరాజునకును, తన్నామమున మాధవ నరపాలునకును గౌరన సమకాలికు డని యర్థ మగుచున్నది. కావున నీమాధవ నరపాలుని కాలము నిర్ణయించినయెడల గౌరనయు నాకాలపువా డని చెప్పవచ్చును.

లక్షణదీపికయందు :

"అ స్తి ప్రశస్తావనిపాలమౌళి
రత్నావళీరంజితపాదపీఠః
రేచర్లవంశార్ణవపూర్ణచంద్రో
మహాబల స్సింగయ మాధవేంద్రః"

అని యున్నది. దీనినిబట్టి మాధవనరపాలుడు రేచర్లవంశము నందు జన్మించినవా డనియు, సర్వజ్ఞసింగమ నాయని కొడుకనియు దెలియుచున్నది (చూడుడు—నవనాథచరిత్రము, పీఠిక). శాలివాహనశకము ౧౩౯౯ సంవత్సరమునందు (క్రీ. శ. ౧౪౭౭) శ్రీ మద్రామాయణమునకు రాఘవీయ మనుటీకను మాధవనృపాలుడు రచించె నని యాతని భార్య వ్రాయించిన శాసనమువలన ప్రకటిత మైనది. కావున, గౌరనమంత్రి ౧౪౪౦ - ౧౪౫౦ సంవత్సర ప్రాంతములందుం డవలెనని కందుకూరి వీరేశలింగముపంతులుగారి యభిప్రాయము[2]

కాని బ్రహ్మశ్రీ వఝ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రిగారు "గౌరన వ్రాసిన మాధవనృపాలుడు, ౧౪౭౭ సంవత్సరమునందున్న రేచర్ల మాధవనృపాలుడే యనుటకు దగిన యాధార మగుపడ" దనిరి (హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠిక). పై నుదాహరింపబడిన లక్షణదీపికలోని శ్లోకమును గద్యను పరికించినయెడల గౌరన పెదతండ్రి మంత్రిగానున్న మాధవనృపాలుడు రేచర్ల మాధవనృపాలుడే యనుట స్పష్ట మగుచున్నది. శాస్త్రిగారు లక్షణదీపిక చూడకుండుటచే నిట్టి సందేహము వచ్చియుండును. శాస్త్రిగారు 'హరి. నల పీఠిక' లో గౌరన కాలవిషయము చర్చించియు నొక నిర్ణయమునకు రాలేదు. వీరు రామరాజభూషణుని కవితాపాటవమునకు ప్రాముఖ్యము తేవలయునను అభిలాషతో గౌరనమంత్రి నొక పడికట్టురాయిగా నెంచి ఒకసారి రామరాజ భూషణునకు ఉత్తరకాలమునకును, ఒకసారి యతని పూర్వమునకును లాగిరి. భట్టు

2. "గౌరనకవి ౧౪౪౦-౫౦ సంవత్సరప్రాంతములం దుండియుండవలెను. అందుచేత గౌరనమంత్రి శ్రీనాథకవియొక్క యంత్యకాలములోను తదనంతరమునను నుండినందుకు సందేహము లేదు."- కం. వీ. ఆంధ్రకవుల చరిత్రము—౧-వ భా.

మూర్తికి లోటు రాకుండ చేయు ప్రయత్నములో గౌరనమంత్రికి హరిశ్చంద్రోపాఖ్యాన కథాసంవిధానమున నున్న అనన్యసామాన్యస్థానమును శాస్త్రిగారు గమనింపలేదు.

మొదట హరిశ్చంద్రలోని నూతన కల్పన లన్నియు రామరాజభూషణునికే కట్టిపెట్టనెంచి "రామరాజభూషణుడే యీ కథను గల్పింపగా నయ్యది శ్లేషనిర్బంధమున నంత రసవంతముగా నుండనందున గౌరన ప్రతిబంధశూన్య మగు పాటవంటి ద్విపదతో మిక్కిలి మనోహరముగ వర్ణించె ననుట విరుద్ధము గానేర" దని వ్రాసియు, మరల "శ్లేషార్థమును గల్పించె ననుటకన్న నది యావరకు ప్రసిద్ధమైయున్న దనియు, గవి తనసామర్థ్య విశేషమున న ట్లద్భుతముగా సందర్భపరిచె ననియు నంగీకరించుటయే రామరాజభూషణుని కవితాపాటవమునకు దగియుండునని నాయభిప్రాయము" అని వ్రాసిరి (హ. న. పీఠిక).

గౌరన ననుసరించి ౧౫౫౦-౮౧ ప్రాంతమున నున్న శంకరకవియు ౧౫౫౦-౧౬౦౦ ప్రాంతమున నున్న మల్లారెడ్డియు కావ్యములను రచించిరి. చి. సీ. రా. శాస్త్రిగారు గౌరన శంకరకవి, రామరాజభూషణులకు బూర్వుడైనను "గౌరన వర్ణించిన కథలోని కొన్ని విషయములు మల్లారెడ్డి షట్చక్రవర్తి చరిత్రలోని హరిశ్చంద్రకథయందు నగుపడకుండుటచే నదే మొదటి దని గ్రహించుట యుక్త" మనిరి. ఈ విషయము సత్యమైనచో గౌరన మల్లారెడ్డితరువాత, అనగా ౧౬౦౦ తరువాత జీవించియుండవలెను. శంకరకవియు, మల్లారెడ్డియు మల్కిభరామునకు సమకాలికులై యున్నందున, గౌరన ఇందొకరికి పూర్వకాలమునను, నింకొకరికి ఉత్తరకాలమునను జీవించియుండుట యసంభవము. గౌరన శంకరకవికి బూర్వుడైనచో మల్లారెడ్డికిని బూర్వుడే. అది యట్లుండ, గౌరన వర్ణించిన విషయములు మల్లారెడ్డి సంపూర్ణముగా విడిచిపెట్టినచో నొక్కెడను షట్చక్రవర్తిచరిత్రయందు గాన్పించవు. మల్లారెడ్డి కొన్నిచోట్ల గౌరనకంటె విపులతరముగా వర్ణించియున్నాడు. రెండు సందర్భములనుమాత్రము చూపెదను: (౧) హరిశ్చంద్రుడు వేటకేగు సందర్భమున పల్లీవాసులందరును రాజుతో తమ బాధలను గురించి గ్రామ్యభాషలో మొరపెట్టుకొనుట గౌరన తలపెట్టని విషయము. గౌరన కావ్యమునందు పౌరులు వచ్చి మృగబాధలను సలక్షణభాషలోనే చెప్పిరి. వారిమాటలను గ్రామ్యములో జెప్పించి మల్లారెడ్డి క్రొమ్మెఱుగు గూర్చెను; (౨) కాశీవిశ్వనాథస్తుతి గౌరన కావ్యమందైనను, గౌరన ననుసరించిన శంకరకవికావ్యమందైనను సామాన్యపద్యముల నతిక్రమింపలేదు. మల్లారెడ్డి ఏకాక్షర, ద్వ్యక్షర కందములను, తలకట్టుకందము, ఏత్వముల కందముల నుపయోగించుటేగాక సంస్కృతదండకము నొకటి వ్రాసెను. ఛేకానుప్రాసాది యమకములు, పుష్పమాలికాబంధోత్సాహము మొదలగు రచనావైచిత్ర్యములు కృష్ణదేవరాయల తరువాత కావ్యములందు విరివిగా నుపయోగింపబడినవి కావున నితడు రామరాజభూషణుని సమకాలమునో, లేక యతని తరువాతనో జీవించియుండవచ్చును. గౌరనకావ్యముపై నభి

వృద్ధి చేసికొనుచువచ్చిన మల్లారెడ్డి తలవని తలంపుగా షట్చక్రవర్తిచరిత్రము వ్రాయ నుద్యమించుటచేతనో, లేక గ్రంథవిస్తరభీతి చేతనో హరిశ్చంద్రుడు కాశికాపురిని ప్రవేశించిన తదుపరికథను వర్ణనలను తగ్గించి శీఘ్రముగా ముగించినాడు. కథాంతమున నున్న ఈ తగ్గింపును జూచి శాస్త్రిగారు పొరబడి గౌరన మల్లారెడ్డితరువాతివా డని నిర్ణయించిరి. మల్లారెడ్డి గౌరన ననుసరించె ననుట కొక యుదాహరణమును జూడుడు:

"జనపతుల కేయూరు సత్య మేయూరు
వినగూడ దీమాట విమతు చాలు......
హితవు మీరిన పురోహితుడవు గాన
శతముఖంబుల కేగి సన్నుతి సేరు..."
(గౌరన ప్ర.భా. ౧౬౧, ౧౬౨, ౧౬౫, ౧౬౬)

మల్లారెడ్డి కావ్యములో

గీ. హరిమిని రాజు, వాని జేయూరు ? సూన్ృ
తం బజేయూరు ? విన సమ్మతింప నగునె ?
యతని మాచార్యుడవు గాన హితవుగూర్చి
పలికితివి గాక యిది నసుబాటు గాదె?"
(షట్చక్రవర్తి చరి. ౨. ఆ, ౧౨ ప.)

ఇటీవల ప్రకటింపబడిన నవనాథచరిత్రముపీఠికలో శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు ఇంచుమించుగా కందుకూరి వీరేశలింగముగారి యభిప్రాయముతో నేకీభవించిరి. లక్షణదీపికలోని యవతారికవలనను, మాధవనృపాలునిభార్య రచియింపించిన శాసనమువలనను, రామకృష్ణయ్యగారీనిర్ణయమునకు వచ్చిరి.

"ఇట్లు క్రీ. శ. ౧౫-వ శతాబ్ది తొలిభాగమున నున్న సింగయమాధవ నృపాలునియొద్ద మంత్రిగా నున్న పోతరాజు ననుజుడగు నయ్యలామాత్యుని కొడుకగు గౌరన ౧౫-వ శతాబ్ది పూర్వార్ధమున (అనగా ౧౪౦౦-౧౪౫౦ వరకు) నుండెననుటకు సందేహము లేదు."
—నవనాథ చరిత్రము- పీఠిక

ఇంతేగాక, శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును దన భృత్యుండగు ముమ్మిడి శాంతయ్యకు కృతి యిప్పించిన శ్రీశైల జంగమమఠాధీశ్వరుడగు శాంతభిక్షావృత్తిరాయడే గౌరనచే నవనాథచరిత్రమును మల్లికార్జునునిపేర కృతిగా జెప్పించెను. శివరాత్రిమాహాత్మ్యము శ్రీనాథుడు తన చరమకాలమున రచించిన దగుటచేత, గౌరన శ్రీనాథుని చరమకాలముననున, నాతని తరువాతను జీవించి యుండవచ్చును.

ఇవిగాక గౌరన కాలమును నిర్ణయించుట కింకొక యాధారము దొరకినది. భైరవకవి తాను రచించిన శ్రీరంగమహాత్మ్యములో గౌరనామాత్యపుత్రుండ నని చెప్పికొనినాడు, చూడుడు:

మ. కృతవిద్యాఘురళీ పరిశ్రమ కళా
కేళీవిలాసుండ జన,
స్తుతచారిత్రుని గౌరమాన్వయసువి
శ్రుతు గౌరనామాత్యస,
త్సుతు కల్యాణ కవిత్వ లక్షణసమ
ర్థుం సూక్తిముక్తాఫలా
తతకాంతిస్ఫుట చంద్రికోల్లసిత వి
ద్వత్చకోరవ్రు భైరవున్.
—శ్రీ రంగ మహాత్మ్యము.

కాని, భైరవకవి పేర్కొనిన గౌరన హరిశ్చంద్రోపాఖ్యానకర్త యగు గౌరన కాడనుటకు కందుకూరి వీరేశలింగముగారు రెండు కారణములను దెలిపినారు. ఒకటి, భైరవకవి గౌరనమంత్రిని గూర్చి తన కావ్యములో కవీశ్వరు డని వర్ణించలేదు. రెండవది, గౌరన తాను రచించిన లక్షణ

దీపికలో భైరవకవి రచించిన కవిగజాంకుశ ములోని పద్యముల నుదాహరించెను. ఈ రెండాక్షేపములును తృప్తికరములుగా లేవు.

పైనుదాహరించిన పద్యములో భైరవకవి 'కృతవిద్యాఖురళీపరిశ్రమ కళాకేళీవిలాసు' డని తన తండ్రినిగూర్చి నుడివినాడు. అంతే గాక భైరవకవి గౌరనతో సమకాలికు డగుటచే తండ్రి నెక్కువగా పొగడలేదు. ఈ కారణమువలననే, గౌరన తనలక్షణదీపికలో నంతకుముందు భైరవకవి రచించిన కవిగజాంకుశములోని పద్యముల నుదాహరించుట సంభవించినది. పైనుండి లక్షణదీపికలో నుదాహరింపబడిన కవిగజాంకుశము భైరవకవికృతము గాక యెప్పటిదో పూర్వపు దనియు, వివిధ దేశములనుండి సంపాదించిన తమయొద్ది నాలుగు కవిగజాంకుశప్రతులలోను లక్షణ దీపికలో నుదాహృతములైన పద్యములు లేవనియు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు తెల్పియున్నారు. గౌరన భైరవకవు లిద్దరును గౌతమగోత్రజులే. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమునందు 'భ్రమరాంబాప్రసాద సంప్రాప్త కవిత్వసుమహితసామ్రాజ్యసుఖపరాయణుడ' నని వ్రాసికొనినాడు. భైరవకవి శ్రీరంగ మహాత్త్వములోను, ఇతరకావ్యములలోను 'శ్రీమద్భ్రమరాంబా వరప్రసాదలబ్ధ సిద్ధ సారస్వతగౌరవుడ'నని చెప్పికొనినాడు. ఇరువురును భ్రమరాంబాదేవ్యుపాసకులే. జనకుడు కొలిచిన దైవమునే పుత్రుడు సేవించుట సహజముగదా! ఈ కారణములవలన భైరవకవి గౌరనపుత్రు డని నిశ్చయ మగుచున్నది. క్రీ. శ. ౧౪౫౦-౬౦ ప్రాంతము లందున్న ప్రౌఢదేవరాయలకాలమున భైరవకవి యుండుటచేత, గౌరన పదునైదవ శతాబ్దిపూర్వార్ధమున నుండవలెనని రూఢియగుచున్నది.

కవికాలమును నిర్ణయించుటకు కావ్యేతరాధారము లటుండ కవిత్వపు శైలి యొక ప్రబల నిదర్శనము. శైలివలన కాలమును స్పష్టముగా నిర్దేశింపలేకపోయినను సుమారుగా నిర్ణయింపవచ్చును. గౌరన కావ్యమందు దృష్టాంతోపమాలంకారములును స్వభావోక్తులు నెక్కువ. ప్రబంధకవిత్వములోవలె కల్పనాలంకారములుగాని భావములేని శబ్దాడంబరముగాని కానరావు. శంకరకవి, మల్లారెడ్డి మొదలగువారు 'నాయొనర్పంబూనిన మహాప్రబంధమునకు గథాక్రమం బెట్టిదనిన' అని యుపక్రమించి తమ గ్రంథములను మహాప్రబంధములుగా గణించిరి. కావున నివి ప్రబంధయుగమున రచింపబడినవనుట స్పష్టము. దీనికి వ్యతిరేకముగా గౌరనమంత్రి

'శ్రీకరంబుగ విరచింప జేకొనరు
నా కథావృత్తాంత మది యెట్టి దనిన'
(౧. భా. ౪౯, ౫౦)

అని గ్రంథాదిని, 'కవు లెన్న నుత్తరకథ రచియించె' నని గ్రంథాంతమునను వ్రాసి, తాను రచించినది 'కథ' యని వాక్రుచ్చినాడు. ఇది పురాణయుగమునందలి కవుల లక్షణము. ఐనను ఇతని కవిత్వమందు ప్రబంధకవిత్వపు వాసన ఘాటుగా నున్నది. తెనుగుకై తయందు తిక్కనసోమయాజి తెనుగుపదముల విరివిగా నుపయోగించిన తరువాత, స్వీయమత ప్రచారమునకై పామరజనవేద్యముగా నుండుటకొరకు శైవకవులాతని ననుసరించిరి. శ్రీనాథు డవతరించిన తరువాత ఆంధ్రవాఙ్మయమున సంస్కృత సమా

సోపయోగ మెక్కువయ్యెను. తెనుగు కవులకు దీర్ఘ సంస్కృతసమాసములపై 'మోజు' ఎక్కువైనది. గౌరన నవనాథచరిత్రమును రచించి శైవకవుల పరంపరలో జేరినను వాఙ్మయ వాతావరణములోని మార్పులను గమనింపక పోలేదు. అందువలన నీతనికవిత్వమందు రెండుధోరణులును నగుపడుచున్నవి. ఒకచోట తెలుగుపదముల వెలుగు, ఇంకొకచోట సంస్కృత సమాస జటిలత. తెలుగు పదముల కూర్పున కుదాహరణము:

'కుత్తెంపు జిప్పల మురళించు మోము
గ్రొత్త నీలపురంగు గులుకు కన్దోయి
పగడంపు నును గెంపు బవరించు చెవులు
ధగ ధగమను పైడి తళుకుల మేను...'

(ప్ర. భా. ౫౪౧-౪౪)

సంస్కృతశబ్ద గాంభీర్యమునకు—

'దారుణ కరవాల ధారాహతారి
వీరకోటీర నవీన మాణిక్య
రంగవల్లీ రణరంగ విఖ్యాత
మంగళ విజయ రమాకరగ్రహణ
శస్త్రమైనట్టి యా శత్రుఘ్నోత్తముని
హస్త మేరీతిని వలవదు గృహికి...'

(ద్వి. భా. ౫౭౯-౯౪)

ఈ విధముగ శైలిని బట్టి చూచిన యెడల గౌరన పురాణయుగాంతమునందును, ప్రబంధయుగోదయ పూర్వమున నున్నట్లు స్పష్టమగుచున్నది; అనగా శ్రీనాథునికి కృష్ణదేవరాయలకు మధ్య కాలమున జీవించి యుండవలెను.

గౌరన ౧౬౦౭ల ప్రాంతమున నుండవచ్చుననిన బ్రౌనుదొరగారి నిర్ణయమును, పదునారవ శతాబ్దముమధ్యభాగమున నుండవచ్చుననుకొనిన తంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారి నిర్ణయమును నిరాకృతములైనవి. కీ. శే. కందుకూరి వీరేశలింగంగారు ౧౪౨౦-౫౦ ప్రాంతమున గౌరనకాలమును నిర్దేశించుటచేతను, కోరాడ రామకృష్ణయ్యగారు ౧౪౦౦-౧౪౫౦ ప్రాంతమున నిర్ణయించుటచేతను, ఇద్దరి యభిప్రాయములును నేకీభవించి బ్రహ్మశ్రీ వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారి వాదమును త్రోసిరాజనుచున్నవి. శైలివల్లను గౌరన పదునైదవ శతాబ్ది పూర్వభాగమున నుండవచ్చునని తెలియుచున్నది. భైరవకవి కాలనిర్ణయప్రకారము చూచినయెడల గౌరన ౧౪౬౦ వరకు జీవించి యుండవలెను. మనపూర్వులు దీర్ఘకాలము జీవించెడివారు గనుక గౌరన అరువదేండ్లు జీవించియుండుటకు సందేహము లేదు. గౌరన చెప్పిన మాధవనృపాలుడు రేచర్ల మాధవనృపాలుడగుటకు సందేహము లేదు. కావున, గౌరనమంత్రి క్రీ. శ. ౧౪౦౦—౧౪౬౦ వరకు జీవించి యుండె ననుట నిశ్చయము. ఈ విషయమై వాదోపవాదములకు తావు లేదు. మాధవనృపాలుని జీవితకాలమున రచింపబడిన దగుటచే హరిశ్చంద్రోపాఖ్యానము ౧౪౩౦ ప్రాంతమున విరచితమై యుండవచ్చునని స్పష్టమగుచున్నది.

నాటకం - టాకీ

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు

'నాటకం' పాతమాట, 'టాకీ' కొత్తది. ఇవి రెండూ ఫలానా అనుకుని వాటిప్రస్తావన చెయ్యడం కర్తవ్యం. కాని పాతమాటే చిక్కుమాట. తెలుగునాటకజననం (-యక్షగానం, కలాపం, తోలుబొమ్మలు, భాగవతం, పగటివేషం వగైరాల్లోంచి), నాటకలక్షణం (-సంస్కృతాది నాటకాల్ని అనుసరించి), నాటకావసరం (-మానవజీవితానికి) నాటకసుసాధ్యత (-అది అబద్ధం అయినప్పటికీ), నాటకోద్దేశం (అహం — మమ — విసర్జనగురించి), నాటకపరమావధి (-అన్యతాత్వారోపణద్వారా సర్వభూత సమత్వ ప్రత్యక్ష సిద్ధి), వగైరాలు చర్చించి 'నాటకం' అంటే ఇదీ అని కూడబలుక్కోడం న్యాయమేగాని ఇప్పుడు కష్టం అదీకాక, 'నాటకం'అంటే కంటికి సంబంధించినచిత్ర, విగ్రహ, శిల్ప, నృత్య, అలంకారాది కళలున్నూ, చెవికి చెందిన సంగీత సాహిత్యాది కళలున్నూ యథాక్రమంలో మేళవించినమీదట బయల్దేరే పాకం, అని నిరూపించడానికికూడా ఇది అదనుకాదు. ఏదో యాభై అరవైఏళ్లక్రితం తెలుగునాటకం పుట్టిందనీ, మొదట శుద్ధవచనంలో దానిరూపం ఉంటోచ్చినా, మంచిపీకగలవాళ్లు ఆడేవాళ్లల్లో చేరుతోచ్చినకొద్దీ, పద్యాలూ పాటలూ దాన్లోకి చేరుతోచ్చాయనీ, నేటికి అయిదారువందల నాటకాలు తెలుగులో వెలిసి ఉంటాయనీ వాటిల్లో సుమారు ఓవంద ఆడడానికి వీలైనరకంలో పడతాయనీ, స్థూలంగా అంతా ఒప్పుకోవచ్చు. ఇక మరి పురాణ, చారిత్రక, సాంఘికవంటి రకాలు తెలుగునాటకాల్లో ఎన్నట ఉండనీండి, దేవుళ్లుగాని, మనుష్యుల్లాంటి దేవుళ్లుగాని, దేవుళ్లులాంటి మనుష్యులుగాని, రాజులుగాని, గృహస్థులుగాని, నిరుపేదలుగాని, ద్రోహులుగాని, రాక్షసులుగాని- ఎవరట కథానాయకులుగా ఉండనీండి, వాట్ల అన్నింటిలోనూ గానం వాల్లాడిపోతూంటుందిగనక (-ఆగానం గాయకులు సచేలస్నానంచేసేరకం! శ్రుతి లయలు అనే తలిదండ్రులు లేనిబాపతు!) తెలుగులో 'నాటకం' అంటే 'సంగీతనాటకం' అన్నమాటే అని అందరూ ఒప్పుగునేమాటే.మరొక్క.విషయం కూడా ముందే అనేసుకుంటే తీరిపోతుంది. నాటకరచనలోగాని, నాటక అభ్యాసంలోగాని, నాటకప్రదర్శనంలోగాని రక్తమాంసాలు కలిగి ఏచిన్నడోసో జీవంకూడా ధరించి ఉన్న మనుష్యులు పనిచేసి చూపిస్తూండడం ఎరుగుదుం. కాని మనం చూస్తూండగానే, మానవయుగం యంత్రయుగం అయింది. ఆయంత్రయుగం సాగి, రేగింది. ప్రతీయితరసంస్థమీదా యంత్రప్రభావం ప్రసరించినట్టే నాటకసంస్థ మీదకూడా ప్రసరించింది. కళలో నకళ్లు ఉండవు. ప్రపంచానికి విరివిగా నకళ్లు కావలసి రావడంచేత

కొందరు అభినయించినవాళ్లని చూసి, వాళ్లని ఇదివరకే 'షూట్' చేశారు, ఇహాను వాళ్లనే నేం చెయ్యను అని ఆగిపోయాను. కొన్ని చోట్ల తిట్లల్లో 'హారి నిన్ను టాకీ తియ్యా!' అనికూడా వ్యవహరిస్తున్నారు!"

పై వాక్యాలు సత్యమూ కాదు, అసత్యమూ కాదు. కొత్త సంస్థల్ని నిరసించడం మానవస్వభావం. కాని నాటక-టాకీల గుణకర్మల్ని పోల్చిచూస్తే రెండిటికీ ఏమీ సంబంధం లేదని తేల్తుంది. నాటకంలో ఉండేది స్థూలరూపాల చలనం — టాకీలో ఛాయాచిత్రాల చలనం. నాటకం సజీవ వ్యక్తులైన మానవుల కృషి — టాకీలో మానవుడు సముద్రంలో కాకిరెట్ట. జంతువు, చెట్టు, పిట్ట, కర్ర, కొండలాగ బొమ్మల వరసలో పనికొచ్చే ఒక దినుసు. నాటకానికి శబ్దం ప్రధానం— టాకీకి మూలం బొమ్మ. [—మన తెలుగు నాటకం రాగప్రధానం — తెలుగు టాకీ నాటకానికి నకలైనంతకాలం, అనగా తక్కువ ఖర్చుతో చూడడానికి వీలైన నాటకప్రత్యామ్నాయి అయినంతకాలం అదీ రాగప్రధానమే!] నాటకంలో అభినయం ప్రధానకళ — టాకీలో అభినయం ప్రతికూలం, అనవసరం, బాధాకరం [—అభినయించడం మొదలెట్టి నాటకపు కంపు కొట్టేలాగ చేసే నాటకనటుణ్ణి టాకీ ధరిమేనా కానియ్యకూడదంటాడు ఒక దర్శకుడు.] నాటకాభినయం అవిచ్ఛిన్నం — టాకీనటుడు అవిచ్ఛిన్నంగా అభినయించినా, కావలిసింది కొన్నికొన్ని క్షణాల్లో అతని స్థితులే గనక, ముక్కలేసి అవే చూపిస్తారు. నాటకరంగంమీది కాలం మనం ఎరుగున్నదే, దేశం ఎరుగున్నదే—టాకీలో బొమ్మలవరసయొక్క కాలంగాని దేశంగాని మనం ఎరగం. నాటకంలో నటుడు తనలో లోగడ లేని ఒక అవస్థ ఆరోపించుకుని అన్యుడై మనకి కనపడ్డానికి యత్నిస్తాడు, సమర్థుడైతే నెగ్గుతాడు — టాకీలో వ్యక్తి తను తనులాగ ఒకఅవస్థలో కనపడగలిగితే అంతే చాలుట, తన సత్తా కనపరిస్తే చాలుట. [అందుకనే ఒకటాకీలో కెక్కిన వ్యక్తియొక్క సరుకు ఆ టాకీతో అఖరయే దోషం ఉందిట]. నాటకంలో నటించడం సాధ్యవస్తువు. టాకీలో వ్యక్తి నటించడం అనేది ఉండనే ఉండదు గనక ఏమి చేసినా అది దర్శకుడు ముందుముందు రచించగల బొమ్మల కావ్యానికి సాధనం. నాటకంలో ఫలితం ఆడేవ్యక్తికి తెలుస్తుంది — టాకీలో ఎవడు ఎందుకోసం ఏది చేస్తున్నాడో దర్శకుడికి తప్ప మరి తెలియదు. (—అసమర్థుడైతే అతడికీ తెలియదు). నాటకంలో భాష ఉండడంవల్ల గాంభీర్యం, పాండిత్యం, ఆలోచనా, అవగాహనా—ఇల్లాంటివి కావాలి— టాకీలో అంతా ప్రత్యక్షం. ఒకవేళ భాష ఉంటే దానికి పై ప్రమాదాలు ఉండవు. ఆలోచన వగైరాలు అన్నీ దర్శకుడే జరిపేసి అమారుచేసి అట్టే పెడతాడు. ప్రేక్షకుడు తన బుద్ధి — (ఒకవేళ ఉన్నాసరే) ఖర్చుపెట్ట నక్కర్లేదు. నాటకం వ్యక్తిత్వం గల ప్రత్యేక వ్యక్తులపని. ఇష్టిలాంటిది— టాకీ కొన్నిపందలమంది జనం, బోలెడు యంత్రాలు, శకటాలువగైరా సాయం ఉన్న మీదట చేసేమహాయజ్ఞం. నాటకంలో ప్రేక్షకులు, జరిగేది గమనించి గ్రహించాలి—టాకీలో ప్రేక్షకులు ఏది గమనించి గ్రహించాలో ముందే చూసుకుని అదే జరపాలి. నాటకంలో

జరిగేదృశ్యం సాంతంగా జరగవలిసిందే కాని, మధ్యరంగంలో, అవస్థలలో అప్పట్లో ఏమవుతుందో గమనించి, వెనక్కొచ్చి మళ్లీ ఇందాకటి దృశ్యం కానివ్వడానికి ఏ ఝుంకవు — టాకీలో సామ్యం సారూప్యం సాదృశ్యం సాధర్మ్యం వైరుధ్యం వంటి ఏదో సంబంధం గల కథాంతర విషయంతాలూకు చిత్రపరంపర మధ్య జొనిపి, అసలు కథ చెడకుండా అది ముందుకికూడా పట్టిచ్చేలాగ చెయ్యొచ్చు. నాటకం భౌతికాన్ని మరిపిస్తుంది. టాకీ యావత్తూ ప్రత్యక్షభౌతికం, తద్వారా మరోటి ఏదేనా కావచ్చు. నాటకం అవతారంవంటిది. టాకీ విశ్వరూపంవంటిది. నాటకంలో కథానాయకుడైన ఒక మానవుడి సంతాపసంతోషాలే ముఖ్యంగాగమనించడం అవుతుంది. కాని, చెప్పినా విన్లేని జడప్రకృతినీ, చెప్పినట్టు వినని జంతుప్రకృతినీ, చెప్పినట్టు విని చెయ్యగల మానవప్రకృతినీ, చెప్పడానికి వీల్లేకుండా జరిగిపోయే ప్రకృతి సంభవాల్నీ, సర్వాన్నీ గమనించి వివిధావస్థల్లో, వివిధ ప్రదేశాల్లో, వివిధక్షణాల్లో, వివిధదృష్టుల్లో వాటిఛాయాఖండాలు తీసి, వాటిని కథకి అనుకూలించేలాగు ప్రేక్షకుల మానసికతత్వం గుర్తెరిగి వాట్లకి ఒకక్రమం ఒకమేళవింపూ బయల్దేరేలాగు వాటిని సర్ది, తద్వారా నూతనజీవం అపూర్వాకర్షణా కలిగించినప్పుడే చలనచిత్రం ఒకకళ — అప్పుడేనా యంత్రకళ. ఇన్నిరకాల వస్తువులూ, ఇంతమంది కర్తలూ, ఇన్ని రకాల సాధనాలూ, ఇన్ని రకాల ఆచరణ విధానాలూ, ఉంటూన్నప్పుడు మహత్తమఫలితం ఏప్రత్యేక మార్గంద్వారా సిద్ధింపచెయ్యవచ్చునో ప్రస్తరించి చూసుకుని దర్శకుడు వ్యవహరించినప్పుడుమాత్రమే టాకీ ఒకకళ.

టాకీవ్యాపారం జీవితానికి అవసరం అయినదే. కిట్టుబాటు ఉన్నప్పుడే వ్యాపారం జరుగుతుంది, జరగాలి. పెట్టుబడిదార్లకి వడ్డీలాభాలు కిట్టాలి, ప్రేక్షకులకి ఆనందం వినోదం బోధా కిట్టాలి. కాని వ్యాపారాల్లో పార్టీలు బోల్తాలు కొడుతూండడం దెబ్బలు తిని తెలుసుకుంటూ ఉండడం జరుగుతూ ఉంటుంది. సలహాలు అనవసరం. మరి, టాకీ నిర్వాహకుల అసామర్థ్యం గురించి సూచించడం ప్రమాదకరం. ఏమంటే, సమర్థులూ అసమర్థులూ కూడా ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. వాళ్లూ అన్యశాఖల్లో వాళ్లకిమల్లేనే, అనుభవ అభ్యాసాలవల్ల ఆరితేరి తప్పులు దిద్దుకుని ముందుకి జాగ్రత్త పడుతూ ఉంటారు. ఇక నాటకనటులు టాకీలోకి ఎక్కితే యంత్రనటులుగా మారాలి. కొందరు మారగలరు, కొందరు మారరు, మారలేరు. వాళ్లు తమ కున్న నాట్యప్రసిద్ధి పేరూ టాకీలో హోమంచెయ్యడానికి వెళ్లాలి గాని అభివృద్ధి చేసుకునేనిమిత్తం కాదు. మరి ఎందుకయ్యా వెడుతున్నారూ! అంటే, కారణాంతరాలవల్ల, పోనీ డబ్బుకోసం. అది వ్యాపారం గనక, దండిగా సొమ్ము చేతులో పడితే మహారాజులా వెళ్లమనండి. కొందరు పామరులు ముందు ఒక టాకీలోకి ఊరికే వెళ్లి అభినయించి పేరుపొందితే, తరవాత తరవాత వెయ్యగల టాకీవేషాలకి డబ్బు వస్తుందని భ్రమించేవాళ్లు ఉన్నారట. అభినయశూన్యం గనక టాకీలో పడటం ఒక మాటే మనీసగంలాగ. వాళ్లకి వాతేగాని తరవాత లేదు ఇహాను; ఎందుకంటే టాకీలో

స్వతస్థాపనే గనక. ఒక ప్రత్యేక లక్షణం ఉన్నందువల్ల ఒక అనామకుడు యంత్రనటుడుగా ఏరుకోబడ్డా మనం ఆశ్చర్యపడి 'వీణ్ణి టాకీలోకి తీసుకున్నారు, వీడేం చెయ్యగలడ్రా అక్కడా?' అంటూ నిర్ఘాంతపో నక్కర్లేదు; ఎంచేతంటే, వాడు ఆలక్షణంతో అక్కడ నిలబడితే చాలుట. అభినయించ నక్కర్లేదు; ఇక టాకీ వచ్చి నాటకాన్ని చంపినట్టు ఎందుకు కనపడుతోందీ అంటే, మననాటకం నాటకపుపని నిర్వహించటం లేదు, మనటాకీ టాకీపని చూసుకోడం లేదు. క్షుద్రసంగీతాన్ని ఆశ్రయించుగుని మన నాటకం సంగీత నాటకం అయిఉంది, దానికే తప్పుడు నకలుగా మన టాకీ ఉంటోంది. కాని, ఈ పరిస్థితి చిరకాలం ఉండదు. దేని పని అది చెయ్యడం నేర్చుగున్నప్పుడు రెండూ నిలిచి ఒకదాల్లో ఉండేమంచి రెండోది గ్రహిస్తుంది. నాటకం లోంచి టాకీలోకి మార్పు—మాటలోంచి బొమ్మలోకి—వెనకడుగు — వెనక దిగడి పోయినజనం వచ్చి ముందుజనాన్ని కలుసుగోడం నిమిత్తం. మాటకి అర్థజ్ఞానం కావాలి, బొమ్మకి కన్ను చాలు (-టాకీలో మాటలకి గణ్యత తక్కువగనక) అందుకని, టాకీ పామరుల్ని కూడా ఆకర్షిస్తుంది-కాదు, పామరుల్నే ఆకర్షిస్తుంది. యంత్రనటుడు చూపెట్టగల ప్రజ్ఞ, నాటకనటుడి ప్రజ్ఞలో శతాంశమైనా ఉండదు. నాటకకారుడు టాకీ బొమ్మలకేసి చూసి గుండె బాదుకోడు. శబ్దశక్తిలో నమ్మకం అతడు వదులుకోడు. నాటకాలు రాసితీరతాడు. యంత్రజనితమైన గారడీలు అక్కర్లేకుండా శబ్దశక్తివల్లనే చిత్తవృత్తుల్ని కలిచివెయ్యగల నటులూ ఉంటారు. అన్య యంత్ర సాహాయ్యం లేకుండా మానవుడు సృష్టించగలిగింది 'మాట' ఒక్కటే! మాటే కదా అన్నింటికీ మూలం!!

బుద్ధబోధ

శ్రీ దువ్వూరి సూర్యనారాయణమూర్తి

౧

పట్నవాసము పల్లెటూరుల
అందచందా లన్ని కలిగిన
ఊరు ఉన్నది, ఘోరహింసకు
పుట్టినిల్లువలెన్.

౨

మోతుబరులగు కమ్మవారిది
జాతియున్నది వందగడపకు;
లాతివారలు బక్కబడుగులు
లెక్కయే లేదు.

౩

అంగబలమూ, అర్థబలమూ,
రెండు కలిగిన మూర్ఖపురి యది;
తిరుట, పొలములు దున్నకొనుటే
తెలియు వారలకున్.

౪

మేకమిద్దెలు, పెంకుటిళ్లూ
మిక్కుటంబులు భూమివసతులు
కలరు వారిలో వేలు వచ్చెడి
వారుసంసారుల్.

౫

దున్నలెద్దులు పరమటావులు
కోడెదూడలు గొడ్డుగేదెలు
పాడిపంటలు సిరిసంపద
పట్టె నాయూరన్.

౬

ఆలయమ్మున కాలయమ్మై
యమరె కోవెల పెద్ద దొక్కటి;
గ్రామదేవత గద్దె నెక్కి
యందు నివసించున్.

౭

మనిషిపుర్రెల మాల మెడలో
రక్తపాత్రిక యొకటి ఒడిలో
పటాకత్తెను ఒక్కచేతను
పట్టె నాదేవి.

౮

గొఱ్ఱెమందలు, మేకమందలు
కోడికోటులు దున్నపోతులు
కమ్మవారలు బలుల నిత్తురు
గ్రామదేవతకున్.

౯

ఎంద రెందరో అహింసాపరు
లెన్నొ చెప్పిరి; హింస మానరు.
మాంసములు తిన మరుగువారల
మనసు రాయిగదా!

౧౦

దండిగా నొకయేడు జాతర
జరుపుచుండిరి రైతు లెల్లరు ;
వేటపోతులు వేనవేలకు
నిలిచె గుడిమెదుటన్.

౧౧

వేపరొట్టలు మెడకు కట్టిరి
పసు పలందిరి మొగములందున
లంకెలంకెలు వేసి కట్టిరి
వేటపోతులను.

౧౨

కన్నుకొలకుల నీరు కార్చుచు
గుండె పగిలెడి వెర్రి అరపుల
నెమరు వేయుట మాని కొన్ని
నిలిచియే యుండెన్.

౩౧

మృత్యుదేవత దీర్ఘదంష్ట్రల
ముందు నిలిచిన కొన్ని మేకలు
చావుదగ్గర పడుట మెరుగక
తినును ఆకలముల్.

౧౪

చావు గడియకో? నిముషమునకో?
చింబోతా! యెందు కింకను
వెఱ్ఱిదాంపత్యంపు ప్రేమకు
వెదకులాడెదవు ?

౧౫

ప్రాణమంటే యెంత తీపే;
లంకె త్రెంచుకు పారిపోతివి.
మహిషమా! నిను విడిచిపెట్టడు
రైతుబాబయ్య.

౧౬

పుండ్లు పుట్టగ ముల్లుకర్రల
పోటులను తిని అరకలాగీ
రైతురుణమును తీర్చి నేటికి
బలికి వచ్చేవా?

౧౭

ఇట్టు లుండగ అర్చకుం డొక
డేగుదెంచెను కఱకుకత్తితో;
విసురు కొక్కొక వేయిపశువుల
నేలకూల్చగను.

౧౮

కలుకుమని శిర మొక్క పెట్టున
నరికివేసెడి వేటకత్తిని
మెడను చాపుచు ఒక అమాయపు
మేక మూర్కొనును.

౧౯

ఇంతలోనే ఒకని కెవనికొ
గ్రామదేవత పూనె, అతడు
బారచాపుచు, సివాలెత్తుచు
పలికె హడలెత్తన్.

౨౦

చాల దీ బలి; చాల దీ వధ;
రక్త మేదీ? మాంస మెక్కడ?
లక్షపశువులు, రక్తకుంభము
లేదె నైవేద్యం?

౨౧

మోతుబరులూ, ముసద్దారులు,
పెద్దరైతులు, వరి? ఎక్కడ?
పీక నొక్కెద. పీల్చివేసెద,
తెండి నైవేద్యం.

౨౨

నాకు ఆకలి, నాకు దాహము
తీర్చుతారా? తీర్చరా? మీ
పాడిపంటల నిట్లె, భగ్గం
పాడు గావింతున్.

౨౩

అనుచు పొలికేకలను పెట్టగ
హడిలిపోవుచు రైతు లందరు,
"అమ్మతల్లికి లోటుచేయము"
అనుచు మ్రొక్కుచును.

౨౪

నిలిచియుండగ నన్ని జీవుల
కంతరాత్ముండైన బుద్ధుడు
తెలిసి యాంతరదృష్టి నప్పుడు
వెలసె నచ్చోటన్.

౨౫

అబ్బురంపడి రైతు లప్పుడు
అంద రాతని చూచుచుండగ
పలికె వారల మూఢతత్వము
పటాపంచ లవన్.

౨౬

బుద్ధుడు

అన్నలారా! రైతులారా!
ఆలకింపుడు నాదుమాటలు,
ఇన్ని ప్రాణుల నరికి చంపిన
యేమి గలుగునయా?

౨౭

మనిషి చేసిన రాయిరప్పకు
మహిమ గలదని సాగి మ్రొక్కుతు
మనుషు లుంటే, రాయిరప్పల
కన్న కనికష్టం.

౨౮

జగన్మాతకు కన్నబిడ్డలె
జీవితతు లన్నియునుకూడా,
ఆమె బిడ్డల చంప నంబకు
ఆగ్రహము రాదా?

౨౯

ఆకృతిని భేదంబెకానీ
ఆమె యంశము అన్ని జీవులు.
ఆదిశక్తికి బలుల నిమ్మని
అన్న దెవరోయీ?

౩౦

రక్తమాంసము లంచమిస్తే
లంచముల తిని యాదిశక్తియు
మీకు ఉపకారాలు చేయుచు
మిణుకుచుండెడునా?

౩౧
వట్టిభ్రమ యిది, రైతులంతా
కట్టిపెట్టుడు జీవహింసను.
రాళ్లు దేవుళ్లైన మన కిక
నిలువ నీ డేదీ?

౩౨
రైతులు
రాయి యందువు, రప్ప యందువు
అమ్మతల్లి ని ; ఒళ్లు తెలియక
ఎవరవయ్యా మూఢుడా? నీ
కేమి తెలియదు ఫో!!

౩౩
బుద్ధుడు
రైతులారా! అమ్మతల్లిని
రాతిలోపల చూపగలరా?
శక్తిలే దీ రాతిబొమ్మకు
చెప్పి మెప్పింతున్.

౩౪
రైతులు
నోరు కలదని బుకాయించకు
అంబ అదిగో పూనె వానికి,
ములికిఉంటే వెళ్లి యాతని
ముందు మాట్లాడు.

౩౫
బుద్ధుడు
ఒళ్లు తెలియని తందనా లవి
ఒట్టిబూటకమైన కేకలు
అంబ లేదూ, కింబ లే దీ
యాలయములోను.

౩౬
మనిషి చేసిన మట్టిబొమ్మకు
మహిమ లేదని నేను చూపిన
జీవహింసను నేటినుండియు
చెయ్యనంటారా?

౩౭
రైతులు
మేము కొలిచే అమ్మతల్లికి
శక్తి లేదని చూపగలిగిన
నేటినుండే హింస చేయము
నిజము, మానెదము.

౩౮
అంత బుద్ధుడు లోని కరుగుచు
ఆలయములో బొమ్మతలపై
ఎడమకాలును పెట్టి నిలిచెను
అందరును చూడన్.

౩౯
రైతులు
ఏమి చేసే మది? అమ్మతల్లిని
యెడంకాలితో తన్నుతావా?
నెత్రు కక్కుకు చచ్చిపోవా
నీవు పాపాత్మా!!

౪౦
బుద్ధుడు
ఆదిశక్తీ, పరాశక్తీ
అణగి ఉంటే రాతిలోపల
మీర లన్నటు నెత్రు కక్కుకు
చచ్చిపో నేమీ?

౪౧

ఒకరినొకరు పింకొలకరు చూచుచు
తెల్లబోయిరి రైతు లందరు.
బుద్ధదేవుని సాహసానికి
బుఱ్ఱ వంకిస్తూ.

౪౨

బుద్ధుడు

రైతులారా! రాతిబొమ్మకు
శక్తిలేదని నమ్మినారా?
నడువు డావలి కొక్క చిత్రము
మీకు కనబరుతున్.

౪౩

ధగద్ధగిత శరీరకాంతితో
ధర్మదేవత అదిగో చూడుడు
వేటపశువులమంద మధ్యను
నిలిచి యేమనునో.

౪౪

ధర్మదేవత

బిడ్డలారా! జీవితములో
ప్రాణు లన్నియు సుఖమొ, దుఃఖమొ
అనుభవించేటందులకె విధి
ఆయు విచ్చేడు.

౪౫

బ్రదుకదలచిన నిండుజీవుల
బలుల కంచును తెచ్చిచంపుట
దారుణం బిది, మహాపాపము
తప్పు తెలియండీ.

౪౬

అని వచించుచు జ్ఞానబుద్ధుని
యంతరాత్మలో నైక్యమందెను
రైతు లందరు బుద్ధదేవుని
చుట్టి యి ట్లనిరి.

౪౭

దేవ దేవా! కావవే
దివ్యప్రభావా! బ్రోవవే యిక
జీవహింసను నేటినుండియు
చేయబోము సూ!!

౪౮

రైతు లందరి పలుకు వినుచును
బుద్ధదేవుడు తథాస్తనుచును
వేటపశువుల రైతుబిడ్డల
వీడి యదృశ్యుడయెన్.

౪౯

రైతు లందరు నెవరిపశువుల
వారు తోల్కొని యిండ్ల కేగిరి
మూఢబుద్ధికి నిదర్శన మొక
ముల్లు కర్రగదా;

౫౦

నాటినుండియు నేటివరకును
జీవహింసను చేయమానిరి
మూర్ఖనగరము జ్ఞానపురియై
ముదము చేకూర్చెన్.

ఆంధ్రదేశం - హరిజనసమస్య

శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు

యూరోపా దేశాలవారిలో మతసంస్థయైన క్రైస్తవమతానికి, అమితమైన గౌరవము, అధికారములుకూడా వున్నాయి. రాజకీయాల్లో మహారాజు కెంత అధికారం వున్నదో, మతవిషయములలో వారిప్రధాన మతగురువు(Archbishop)న కంత అధికారం వుంది. మతసంబంధమైన విషయములలో ఆమతాధికారియొక్క ఆజ్ఞలకు, కట్టుబాట్లకును మహారాజుకూడా శిరసావహించి ప్రవర్తించవలసిందే. వానికి భిన్నంగా నడిచినప్పుడు మహారాజునికూడా శిక్షించే అధికారం ఆమతాధికారికి వుంది. అందుచేత ఆమతాధికారికి మహారాజుకూడా భయపడుతూంటాడు. ఒకప్పుడీ మతాధికారులు, ఇంగ్లండుదేశంలో మహారాజులను తమచేతి కీలుబొమ్మలరీతిగా ఆడించి, రాజకీయాల్లో ప్రధానపాత్ర వహించినట్లు ఇంగ్లండుదేశ చరిత్ర తెలియజేస్తున్నది.

ఈమతసంస్థలకి ప్రజలును, రాజులును ఇచ్చినధనం అపారంగా వుంది. ఈధనం అంతటినీ వారు మతవ్యాప్తికీ, తత్సంబంధమైన విషయాలకీ ఖర్చుచేస్తారు. మతవ్యాప్తి కొరకు, మతప్రబోధమునకు ఏ కెంతధనమైనా ఖర్చుచేయడానికి జంకరు. తమ మతాన్ని ఖండఖండాంతరాల్లోకూడా వ్యాపింపచెయ్యాలని వారెప్పుడూ ప్రయత్నిస్తుంటారు. దీనికొరకు మతప్రచారకుల ననేకమందిని అనేకదేశాలకు పంపి మతబోధ చేయిస్తుంటారు. ప్రస్తుతం మన దేశంలో స్థావరం కల్పించుకొన్న క్రైస్తవ మిషను లన్నీ కూడా, ఆ వుద్దేశ్యాలతో వచ్చినవే ఇక్కడికి.

మన హిందూదేశంలో, ఇంగ్లీషువారు తమ రాజ్యాన్ని సుస్థిరం చేసుకొన్న మరునాటినుంచే వారిక్రైస్తవమతం కూడా మన దేశంలో ప్రవేశించి, మన హిందూమతం మీద దండయాత్రలు సాగిస్తూ వచ్చింది. కాని యుగయుగాలనుంచీ అజేయమై నిలిచి వున్న యీ కోట వారికి ఇంకా పూర్తిగా స్వాధీనం కాలేదు. 'ఎప్పటికైనా సాధ్యం కాకపోతుందా?' అన్న అభిప్రాయముతో చుట్టూ, వివిధమైన పటాలాలతో గుడారాలు వేసుకుని ప్రయత్నిస్తోంది, క్రైస్తవ మతం. కాని మన హిందూమతం తనపూర్వ బలసంపత్తులను తలచుకొని, ఆనందిస్తూ నిశ్శంకముగా నిర్భయంగా నిద్రపోతూంది.

మన ఆంధ్రదేశంలోకి, యీ క్రైస్తవ మతానికి సంబంధించిన మిషనులు ఎప్పుడెప్పుడు వచ్చినవో, అవి వచ్చినప్పటినుంచి, మన దేశంలో ఎందరు క్రైస్తవమత ప్రవిష్టులైనారో కొంచెం చూదాం.

యూరపు దేశాలలోని (క్రైస్తవమతానికి సంబంధించిన) వివిధ సంఘాలు దేశీయులకు మతమిప్పించాలనే

౧౮౪౨-వ సం॥లో అమెరికన్ లూథరన్ మిషన్ వచ్చింది. ఇది గుంటూరు, రేపల్లె, బాపట్ల, పల్నాడు, వినుకొండ, బందరు, రాజమండ్రి మొదలైన ముఖ్యపట్టణాలలో తన శాఖ లేర్పరుచుకొని, కృష్ణా, గుంటూరు, కర్నూలు, గోదావరి, అనంతపురంజిల్లాలలో బాగా మతప్రచారం చేసింది.

౧౮౪౩-వ సం॥న ప్రొటస్టెంట్ మిషన్ వచ్చింది. ఈ మిషనువారు నెల్లూరు, గుంటూరు, బందరుప్రాంతములలో తమ శాఖలను స్థాపించి పనిచేశారు. ఇప్పుడు బందరులో వున్న నోబిల్ కళాశాల ఈ మిషనువారు కట్టించినదే. ఈమిషన్‌లోని "నోబిల్" అనే మతగురువు కట్టించుటచేత దానికి ఆపేరు వచ్చింది.

౧౮౪౮ సం॥ లో "ఫ్రీచర్చి ఆఫ్ స్కాట్లెండు" (Free Church of Scotland) నెల్లూరులో స్థాపింపబడింది.

౧౮౬౫-వ సం॥ లో "ఇంగ్లీషు చర్చి మిషనరీ సొసైటీ" వా రొచ్చారు. వీరు ముత్యాలపాడు, నంద్యాల, బందరు, ఏలూరు, బెజవాడ మొదలైనపట్టణాలలో శాఖ లేర్పరుచుకుని, కృష్ణ, గోదావరి, కడప, కర్నూలు, మొదలైన జిల్లాలలో మతప్రచారం చేశారు. ఆ 'సంవత్సరమే హెర్మాన్సుబర్గు లూథరన్ మిషన్' (Hermansberg Lutheran Mission) కూడా వచ్చింది. దీని శాఖలు నాయుడుపేట, సాలూరుపేట, గూడూరు, వెంకటగిరి, కోడూరు మొదలైన ప్రదేశాలలో స్థాపింపబడ్డాయి.

౧౮౭౦-వ సం॥ లో "కెనేడియన్ బాప్టిస్ట్ మిషన్" (Canadian Baptist Mission) స్థాపితమైనది. దీని శాఖలు కాకినాడ, భీమునిపట్నం, శ్రీకాకుళం, తుని, బొబ్బిలి మొదలైన ప్రదేశాలలో స్థాపింపబడ్డాయి.

ఇవికాక "అమెరికన్ మధుర మిషన్", "బేసిల్ ఎవాంజిలికల్ మిషన్" (Basel Evangelical Mission), "షేల్స్విగ్ హోల్‌స్టీన్ లూథరన్ మిషన్" (Scheleswig-Holstein Lutheran Mission), "సెంట్ ఫ్రాన్సిస్ ఆఫ్ సేల్సు మిషన్" (St. Francis of sales Mission) మొదలైన వనేకం మధ్య మధ్య బయలుదేరి, కొద్దికాలం పనిచేసి అంతరించి పోతూవచ్చాయి.

ఆ యీసంస్థలవా రంతా తమ మత ప్రబోధాని కెట్టిపద్ధతు లవలంబించారు? తమ సంస్థలపేరిట ఉచిత పాఠశాలలు స్థాపించారు, వైద్యాలయాలు కట్టించారు, చర్చిలను నెలకొల్పారు, అనేకవిధాలుగా ధనసహాయం చేశారు, అనేకమందిని మతబోధకులను నియమించి, ప్రతిపల్లెకీ పంపించి మతబోధ చేయించారు, మతగ్రంథాల నచ్చువేయించి ఉచితంగా పంచిపెట్టారు. వారిపాఠశాలలలో విద్యాబోధన గంట, మతబోధ నాల్గు గంటలు. వైద్యంకోసం వచ్చినవారంకరిచేతను మొదట ఏసుక్రీస్తునుగూర్చి ప్రార్థన చేయించి, తమ మతాన్ని గూర్చి వారికి బోధచేస్తూఉంటారు. ఇంకా ఇటువంటి ఆకర్షవంతములైన కార్యములెన్నో చేసి, మనహిందూమతస్థుల ననేకమందిని క్రైస్తవమతంలో కలుపుకుంటూ వస్తున్నారు.

ఈ క్రింది ౧,౨ పట్టికలవలన ౧౮౭౧నుండి ప్రతి పది సంవత్సరములకు క్రైస్తవుల సంఖ్య యేరీతిని హెచ్చినదో, ప్రతి ముప్పది సంవత్సరములకు మొత్తము జనసంఖ్యయున్ను, క్రైస్తవ జనసంఖ్యయున్ను ఎట్లా హెచ్చినదో, ఆంధ్రదేశంలో గత ౬౦ సంవత్సరములలో క్రైస్తవమతం ఎంత అభివృద్ధిపొందినదో తెలుస్తుంది.

౧౮౭౧-వ సంవత్సరందాకా తెలుగుదేశంలో క్రైస్తవమతం వృద్ధిపొందలేదు. ౧౮౮౧-వ జనాభాలెక్కలనుబట్టి చూస్తే అది క్రమంగా ఉత్తరానికి వ్యాపిస్తున్నట్లు కనిపిస్తుంది. ౧౮౯౧ నాటికి క్రైస్తవమిషనరీలకు తెలుగుదేశంలో గట్టిపట్టు చిక్కింది. అందులో ౧౮౮౧-౧౮౯౧ సంవత్సరాలమధ్య క్రైస్తవమతం కృష్ణ, నెల్లూరు, కర్నూలుజిల్లాలలో బాగా అతిత్వరగా వ్యాపించింది.

	౧౮౮౧	౧౮౯౧
కృష్ణ జిల్లా	౩౬,౧౯౪	౬౮,౫౨౪
నెల్లూరు ,,	౨౦,౭౯౪	౪౭,౧౭౬
కర్నూలు ,,	౧౧,౪౫౫	౨౨,౭౩౫

మద్రాసురాజధానిలో ౧౮౭౧ మొదలు ౧౯౦౧ వరకుగల ౩౦ సంవత్సరాల కాలంలో అసలు జనసంఖ్య నూటికి ౨౨.౧

క్రైస్తవ సంఖ్యాభివృద్ధిని సూచించు పట్టిక, ౧.

జిల్లా	౧౮౭౧	౧౮౮౧*	౧౮౯౧*	౧౯౦౧*	౧౯౧౧*	౧౯౨౧*	౧౯౩౧*
గంజాము ...	౬౭౯	౧,౫౫౧	౨,౨౯౨	౨,౪౨౬	౨,౩౬౭	౧,౯౬౯	౮,౫౮౪
విశాఖపట్టణము	౨,౧౮౫	౩,౪౧౦	౩,౦౧౪	౪,౧౯౧	౪,౯౮౩	౫,౬౫౬	౩౪,౧౨౪
గోదావరి ...	౧,౪౮౩	౩,౬౮౭	౮,౬౨౨	౧౬,౦౬౬	౮,౨౪౦	౧౪,౨౩౭	
,, పశ్చిమ	—	—	—	—	—	—	౨౯,౫౭౭
,, తూర్పు	—	—	—	—	—	—	౬౨,౬౬౧
కృష్ణ ...	౭,౬౭౦	౩౬,౧౯౪	౬౮,౫౨౪	౧,౦౧,౪౧౪	౪౯,౮౬౩	౯౧,౦౮౭	౧,౦౧,౨౮౯
గుంటూరు †	—	—	—	—	౧,౨౩,౭౦౭	౧,౫౩,౫౧౦	౨,౩౭,౭౭౨
నెల్లూరు ...	౩,౦౧౨	౨౦,౭౯౪	౪౭,౧౭౬	౫౩,౯౪౮	౪౪,౨౯౮	౫౨,౪౯౬	౬౫,౫౯౩
కడప ...	౪,౯౭౩	౬,౦౬౭	౯,౭౨౫	౧౮,౯౨౩	౨౨,౪౦౮	౨౫,౭౩౯	౩౬,౬౬౭
కర్నూలు ...	౩,౮౫౫	౧౧,౪౫౫	౨౨,౭౩౫	౩౪,౦౪౩	౪౨,౦౬౮	౫౩,౬౫౬	౭౪,౨౫౫
బళ్లారి ...	౫,౫౪౫	౪,౧౨౯	౫,౨౮౩	౫,౦౬౬	౪,౪౮౧	౩,౫౩౨	౭,౧౧౩
అనంతపురం†	—	౮౫౭	౧,౭౮౩	౨,౬౭౫	౩,౬౩౬	౪,౯౨౩	౬,౫౪౬
చిత్తూరు † ...	—	—	౨,౫౩౫‡	౩,౮౬౪‡	౪,౫౫౮‡	౬,౯౧౬	౧౦,౬౪౫
మొత్తం ...	౨౯,౪౦౨	౮౮,౧౪౪	౧,౭౧,౬౮౯	౨,౪౨,౬౧౬	౩,౧౦,౬౦౯	౪,౧౩,౭౨౧	౬,౭౪,౮౨౬

* ఈ సంవత్సరముల జనాభాసంఖ్యలలో గంజాము, విశాఖపట్టణము, గోదావరి ఏజెన్సీభాగములజనసంఖ్యయున్ను, కర్నూలుజిల్లాలోని బనగానపల్లి, బళ్లారిజిల్లాలోని సాండూరుసంస్థానముల సంఖ్యలున్ను చేరలేదు.

చొప్పున వృద్ధి అయితే క్రైస్తవుల సంఖ్య నూటికి ౯౯ చొప్పున వృద్ధిఅయినట్లు తేలినది. ౧౯౦౧-వ సంవత్సరంనుంచి ౧౯౩౧ వరకు గల మధ్యకాలంలో తెలుగు దేశం మొత్తం మీద నాలుగులక్షల పైచిల్లర పెరిగింది క్రైస్తవుల సంఖ్య. ఈ యంకెలనుబట్టి చూస్తే మొత్తం జనసంఖ్య ఏరీతిని వృద్ధిచెందుతున్నదో, క్రైస్తవ జనసంఖ్య ఏవరవడి చొప్పున వృద్ధిచెందుతున్నదో తెలుస్తుంది.

క్రైస్తవమతానికున్న ఆయుధబలం లేదుకాని, మన హిందూమతం అంగబలంలోను, అర్థబలంలోను మరి యేమతానికీ తీసిపోదు. కాని క్రైస్తవమతం తనబలాన్నంతనీ మతాభివృద్ధికీ, మతవ్యాప్తికీ ఉపయోగిస్తుంది. హిందూమతం తన బలాన్నంతనీ మతాధికారుల ఆడంబరాలకీ, మర్యాదలకీ, లేనిపోని ఆర్భాటాలకీ ఉపయోగిస్తోంది. హిందూమతం స్వతస్సిద్ధంగా ఎంత మహోత్కృష్టంగా ఉండినప్పటికీ, దానిప్రస్తుత దుస్థితికి, ఆ మతాధికారులు, ప్రజలే కారణం. దీన్నిగూర్చి గాంధిమహాత్ముడు

"Hinduism is a pure faith, free from idolatory; that the spiritual faith of India is corruptded by materialism and because of this she has lost her place in the van of progressive nations".

క్రైస్తవ సంఖ్యాభివృద్ధిని సూచించు పట్టిక, ౨.

జిల్లా	౧౮౭౧		౧౯౦౧ *		౧౯౩౧ *	
	మొత్తము జనసంఖ్య.	క్రైస్తవులు	మొత్తము జనసంఖ్య	క్రైస్తవులు	మొత్తం జనసంఖ్య.	క్రైస్తవులు
గంజాము ...	౧౫,౨౦,౦౮౮	౬౭౯	౧౬,౮౯,౧౪౨	౨,౪౨౬	౨౪,౧౧,౬౧౯	౮,౫౮౪
విశాఖపట్టణము	౨౧,౫౯,౧౯౯	౨,౧౮౫	౨౦,౮౨,౬౬౨	౪,౧౯౧	౩౬,౦౭,౯౪౮	౩౪,౧౨౪
గోదావరి ...	౧౫,౯౨,౯౩౯	౧,౪౮౩	౨౧,౪౧,౯౧౭	౧౬,౦౬౬		
,, పడమర	—	—	—	—	౧౯,౨౦,౫౮౨	౨౯,౫౩౭
,, తూర్పు	—	—	—	—	౧౨,౨౩,౦౫౬	౬౨,౬౬౧
కృష్ణా ...	౧౪,౫౨,౩౭౪	౭,౬౭౦	౨౧,౫౪,౮౦౩	౧,౦౧,౪౧౪	౧౨,౫౪,౨౦౮	౧,౦౧,౨౮౯
గుంటూరు ...	—	—	—	—	౨౦,౩౫,౬౬౦	౨,౩౭,౭౭౨
నెల్లూరు ...	౧౩,౭౩,౮౧౧	౩,౦౧౨	౧౪,౯౬,౯౮౭	౫౩,౯౪౮	౧౪,౮౬,౨౨౨	౬౫,౫౯౩
కడప ...	౧౩,౫౧,౧౯౧	౪,౯౭౩	౧౨,౯౧,౨౬౭	౧౮,౯౨౩	౯,౪౯,౩౯౭	౩౬,౬౬౭
కర్నూలు ...	౯,౫౯,౬౪౦	౩,౮౫౫	౮,౭౨,౦౫౫	౩౪,౦౪౩	౧౦,౨౪,౯౬౧	౭౪,౨౫౫
బళ్లారి ...	౧౬,౬౮,౨౦౬	౫,౫౪౫	౯,౪౭,౨౧౪	౫,౦౬౬	౯,౬౯,౭౭౪	౭,౧౧౩
అనంతపురం	—	—	౭,౮౮,౨౫౪	౨,౬౭౫	౧౦,౫౦,౪౧౧	౬,౫౪౬
చిత్తూరు ...	—	—	—	౩,౮౬౪‡	౧౪,౪౭,౧౦౩	౧౦,౬౪౫
మొత్తం...	౧౨౦,౮౦,౨౫౧	౨౮,౪౦౨	౧౩౪౬౪౩౦౧	౨,౪౨,౬౧౬	౧,౯౩,౮౦,౯౪౧	౬,౭౪,౮౨౬

†. అనంతపురము ౧౮౮౨లోను గుంటూరుజిల్లా ౧౯౦౪ లోను, చిత్తూరు ౧౯౧౧ లోను ఏర్పాటయినవి.

‡. జనాభా నివేదికలలో ఇచ్చిన సంఖ్య లివి.

అన్నాడు. క్రైస్తవ మతాధికారులు తమ మతవ్యాప్తికొరకు లెక్కలేని ధనం వ్యయంచేసి, శ్రమలుపడి, అనేకనూతనవిధానాలలో మతప్రబోధం చేస్తుంటే, మన మతాధికారులు సుఖప్రియులై, ఏనుగులు, పల్లకీలునెక్కి పట్టణములకుమాత్రము పోయి, భిక్షులపేరిట ధనికులదగ్గరనుంచి డబ్బు గుంజుకుపోతున్నారు. కాని, మతంలో తమ కెట్టిస్థానం వున్నదో, ఎంతటి బాధ్యత వున్నదో, తమవిధివిధానము లేమిటో గ్రహించి ప్రవర్తించటం లేదు.

యుగయుగాలనుంచీ సుస్థిరంగా పాతుకొనిపోయిజగద్విఖ్యాతికాంచిహిందూమతానికాలవాలమైన హిందూదేశంలో, అనేకవేల మైళ్లదూరాన్నుంచి వచ్చిన క్రైస్తవమతం దినదినాభివృద్ధి పొందటానికి కారణం ఏమిటి? క్రైస్తవమతంయొక్క గొప్పతనం కాదు. మన మతంలోవున్న ఒకచిన్నలోపం. అదే "అంటరానితనం." మన దేశపు జనాభా మొత్తంలో ౫-వ వంతు నిమ్నజాతులవారున్నారు. అందులో మాల మాదిగ మొదలైన అంటరాని జాతు లెక్కువ. ఈ జాతులవారిని అంటరాని వారని దూరంగా తరిమేస్తున్నాము. వీరందరినీ క్రైస్తవమతం ఆదరించి, అభిమానించి చేరదీస్తోంది. అందుచేత క్రొత్తగా క్రైస్తవ మతం అవలంబించినవారిలో ౧౦౦కి౯౦మంది ఈ అంటరానిజాతివారే. మనమతంమొత్తంలో అయిదవభాగాన్ని ఆక్రమించివున్న ఈ జాతులను, హిందూమతం నిర్లక్ష్యంచేసి వదులుకున్నట్లయితే, తప్పకుండా క్రైస్తవ మతంవారందరినీ ఆదరించి ఆశ్రయమిస్తుంది. తన్మూలంగా హిందూమతానికీ, దేశానికీ తీరనినష్టం వస్తుం దని పూర్తిగ తెలిసినవాడు కనుకనే గాంధిమహాత్ముడు హరిజనప్రచారం ప్రారంభించాడు. మనమతంలోని, అంటరానితనమనే యీదురాచారాన్ని సహించలేక, విసుగుచెంది, అన్యమతాన్ని ఆశ్రయిస్తున్న యీనిమ్నజాతులవారి నందరినీ ఉద్ధరించి, హిందూమతంలో వారికి తగినస్థానం ఇచ్చి, హిందూమతాన్నీ, హిందూదేశాన్నీ ఉద్ధరించడమే హరిజనోద్ధరణలోని మహాత్ముని ముఖ్యోద్దేశ్యం.

క్రైస్తవమత ఈ విధంగా వృద్ధిపొందుతోం దంటే దాని అర్థ మేమిటి? హిందూ మతం క్షీణిస్తున్న దన్నమాట; హిందువుల సంఖ్య క్రమంగా క్షీణిస్తోం దన్నమాట: ఎందువల్లనంటే, క్రైస్తవ మతబోధకులు మత మిచ్చి, క్రైస్తవులను చేస్తున్నది విస్తారం కడజాతివారిలోనుంచే గనుక. యుగయుగాలనుంచి, తరతరాలనుంచి హిందూ దేవతల నారాధించి, హిందూమతాన్ని అంటిపెట్టుకొనివుండి, మేమున్నూ హిందువులమే అనిచెప్పుకొంటూవస్తున్న హరిజనులు (మాల, మాదిగలు) తమపూర్వపుమతం విడిచిపెట్టి క్రైస్తవమతం అవలంబిస్తూవస్తే అది హిందూ మతానికీ, హిందువులకూ ఎంతటి గొప్ప దెబ్బో పై అంకెలనుబట్టి తెలుసుకోవచ్చును.

ఈఅంటరానితనం మనమతంలోతొలుత నుంచీ లేదనీ, మధ్యకాలంలో కొందరు స్వార్థపరులచేత ప్రవేశపెట్టబడినదనీ గాంధిమహాత్ముడు చెప్పుతున్నాడు. ఏదిఎట్లా ఐనా ప్రస్తుతం ఈ అంటరానితనం మన దేశంలో వుండటం చేతనే క్రైస్తవమతం తనప్రచారం నిరాఘాటంగా సాగించగలుగుతోంది. దీనివలన మన

మతానికీ దేశానికీ అపారనష్టం కలుగ గలదు. కనుక అంటరానితనాన్ని రూపు మాపి, నిమ్నజాతులవా రందరకీ తగిన స్థానం ఇచ్చి మనహిందూమతాన్ని, మన హిందూదేశాన్ని పునరుద్ధరించవలసిన బాధ్యత ప్రతిహిందువునిమీదను, ముఖ్యంగా మతాధికారు లగు మతాధికారులమీదను కలదు.

భక్తరోహిదాసు

శ్రీ భమిడి ఉమామహేశ్వ రావధాని

ప్రవిమలంబైన గంగాస్రవంతి చెంత
తనదు కులవృత్తివలన జీవనముఁ గొనుచు
పరమశాంతుండు దాంతుండు, పరహితుండు,
భక్తుఁ డొకఁ డుండె మాదిగ పల్లెలోన.

అనుదినం బతఁడు జాహ్నవిలోన మున్గి
చర్మపాత్రంబునన్ సలిలముల్ దెచ్చి
తొలుత సాలగ్రామ శిలపయిన్ గొన్ని
తులసికిన్ గొన్ని తజ్జలములన్ బోసి
పూజించిననుగాని భుజియింపఁబోఁడు
కాల మెన్నఁడు వృథా గడుపఁగాఁబోఁడు
శ్రీహరి భక్తుండు రోహిదాసుండు.

వినుతికెక్కిన వాని విఖ్యాతి గరిమ
వినినంత సైపక విప్రుఁ డొక్కండు
పగ, వాని నవమానపరుపఁగా నెంచి
తరలివచ్చెను రోహిదాసునికడకు.

సత్యసంపన్నుఁ డా చండాలుఁ డంత
బాపనయ్యను గాంచి ప్రణతు లర్పించి
చేతులు జోడించి, "సెలవిం డదేమొ?
మీర లేతెంచిన కారణం" బనఁగ
"నక్క యెక్కడ రోరి? నాక మెక్కడర?
కాశ మెక్కడ రోరి? కలహంస మేడ?
నీవేడ? నీచుఁడా! దేవుఁ డెక్కడర?
చాలు చండాలుఁడా! చాలు నీచర్య"
యనుచు విప్రుండు పల్కిన పల్కులకును
చండాలుఁ డిట్లనె శాంతచిత్తమున
"సృష్టిలోఁ గలయట్టి యెల్లజీవులును
సర్వేశ్వరుని దృష్టి సమముగావొక్క?
తెలిసి యీ జీవిని వెలిబెట్టె దేల?
అఖిలాత్ము సేవింప నర్హు లందరును."
అనుచుఁ బల్కిన, విప్రుఁ డలఘుకోపమున

"ఓరిదుర్మార్గుఁడా! ఓబ్రహ్మద్రోహ!
ఏవిధిన్ నీవు మాదేవుఁ గొల్తువుర;
ఏది నీ కర్హత! హీనవర్ణుండ!"
అనుచు నిందించు బాపనిపల్కులు విని
కొంచె మైనను కోపగింపక నవ్వి
"భూదేవుఁడా! చూడుమా దేవు" ననుచు
తోలుభరణిలోని నీలంపుశిలను
జూపింప, బాపండు కోపించి "యోరి!
తులువ! సాలగ్రామశిల నల గొడ్డు
చర్మము పాల్జేసి సంతసించెదవు,
దాని ముట్టుట కర్హతయులేని నీవు,
దాని సేవకుఁగూడఁ దగనట్టి నీవు,
తొలగించి చర్మ మాశిల నిటుఁ బెట్టు"
మనుచు గద్దించు పారుని పల్కులకును
చాల యబ్బుర మంది చండాలుఁ డంత
"నిందింపకుము దాని నీకు దండంబు
బాపఁడా! నాకున్న పాత్ర మయ్యదియె;
తోలు జేసినయట్టి దోస మదేమి?
భ్రమఁగొల్పి మురిపించు పాడుదేహములు,
మనలను గన్నట్టి మాతృగర్భములు,
వేదముల్ పఠియించు విప్రులనోళ్లు,
సురలఁ బూజించు భూసురకరంబులును,
ఇవి యవి యననేల? యెల్లజీవులును
చర్మమయంబులే—చర్మమే నెలవు
సర్వేశ్వరునకు, విచారింపు"మన్న
ననలంబులోన నాజ్యము వోసినట్లు
కోపంబుచేత భగ్గున మండిపడుచు,
"ఓనీచ! నీవు నా కుపదేశమటర?
మూయింతుఁ జూడు నీవాయినం"చనెడు

విప్రుని పల్కులు వెడవిడాటకయె
అది యేమి చిత్రమో? అది యేమిమాయొ?
బ్రహ్మతేజంబు రూపము నొందినట్లు
చండాలు మోమున సాక్షాత్కరింప,
ముకుళితహస్తుఁడై పుడమిపై వ్రాలి,
"భక్తవత్సల! నీదుభక్తుని దూరి
దురితమార్జించిన దుర్మార్గుఁ డితఁడు;
దాక్షిణ్యచిత్త! నీదాసుని యెడల
నగ్గొనర్చినయట్టి హీనుఁ డితండు;
శ్రీహరీ! తెలియక జేసినయట్టి
తప్పు మన్నింపు నీదాసదాసుండ;
తండ్రి! రక్షించు నీదయకుఁ బాత్రుండ"
ననుచు ప్రార్థించు విప్రుని మొఱల విని
"లెమ్ము విప్రోత్తమా! లెమ్ము నీ వింక,
తెలియకఁ బల్కిన పలుకులకు మఱి
యెఱుఁగకఁ జేసిన కృత్యంబులకును
పాపంబులేదన సామి మఱి వినవె?
భగవంతుఁడే మన పాలిదైవంబు,
భగవంతుఁడే మన ప్రాపగు తండ్రి
సకలజీవులయందు సమత వర్తించు
నంచు గుర్తించితి వది జ్ఞానచిహ్నం;
జ్ఞానోదయంబయ్యె సామి నీ" కంచు
వినయోక్తు లలరఁ దా విప్రుని కనియె.

విప్రుఁ డంతట వాని విజ్ఞాన మెఱిఁగి
'శ్రీహరి భక్తుండు రోహిదాసుండు,
భక్తవరులలోనఁ బ్రథమగణ్యుండు,
ఘనుఁడు, పుణ్యాత్ముఁ"డనుచు నుతించి
సరసుఁడై తన నివాసమ్మున కరిగె.

హిట్లరు: జర్మను వ్యవసాయము

శ్రీ కొప్పర్లకోట సత్యనారాయణమూర్తి

"అంగవ్రాతమునకు చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగవ్రాతము రక్షచేయు క్రియ..."

— భాగవతము.

జర్మను వ్యవసాయ పునరుద్ధరణ, నిరుద్యోగ సమస్యా నివారణ, ఇవి హిట్లరు కార్యక్రమంలో ప్రధాన విషయాలు. వీటిని గురించి అతడు మొదటి నుంచీ హెచ్చరిస్తూ వచ్చాడు. 1933 జనేవరిలో తాను అధికారానికి రావడంతోటే తిరిగి జ్ఞాపకం చేశాడు. ఆ మరుచటి నెల ఒక సందర్భంలో అతడన్న మాటలు; "సహోదరులారా! ఒక్క విషయం మీరు నిశ్చయంగా నమ్మండి. జర్మను రైతాంగానికి కట్టకడపటి, తుది, ఆఖరు, అవకాశం ఒక్కటే కలదు. నాజీపరిపాలనక్రింద నా వ్యవసాయకార్యక్రమం మీరు అమలులో పెట్టగలిగితిరా, జర్మను జాతిని, జర్మను నేలను పోషించి సంరక్షించగల గట్టి పునాది ఏర్పాటవుతుంది; లేనియెడల సోషలిజము ఒక్కటే మనకు గతి అవుతుంది"; అనగా, జర్మను సామ్రాజ్యము "రైతు రాష్ట్రం" కావాలి. మరో సందర్భంలో అతడు అన్న మాటలు: "ఇకముందు జర్మనీదేశము 'రైతురాష్ట్రము'గా మాత్రమే నిలిచియుండగలదు! లేదా, పూర్వం హోహెనుస్టాఫెను, హోహెనుజాలరను చక్రవర్తుల సామ్రాజ్యాలు అంతరించినట్లే, అంతరించిపోతుంది.... ఏజాతికి బలమూ, ఆరోగ్యమూగల రైతాంగము సజీవమైన పునాదిగా ఏర్పడివుంటుందో, ఆజాతి దైవప్రేరితమైన దెబ్బలను కష్టనష్టాలను సులభంగా ఎదుర్కొ గలదు. జాతీయసరాగానికి విరుద్ధంగా, ధనాశాపేక్షితులై, తమరైతాంగాన్ని ధ్వంసంచేసుకొన్న జాతులు చరిత్ర రంగంలోనుంచి శాశ్వతంగా అంతరించిపోయినాయి." రైతు పడిపోవడం, జాతియొక్క పతనానికి ముఖ్య కారణమని అతడి నమ్మకం. "జర్మను రైతుయొక్క వినాశము జర్మను జాతియొక్క వినాశమే" అని అతడన్నాడు.

జర్మనుజాతిని, జర్మను నేలను పోషించి సంరక్షించగల 'రైతురాష్ట్రమా'? లేకపోతే, "సోషలిజం" పేర సంఘవిచ్ఛేదమా? ఇది, 1933 లో జర్మనీని ఎదుర్కొన్న సమస్య. ఒక్క జర్మనీని మాత్రమే కాదు. నేడు అన్ని దేశాలను, మన దేశాన్ని కూడా, ఎదుర్కొంటున్న సమస్య ఇదియే!

"ఇక నాలుగేళ్ల కాలంలో జర్మనురైతు తన దుస్థితిలోనుంచి బైటపడాలి" అని నాజీపార్టీవారు 1933 లో శపథం చేశారు.

వారి ఉద్దేశంలో, నశించిన చేతిపనులను ఎన్నటికైనా పునరుద్ధరించవచ్చును. ఆర్థికదుస్థితిలో మునిగియున్న మధ్యతరగతి ప్రజను ఎన్నటికైనా తిరిగి లేవనెత్తవచ్చును, సంపూర్తిగా క్షీణించిపోయిన పరిశ్రమలను ఎన్నటికైనా తిరిగి అభివృద్ధి చేయవచ్చును. దరిద్రం ఓడుతూ పాడుపడిపోయిన పట్నవాసాలకు ఎన్నడైనా తిరిగి ప్రాణం పోయవచ్చును. కాని ఒకసారి రైతాంగాన్ని పొలంలోనుంచి లేవగొట్టితిమా, వారు ఒకసారి తమపదవిలోనుంచి దిగజారారా తిరిగి ఎన్నటికీ తేరుకోలేరు, తొల్లిటిపదవికి రాలేరు.

ఈ విషయంలో నాజీల ఉద్దేశం కేవలం ప్రజల ఐశ్వర్యాభివృద్ధి మాత్రమే కాదు. సాంఘికంగాను రాజకీయంగాను కూడా జాతియొక్క భవిష్యదభివృద్ధి, జవసత్వాలు, వీర్యము, శాంతిసౌఖ్యాలు, సహనశక్తి చాలావరకు జర్మను రైతాంగముమీదనే ఆధారపడి వున్నాయనీ, రైతుకుటుంబాలు నిస్సంతులై అంతరించిపోవడం దేశానికంతటా సంభవించే మహాసర్వనాశకాలలో ఒకటి అనీ, అవి సంతానసమృద్ధిలో, ఐశ్వర్యాభివృద్ధిలో తులతూగడం జర్మనీ

దేశ మనుభవించే మహదైశ్వర్యాలలో వకటిఅనీ నాజీల అభిప్రాయం. రాజకార్యాలు చక్కదిద్దే సచివోత్తముడు దేశక్షేమాని కెంత యవసరమో, రైతుకూడా అంతే అవసరమనీ, ప్రభుత్వాదరణకు మన్ననకు అంతే పాత్రుడనీ వారి ఉద్దేశ్యం. కాబట్టి జర్మనుజాతిని పునరుద్ధరించాలి అంటే జర్మనురైతాంగాన్ని పునరుద్ధరించడం ప్రథమకర్తవ్యమని, వారి దృఢవిశ్వాసం. వారిదృష్టిలో జర్మనురైతు, జర్మనుజాతికి ప్రాణాధారం, ముఖ్యమైన అండ, బలం.

ఆ జన్మాంతం మెట్టవేదాంతాలలో మునిగి తేలుతూవున్న మనకు, ఈదేశంలో, ఈఆదర్శాల అర్థం సరిగా బోధపడకపోవచ్చును. ముందు కార్యము, తరువాత వాక్కు, తమకు నిత్యాచారమైన నాజీలు, కార్యాచరణమేగాని వేదాంతచర్చలంటే అసహ్యించుకునే హిట్లరు, ఉన్నతవిద్యావిహీనుడై, రైతులకు సహజమైన కార్యదీక్షతో, ఖండితమైన, మోటి, పాడి, ముక్తసరి, కఠోరవాక్కులతో, దృష్టితో, తనస్వీయచరిత్రను వ్రాయడం, ఉపన్యాసాలియ్యడం మాత్రమే కాకుండా, రాజకార్యాలనుసైతము చక్కబెడుతూవున్న మోటుమానిసియైనహిట్లరు, వ్యవసాయదారులననుసరించి ఇన్ని వేదాంతోపన్యాసా లీయుట యేల? ఇంత శ్రద్ధను తీసుకోనేల?

నాజీఆదర్శాలూ, దృష్టీ మనకు అర్థమైతేనేగాని ఈవిషయం స్పష్టం కాదు. అవి యీ విధంగా వుంటాయి:—

ప్రపంచంలో వున్న జాతు లన్నిటిలోను 'జర్మను' లేక 'నార్డికు' జాతి మహోన్నతమైనది. మిగతమానవకోటి కంతకూ లేని కొన్ని ప్రత్యేకలక్షణాలు, కొంత ప్రత్యేక అధిక్యత ఆ జాతికి కలవు. స్థిరబుద్ధి, కార్యసామర్థ్యము, కార్యోత్సాహము, నిర్దుష్టమైన గ్రహణశక్తి, పరిశీలనాశక్తి, వివేకము, అకుంఠితమైన ప్రభుశక్తి, అనన్యసామాన్యమైన ధైర్యస్థైర్యసాహసాలు,—ఇవి జర్మనుల ముఖ్యలక్షణాలు. సైనిక, రాజకీయవిషయాలలో వారికి అభిరుచీ, ఉత్సాహమూ మెండు. ఇతరజాతు లందరికన్న వారికి సంఘీభావమూ, పరస్పరసహనమూ, సహాయమూ హెచ్చు. ఈ కారణాలవల్ల జర్మనుజాతి తన సంస్కృతికీ నాగరికతకూ అనుకూలమైన ప్రత్యేక ప్రపంచదృష్టినీ, సంఘధర్మాన్నీ అభివృద్ధిచేసుకుంది.

కాని ఆ జాతియొక్క దౌర్భాగ్యంకొద్దీ ఈ మధ్యకాలంలో రోమనునాగరికత ఐరోపాఖండమంతటా ఆవరించి జర్మనుల ప్రత్యేకసభ్యతను నాగరికతను అణచివేసింది. రోమనుసంస్కృతి, రోమను రాజ్యాంగవిధానము, రోమనుచట్టాలు క్రమంగా క్రైస్తవమతానికీ, ధనికుల అధిక్యతకూ, సోషలిస్టుల ప్రాబల్యానికీ దారి చూపాయి. ప్రజాస్వాతంత్ర్యం పేర, ప్రజా ప్రభుత్వం పేర, ధనికులు సంఘాన్ని తమ దాస్యంలో వుంచుకొన్నారు. జనసామాన్యంలో "నేను" అన్న అహంభావ పూరితమైన స్వతంత్రభావం అభివృద్ధి కావడంతో, ధనికులు వారిని లాలించి పాలించి తమ అదుపాజ్ఞలకిందకు తెచ్చుకొన్నారు. సామాన్యులు, "మన మంతా సమానులమే" అన్న వేదవాక్యం నోటితో ఉచ్చరిస్తూ, క్రియలో తమపై అధికార మంతా ధనికులపరం చేసి, తమ దరిద్రానికి, అజ్ఞానానికి నికృష్ట జీవితానికి అధమస్థితికీ చాలావరకు తామే కారకులైనారు ప్రజాప్రభుత్వమూ, ఓట్లూ, ఎన్నికలూ భాగ్యవంతుల అధికారమూ, సంఘమూ అంతా వారివెంటబడి పూజించడం, బీదవారి నీచస్థితీ ఇంతకాలమూ నిరాటంకంగా కొనసాగాయి. ప్రజలలో సంఘీభావం నశించి, 'ఎవరికి వారే' అన్న ఒంటెత్తుతనము, స్వతంత్రత ఏర్పడ్డాయి. సంఘం అనేక తరగతులకింద చీలిపోయి వారిలో వారికి పరస్పరస్పర్ధలు, కొట్లాటలు, కొద్దీ గొప్ప వివాదాలు, స్వార్థపరత్వమూ అధికమై తలకొక పాట, తల కొక నాయకుడు చొప్పున తయారైనాడు. ఈ విధంగా అరాచకం ప్రబలి, పెద్దచేప చిన్నచేపను తినే న్యాయంలో, స్వార్థపరులైన బలవంతులు బలహీనులను పీడించుకొని తింటున్నారు. ప్రజ లన్ని తరగతులవారూ తమహద్దులను మీరి, పూచీలను మరచి, హక్కులకోసం కొట్లాడుతున్నారు. సంఘంలో అదుపాజ్ఞలు, నీతి నియమాలు, క్రమప్రవర్తన నశిస్తున్నాయి. అతృప్తి,

అశాంతి, అసౌఖ్యభావము, అవివేకము, అనిశ్చయము, అలజడి, పేరాస, నిరాశ అధిక మౌతున్నాయి. ఇట్టి దుర్భరపరిస్థితులలో సోషలిజము ఒక్కటే సంఘాన్ని ఉద్ధరించి దరిచేర్చగల తెప్ప యని అందరూ భ్రమించి మోసపోతున్నారు. రోమనునాగరికతా, క్రైస్తవమతమూ, ధనికుల అధికారమూ, ప్రజాప్రభుత్వమూ కలిసి లోకాన్ని "సోషలిజము" అనే వడిసముద్రంలో ముంచివేసి వ్యక్తిస్వాతంత్ర్యంలో వున్న మంచితనాన్ని పూర్తిగా చంపివేశాయి. కాని సోషలిజముమాట ఏల? ఈనాటి ప్రజల దుర్భర మనోదుస్థితలో అన్ని కోరిక లిచ్చే కల్పతరువు లభించినా వారికి శాంతి సౌఖ్యాలు చేకూరుతాయా అన్నది మిక్కిలి సందేహాస్పదమైన విషయం. కాబట్టి నాజీల ఉద్దేశ్యంలో, సంఘశత్రువులు, సంఘద్రోహులు, సంఘవినాశన కారకులు, ఎవరు? ఒకవంక స్వార్థపరులైన ధనికులు, మరో వంక సోషలిస్టులు. ఈ యిద్దరినుంచీ సంఘాన్ని కాపాడాలి అంటే ప్రభుత్వాధికారాన్ని, కుటుంబాన్ని, సంఘధర్మాన్ని నీతినియమాలను బలపరచాలి. వ్యక్తి స్వాతంత్ర్యము, విచ్చలవిడితనము, విరగబాటులను అరికట్టాలి. సంఘంయొక్క పునాదులను తినివేస్తూవున్న సోషలిజము అనే చేదుపురుగును నిర్మూలంచెయ్యాలి. సంఘంలో వున్న నికృష్టులు, దురదృష్టవంతులు దరిద్రులు సంఘాన్ని తామున్న హీనస్థితికి దిగలాగడంకోసం ఉద్దేశించిన కూలీమతము సోషలిజము. అధమాధమస్థితిలో, సంఘాన్ని, హెచ్చు తగ్గులు లేకుండా, సరిసమానంగా ఉండేటట్టు లెవెలు చేయడం దానిఆదర్శం. దానిదృష్టిలో పెద్దా పిన్నా, కొద్దీ గొప్పా వ్యత్యాసాలు లేవు. సహజఔన్నత్యం కల అధికులయెడల అసూయ తప్ప అది పూజించే భగవంతుడు వేరు లేడు. సృష్టికి సహజమైన, భగవత్ప్రసాదితమైన శక్తిసామర్థ్యాలలో వ్యత్యాసాలకు మానసికౌన్నత్యానికి అపరమనాస్తికమతంలో తావు లేదు. ప్రకృతికి, భగవత్సృష్టికి, ప్రపంచధర్మానికి విరుద్ధమైన అట్టినికృష్టులసామ్రాజ్యానికి, అధముల సర్వసమతకు, సృష్టికి ప్రతిసృష్టికి జర్మనుజాతి, నాజీపార్టీ సహించవు.

నాజీలఉద్దేశంలో సమర్థులైన నాయకులు జాతిని నడపాలి. కిందివారు తమతమ శక్తిసామర్థ్యాలకు అర్హమైన స్థానాలలో వుండాలి. వ్యవసాయంమొదలైన వృత్తులలో వ్యాపారాలలో పోటీ లుండాలి. వ్యవహారదక్షులు తమ స్వంత పూచీమీద వృత్తులను వ్యాపారాలను నడిపి లాభనష్టాలు పొందాలి. సమర్థులు, అదృష్టవంతులు మిగలాలి; పైకి రావాలి. అసమర్థులు, దురదృష్టవంతులు అణగారిపోవాలి. అందువల్ల వృత్తులు, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. సంఘానికి అన్నివిధాలా లాభం చేకూరుతుంది. కాని ఈపద్ధతులు మితిమీరరాదు. కొద్దిమంది వ్యాపారస్థులు తమస్వలాభం గమనించుకోవడంలో సంఘక్షేమానికి విరుద్ధంగా ప్రవర్తించరాదు. వ్యక్తిలాభంకన్న సంఘక్షేమమే ప్రధానమన్న విషయం మరువరాదు. అట్లుకాక సంఘక్షేమానికి హాని కలిగినప్పుడు అధికారు లట్టిపద్ధతులను నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వాధికారంకిందకు తేవాలి. ఉదా: జర్మనురైతు విదేశాల పోటీల కాగలేకపోతున్నాడు. కాని అంతమాత్రాన ప్రజాస్వతంత్రంపేర ఆతణ్ని అంతరించిపోనీయగూడదు. ఇది దేశహితార్థము ప్రభుత్వము చేయవలసినపని.

ఏవ్యాపారంలోనైనా యజమాని తనస్వలాభం కోసం పనివాళ్లను పీడించరాదు. పనివాళ్లు తమ గొంతెమ్మకోరికలతో యజమానుణ్ని నాశనంచేయగూడదు. నే డెక్కడచూసినా ప్రబలంగా వున్న సంఘకలహాలను నిరర్థకమైన రాపిళ్లను అణగద్రొక్కి సంఘాన్ని ఒక్కసంస్థగా ఏర్పాటుచెయ్యాలి. పనివాళ్లకూ యజమానులకూ మధ్య పరస్పర సానుభూతీ, సుహృద్భావమూ పెంపొందించాలి. నాజీసిద్ధాంతాల కనుకూలంగా జరిగినంతకాలం వృత్తులూ వ్యాపారాలు తమతమపరిస్థితుల కనుకూలంగా అభివృద్ధిచెందడానికి సంపూర్ణమైన స్వేచ్ఛ స్వతంత్రమూ వుండాలిగాని రష్యాలో మాస్తరుగా ప్రభుత్వమే వీటిని నడపడానికి పూనుకోగూడదు. ప్రభుత్వంచేతులలో అవి నలిగి అణగారిపోగూడదు.

అయితే ఆ స్వతంత్రము, స్వేచ్ఛాప్రజాప్రభుత్వవిధానంమీద, ఓట్లమీద, పార్టీనాయకుల కొట్లాటల

మీద ఆధారపడియుండరాదు. సమర్థులైన, ప్రజాహిత తత్పరులైన, ప్రజానాయకులైన అధికారుల ఆజ్ఞలకు లోబడి ప్రజాక్షేమాభివృద్ధికరంగా అవి నడపబడాలి.

ఆ అధికారుల బ్రతుకు అన్నివిధాలా తమకంటె అధములైన వోటర్ల చలచిత్తాలపై గాక తమ పైయధికారుల అనుమతిపై ఆధారపడి వుండాలి. ఈవిధంగా హిట్లరు తన ప్రతినిధులైన మంత్రివర్గం ద్వారా, జర్మను సామ్రాజ్యాన్ని పునర్నిర్మాణం చెయ్యాలి. జర్మనుజాతికి సహజమైన నాగరికతను, సంఘధర్మాన్ని, ప్రపంచదృష్టిని చంపివేసిన అజాతీయ, అన్యదేశీయ సంప్రదాయాలను, సంపర్కాలను, రాజ్యాంగవిధానాలను రూపుమాపి జర్మనుజాతిని పునరుద్ధరించాలి. జర్మనీ దేశం జర్మను జాతిది. అది వారికే చెందివుండాలి. అన్నివిధాలా అన్యాక్రాంతమైన జర్మనీదేశాన్ని జర్మను జాతికోసం తిరిగీ స్వాధీనం చేసుకోవాలి. నేటి నాజీ పార్టీ సాధించవలసిన మహాకార్య మిది.

జర్మనీలో పట్నవాసాలలో జనాభా చాలా పెరిగిపోతోంది. ౫౦ ఏళ్లకు పూర్వం జర్మనుప్రజలలో నూటికి ౩౦ మంది పట్నవాసాలలోను, ౭౦ మంది గ్రామాలలోనూ నివసిస్తూ వుండేవారు. ఈ మధ్య నూటికి ౭౦ మంది పట్నాలలోను, ౩౦ మంది గ్రామాలలోను నివసిస్తున్నారు.

ఇది మిక్కిలి హానికరమైన పరిస్థితి యని నాజీల నమ్మకం. వారి ఉద్దేశ్యంలో పట్నవాసాలు చెడ్డవి వాటివల్ల దేశానికి అనేకఅనర్థకాలు సంభవిస్తున్నాయి. పట్నవాసస్థులకు భూమితో సంబంధం తక్కువైంది. క్రమంగా వారి ఆరోగ్యము, ఆయుర్దాయము, సమర్థతా క్షీణిస్తూన్నాయి. కార్యోత్సాహం తగ్గిపోతోంది. పట్నవాసస్థులకు ధనాశతప్ప వేరే మతమూ దైవమూ ఉండవు. కాకులు, గ్రద్దలు మాదిరిగా వారెప్పుడూ జాతియొక్క రక్తమాంసాదులను పీడించుకుని తిని బ్రతుకుతున్నారు. నిరాశ, దారిద్ర్యమూ, అనారోగ్యమూ తప్ప వారివల్ల జాతికి ముట్టుతూవున్న ప్రతిఫల మేమీ లేదు. వారి నీరస, నిర్జీవ, ఆదర్శాలను గ్రామస్థులు అనాలోచితంగా అనుకరిస్తున్నారు. తమకు సహజమైన పరస్పర సహృద్భావమూ, ధర్మబుద్ధీ మొదలైన సుగుణాలను చంపివేసుకుంటున్నారు. పట్నవాసస్థుల మాదిరిగా తామున్నూ ధనార్జనకోసమూ, ప్రాపంచిక సుఖాలకోసమూ పాకులాడుతున్నారు. ధనాశతో జీవిత సౌఖ్యమూ, శాంతీ ధ్వంసంచేసే బాహ్యాడంబరాలలో జనసామాన్యం నిరంతరము దొర్లాడుతోంది. సంఘంలో ఎవ్వరికీకూడా తమతమ స్థానాలతో తృప్తిలేదు. ప్రకృతిసిద్ధమైన తమలోటుపాట్లను ఎక్కువ తక్కువలను, అర్హస్థానాలను, కర్తవ్యధర్మాలను గుర్తించుకునే జ్ఞానం నశించింది. ఆడవాళ్లు తమ పరిస్థితులు మరిచిపోయి ఆఫీసులలోను, ఫ్యాక్టరీలలోను మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలకు తయారవుతున్నారు. పనివాళ్లు ఎక్కువజీతంకోసం పోట్లాడుతున్నారు; తక్కువకాలం పనిచేస్తూ వుంటున్నారు; ఎక్కువసౌఖ్యాలు కావాలంటున్నారు. స్వంతవ్యాపారాలను సాగనీయకుండా సమ్మెలు కడుతున్నారు. ఈ అతృప్తిని, అలజడిని, అశాంతిని, దారీ తెన్నూ తెలియని గాఢాంధకారమయమైన తొక్కులాటను, ఒళ్లువంగని సోమరితనాన్ని సంఘాభివృద్ధికి లక్షణాలనీ, ముందడుగు శుభసూచనలని వర్ణించి చప్పట్లు కొడుతున్నాము. సాంఘికంగా గాని, విద్యావిజ్ఞానాలలో గాని ఏంతమాత్రం కాలు నిలుకడ, స్థిరచిత్తమూ లేని జనసామాన్యము "మేము సోషలిస్టులము" అని చెప్పుకుంటూ, వారిసృష్టికర్తలైన కారలు మార్క్సు మహర్షియొక్క భ్రష్టసిద్ధాంతాలవెంట మహా అజ్ఞానాంధులై పరుగులెత్తుతున్నారు. "అందరూ సమానులే, అందరూ ఒక్కటే' అన్న అల్లరిమూక, బికారిసంఘ, వేదాంతాలు ప్రబలుతున్నాయి. భాగ్యవంతులు, బీదవాళ్ల మధ్య అసూయలు, అసహనాలు, కొట్లాటలు అనే పెనుభూతాలు దేశమంతా ఆవరించివేసి దేశక్షేమంకోసం సార్థకంగా వినియోగపడవలసిన జాతియొక్క జవసత్వాలను చెల్లాచెదురుచేసి పీల్చి పిప్పి చేస్తున్నాయి. దారీ తెన్నూ, గమ్యస్థానమూ లేని ఈ మహా మోహాంధకారానికంతకూ అధిష్ఠానదేవత నిరాశ! జాతియొక్క వినాశానికీ, ఆత్మహత్యకూ మూలకారణ మీ నిరాశాదేవతయే! ధనకాంక్ష, పట్నవాసపు కాపురాలు, —ఈ రెండూ కలిసి విషయాసక్తిని, ఇంద్రియచాప

లన్నీ పెంపొందించి తలిదండ్రులకు తమ పిల్లలమీద ఉండే సహజ ప్రేమనుకూడా చంపివేస్తున్నాయి; పవిత్రమైన కుటుంబబంధాలను, వివాహబంధాలను తెంపివేస్తున్నాయి. స్త్రీల పాతివ్రత్యధర్మంయెడల ప్రజలకు మునుపటి గౌరవమూ, ఆదరణా క్షీణిస్తున్నాయి. క్రమప్రవర్తనకు నీతి నియమాలకు మన్నన నశించింది.

ఈమధ్య జర్మనీలో "పట్నవాసం అనే శ్మశానవాటిక" అని ఒక పెద్దబొమ్మను ప్రకటించారు. ఆ బొమ్మ పైభాగంలో, హాయైన ఒక వ్యవసాయదారుడు తాను, తనభార్యా, ఆరుగురు పిల్లలు కలిసి శాంతియుతమైన పల్లెటూరును విడిచి చింతాసంకులమైన పట్నంవైపుకు బైలుదేరుతున్నారు. ఆ బొమ్మయొక్క కిందిభాగంలో చిత్రాలు ఈవిధంగావున్నాయి. రెండో పురుషాంతరంలో పట్నవాసం చేరుకున్న ఆ కుటుంబంలో ముగ్గురు పిల్లలుమాత్రమే మిగిలారు. మూడో పురుషాంతరంలో ఒక్కబిడ్డమాత్రమే మిగిలివుంది. నాలుగో పురుషాంతరంలో ఆకుటుంబం నిస్సంతతై, పట్నవాస మనే అంధకారమయమైన శ్మశానవాటికలో అంతరించిపోయింది. మొదటితరంలో ఆ కుటుంబపు దుస్తులు చాలా మోటుగాను ముతకగాను వున్నాయి. క్రమంగా ఒకతరాన్నుంచి మరో తరానికి వారి దుస్తులలో పూర్వపు మోటుతనం పోయి, ఎక్కువ ఉలిపితనము, విలాసము అగపడుతున్నాయి. కాని వారిముఖాలలో నిరాశ, అతృప్తి, జీవితపులక్ష్యవిహీనత తాండవమాడుతున్నాయి. ప్రపంచకమంటే నిరాశతో విసుగుతో ఏమిటో చెప్పరాని భయంతో వారిముఖాలు మొద్దుబారిపోయినాయి. ఎన్నడో మరిచిపోయిన చావూ శ్మశానమూ తప్ప పట్నవాసంకాపురంలో వారి కేమీ చివరకు మిగలలేదు.

ఇవి ఆ బొమ్మలోని విషయాలు. దేశంలో పుట్టుకలకన్న చావు లధికమవుతున్నాయి. ఉత్కృష్టమైన ఆర్యనుజాతి క్రమంగా క్షీణిస్తోంది. జర్మను జాతియొక్కా, సంస్కృతియొక్కా పునాదులు కదిలిపోతున్నాయి. దేశసంరక్షణకు, పొలంపనికి చాలినంత మనుష్యబలం దొరకడంలేదు. విద్యార్థులు పనిపాట్లు దొరకకుండా సోమరులై తిరుగుతున్నారు. స్వార్థపరమైన విషయవాంఛాలంపటత్వంలో ప్రజలు భౌతిక ఐశ్వర్యాలకు, ఇంద్రియసౌఖ్యాలకు అలవాటుపడి ప్రకృతిసిద్ధమైన తారతమ్యాలను మరచిపోతున్నారు. ఈ మరుపే, ఈ అజ్ఞానమే, ఈనాటి గంగవెర్రులన్నిటికీ మూలకారణం.

వ్యవసాయపుపనివాళ్లు తిరిగి భూమిని చేరుకున్న రోజున ఇప్పటి అసూయలు, అశాంతీ, స్పర్థలూ నశిస్తాయి.

"నేటి జర్మనీదేశం (౧)రైతాంగం, (౨)పనివాళ్లు అనే రెండు స్తంభాలమీద నిలిచివుండాలి. రైతు తన భూమిని కనిపెట్టుకుని వుండాలన్న సంప్రదాయంవల్లనే మొదటి స్తంభం ఇంతకాలం సుస్థిరంగా నిలిచివుంది. రెండో స్తంభంకూడా సుస్థిరంగా నిలిచివుండాలంటే పనివాడుకూడా తనపనిని అంటిపెట్టుకుని వుండాలి."

ప్రతిపనివాడికీ కొద్దిగానో గొప్పగానో భూమి నియ్యాలి. అతడు తనవృత్తినీ స్వస్థలాన్నీ కనిపెట్టుకుని వుండేటట్లు, అతడిలో అతృప్తి అశాంతీ, తిరుగబాటూ చెలరేగకుండా వుండేటట్లు చూడాలి.

జర్మనురక్తంయొక్క పవిత్రతను, జర్మను జనాభాయొక్క అభివృద్ధిని, పాడిపంటల సమృద్ధిని పోషించి కాపాడవలసినది జర్మనురైతాంగము. శాంతి సమయంలో నాగలిని, యుద్ధకాలంలో తుపాకిని బట్టి జర్మనురైతాంగము జర్మనుజాతిని సంరక్షించాలి. "నా ఆస్తి" అన్న అభిమానంతో బోల్షివిస్టులనుంచి, విదేశశత్రువులనుంచి కాపాడడంకోసం, ప్రతిజర్మను వ్యవసాయపు పనివాడికీ స్వంతఇల్లూ, పొలమూ, కుటుంబమూ వుండాలి.

నాజీపార్టీకి చిన్న చిన్న కమతాలమీద, కమతగాళ్లమీదా వున్న అభిమానం పెద్ద ఎస్టేట్లమీదా భూస్వాములమీదా లేదు. జర్మను జాతీయసంప్రదాయాలను, నాగరికతను, సంఘధర్మాన్ని, నిలబెట్టగలవారు చిన్న చిన్న వ్యవసాయదారులే అనీ, యుద్ధ సమయాలలో దేశసంరక్షణభారం ముఖ్యంగా వారి

మీదనే పడుతుందనీ, ప్రజలందరిలో వారికే సాంఘికంగా ఆర్థికంగా ఎక్కువ కొలువనిలకడ, స్థిరబుద్ధీ వుంటాయనీ, వారు వృద్ధిలో వున్నంతకాలం దేశీయపరిశ్రమలు వృత్తులూ కూడా వృద్ధిచెందుతాయనీ నాజీల నమ్మకం. పెద్దఎస్టేటు ప్రొప్రయిటర్ల లోపం వల్లనై తేనేమి, వారి అలివికి మీరడంవల్లనై తేనేమి, ఆ ఎస్టేట్లలో వ్యవసాయం సవ్యంగా గాఢంగా జరగటం లేదు. అందువల్ల దేశానికి సరిపడ్డ ఆహారసామగ్రి దేశంలో ఉత్పత్తికావడం లేదు. ఆ విషయంలో, వెనుక సహాయం వుంటే చిన్నవ్యవసాయదారులకుండే వీల్లు పెద్దపెద్ద వ్యవసాయదారుల కుండవు.

శరీరదారుఢ్యముగల జనాభాను సప్లయిచేయడంలోకూడా పట్నవాసస్థులకన్న పల్లెటూరివారు, అల్పసంఖ్యాకులైన ఎస్టేటు ప్రొప్రయిటర్లకన్న అధికసంఖ్యాకులైన చిన్నవ్యవసాయదారులు ఎక్కువ తోడ్పడుతున్నారు.

స్వల్పసంఖ్యాకులైన పెద్దభూస్వాములు విలువగల విదేశసరుకుల కలవాటుపడి వాటికోసం విస్తారం ధనం వెచ్చిస్తున్నారు. అధికసంఖ్యాకులైన చిన్నభూస్వాములు చాలామట్టుకు స్వదేశంలో స్వస్థలంలో తయారైన వస్తుసామగ్రికి అలవాటుపడివుండడంచేత దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం కలుగుతోంది.

అన్నివిధాలా, చిన్నకమతగాళ్లకు సహాయం చేయడమే క్షేమకరమైన విషయం వారికి భూము లిచ్చి, స్థిరనివాస మేర్పరిచి జర్మనుసంఖ్యను అభివృద్ధిచేయడం నాజీల యుద్ధనీతికికూడా అనుకూలమైన విషయం. ఇది పూర్వం, ఫ్రెడరికుచక్రవర్తి కాలంనుంచీ జర్మనీలో అనుశ్రుతంగా వస్తూవున్న పద్ధతి.— తమరక్తంతో పితృదేశం సంరక్షించవలసిన సైనికవర్గాన్ని పోషించేవిధ మిది వక్కటే అన్న నమ్మకముతో పూర్వంనుంచీ జర్మనుప్రభుత్వం ఈ పద్ధతి నవలంబించింది. అందువల్ల పల్లెటుక్కలన్నీ ప్రభుత్వానికనుకూలంగా వుంటాయి అన్నది మరొక్క సంగతి.

నాజీలఅధికారానికి పూర్వం జర్మనువ్యవసాయం ఏ స్థితిలో వుండేది?

కడచిన యుద్ధానంతరం జర్మనువ్యవసాయవృత్తి అనేకకారణాలవల్ల హీనస్థితికి వచ్చింది.

ధరలు పడిపోవడం, విదేశపు చవకసరకుల పోటీలు, పన్నులభారము, అప్పులు, మొదలైన కారణాలవల్ల రైతు చితికిపోయాడు. అతడు ఋణాలలో మునిగి, వాటిపై వడ్డీని తీర్చడంకూడా దుర్ఘటమైంది.

౧౯౩౨ నాటికి వ్యవసాయదారులబాకీలు ౧౨,౦౦౦ మిలియను రెహ్మార్కులనీ (సుమారు ౧,౪౧౨ కోట్ల రూపాయలు), అందులో చాలాభాగం అంతక్రితం ౬, ౮ ఏళ్లలో పెరిగిన ఋణాలబాపతుఅనీ అంచనావేశారు. ప్రతియేడూ రైతులు పండించే పంట మొత్తంలో విశేషభాగం ఆ బాకీలమీద వడ్డీకిందనే సరిపోతోంది. అదిగాక పన్నులబాధ అధికమైంది. పిన్నా పెద్దా వ్యత్యాసాలు లేకుండా రైతులందరూ కుంగిపోయారు.

మొదటితరగతి, ౨౫౦ యెకరాలకు మించిన భూవసతిగలభూస్వాములుఅప్పులలో మునిగియున్నారు. ఆభూఖామందులు పట్నవాసపు వ్యసనాలకు పోకులకు అలవాటుపడి తమతాహతుకు మించిన ఖర్చులు చెయ్యడం, అలివికి మించిన తమవ్యవసాయం సమర్థతతో నిర్వహించుకోలేకపోవడం మొదలైన కారణాలవల్ల వారిలో అనేకమంది కూలిపోయారు. ప్రభుత్వవర్గంలో వారికి పలుకుబడి వుండడంచేత తమకు ధనసహాయ్యం చేయవలసిందనీ, తాము చెల్లించవలసిన పన్నులు అప్పుల పైవడ్డీలు కొట్టివేయవలసిందనీ పోరాడారు. తూర్పు ప్రష్యాలోవున్న జమీందార్లకు ప్రభుత్వం ధనసహాయం చేసింది. అప్రువ్యాన్ని వారు తమ పరిస్థితులను అభివృద్ధి చేసుకోవడంలో వినియోగించడానికి బదులు, పారిసు, వియన్నా మొదలైన నగరాలలో స్వంతవ్యసనాలమీద ఖర్చుపెట్టుకున్నారు. దానితో జర్మనీ దేశమంతటా గగ్గోలుబైలుదేరింది. "హూ-హా? ధనికులేమి చేశారో! వారు ఇల్లా చేస్తారని మేము ఇదివరకే చెప్పలేదా ?" అని సోషలిస్టులు చంకలు కొట్టుకొని గంతులువేశారు. రెండోతరగతి ౧౨ మొదలు ౨౫౦ యెకరాలు భూవసతిగల మధ్యరకం వ్యవసాయదారులు. పైకష్టాలన్నీ వారికి మరీ ఒత్తిడి కలుగజేశాయి. రెక్కల

కష్టంవల్ల న్యాయంగా, కుదురుగా, పొదుపుగా జీవించ వలసిన ఈతరగతి రైతాంగం పట్నవాసపు దుర్వ్యసనాలకు, ఆడంబరపు ఖర్చులతో వర్తకవ్యాపారాలకు, ధనాశకు అలవాటుపడి నశించిపోవడం సంఘానికంతకూ ముప్పును తెచ్చిపెట్టే ఉపద్రవకరమైన విషయమని, అందువల్ల జాతియొక్క పునాదులు కదిలిపోతున్నాయని నాజీనాయకులు తల్లడిల్లిపోయారు. ఈ వ్యవసాయదారులలో చాలమందివి బహుపురాతనమైన, మర్యాదగల, వ్యవసాయపు కుటుంబాలు. జర్మనీ దేశాన్ని కాపాడడంకోసం ఇదివరకు కన్నోసార్లు తమ ప్రాణధనాలను అర్పించిన కుటుంబాలు. దేశసంరక్షణకు నీతినియమాల పునరుద్ధరణకు జైలుచేరిన ఉద్యమాలన్నిటిలోను ముందంజవేసి తోడ్పడ్డ కుటుంబాలు. మూడో తరగతి, ౧౨ ఎకరాలకు లోపు ఆస్తిగల రైతాంగంకూడా వ్యవసాయపు పంటలు, ధరలు తగ్గి, కటిక దరిద్ర బాధతో కుంగిపోయింది.

నాలుగో తరగతి పొలం పనివాళ్లు, ౧౯౨౫-వ సంవత్సరం అంచనా ప్రకారం మొత్తం గ్రామస్థుల జనాభాలో ఐదోవంతుమంది వుండేరి. బీదరైతుల లోను, కూలి నాలి చేసి జీవించేవారిలోను చాలాభాగం కడచిన యుద్ధంలో చనిపోయారు. పోగా మిగిలిన వారిలో చాలామంది ౧౯౨౪-౧౯౨౯ మధ్య ఫ్యాక్టరీ పనులకోసం పట్నవాసాలు చేరుకున్నారు. ౧౯౨౯ తరువాత ఫ్యాక్టరీలు మూలపడి పట్నవాసాలలో జీవితం జరగక తిరిగి గ్రామాలు చేరుకున్నారు. ఈలోపుగా వ్యవసాయవృత్తిలో మార్పులు వచ్చి పొలం పనులు తగ్గాయి. అందులో ముఖ్యంగా భాగ్యవంతులు తమచుట్టు ప్రక్కలవున్న చిన్నపొలాలను తమ స్వాధీనం చేసుకొని, యంత్రాల సహాయంతో, విరివిగా, శాస్త్రీయమైన వ్యవసాయం సాగించారు. అందువల్ల సామాన్యులకు దున్నడానికి పొలము, చేయడానికి పని కరవైనాయి. ఈవిధంగా కడచిన యుద్ధంతర్వాత ఒక్క ప్రష్యారాష్ట్రంలోమాత్రం ౩౨ లక్షల యెకరాలభూమి భాగ్యవంతుల పరమైందనీ, సుమారు ౨౦వేలమంది బీద రైతులకు పొలమూ, పనీ దొరకలేదనీ అంచనావేశారు.

నాజీల వ్యవసాయ కార్యక్రమంలో నాలుగు భాగాలు కలవు:—

౧. వ్యవసాయదారులు శాశ్వతంగా నిరాటంకంగా తమ భూమిని, వృత్తిని అంటిపెట్టుకొనివుండాలి.

౨. జర్మనీకి కావలసిన ఆహారపదార్థాలను దేశంలోనే ఉత్పత్తిచెయ్యాలి. పంటసరకుల ధరలు, క్రయ విక్రయాలు దేశక్షేమానికి అనుకూలంగా వుండాలి.

3. జర్మను రైతులను ఋణబాధనుంచి తప్పించి వారికి చవుకగా సులువుగా పరపతి ఏర్పాటు చెయ్యాలి.

౪. వారిని నీరసస్థితిలోనుంచి ఉద్ధరించి, ఆరోగ్యము, ఐశ్వర్యము, సంతానముతో తులతూగునట్లు అవకాశాలు కలుగచెయ్యాలి. సాంఘికంగా, ఆర్థికంగా, రైతువృత్తికి సంఘంలో మర్యాద, గౌరవం ఏర్పడాలి. వృత్తిగౌరవము, స్థానగౌరవము ఏర్పడ్డనాడు రైతుకు స్థిరనివాసము, కాలునిలకడ తమంతట తామే ఏర్పడతాయి. పల్లెలనుంచి పట్నాలకు, పట్నాలనుంచి పల్లెలకు లేచిపోవడం అరికట్టడంవల్ల, వ్యవసాయదారులకు గ్రామాలలో స్థిరనివాసం అలవాటు చేయవచ్చును. పట్నాలలో చేరుకొని పనిపాటులు లేకుండా తిరుగుతూవున్న పొలంపనివాళ్లను, వ్యవసాయదార్లను పల్లెలకు మరల్చి వారికచ్చట స్థిరవసతులు ఏర్పాటుచెయ్యాలి. పట్నవాసాలలో జనసమ్మర్దం తగ్గించాలి. సామ్యవాదప్రచారాలతోటి సమ్మెలతోటి, విప్లవాలతోటి, వృత్తులకు వ్యాపారాలకు నిరోధం కలుగజేస్తూవున్న పనివాళ్లను అదుపాజ్ఞల కిందకు తెచ్చి, వ్యవసాయవృత్తిని కాపాడాలి.

నాజీలు ఈఆశయాలను ఆచరణలో పెట్టినవిధం ముందు సంచికలో వివరిస్తాను. (సశేషము)

కోయుపడుచా!

శ్రీ జయంతి సీతారామశర్మ

కోయపడుచా! కోయపడుచా!
వలపుతెలికడలిలో
ఈదుకోనీవా ?
ప్రేమగేయం ఒకటి
పాడుకోనీవా ? కోయ.

తనువుమృదువులో ఒడలు కరిగింది
నీ ప్రేమమధువులో మనసు కరిగింది.
పాదపావనవాటిలో నీడనీవా ?
సాదుజీవితవకుళవల్లిక బ్రతుకనీవా? కోయ

హేమవల్లికనీడకొరకై
ప్రేమవల్లికనీడకొరకై
వెదకి యేడ్చినకనులలోపల
వలపుపాలను చిల్కవా ?
తలపుతీపిని తెలుపవా ? కోయ.

కురుల కొరక విరియనై
మనసు కొరక మనువునై
ఒడలి కొరక తోడవునై
కళకు సేవను చేయనీ,
కళాజీవిని బ్రతుకనీ. కోయ.

ఇది నాదు జీవితపు
నీ రాజనపు జీర
ఈ వెలుగులో కొత్తువా ?
లేక ఇటులనే తుదినొందనా? కోయ.

సయీబాయి సలహా

శ్రీ కవిసింహ జి. శేషశాస్త్రులు

[బీజాపూరునవాబు షాజీని చెరబట్టినాఁడు. మాయోపాయమున శివాజీని చెఱబట్టునుద్దేశమున నున్నాఁడు. శివాజీకిది యొకసందిగ్ధావస్థ, చాలలలితమగు మెలపునఁ బ్రవర్తింపవలసినయదను. అప్పుడు, భర్తయాజ్ఞపై వీరమాత సయీబాయి సలహానొసఁగుచున్నది.]

నను మన్నింపుము నాథ! యిట్టి పనులన్ నాబోఁటు లేమన్నఁ జా
లిన దానే యొకరాఁడుకూ యనుచుఁ దూలింపంగ నోఁగాక, నే
ర్చిన మీ తీరు మెఱుంగు దిద్దు టిది యౌచిత్యంబె! యేమైన నే
మనెదన్ మీచను వంది, పొందుఁగొనఁ దోడైయున్న మేలయ్యెడిన్.

తీరమి యింతవట్టు గడతేఱిన దిప్పటి కీగతిన్, దునే
దారితనంబులేక పెరదాగుల వైరులు పుట్టలోన ఘూ
త్కారము సేయుచుండిరి, తెగంబడ కిప్పుడు వారువోయుచున్
దోరము వెట్టి మ్రొక్కబడినోఁచుట యావను లిచ్చమెత్తురే!

మనసున మాటరెంట పురి మూరగ ముప్పిరి తీరుసేఁతఁ బెం
చిన పగ్రతాళ్లు ద్రెంపఁ బడిచేతులు చాలునె! వాడికత్తులన్
దునియలు సేతగాక, పెద్రోవల నెన్నిట వారిచిత్తముల్
పనుపడనేర్చునే యడుగువట్టినఁగా, కివి శూరుఁ డోర్చునే!

ఇరుగడఁ గంటయొప్ప మొదలెత్తినయప్పడ, కొంత యీఁది ద
గ్గరిదరి వీడుచో నవలిగట్టును మెట్టుట గట్టిపూన్కి, పెం
దరగల ద్రోతలన్ నురుగుతంపమురోఁతల సుళ్లకోఁతలన్
దెఱఁగులు మారుగుండియలు ధీవరులన్ దనియింప నేర్చునే!

ఉత్తముఁడైన మామ పగయొత్తుల గత్తఱవోవుచుండ నే
జిత్తులతోఁ బనేమి? విరజిమ్ము మగంటిమి కావి తేఁగఁ బై
కెత్తినకేల విచ్చి పరువెత్తగ దాయలఁ దోలి కార్యమున్
బాత్తిటఁ జేర్చుదాక తరిపుత్తురె దాగురుమాతలాడుచున్ !

ఇంతటి లోతుపాంతు గమనించెద రేటికి! మామగారికిన్
బంతమువట్టి యేదయినఁ బాపము సేతు రటంచుఁగాదె! యీ
వంతు తొలంగని, మ్మెదిరివచ్చినఁ దప్పికొనంగనౌన! వి
భ్రాంతియగాక పట్టుగొని ప్రాణము లెవ్వఁడు గాదనోపెదున్.

అత్తకు మామకున్ గుఱుచలాడుచుఁ గీడు దలంప, వారు నా
యుత్తమ దైవదైవతము, లూర్జితశక్తిఁ గడంగి వారి యా
పత్తులఁ దీర్చుటాద్యము, నవశ్యముగాదన దాని; గాని యీ
పొత్తున మీకడంక గరివోవక విచ్చుట లామతించెదన్.

తల్లి మొగమ్ముఁ జూచి, పగదాయలఁ దక్కిన తండ్రిఁ జూచి, మీ
యుల్లము పల్లవో నునికి యొప్పునె! హైందవరాజ్యలక్ష్మికిన్
బల్లవతోరణంబు కనుపండువుసేయుకరంబు చెక్కటన్
జెల్లువడంగ నే భువనజేత శతారను చేతఁ బట్టెదున్.

పున్నమునోచి క్రొత్త సరిపువ్వులు బోసి భవాని పూజలన్
గన్నది జీజియా: భరతఖండము గొన్నది మిమ్ము, తత్తప
చ్ఛిన్నములౌచు విఘ్నములు చేద్పదుఁ, దత్సమనోరథామృత
స్విన్నము మీకడంక వికసించుఁజుమీ! నిలువెల్లఁ బూయుచున్.

గడునరివాయి మీఁగడలు గట్ట వచింపఁగ నేరనయ్యు, వా
విడిచిన తెంపు సైపు, మదవీయసహా నిజకార్యసిద్ధికిన్
దొడిమెలు నొక్కవారి వడి దోచి, స్వతంత్రత జాలువాఱ, న
ల్గడ జయమంగళ ధ్వనులెలర్చెడు హైందవలక్ష్మిఁ జూడుమీ.

తలఁప పలుకఁగా మనము కర్తలము గాని
కనుల కందని బ్రహ్మాండ గర్భగోళ
మెనసి యూకొట్టు సర్వభోక్తను దలంపుఁ
డతని మేలంద భావికార్యమునఁ జనుఁడు.

(శ్రీ శివాజీ ప్రబంధమునుండి)

ఒక అన్నామైట్ కథ

'ట్రాన్ వన్ టూన్గ్'

[స్టాన్లీ రైస్ గారిచే అనువదింపబడి 'ఏషియాటిక్ రివ్యూ'లో ప్రకటితమైనది. దానిననుసరించి-యిది...]

ట్రాన్‌వంశపు మైహోరాజు కాలంలో జరిగిన వృత్తాంతం ఇది. ధనిక కుటుంబానికి చెందిన ట్రంగోనామక యువకు డొకడు వ్యాపారార్థం ఉత్తరాన్నుంచి దక్షిణానికి ప్రయాణం చేస్తున్నాడు ఒక చిన్నపడవలో. ఒకనాటి సాయంకాలం సంధ్యాసమయానికి వకప్రదేశంలో దిగి అక్కణ్ణుంచి బజారుకు పోవా లనుకొన్నాడు; కాని అంతలో ఒక యువతి - బుద్ధునంతటివాణ్ణయినా మోహింపచేయగల అతి సౌందర్యవతి - అతని మార్గానికి అడ్డం తగిలింది. యువక వ్యాపారి సహజంగా మోహంలో దగుల్కొన్నాడు. ఇతడామెవైపు చూసేసరికి ఆమే ఇతనిమీద అనుకూలదృష్టుల ప్రసారించింది. ఆమె సమీపానికి పోయి ఎదుట మోకరించి కూచొని వేలకొలది ప్రియమధుర భాషణలను గురిపించాలనుకొన్నాడు కాని అందుల కతనికి ఓటవూ లేదు, ధైర్యమూ చాలలేదు.

ఆ యువతి ముందుకు సాగి కనుపడకుండా పోయింది. కాని పాప మీ యువకునికి అత్యంత ప్రియమైన వొక తియ్యనికల కల్పించిపోయింది. ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడుబడితే అప్పుడు రాత్రింబవళ్లు సీటిమీదగాని నేలమీదగాని యీసుందరి మనోహరాకృతి యితని ఆత్మను ఆవేశించి అందోలనపరుస్తూ వేధించసాగింది.

ఎటు చూసినా ఆమే! అతనిహృదయం, ఆత్మా రెండూకూడా ఆమెతో నిండిపోయినాయి. ఆమెను కౌగలించాలని, ఆమెను చేపట్టాలని, ఎల్లప్పుడూ ఆమె ప్రక్కనే వుండాలని ఉవ్విళ్లూరుతూ పరితపించిపోతూ వుండేవాడు.

ఈ ప్రకారం మాసాలకు మాసాలు- అతి దీర్ఘమాసాలు - గడచిపోయినాయి. ఆ యువతిసుందరాకారచేష్ట లన్నీ అతనిమనఃఫలకాన్నుంచి మాసిపోసాగాయి. ఇంతలో అకస్మాత్తుగా కలిశారు ఇద్దరూ వొకవుత్సవంలో. అతని హృదయాంతరాళంలో పుట్టి ప్రవర్ధమాన మవుతున్న అతనస్వంగివిషయక ప్రేమ ప్రకటీభూత మవడానికి చక్కటి అవకాశం దొరికింది కాని పాపం అది ఆమె చెవులబడకుండానే అంతర్ధాన మైపోయింది.

అనంతర మామె తననేస్తురాలిని గలసికొని ఏకాంతంలో తనపై నప్పుడు ప్రేమ గనబరచిన ఆ యువకుని తానుకూడా ప్రేమించినట్లు వొప్పుకుంది. అక్కడవున్న వకవంతెనమీదికి పోయి తిరుగ వచ్చేటప్పుడు కలుసుకొందాంపదమనిఇద్దరూ కలిసి ఆవంతెనమీది కెళ్లారు. అక్కడామె పిట్టగోడమీదికి వంగి వీణ వాయించడం ఆరంభించింది. రాగపూర్ణమైన ఆమె చేతి వ్రేళ్ల త్రాకుడున విజృం

భించి 'రమ్ము! ప్రియా! రమ్ము! నా ప్రియ భాజనమా!' అని గీతాన్ని వెలారుస్తుంది వీణ.

వంతెన క్రింద నీళ్లు చిన్న చిన్న తరగలు కట్టుతూ జలజలమని ప్రవహిస్తున్నాయి. గాలి స్తంభించింది. సాయంకాలం దాటిపోవచ్చింది. కాని ఆ ప్రియుడుమాత్రం రాలేదు ఆగానం ఆలకించడానికి. వీరికి నిరాశ ఎక్కువవుతూవున్నకొద్దీ విషాదధ్వనిని మరింత దుఃఖకరంగా సారించుతూవుంది వీణ. దినంఅంతా వ్యర్థంగా పోయింది. మిగిలింది కూడా అవసానాన్ని సమీపిస్తూ వుంది. చంద్రుడు నీలాకాశంలో సుస్థిరుడై సంధ్యాకాంతుల భుజస్కంధాలమీద పెద్ద వెండిరాశిని గుమ్మరిస్తున్నాడు.

యువతు లిద్దరూ నిరుత్సాహులై, అలసి మరలిపోవడానికి సంసిద్ధమయ్యారు. ఇంతలో ఎవరో వస్తున్నట్లు కాళ్లచప్పుడు వినవచ్చింది.

ఆహా! ప్రేమార్తుడైన ట్రింగోయే వచ్చింది.

"హృదయేశ్వరీ! వచ్చాను. ప్రియే! మళ్లీ వకమారు వీణ గైకొని నానిమిత్తం పరిశుద్ధమైన ప్రేమాలాపాన్ని కావించు".

"ఆహా! నీవేనా! సుహృద్వర! నే నిక్కడున్నాను. మన కీలాగు ముఖాముఖి సమాగమం కలిగించినందులకు భగవంతునికి ధన్యవాదాలు."

"మనోహరీ! నీ పే రేమిటో చెప్పవు! వేడుకొంటాను."

"హ్రీ ఖాన్హా నా పేరు" అనిఆమె సన్మానపూర్వకంగా జవా బిచ్చింది. మరియు "భర్తృపరిత్యక్తను. నిరాధార నీప్రపంచములో నన్ను కనికరించు. యౌవనానందాలను సమకూర్చగలిగే నేస్తకాడు ఎక్కడ దొరకుతాడా యని ఎల్లప్పుడూ కలగంటూ వుంటాను. ఎందు కనగా ఛాయాలోకంలో సౌఖ్య మెవరికీ లభించదు" అంది.

ఏకీభవించిన రెండు ప్రేమాన్విత హృదయాల దివ్యగాన మగుటంచేసి వారిద్దరి ప్రేమాలాపనం ఈలాగు ఆ నిశాసమయంలో, ఆ పండువెన్నెల్లో, వీణానాదం కంటె కూడ మిగుల స్వచ్ఛమై మనోహరమై ప్రవర్తిల్లింది.

జోలపాటం బోలి మనోరంజక మైన రాత్రిచే ప్రోత్సాహితులై ప్రేమికాప్రేముకు లిద్దరూ నీటిమీద నెమ్మదిగా పడివున్న పడవను చేరుకున్నారు. వెన్నెల మహాకాంతిమంతంగా వుంది. ఇటూ అటూ గట్లమీది పూలపొదలనుండి వెలువడుతున్న సువాసనలు మత్తుగొలుపుతున్నాయి. నితాంత నిశ్శబ్దసంచారం. ఇవన్నీ వారిని వాస్తవిక ప్రపంచాన్నుంచి లాక్కొనిపోయి స్వప్న ప్రపంచంలో ముంచివేశాయి.

మన్మథుడు విషసిక్తబాణాలను చేత ధరించి, ముఖాన్ని రెక్కలుగట్టుకొని వచ్చి పడవయంచున వ్రాలి ప్రేమికా ద్వయాన్ని ఒక్కటిగా చేశాడు.

ప్రత్యూషం - ప్రాతఃకాల మారుతం చేత మెలకువ గలిగినప్పటికీ - వారియర్థనిమీలిత నేత్రాలనే సందర్శించింది. ప్రకృతి ఒక పెద్దనవ్వు నవ్వింది భళ్లుమని భూతలంమీద. (బాగా తెల్లవారింది). అంత నా కాముకు లిద్దరూ మరల మరల కలుసు

కొందామనీ, ఎల్లప్పుడూ ఇద్దరం కలిసివుండి, ఇద్దరం ఒకేమాటు కలిసి మరణిద్దామనీ ప్రతినలు గావించుకొని ఎవరి దారిని వారు పోయారు.

అటుతరువాత అనేకసార్లు కలుసుకొన్నారు. తెగతెంపు లేకుండా వీరి ప్రేమ వ్యాపారం నిరంతరాయంగా గడిచిపోయింది వక్క నెలరోజుల పర్యంతం.

కాని ఈ ప్రేమకలాపం చాలకాలం వరకు దాగివుండలేదు. మిత్రుల సూటి మాటలచే ఉద్బోధితుడై యా వ్యాపారి తన ప్రియురాలి గతవర్తనంలో సందేహం పెట్టుకొని ఆమెను ఆ విషయమై అడగాలని పూనుకొన్నాడు. ఆమెయు వకనాడు పట్టువడి అమితక్రోధం అభినయించింది. ఇతడును మొండిపట్టుపట్టి ఒలిమాలి తనను ఆమెనివాసానికి గొనిపొమ్మన్నాడు.

అర్ధరాత్రి వేళ. అంధకారంవల్ల కళ్లు కనబడడంలేదు. చడీచప్పుడూ లేక నిశ్శబ్దంగావున్న వొకపల్లెలో ఇద్దరూ కలిసి ఒకచుట్టు దారినిబట్టి నడిచిపోయి పల్లంగావుండే శిథిలావశేషాల మట్టిదిబ్బల్లో ప్రవేశించారు. ఆప్రదేశం యావత్తూ అంధకార బంధురం. నేలంతా సీరొడుస్తూ వుంది. కీకారుగా గలిసి పెనవేసుకొనిపోయిన తీగెల పొదలు అపరిమితంగా వ్యాపించి చిత్ర విచిత్రాకృతులుగా కన్పడుతున్నాయి. శైత్యమయం. దుర్గంధపూరితం, కుళ్లిన మాంసపు కంపు. ఇత్యాదులు నేలనుండి మట్టిగోడలనుంచీ వెలువడు తున్నాయి. యువకుడు ఇవన్నీ చూసి ఆశ్చర్యపడుతూవుండగానే చటుక్కున ఆ యువతి మాయమైపోయింది. ఇతడు భయపడి పరుగెత్తాలని వెనక్కు అడుగువేసి వాకిటిగుండా దాటిపోవాలని ప్రయత్నించాడు కాని అతని పాదాలు నేలలో పాతుకొనిపోయిన ట్లయినాయి. ఉసురుసురని నిట్టూర్పులు, ఏడ్పులు, శోకాలు ఆక్రందనాలు నాల్గువేపులా వినబడుతున్నాయి కాని ఫలానిచోటునుంచి అని తెలియడంలేదు. చెమ్మనేలలో నుంచి స్ఫురకాంతివంటి కాంతి పైకి లేచింది. దానినుండి వెలువడే వందలకొలది జ్వాలలు వాయువులో వ్యాపించాయి. అంతలో ఒక పెద్ద హాలూ, దానిమధ్య ఒక సర్కీటు మంచం, దానిమీద ఎర్రటి బచ్చెనరంగువేసినశవపేటిక వకటీ వుంది. వీటి నన్నింటినీ చూచే సరికి యువకుడికి కంప మెత్తిపోయింది. శవపేటికపై గప్పిన గుడ్డమీద పెద్దపెద్ద అక్షరాల్లో అంతకు కొంచెముందు తన ప్రక్కనుండిన యువతిపేరు వ్రాసివుంది. శవపేటిక ప్రక్క ఒక పడుచు మోకారించి కూచొని వీణమీద శోకపూర్ణమైన రాగం వాయిస్తూ వుంది. పోగా మిగిలివున్న ధైర్యాన్నంతనూ చిక్కబట్టుకొని, చేతులు కంపిస్తూ వుంటే వాకిలికేసి పరుగెత్తాడు యువకుడు. కాని యువతి మళ్లీ ప్రత్యక్షమై దారి నడ్డగించి యతని దుస్తుల యంచులను బట్టుకొని, వెనక్కు లాగుతూ వెళ్లవద్దని అంది. "నీవు పోజాలవు. మన మిద్దరమూ కలిసివుండి కలిసి చద్దా మని ప్రతిన చేసుకొన్నాం" అంది. అత డేలాగో లాగి తప్పించుకొని ధనుర్ముక్తబాణంలాగు పరుగెత్తాడు నదిలో పడివున్న పడవమీదికి. మరునాడు పాప మా యువకుడు గ్రామంలోకి పోయి విచారించగా తన ప్రియురాలు స్త్రీఖన్నా ఆరునెలల క్రిందటే

మరణించిందని తెలిసింది. అది మొదలుకొని ఆ నిర్భాగ్యుడికి అసాధ్యమైన వ్యాధి పట్టుకొంది. ప్రియురాలిరూపం అతణ్ణి రాత్రింబవళ్లు ఆవేశించివుంటుంది.

ఒక్కొక్కసారి నదిగట్లమీద తానామెతో కలిసివున్నట్లూ, మరోమాటు పడవలో వున్నట్టూ, ఎల్లప్పుడూ పరస్పరం ఆలింగితులై యున్నట్టు తోచేది. పెక్కుసార్లు చిత్తభ్రమ కలిగి తనపడకను వదలిపెట్టి ఆ పాడుగొందిలోకి పోయి ఆమెను కలుసుకోవాలని ప్రయత్నించాడు. అట్లు పోకుండా చేయడానికి కట్టి పడవేయవలసి వచ్చింది. కాని వకనాటిరాత్రి అందరూ పడుకుని నిద్రిస్తూ వుంటే ఈ వ్యాధిపీడితుడు బంధనాలను తెంచుకొని పరుగెత్తాడు. మరునాటి ప్రాతఃకాలం పోయి చూస్తే అత డాగొందిలో చచ్చి పడివున్నాడు ఆపిల్ల శవపేటిక ప్రక్కన. అతణ్ణీ అక్కడే పూడ్చి గోరీ కట్టారు.

ఆదినం మొదలుకొని ప్రతిరాత్రీ అత డాగ్రామంలోని మార్గాలవెంట ప్రియురాలితోసహా తిరుగుతున్నట్టు కన్పిస్తూవుండేవాడు, ఒక్కొక్కమారు పాడుకొంటూ మరోమారు ఏడుస్తూనూ. గ్రామస్థు లనేక పర్యాయాలు ఈ తిరుగుబోతు జీవాత్మల సంతృప్తినిమిత్తం వెలగల ముడుపు లెన్నింటినో సమర్పించారు కాని ఫలం కన్పించలేదు. గ్రామంలో ఏడుపులూ, రోగాలూ, చావులూ శాంతించలేదు.

చచ్చినవాళ్ల పగ సాధించాల నిప్పాళ్లోని పెద్దలు కొందరు, ఆ దురదృష్ట కాముకుల శరీరాలను పైకి దీయించి తగులబెట్టించి బూడిదె రాసులను నదిలో పారపోయించారు. అది మొదలుకొని ఆ రెండుదయ్యాలు వుండడానికి నెలవు లేనందున అక్కడికి దగ్గరే గుడిప్రాకారంలో వున్న నూరేండ్లనాటి అంజీరవృక్షాన్ని ఆశ్రయించి గ్రామాన్ని ధ్వంసం చేయడం మొదలిడినాయి.

ఒకనాటిసాయంకాలం పరివ్రాజకు డైన మాంత్రికు డొకడు ఘటనావశంగా ఆవూళ్లోకి వచ్చి ఆగుళ్లో మకాంవేశాడు. వెన్నెల రాత్రిలో ఆ యంజీరపుచెట్టు కొమ్మలమీద యువతీయువకు లిద్దరు దిగంబరులై పరస్పరం వెంటాడుకుంటూ, పట్టుకుంటూ, ఆలింగనం గావించుకొంటున్నట్టు కన్పించింది.

మరుసటిరోజు ప్రాతఃకాలము మాంత్రికుడు గ్రామంలోకి పోయి పెద్దలందరితోను రాత్రి తాను చూచినదంతా వివరించి తెలిపి వారి నీతినిష్ఠ లింత అధ్వాన్నంగా వున్నవేమని మహా కఠినంగా చీవాట్లు పెట్టాడు. పెద్దలు ఆ కనుపించినవి ఛాయారూపాలు కాని మనుష్యులు కారని తెలియజెప్పారు. అంత నా పోగరుబోతు దయ్యాలమీద అమితమయిన క్రోధం బూని మాంత్రికుడందులకు ప్రతిక్రియ సల్పడానికి అనుమతి నివ్వవలసిం దని కోరి తీసుకొన్నాడు. స్వర్గపాతాళములలోని దేవతల నందరినీ సంతృప్తిపరచేనిమిత్తం వక పెద్ద తంతును జరిగించి, మూడు యంత్రాలను తయ్యారు చేసి ఒకదాన్ని దయ్యాలున్న చెట్టుమొదటికంటగట్టి రెండోదాన్ని నీట్లో పారవేశాడు. మూడోదాన్ని కాల్చి గాలిలోకి పైకెగరజిమ్మి మంత్రాలను ఉచ్చరిస్తూ కూర్చున్నాడు.

అంతట ఆకాశంలో కొండల వంటి నల్లని మబ్బులు పోగయి చెలరేగాయి తూఫానులోని బ్రహ్మాండమైన తరంగాల్లాగు. మహావేగంతో పరుగెత్తుతూ హోరుమని ధ్వనిని బుట్టించాయి. వాయువు ప్రచండమై చెట్లయాకులను దులిపివేసింది. కొమ్మలు విరిగి పడ్డాయి. మహోన్నత వృక్షాలు కూలిపోయినాయి. ప్రకృతి సమస్తం ప్రకోపించి కంపించిపోయింది. సంతృప్తి నందిన దేవతాజను లందరూ విస్మయంతో చూస్తూవుండగా, వైతరణి (Styx) నుండి వెడలివచ్చిన వృథగాత్రులగు వారి చేతుల్లోని ఏడువందల గొడ్డళ్లు ఒక్క పాళంగా పైన పడ్డట్టు పిశాచావిష్టమైన అంజీరవృక్షం ఊగిసలాడి ఫెళఫెళారావంతో మృతధరిత్రి మీద కూలిపోయింది. అదేసమయంలో యమదూతలచే బాధితులై, ఇన్నియనర్థాలకూ కారణభూతులైన ఆదయ్యాలు ఏడ్పులూ పెడబొబ్బలూ పెట్టడం గాలిలో వినిపించింది.

అందుమీద కృతజ్ఞులైన జను లందరూ మాంత్రికునికి సమర్పించాలని ఎన్నో బహుమానాలను పట్టుకెళ్లారు కాని అతడు వేటినీ స్వీకరించలేదు. సాయంకాలం మరీచిమాలి అంతిమకిరణాలు ఆకాశపథాన్నుంచి తొలగిపోతూవుండగా మాంత్రికుడు దూరంలో వున్న వొక పర్వతంవేపు పోతున్నట్లు గన్పించింది. అనంతరం సంవత్సరాలు కడచిపోయినాయికాని తిరుగుబోతులైన యా కాముకుల జీవాత్మలు మళ్లీ ఎప్పుడూ కన్పించలేదు ఆ గ్రామంలో.

ఎన్నినాళ్ళు?

"పరాశర"

ఎన్నినా ళ్ళీ బాధ భరియింతునోయీ!
ఎన్నినా ళ్ళీ వ్యథలు సైరింతునోయీ!

౧

మనసులో వేదనలు
మనసులోనే అణచి
గొంతులో పాటలను
గొంతులోనే ఆపి.

౨

కంఠగతమై హృదయ
మంటుకొనిదహియింప
అణువణువునా రక్త
ముడికిపైకుబుకంగ.

౩

తీయతలపులలోన
తియ్యతియ్యనికోత
వలపు వెతబరువులో
వెలలేని ఆరాట.

౪

పట్టపగ్గాలు చాలని
పడుచు వెడదతో
పలిటీలుకొట్టించు
పరిసరపుటగ్గితో.

౫

వంశమర్యాదలును
సంఘదౌర్జన్యములు
కరపాద నిగళయుసీ
శములు, దిగ్బంధనలు.

౬

జీవితపు సొదలలో
జీర్ణించి వేగి, బీ
టలువారు గుండియలు
ప్రిదిలినుసినుసికాగ.

౭

నవ్యరోచిస్సులో
నవ్యానురాగమ్ము
నవ్యమాలికలలో
నవ్యమధుకుసుమమ్ము.
ఎన్నినా ళ్ళీ బాధ
భరియించుటోయీ!

గ్రహాలు

శ్రీ వసంతరావు వేంకటరావు

౧

రాహుకేతువులను సూర్యచంద్రులను నవగ్రహాలలో చేర్చి జాతకమండలి ద్వాదశ గ్రహాలలో నవగ్రహాలకి స్థానాలేర్పరచడం అనాదిగా పరిపాటైపోయినా, అది పొరపాటని గ్రహించాలి. రాహుకేతువులు కేవలం రూపరహితమైన ఛాయాగ్రహాలు; వాటికి వ్యక్తిత్వం లేదు, స్థితి లేదు. సూర్యుడు గ్రహోద్భవకర్త. బుధ, శుక్ర, కుజ, గురు, శని పంచకం సూర్యునిలోనుండి జన్మించినది. అట్లుద్భవించినదే భూమి. భూమిలోనుండి చంద్రు డుత్పన్నమయినాడు. సూర్యగర్భసంభూతత్వమే "గ్రహ"నామధారణానికి లక్షణమైతే, రాహుకేతువులు సూర్యచంద్రులు "గ్రహాలు" కారు. చంద్రు డొకఉపగ్రహం. అయినా భూలోకజీవులను ప్రేరేపించి వారి జీవితక్రమాన్ని శాసించడంలో వారివారి పాత్ర పోషించుకుంటారనికాబోలు మేషాది రాసులందు వాటికిని స్థానా లేర్పాటుచేయడమైంది. నిష్పక్షపాతంగా పుత్రవాత్సల్యంతో జీవుల నాదరించి, పోషించి, పెంచుభూదేవిని జాతకంలో పరిగణించడం అనవసర మనుకొన్నారు.

కాని "నవగ్రహ"పదంమాత్రం సార్థకమయింది. సూర్యునిలోనుండి జన్మించి, క్రమేణ వ్యక్తిత్వం సంపాదించి, సూర్యునికి నిత్యప్రదక్షిణాలు చేసే గ్రహాలు తొమ్మిదే ఉన్నాయి. ఈ గ్రహోద్భవచరిత్ర కడువిచిత్రమైనది. పరితప్తవాయుగోళాలైన నక్షత్రాలలో ఒకానొకబృహత్తార తన గగనసంచారంలో ఒకానొకప్పుడు సూర్యుని కతిప్రమాదకరంగా దగ్గరికి రావడం తటస్థించింది. తార సూర్యుని సమీపిస్తూన్నకొలది గురుత్వాకర్షణ బలంచేత సూర్యద్రవ్యంలో చిన్నకల్లోలాలుత్పన్నమయేయి (చిత్రం, ౧. అ); సూర్యునికి తారకిగల దూరం తగ్గుతూన్నకొలది ఆ కల్లోలాలు మహాబీభత్సంగా నుద్రేకించాయి. సూర్యముఖంగా వస్తూన్న తార దారి మార్చి, విముఖమై, దూరంగా పోబోయేసరికి నీటి కెరటాలవలె రేచిన ద్రవ్యకల్లోలాలు మహోన్నతపర్వతాకృతి ధరించి క్షణక్షణప్రవర్ధమానంగా నున్నాయి (చిత్రం, ౧. ఆ). ఆతుంటరి నక్షత్రం వెనుకకు పోతూన్న సమయాన్ని సూర్యద్రవ్యంలో అల్లకల్లోలంగానున్న భాగాన్ని చిందరవందరచేసి పై కూడబెరికింది — (చిత్రం, ౧.) నక్షత్రం తనదారి తాను చూచుకొంది. తారామహాబలంచే బహిర్గమించిన వాయువుమాత్రం ఎటూ పోలేక సూర్యునికి దూరంగా ఆకాశంలో నిలిచిపోయింది.

ఇట్లు సూర్యగర్భంనుండి జనించిన వాయుఖండమండలి అణువులు అందందు గుమిగూడ ప్రారంభించాయి. కాలక్రమేణ గురు



చిత్రం. ౧.అ.



చిత్రం ౧.ఆ.



చిత్రం. ౧.
ఇ



చిత్రం. ౨.

త్యాకర్షణప్రాబల్యంచేత ఒక్కొక్క మహా సమూహం ఒక్కొక్క గ్రహమయింది. జనన కాలమందు ఆ ద్రవ్యఖండం వహించిన ఆకారాన్ని అనుసరించి గ్రహపరిమాణా లేర్పడ్డాయి. చిత్రం. ౨-లో చూపినట్లు గ్రహాలు పరస్పరపరిమాణాలు వహించేయి. మధ్యస్థమైన గురుడు గ్రహాలలో పెద్ద; గురుని కిరువైపులనున్న గ్రహాలు క్రమంగా పరిమాణంలో కృశించాయి. ఇవన్నీ సుమారు బంతులవలె గోళాకారంలో నున్నాయి.

ఇ ట్లేర్పడిన గ్రహాలు సూర్యునినుండి వివిధదూరాలలో నున్నాయి. సూర్యుని కతిసమీపంగా నున్నది బుధుడు; బుధుని నుండి వరుసగా నున్నవి—శుక్రుడు, భూమి,

పట్టీ ౧.

గ్రహం	వ్యాసం (మైళ్లు)	సూర్యుని నుండి దూరం (లక్షల మైళ్లు)	భారం (భూమి = ౧)	ఘన పరిమాణం (భూమి = ౧)	సాంద్రత (నీరు = ౧)
బుధుడు ...	౩,౦౦౦	౩౬౦	౦.౦౩౭	౦.౦౫౪	౩.౭౩
శుక్రుడు ...	౭,౫౮౦	౬౭౦	౦.౮౨౬	౦.౮౮౯	౫.౨౧
భూమి ...	౭,౯౨౬ (మధ్య) ౭,౯౦౦ (ధ్రువ)	౯౩౦	౧.౦౦౦	౧.౦౦౦	౫.౫౩
కుజుడు ...	౪,౨౨౦	౧౪౧౦	౦.౧౦౮	౦.౧౫౧	౩.౯౫
గురుడు ...	౮౮,౭౦౦ (మధ్య) ౮౨,౮౦౦ (ధ్రువ)	౪౮౩౦	౩౧౮.౪	౧౩౧౨.౦	౧.౩౪
శని ...	౭౫,౧౦౦ (మధ్య) ౬౭,[illegible]౦౦ (ధ్రువ)	౮౮౦౦	౯౫.౨	౭౬౩.౦	౦.౬౯
యురేనసు ...	౩౦,౯౦౦	౧౭౮౦౦	౧౪.౬	౫౯.౫౪	౧.౩౬
నెప్ట్యూను ...	౩౩,౦౦౦	౨౭౯౦౦	౧౬.౯	౭౨.౪౮	౧.౩౦
ప్లూటో ...	౨,౦౦౦	౩౬౮౦౦	—	౦.౦౧౬	—

కుజుడు, గురుడు, శని, యురేనసు, నెప్ట్యూను, ప్లూటో. ఈ గ్రహాలవ్యాసం ఘనపరిమాణం, భారం, సాంద్రత(density) సూర్యుని నుండి దూరం, పైన ౧ వ పట్టీలో చూపబడినవి. వాటిపరిమాణ తారతమ్యాలు చిత్రం, 3 లో చూడగలం. అన్నిటిలో చిన్నదైన ప్లూటోను ఆవగింజగా నిరూపిస్తే భూమిని కందిగింజ, సూర్యుని పెద్దతియ్యగుమ్మడిపండు గా నిరూపించాలి. ఈ పరిమాణంలో సౌర కుటుంబం నిర్మించే కుతూహాల మున్నటే సూర్యునికి ప్రత్యామ్నాయంగా నుంచిన ఒక పెద్దతియ్యగుమ్మడిపండుకు ౨౦ గజములు ఎడంగా ఒకచిన్న ఆవగింజ, ౩౭ గజములు ఎడంగా ఒకకందిగింజ, ౫౨ గజములు దూరంగా మరొకకందిగింజ, ౭౯ గజములు దూరంగా ఒకపెద్దఆవగింజ, ౨౭౦ గ॥ ఎడంగా ఒకపెద్ద నిమ్మపండు, ౪౯౦ గ॥ ఎడంగా మరొక నిమ్మపండు, ౯౯౦ గ॥ దూరంగా ఒక రేగుపండు, ౧౫౫౦ గ॥ ఎడంగా మరొక రేగుపండు, ౨౦౪౦ గ॥ దూరంగా ఒకసన్నావగింజ ఉంచాలి. అప్పుడు ఆ గుమ్మడిపండుచుట్టు ఆ కాయలు పళ్లు గింజలు వలయాకారమార్గంలో నిరంతర పరిభ్రమణం చేస్తున్న ట్లూహించాలి. ఇవన్నీ రెండుంపావుమైళ్లు వ్యాసంగల గోళంలో పంచరిస్తాంటాయి. ఆ గోళంలో మిగిలిన ప్రదేశమంతా శూన్యంగా భావించుకోవాలి. సుమారు ౩౫,౫౫౦,౦౦౦,౦౦౦ ఘ॥ గజాలు ఘనపరిమాణంగల శూన్య గోళంలో నున్న ద్రవ్య మెంత ? ఒకగుమ్మడి పండు, రెండునిమ్మపళ్లు, రెండు రేగుపళ్లు, రెండుకందిగింజలు, మూడుఆవగింజలు. ఆ స్థలం ఎక్కడ ? దానిలోనున్న ఆ ద్రవ్య మెక్కడ ? ఈ పరిమాణంలో సూర్యుని

కటిసమీపంగా నున్న నక్షత్రాన్ని ౬౦౦౦ మైళ్లు దూరంగా నుంచాలి.

ఈ నవగ్రహాలు సూర్యునిచుట్టు నిత్య ప్రదక్షిణాలు చేస్తూన్నాయి. గడియారంలో గంటలు నిమిషాలు సెకెండ్లు తెలియజేయు ముల్లు ఒకేదిక్కున తిరుగుచున్నట్లు పరివర్తియగ్రహాలన్నీ వాటివాటి కక్షలలో ఏకదిశాముఖమై ఉన్నాయి. వాటికక్ష్య లన్నీ సుమా రొకసమతలం(plane)లోనే ఉన్నాయి; అవన్నీ దీర్ఘవృత్తాకారం(ellipse)గా నున్నాయి. సూర్యుని కటిసమీపంగాను, అతిదూరంగాను ఉన్న బుధ, శుక్ర, ప్లూటో లకు తప్ప తక్కిన గ్రహాలకి ఉపగ్రహాలు (Satellites) ఉన్నాయి. ఏ గ్రహాన్ని ఆశ్ర



చిత్రం, 3. (పరిమాణం : ౧ సెం. మీ. = ౪౮౦౦౦.)

పట్టీ ౨.

గ్రహం	పరిభ్రమణ కాలం		పరిభ్రమణ వేగం సెకెండుకి మై॥ చొ॥	అంతర్భ్రమణ కాలం	ఉపగ్రహాల సంఖ్య	పలాయన వేగం (Velocity of escape) (సెకెండుకి మై॥ చొ॥)
బుధుడు ...	౮౮	దిన.	౨౪	౮౮ దిన.	—	౨.౨
శుక్రుడు ...	౨౨౫	,,	౨౨	—	—	౬.౩
భూమి ...	౩౬౫.౨౫	,,	౧౮.౫	౨౩ గం. ౫౬ ని.	౧	౭.౦
కుజుడు ...	౧.౮౮	సం.	౧౫	౨౪ గం. ౩౭ ని.	౨	౩.౧
గురుడు ...	౧౧.౮౬	,,	౮	౯ గం. ౫౩ ని.	౧౦	౩౭
శని ...	౨౯.౪౬	,,	౬.౫	౧౦ గం. ౨౬ ని.	౯	౨౨
యురేనసు...	౮౪.౦౨	,,	౪	౧౦ గం. ౪౫ ని	౪	౧౩
నెప్ట్యూను ...	౧౬౪.౭౯	,,	౩.౫	౧౫ గం. ౪౨ ని.	౧	౧౪
ప్లూటో ...	౨౪౯.౨	,,	౩	—	—	—

యించిన ఉపగ్రహాలు (పట్టీ, ౨) దానిచుట్టు పరిభ్రమిస్తున్నాయి. సూర్యునిచుట్టు గ్రహాలు ఏ విధంగా తిరుగుచున్నవో ఆదిశాభిముఖంగానే గ్రహాలచుట్టు ఉపగ్రహాలు తిరుగుచున్నాయి. ఆకాశమార్గంలో యాతాయాత పథికగ్రహాలు కాన్పించవు. వర్తులాకారమార్గావలంబములైన పాంథగ్రహాలన్నీ ఏకదిశాభిముఖములై భ్రమించుట విశేషాంశము. ప్రతిగ్రహం తనలో తను తిరుగుతూంది పరిభ్రమణంతోపాటు గ్రహాలు అంతర్భ్రమణంకూడా చేస్తున్నాయి. వాటి పరిభ్రమణకాలం పరిభ్రమణవేగం, అంతర్భ్రమణకాలం మొదలైనవి పట్టీ, ౨ లో గలవు.

వాటివాటి కక్ష్య లో గ్రహాలు నిరంతర ప్రదక్షిణాలు ఎందుకు చెయ్యాలి? యథేచ్ఛగా ఋజుమార్గ సంచారానికి వాటి కవకాశమైతే ఒక్కొక్క గ్రహం సూటిగా పోయి పోయి, నిబిడాంధకార శీతలప్రదేశంలో మాయంకాదా? అటుగాక త్రాడుకు కట్టి తిప్పినపుడు గిరగిర తిరుగు రాయివలె గ్రహాలు వాటికక్ష్యలలోనే పరిభ్రమిస్తున్నాయంటే ఏదో అవ్యక్తబలం వాటిమీద అదృశ్యంగా వర్తిస్తూందని నిశ్చయమౌతుంది. అదే గురుత్వాకర్షణబలం; తద్వారా వాటిని పట్టినది సూర్యుడు.

ఒక్కొక్క త్రాటికి ఒక్కొక్క బరువు కట్టి, త్రాళ్లకొనలన్నీ చేత పట్టుకొని బరువులను వలయాకారంగా గాలిలో తిప్పగలం. గ్రహాలనే బరువులను సూర్యుడనుచేయి గురుత్వాకర్షణబల మను త్రాటిచే పట్టుకొని ఆకాశమనుగాలిలో గిరగిర త్రిప్పుచున్నాడు. గ్రహాలను సూర్యునికి బంధించిన త్రాడు కనుపించదు. కాని అగోచరంగా నున్నతంత్రిలోని ఆకర్షణబలం మాత్రం అనుక్షణం వ్యక్తమౌతూంది. బరువుయొక్క పరిభ్రమణవేగం అధికమగుచున్నకొలది కక్ష్య నతిక్రమించకుండా దాని నొకే మార్గంలో నుంచగల ఆకర్షణబలంకూడా హెచ్చుతూండాలి. సూర్యుని కతిసమీపంగా నున్న గ్రహాలు దూరపుగ్రహాలకన్న మహావేగంగా పరిభ్రమిస్తున్నాయి; అంటే సమీపగ్రహాలమీద దూరపుగ్రహాలకన్న సూర్యు డెక్కువబలం ప్రయోగిస్తున్నాడని విశదమౌతుంది.

ఈసంబంధం గురుత్వాకర్షణనియమాన్ని అనుసరించి ఉన్నది. ఆనియమప్రకారం రెండుబరువులను బంధించు గురుత్వాకర్షణబలం వాటిపరస్పరభారంమీద వాటిమధ్యనున్న దూరంమీద ఆధారపడి ఉంది. దూరం హెచ్చినకొద్దీ బలం క్షీణిస్తుంది. ఆబలం బరువుల పరస్పరదూరం యొక్కవర్గం (Square)తో విలోమం(inverse)గా మారుతుంది. ఆబలమే భూమిచుట్టు చంద్రుని తిప్పుతూంది. మనం పై కెగురవేసిన వస్తువులు మనభూమియొక్క గురుత్వాకర్షణబలంచేతనే సెకెండులో ౧౬ అడుగులు భూతలంవేపు పడతాయి. భూగోళంయొక్క కేంద్రానికి భూతలంకన్న చంద్రుడు ౬౦ రెట్లు దూరంగా నున్నాడు. భూకేంద్రానికి మనం ౪౦౦౦ మైళ్లు దూరంగా ఉంటే చంద్రుడు సుమారు ౨,౪౦,౦౦౦ మైళ్లు ఎడంగా ఉన్నాడు. భూతలంమీది వస్తువులను సెకెండుకి ౧౬ అడుగులవేగంతో తనగర్భముఖంగా ఆకర్షించగలభూమి అంతకు ౬౦ రెట్లు దూరంగా ఉన్న చంద్రుని $\frac{౧౬}{౬౦ \times ౬౦}$ అడుగులు సెకెండుకి తనవైపు ఆక

క్షించాలి. తిన్నగా పోయే చంద్రుని సెకెం డులో సుమారు ౧/౨౦ అంగుళం తనవేపు భూమి లాగుతూంది. అత్యల్పంగా స్ఫురించు ఈ ఆకర్షణ బలం గంటకు సుమారు ౨, ౩౦౦ మైళ్ల వేగంతో పరుగెత్తు చంద్రునిపై వర్తిస్తూ, ప్రతిసెకండులో చంద్రుని ౧/౨౦ అంగుళం భూమివైపు లాగుచుండుట చేతనే యుగాలతరబడి భూమికి ప్రదక్షిణాలుచేస్తూ చంద్రుడు వలయాకార మార్గావలంబుడై ఉంటున్నాడు.

ఈ విశిష్ట నియమానుసారంగానే గ్రహాలు సూర్యునిచుట్టు తిరుగుచున్నాయి. వాటి వాటి పరిభ్రమణవేగానికి యుక్తమైన దూరం, వాటి దూరాల కనువైనవేగం గలిగి గురుత్వాకర్షణ బలాధీనములై శాశ్వతంగా గ్రహాలు వాటి కక్ష్యలలో సంచరిస్తున్నాయి. అగుట, దగ్గరగానున్న బుధుడు ౮౮ దినములలో సూర్యునికి ప్రదక్షిణం చేయగలిగితే, అతిదూరంగానున్న ప్లూటో గ్రహం ౨౪౮ సంవత్సరాలలోగాని సూర్యునికొక ప్రదక్షిణం చేయలేకున్నది. వీటికి నడుమనున్న గ్రహాల పరిభ్రమణకాలాలు ౧- పట్టీలో చూపినట్లు, ౮౮ దినములకు ౨౪౮ సంవత్సరములకు మధ్య నుంటాయి.

మహాజ్యోతియగు సూర్యుడు విరామం లేకుండా తేజోష్ణాలు ప్రసరిస్తున్నాడు. పుష్ప సౌరభంలాగ ఈ తేజోష్ణాలు దిక్పర్యంతాలు వ్యాపించిపోతున్నాయి. ఆ అఖండతేజో రాశిని పరివేష్టించిన గ్రహాలు వాటిదూరాన్నిబట్టి తేజోష్ణాలు పొందుచున్నాయి. సమీపంగా నున్నవి ఉష్ణతీవ్రాన్ని భరించలేకపోవచ్చును; అతిదూరంగా నున్నవి యుక్తమగు వేడిని పొందక చలికొట్టుకొనిపోవచ్చును. జన్మతః ప్రతిగ్రహానికి కొంత వేడి గర్భస్థమై ఉన్నది. కాని, గ్రహాలు క్రమంగా చల్లారి పోతున్నాయి. అయినా, సూర్యునికి దూరమైపోయిన గ్రహాలు సూర్యరశ్మి కొదువపడినప్పుడు వాటి అంతరుష్ణ సహాయాన్నైనా వెచ్చగా ఉంటాయి. అంతరుష్ణం కోల్పోయి కొఅదువారిపోయిన గ్రహాలు సూర్యునినుండి గ్రహించే వేడిమినే మరం ప్రదేశంలోనికి ప్రసరింపజేస్తాయి. ఉష్ణ ప్రసారపరిమాణం గ్రహంయొక్క తాపక్రమాన్నిబట్టి ఉంటుంది. తక్కువ తాపక్రమంలోనున్న గ్రహంకంటె ఎక్కువతాపక్రమం(temperature)లో నున్న గ్రహం సామాన్యంగా ఎక్కువ వేడిమిని ప్రసరింపజేయగలదు. సహజోష్ణంలేని గ్రహంయొక్క తాపక్రమం అది పుచ్చుకొని యిచ్చిన వేడిమినిబట్టి ఉంటుంది. నడివడిగా త్రిప్పుచూ కుంపటిమీద కాల్చిన మొక్కజొన్నపొత్తి లాగ తనఅక్షముమీద మహావేగంగా అంతర్భ్రమణ మొనరించు గ్రహం సూర్యరశ్మికి అంతట ఒకేరకున కాగుతుంది. అట్టి గ్రహంలో ఏభాగమైనా ఒకే తాపక్రమంలో నుంటుంది. కాని, మందంగా అంతర్భ్రమణం చేయు గ్రహంలో ఒకభాగం దీర్ఘకాలం సూర్యాభిముఖంగా నుండి హెచ్చువేడిమిని పొందును గనుక, సూర్యరశ్మికి గురికాక అంధకార బంధురమై చల్లబడు గోళార్ధం కన్న ఆభాగం హెచ్చు తాపక్రమంలో నుంటుంది. కావున, మందంగా అంతర్భ్రమణంచేయు గ్రహాలలో గ్రహతలంపై ఏప్రదేశమైనా శీతోష్ణవిపర్యయాలకు లోనౌతూండాలి. సూర్యరశ్మి పడుచున్నప్పుడు వేడెక్కుచు, రశ్మిపథం దాటి భ్రమించగానే

సానాన్ని కారుచీకట్లు క్రమ్మనరికి బుధాస్తమయం కావటంచేత సూర్యుని మహోజ్వల కాంతి గగనపథంలో నడయాడుచుండగనే బుధుని చూడవలసి ఉంటుంది. కనుక బుధుని సమగ్రంగా పరిశీలించి అందలివిశేషాలు గ్రహించుటకు తగిన అవకాశమే లేదు.

శుక్రుడు

బుధుని తరువాత నున్నది శుక్రుడు. ౭,౭౦౦ మైళ్ల వ్యాసంగల శుక్రగోళం సూర్యునికి ౬౭౦ లక్షల మైళ్లు దూరంగా నుండి. భూమికన్న ఐదవపాలు బరువు తక్కువ గల శుక్రుడు తనపరిమాణంగల నీటిగోళంకన్న ౫.౨౧ రెట్లు(?) తూగుతుంది. ౨౨౫ దినముల కొకసారి సూర్యపరిభ్రమణం చేస్తూన్న శుక్రుని అంతర్భ్రమణకాలం నేటికిని కచ్చితంగా తెలియదు. బుధునివలె శుక్రుడును ఒకభాగం శాశ్వతంగా సూర్యునివైపు ప్రదర్శిస్తూన్నట్లుండ. అట్లయితే ౨౨౫ దినముల లోనే తనలో త నొకసారి తిరుగుచుండాలి.

శుక్రునికి భూమితో ఎక్కువ సారూప్యం గలదు. రెండుగోళాల ఘనపరిమాణాలు భారాలు సుమారు దగ్గరగా నున్నాయి. సూర్యునినుండి వాటిదూరముల వ్యత్యాసమే వాటికిగల భేదమంతటికి కారణం. భూమికన్న సూర్యునికి దగ్గరగా నుండుటచేత భూమితాపక్రమంకన్న శుక్రుని తాపక్రమం సుమారు ౩౬ సెం. అధికంగా ఉండవచ్చునని తెలియుచున్నది. అక్కడ తాపక్రమం సగటున ౬౫ సెం. ఉండవచ్చును. ఆ తాపక్రమంలో నీరు నీరుగానే ఉండగలుగుటచేత శుక్రునిలో సముద్రాలు నదులు ...కములాది జలాశయములు వాతావరణం మేఘమండలాలు వర్షపాతములు ఉండుట కవకాశ మున్నది. వాతావరణము మేఘమండలాలు అందు గలవని ఆగ్రహామే తనసంచారంలో ప్రకటించుచున్నది. భూమి మీాగపడు సూర్యరశ్మికి శుక్రగోళం అడ్డంగా వచ్చినపుడు ఆగోళభాగం సూర్యరశ్మిని నిరోధించినా దాని నావరించి యున్న వాతావరణంలోనుండి బహిర్గమించగల కాంతి కాంత్యావర్తంవలె గోచరిస్తుంది. వాతావరణసమన్వితమైన శుక్రుడు నిబిడమేఘమండలావృతమై యున్నట్లు కూడా పరిశోధనవలన విశదమాతూంది. కడుదట్టమైన మేఘాలు ఎప్పుడూ శుక్రుని ఆవరించుకొని యున్నవి గనుక అందలి విశేషాలు మనకు అజ్ఞేయములు.

సామాన్యకాంతికన్న ఎక్కువగా మేఘ మండలములోనికి జొరబడగల దీర్ఘశోణకిరణాలకు (Infra-red rays)సైతం శుక్రమేఘములు చొరరానివైనవి. కావున దీర్ఘశోణకాంతిచేనైనా శుక్రతలం పరిశీలింపలేము. అతినీలలోహిత (Ultra-violet)కాంతిచే తీసిన శుక్రుని ఛాయాచిత్రంలో కొన్ని నల్లనిగుర్తు లున్నాయి. అవి ఘనప్రదేశాలవైతే దీర్ఘశోణచిత్రంలో మరింత స్ఫుటంగా కనుపించాలి. అట్లగుపింపకపోవుటచేత ఆ మచ్చలు మేఘములలో మహానిబిడంగా నున్న వాటిగుర్తులుగా మనం భావించుకోవాలి. మేఘమండలాలను ఛేదించుకొని శుక్రతలాన్ని పరిశీలింపగల మహాభాగ్యం లేదని గ్రహించి, ఆశోపహతులమై ఆట్టి ప్రయత్నంనుండి విముఖులం కావలసి యున్నది.

భూమికన్న అధిక తాపక్రమంలో నున్న శుక్రునిలో ఎక్కువ పదార్థం వాయువ్యావస్థలో నుండాలి. మిక్కుటంగానున్న వాయువులు సంకీర్ణ మేఘమండలాలుగా ఏర్పడక తప్పదు. అయినా, శుక్ర వాతావరణంలోని అంతరిక్షం(Stratosphere)మాత్రం పరిశీలింపగలం. అంతరిక్షంలో వాయువు పలుచబడుతుంది. ఆ గాలిపొరలోనికి జొరబడ్డ సూర్యకాంతి పరావర్తనము చెంది శుక్ర కాంతివలె మన కగుపించునప్పుడు ఆ అంతరిక్షంలోని కొన్ని రహస్యాలు బయల్పరుస్తుంది. సూర్యరశ్మిలోనున్న కొన్ని రంగులు శుక్ర కాంతిలో కనుపించవు. ఆరంగులకు సంబంధించిన శక్తిని శుక్ర అంతరిక్ష వాయువులు కబళించి శుక్రకాంతి నొకింత కళావిహీనం చేస్తాయి. శక్తివిహీనమైన శుక్రకాంతి అందలి అంతరిక్ష చరిత్రను ప్రకటిస్తుంది.

శుక్ర అంతరిక్షం మన భూ అంతరిక్షం వలె లేదని ప్రధానంగా తెలుస్తుంది. అందులో నీటి ఆవిరి అదనంగా లేదు; ప్రాణవాయువు స్వల్పంగా నుంది. శుక్రునిలో ప్రాణవాయువు అత్యల్పంగా ఉన్నదంటే అదొకముఖ్య విశేషం తెలియజేస్తుంది; ఏమంటే, పదార్థాలతో రసాయనికంగా సంశ్లేషించుటకై ప్రాణవాయువునకు విపరీత కాంక్ష గలదు. అది ఇనుముతో చేరి తుప్పు తయారు చేస్తుంది; పదార్థాన్ని కాల్చినప్పుడు మహోజ్వలంగా ప్రజ్వలింపజేస్తుంది. ఇంత సంయోగపిపాసగల ప్రాణవాయువు మన వాతావరణంలో ఇంత విపులంగా నుండుటకు హేతుభూతమైనవి వృక్షసంతతులు. భూతలాన్ని సంకీర్ణంగా వ్యాపించియున్న వృక్షసంతతి నిరంతరంగా ప్రాణవాయువును తయారుచేసి వాతావరణంలోనికి అందిస్తూంది. అగుట, పదార్థాలతో కలియుటకు మహాతృష్ణ గల ప్రాణవాయువు అక్షయమౌతూ భూవాతావరణంలో ఐదవ భాగం ఆక్రమిస్తూంది. అట్టి ప్రాణవాయువు శుక్రునిలో లేదన్న జ్ఞానం అక్కడ వృక్షజాతి లేదేమో అను శంక కలుగజేస్తుంది.

శుక్రతలం బుధతలంవలె కేవల కఠినశిలా ఘటితమై యుండక కొంత ఆర్ద్రంగా నుండుటకు అవకాశమున్నది. శుక్రుని అంతర్భ్రమణకాలం తెలియకపోవుటవలన అచటి దిన ప్రమాణం తెలియదు. బుధునివలె ఒకభాగమే నిత్యం సూర్యాభిముఖమై ఉంటే, అందలి సాంద్రమేఘములకు యుక్తమైన వర్షములుండవు. భాసురంగానున్న గోళార్ధం ఎండ గాడ్పులతో అర్చుకొనిపోతూంటే, అంధకారంతో నిండిన గోళార్ధం, ముసురుదినాలలో భూతలంవలె, చితచితలాడుచు ఉంటుంది.

పరితప్త వాయుగోళాలుగా ఉద్భవించిన గ్రహాలు క్రమేణ తమ అంతరుష్ణం శూన్యాకాశంలోనికి ప్రసరిస్తూ రాగా చల్లవారి, ద్రవించి, తాపక్రమం క్షీణిస్తూండగా వాటి గోళతలాలు ఘనీభవించాలి. అట్టి పరిస్థితులలో కొన్ని అర్బుదాల క్రితం మనభూమి నేటి అధిక తాపక్రమంలోనుండి ప్రకృతశుక్రునిపోలి ఉండాలి. ఆ కాలంలో భూవాతావరణంకూడా నేటిశుక్ర వాతావరణంవలె ఉండినదనుటకు సందేహం లేదు. నాటినుండి భూమి అనుభవిస్తూన్న శీతోష్ణవిపర్యయాలకు అనుగుణంగా వాతావరణంకూడా పరివర్తనముచెందుచు ప్రస్తుత స్థితిలోనికి వచ్చిఉండాలి. అగుట,